99 Names of Allah (Telugu)

పవిత్రమైన అల్లాహ్ పేర్లు

మూలం:

గులాం ముస్తఫా

అనువాదం:

సయ్యద్ హుసైన్

విషయసూచిక

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

الله
అల్లాహ్

పవిత్రత కేవలం అల్లాహ్‌కే శోభిస్తుంది. ఆయనే సర్వాధికుడు, సర్వసృష్టికి కర్త. అల్లాహ్ అనే నామం అతని వైయక్తికమే కాదు పవిత్రతకు కూడా మారుపేరు. అల్లాహ్ మనల్ని ఐదు మూల ధాతువులతో సృష్టించాడు. ఆయన అన్నింటిపై పరివేష్టించివున్నాడు. ఆయన మన ఊహకు, జ్ఞాన పరిధికి అందనివాడు. సృష్టికర్త, పోషకుడు, సంరక్షకుడు ఆయనే కాబట్టి సృష్టియావత్తు ఆయనపైనే ఆధారపడివుంది. మన అవసరాలన్నిటినీ ఆయన తీరుస్తాడు. ఆయనే మనకు శరణ్యం. సర్వశక్తిమంతుడైన అతనికే మనం భయపడాలి. ఎందుకంటే ఒకరోజు అతని ముందు హాజరై ఈ లోకంలో మనం చేసిన మంచీ చెడులకు లెక్క చెప్పాలి. ఈ లోకానికి సర్వాధికుడైన కారణాన మనం అల్లాహ్‌నే ఆరాధించాలి. ఆయన తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు. అల్లాహ్ ఈ సకల చరాచర సృష్టిని సృజించి ఓ క్రమాన్ని ఏర్పరిచాడు.

సూర్యచంద్రులు, రేయింబవళ్ళ మార్పు, రుతువులు, మూడు కాలాల మార్పులు అన్నీ ఒక క్రమంలో జరుగుతున్నాయి. అల్లాహ్ ఉత్తర్వుతోనే వీటిలో చలనం ఏర్పడింది. ఇంకా ఆయన తలచుకున్నప్పుడు వీటిని స్తంభింపజేస్తాడు. మనం, ఇంకా మన చుట్టూవున్న ప్రపంచం దేవుని శాసనాలకు లోబడివున్నాం. తాను తలచుకుంటే సందర్భానుసారం ఈ శాసనాల్లో మార్పు చేయగలడు. భూమ్యాకాశా లను, స్వర్గాన్ని సృష్టించిన దేవుడు ఎంతో దయామయుడు. దయాగుణం అతని గొప్ప గుణం. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు ఆయనకు ఒక్కటే. అన్ని కాలాల్లో వుంటాడు. కాబట్టి ఆయన నిత్యుడు. ఆయనకు జరామరణాలులేవు.

మనం చేసే ప్రతిదాన్ని చూస్తున్నాడు, మన ప్రతిమాటను వింటున్నాడు. ఆయనకు అంతా తెలుసు. మన పనులే కాదు మన ఆలోచనలూ ఆయనకు తెలుసు. మట్టితో సృజించబడిన మానవుడు ఎట్టకేలకు మరణించి తీర్పుదినాన తన లెక్కను

సమర్పించుకోవాలి. సదాచారులైన ముస్లింలు (విశ్వాసులు) స్వర్గానికి, దురాచారులైన అవిశ్వాసులు నరకానికి పంపబడతారు.

దివ్యఖుర్ఆన్ సెలవిస్తోంది. చెట్లు చేమలు, జంతుజాలం, రాయిరప్ప- అన్నీ దేవుణ్ణి స్తుతిస్తున్నాయి. కాని మీలో వాటి భాషను విని, అర్థం చేసుకునే శక్తి లేదు. కాబట్టి దైవానికి భయపడటం, జ్ఞానానికి మొదటి మెట్టు. మనం దేవుని ముందే మోకరిల్లాలి. ఆయన ముందు తప్ప మరెవరి ముందూ సాష్టాంగపడరాదు. 'అల్లాహ్' అనే పదం ఏ భాషకూ అందనిది. హిందూ ధర్మంలో "దేవుడు" పదం "దేవతలు" అన్న దానికి దారితీసింది. అదే విధంగా క్రైస్తవధర్మంలో తండ్రి పదం కొడుకు వరకు దారితీసింది.

అల్లాహ్‌కు సహవర్తులు కల్పించి వాటిని ఆరాధించటం ఘోరమైన పాపం అని ఖుర్ఆన్ ఘోషిస్తోంది. మన చిన్న పొరపాట్ల పట్ల అల్లాహ్ చూపోవు వహిస్తాడు. కాని షిర్క్ (బహుదైవారాధన)ను, లేక మరొక సృష్టిరాశిని అతనికి సాటి కల్పించి కొలవటాన్ని అల్లాహ్ ఏ మాత్రం క్షమించడు.

అల్లాహ్ ఒక్కడే. ఆయనకు సాటి, తోడు ఎవరూ లేరు. ఆయన నామ సంకీర్తనం మనకు మనశ్శాంతిని ప్రసాదించి అన్ని రకాల ఆందోళనల నుండి దూరం చేస్తుంది.

ఆది మానవుడు, ప్రవక్త అయిన ఆదం (అ) తోటే 'అల్లాహ్' నామం మానవాళికి ప్రసాదించబడి, నేటి వరకు ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. దివ్యఖుర్ఆన్ అల్లాహ్‌కు ఎన్నో గుణవాచకాల్ని పేర్కొంది. అవి సంఖ్యాపరంగా 99. అయితే అల్లాహ్ గుణగణాలు అసంఖ్యాకమైనవి, ఇదమిత్థంగా వాటిని సంక్షిప్తీకరించటంగాని, వాటికి సరిహద్దును ఏర్పరచటంగాని కుదరని పని. సర్వ సద్గుణ సంశోభితుడైన అల్లాహ్‌ను మనం కొంతమేరకే అర్థం చేసుకోగలం. అన్ని గుణగణాలకన్నా "అల్లాహ్" అనే నామమే మిన్న.

ఏ మనిషీ 'అల్లాహ్' అనే పేరు పెట్టుకోలేడు. అయితే ఆయన గుణవాచకాలతో కూడిన పేర్లను పెట్టుకొని ముస్లిం సోదరులు పిలవబడుతూ వుంటారు.

ఏ పనినైనా అల్లాహ్ నామం స్మరించి ప్రారంభించటం అలవాటు చేసుకోవాలి. అదే - బిస్మిల్లాహ్ హిర్రహ్మా నిర్రహీం. ఆయన నామస్మరణే మనకు శక్తిని, యుక్తిని, విజయాన్ని చేకూర్చగలదు.

اَلرَّحْمٰنُ

1. అర్రహ్మాన్

అల్లాహ్ గుణగణాల్లో 'రహ్మాన్' గుణానికి ఎంతో ప్రాశస్త్యం వుంది. రహ్మాన్ అంటే దయామయుడు, కరుణామయుడు అని అర్థం. తన సృష్టితాలన్నింటికీ అల్లాహ్ రహ్మానే. అర్థించకుండానే అందరి అవసరాలు తీరుస్తున్నాడు, అందరినీ రక్షిస్తున్నాడు. బిడ్డలందరికీ మాతృగుణం ఎలానో, అల్లాహ్ దాతృగుణం కూడా పుణ్యాత్ములకు, పాపులకు ఒకే రీతిగా వుంటుంది. తనను విశ్వసించినా, విశ్వసించకపోయినా అందరికీ కావలసిన సౌకర్యాలు సమకూరుస్తున్నాడు. దీని ద్వారా మనం ఆయన గుణోన్నతిని ఊహించవచ్చు. మనిషికి అల్లాహ్ సర్వస్వతంత్రత ఇచ్చాడు గనక, తనను తాను అల్లాహ్‌కు సమర్పించుకొని, అతన్ని సేవించి మంచివాడిగా మనగలగడమో, లేక అల్లాహ్‌ను కాదని ధిక్కారిగా తయారవడమో– తేల్చుకోవలసింది మనిషే. మన జీవికను ప్రసాదించడంలో అతను ఎలాంటి తారతమ్యాన్ని, భేదభావాన్ని చూపడు. హిందువు అయినా, ముస్లిమ్ అయినా, క్రిస్టియన్ అయినా, నాస్తికుడయినా మరెవరయినా సరే అందరికీ ఆహారాన్ని సమకూర్చేది అల్లాహ్ మాత్రమే. ఎలాంటి ధర్మాన్ని ఆచరించే వారికైనా, ఆహారాన్ని, ఆశ్రయాన్ని, వస్త్రాలను, రక్షణను సమకూర్చేది ఆ రహ్మాన్ మాత్రమే.

అప్పట్లో మక్కా నగరంలోని ఖురైషులకు అల్లాహ్ నామం సుపరిచితమే కాని 'రహ్మాన్' నామం వారికి కొత్త. ప్రవక్త ముహమ్మద్ (స)పై ఖుర్‌ఆన్ ప్రభవన తరువాత ఇస్లాం ద్వారా అరబ్బులకు 'రహ్మాన్' కొత్తగా పరిచయమైన నామం.

కరుణామయుడైన అల్లాహ్ దయవలన ఖురైష్ వంశం నుండే ఒక

ప్రవక్తను ప్రభవింపజేయడం జరిగింది. ఆ ప్రవక్త (స) ద్వారానే వారికి నిజధర్మం, రుజుమార్గం లభించింది. రహ్మాన్ కారణంగానే మనకు అల్లాహ్ పట్ల విశ్వస నీయత కలిగింది. గ్రహాలను, విగ్రహాలను పూజిస్తూ ప్రజలు అజ్ఞానాంధకారంలో పడివున్నప్పుడు, అల్లాహ్ మాత్రమే ఆరాధనకు అర్హుడని, అందరూ ఆయన్నే వేడుకోవాలనే ఏకేశ్వర సిద్ధాంతం ఆ రహ్మాన్ మూలంగానే లభించింది. ప్రవక్త ముహమ్మద్ (స) ఏకేశ్వరోపాసన ద్వారా మనుషులందరినీ ఏకం చేశారు. అందువల్లనే ప్రపంచంలో ముస్లింలు ఏ ప్రాంతానికి చెందినవారైనా ఈ సిద్ధాంతాన్నే పాటిస్తారు. మనుషుల మధ్య సోదరభావం జనింపజేయడానికి ఈ ఏకేశ్వర సిద్ధాంతమే మూలమంత్రంగా పనిజేస్తుంది. ఇదంతా ఆ రహ్మాన్ వల్లనే సాధ్యమయ్యింది. ఆ రహ్మాన్ కారణంగానే మానవాళికి మహోన్నతమైన ప్రవక్త ముహమ్మద్ (స) లభించారు, ఆ రహ్మాన్ మూలంగానే మనకు దివ్య ఖుర్ఆన్ లభించింది, ఆ రహ్మాన్ వల్లనే రుజుమార్గమైన ఇస్లాం ప్రసాదించ బడింది.

మానవుల కష్టాలు, కడగండ్లు కేవలం కరుణామయుడైన అల్లాహ్ వలనే అంతమవుతాయి. సమస్యల అరణ్యంలో చిక్కుకున్న మనిషికి రహ్మాన్ నామ జపతపములే శరణ్యం.

اَلرَّحِيْمُ

౨. అర్రహీమ్

అల్లాహ్ మరో నామం రహీం, అంటే దయామయుడు అని అర్థం. రహ్మాన్, రహీం రెండు నామాలు దాదాపు ఒకే అర్థాన్ని ఇస్తాయి. అల్లాహ్‌కు మానవులపట్ల గల అనంతమైన దయాగుణాన్ని తెలిపేవే ఈ రెండు పేర్లూను. ఏమైనా రెంటిలో కాస్తంత తేడావుంది. తన పట్ల విశ్వాసం లేకున్నా తనకున్న దయాగుణం కారణంగా అందరికీ అన్నీ ఇస్తున్నాడు రహ్మాన్. అల్లాహ్‌ను విశ్వసించి, అతన్నే ఆరాధించే వారికి స్వర్గాన్ని ప్రసాదిస్తాననే శుభవార్త నిస్తున్నాడు రహీం. అల్లాహ్‌ను విశ్వసించి ఖుర్ఆన్ ఆదేశానుసారం జీవితాన్ని కొనసాగించే ముస్లింలకు పరలోకంలో స్వర్గాన్ని ప్రసాదిస్తాడు రహీం. ఇదీ రహీం ప్రత్యేకత. రహ్మాన్ అందరివాడు. విశ్వసించిన సజ్జనులకు చెందినవాడు రహీం. కాబట్టే ఏకేశ్వరోపాసకులైన దాసులకు పరలోకంలో స్వర్గాన్ని బహూకరిస్తానంటున్నాడు రహీం. మన ప్రతి చిన్న సత్కర్మకు అల్లాహ్, అర్రహీం కనికరించి అనేక రెట్లు బహుమానాల్నిస్తాడు. సరి అయిన విశ్వాసంతో చేసే నిజమైన ఆరాధన వలన అల్లాహ్ మన పట్ల దయచూపుతాడు కాబట్టే రహీం అని పిలువబడుతున్నాడు. ఆయన దయ, కనికరం మన ఊహలకు అందనిది, అందుకనే విశ్వసించిన ఒక ముస్లిం తనకు స్వర్గాన్ని ప్రసాదించమని రహీంను అర్థిస్తాడు.

దాదాపు ప్రతి మనిషి తన దుష్ట కోరికల కారణంగా చేసిన అపరాధాలకు తానే బాధ్యుడు, బాధితుడు. దీని వలన జీవితంలో ఒక్కోసారి గౌరవం, పరపతి ఇంకా సమస్తం కోల్పోవలసి వస్తుంది. వెంటనే పశ్చాత్తాపపడి రుజుమార్గాన్ని అవలంబిస్తూ కేవలం అల్లాహ్‌ను మాత్రమే సేవిస్తే, అర్రహీం దయదలచి అతన్ని

సన్మార్గాన నడిపే ఆస్కారం వుంది. చేసిన తప్పును మళ్ళీ చేయకుండా వుంటేనే పశ్చాత్తాపపడినట్లు లెక్క. అప్పుడే అర్రహీం మన పట్ల కరుణ జూపుతాడు. అనంతమైన కరుణ చూపుతాడు కాబట్టే అల్లాహ్ అర్రహ్మాన్, అర్రహీం, అల్ గఫూర్ అనే పేర్లతో అలరారుతున్నాడు. మనంతట మనం దేనికీ అర్హులము కాము. మన పరలోకమంతా అల్లాహ్, అర్రహ్మాన్, అర్రహీం దయపైనే ఆధారపడి వుంది. షైతాన్ వలలో చిక్కి దోషులమైన మనకు అల్లాహ్ దయతోనే రక్షణ లభిస్తుంది. లేకపోతే మనదుష్ట కార్యాలకు శిక్షగా నరకాగ్ని మనకోసం కాచుకొనివుంది. అల్లాహ్ భీతి, దయ మనకు ఉభయలోకాల్లోనూ అవసరమే. పాప కార్యాలకు పాల్పడకుండా వుండేందుకు, సత్కర్మలాచరించేందుకు మనకు అల్లాహ్, అర్రహ్మాన్, అర్రహీం ఆశీస్సులు అవసరం. అల్లాహ్ పట్ల విశ్వసనీయత కొరకు, పరిశుభ్రమైన ఆలోచనకొరకు, సదాచరణ కొరకు ఆయన్నే వేడుకోవాలి.

అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన్ను మాత్రమే కొలిచే వారికి అల్లాహ్, అర్రహీం ఆశీస్సులు, దయవలన శాశ్వతమైన స్వర్గసుఖాలు సంప్రాప్త మవుతాయి.

اَلْمَالِكُ
3. అల్ మాలిక్

అల్లాహ్‌యే ఈ ప్రపంచానికి సృష్టకర్త, యజమాని. తీర్పు దినానికి కూడా ఆయనే అధినేత. ప్రతి వ్యక్తికీ తన కర్మలను బట్టి ప్రతిఫలం దొరకాలి. అల్లాహ్‌యే అందరికీ సరియైన న్యాయం చేసేవాడు. నేరస్థుడికి శిక్ష, సజ్జనునికి తగిన సత్ఫలితం లభించాలి. అల్లాహ్‌యే నిజమైన తీర్పరి, మన అన్ని విషయాలూ ఎరిగినవాడు. కాబట్టి ఆయనే తీర్పు దినానికి యజమాని. ఆయన తలిస్తే మనల్ని క్షమించవచ్చు, ఎవరూ మరొకరి మన్నింపు కొరకు సిఫారసు చేయలేరు. షిర్క్ (బహుదైవారాధన)ను తప్ప మన ఇతర చిన్నాచితక తప్పులను ఆయన క్షమించవచ్చు. ఆయన తప్ప ఆరాధనకు అర్హులు మరెవ్వరూ లేరు. సజ్జనులు స్వర్గానికి, నేరస్తులు నరకానికి పోక తప్పదు.

మాలిక్ అంటే రాజు లేక యజమాని అని అర్థం. ఈ ప్రపంచానికి అల్లాహ్‌యే కర్త, యజమాని ఇంకా తీర్పు దినానికి యజమాని. ఈ ప్రపంచం లోని ఓ ప్రాంతానికీ లేక ఓ దేశానికి మాత్రమే ఆయన రాజు కాదు. ఆయన రాజులకు రాజు, ప్రపంచానికే చక్రవర్తి, సార్వభౌమాధికారి, పాలకుడు. ఫిరౌన్ రాజు తాను ప్రపంచానికి రాజునని చెప్పుకున్నాడు. కాని చివరికి ఏం జరిగింది– సర్వనాశనమయ్యాడు. పుడమిపైన వున్న రాజులంతా ఏదో ఒకరోజు చనిపోయేవారే. అల్లాహ్ ఒక్కడే శాశ్వతంగా వుండేవాడు. ఆయన ఈ ప్రపంచానికి రాజు మాత్రమే కాదు తన సృష్టితాల పట్ల అమిత దయ, ప్రేమ, వాత్సల్యాలు గలవాడు; ఇంకా అందరినీ ఆయనే ఎల్లప్పుడూ కనిపెట్టి కాపాడే వాడు. ఈ ప్రపంచంలో సత్యాన్ని, శాంతిని సంస్థాపించదలిచాడు. మనమంతా

విశ్వసనీయమైన దాసులుగా మారాలని ఆయన ఆకాంక్ష. అల్లాహ్‌యే అత్యంత శక్తిమాన్యుడైన పాలకుడు.

ఒక దేశంలో మనం నివసిస్తున్నప్పుడు ఆ దేశ సంవిధానాన్ననుసరించి జీవించాలి. అదే విధంగా ఈ ప్రపంచంలో నిజమైన విశ్వాసంతో, నిత్యజీవితంలో పాటించాల్సిన నియమాల్ని అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో మనకు తెలిపాడు. ఆయన అయిష్టత నుండి, కోపాన్నుండి, శిక్ష నుండి మనం తప్పించుకోవాలంటే ఆ విధివిధానాల్ని అనుసరించటం మన విధ్యుక్త ధర్మం. మనం మంచివారుగా, సత్యవంతులుగా, సత్శీలురుగా, ఉన్నతులుగా మారి శాంతిని, సోదరత్వాన్ని స్థాపించాలి; అప్పుడే మనం మంచి పౌరులుగా పరిగణించబడి అందరి మాలిక్-అల్లాహ్ నిర్దేశించిన నియమాల్ని పాటించినవారమవుతాం. మన మార్గదర్శకానికి దివ్య ఖుర్‌ఆన్, ఇంకా ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర జీవన విధానం కూడా మన ముందుంది.

మరణించిన మానవాళి అంతా మళ్ళీ లేపబడి అల్లాహ్ ముందు హాజరవటం తథ్యం. ఆ తీర్పు దినానికి ఆ మాలిక్ మాత్రమే సర్వాధికారి అవుతాడు.

اَلْقُدُّوسُ
4. అల్ ఖుద్దూస్

అల్లాహ్ పరమ పవిత్రుడు గనకనే 'అల్ ఖుద్దూస్' అని పిలువబడు తున్నాడు. ఆయన నామమే పావనమైనది, పునీతమైనది. ఆయన తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులుకారు. అల్లాహ్ అన్ని పాపాలకు అతీతుడు, అత్యంత పవిత్రుడు. స్వయంగా తనే ఆరాధనకు అర్హుడని, మన ఆరాధనలన్నీ ఆయన కొరకే సంస్థాపించబడాలని ఖుద్దూస్ నామం తెలియజేస్తుంది. ఒక మానవుడికి పవిత్రతను ఆపాదించి మనం పొరపాటు చేస్తున్నాం. ఇది ఎంతో విపరీతమైన పోకడ. అల్లాహ్, అల్ ఖుద్దూస్ తప్ప ఈ ప్రపంచంలో ఎవరూ పవిత్రులు కారు. అనేక ధార్మిక భావనల్లో తమ పెద్దల్ని, రుషుల్ని, మత గురువులను పవిత్రులుగా పరిగణిస్తూ వుంటారు. ఇది యుక్తమైనది కాదు. ఒకరు శారీరకంగా పరిశుద్ధులైనంత మాత్రాన పవిత్రులుగా పిలవబడటానికి అవకాశం లేదు. మనిషి శరీరం, ఆలోచనలు అశుద్ధాలకు నిలయాలు.

జిబ్రయీల్ (అ)లాంటి దైవదూతలు పవిత్రులుగా పరిగణించబడుతున్న ప్పటికీ, వారు మట్టితో కాక కాంతితో సృజించబడ్డారు. అల్లాహ్‌కు వున్న పవిత్రత దైవదూతలకంటే ఉన్నతమైనది. అల్లాహ్ ఆరాధనా నిలయాలైన మస్జిదులు కూడా పవిత్రతకు మారుపేర్లు. అల్లాహ్‌ను ఆరాధించే స్థలం కాబట్టే మస్జిదులను చాలా పరిశుభ్రంగా వుంచుతాం. బాహ్యాపరంగా కనిపించేది పరిశుభ్రత; కాని పవిత్రత, పరిశుద్ధత అనేవి అల్లాహ్‌కు వుండే అంతర్ గుణాలు. మానవులు లేక దైవదూతలు అల్లాహ్ అంతటి పరిశుద్ధులు కారు.

మన దురాలోచనలే మన చెడు పనులకు, పాపాలకు ప్రేరణగా పని

చేస్తున్నాయి. ఎందుకంటే మనమంతా షైతాన్ బాధితులం. మన ప్రయత్నంతో, దైవానుగ్రహంతో మనం మంచివారిగా, సత్యవంతులుగా, ధర్మవర్తనులుగా మారవచ్చు కాని పరిశుద్ధులం కాలేము. స్వయంగా మన శరీరమే రక్తమాంసాలతో, అశుద్ధాలతో నిండివుంది. అలాంటప్పుడు మనమెలా పవిత్రులుగా ఎంచబడగలుగుతాం? కాబట్టి పవిత్రత పరిశుద్ధతలు అల్లాహ్ సుగుణాలు మాత్రమే.

సకల ప్రయత్నాలతో మనం శారీరకంగా శుద్ధులమై, సత్శీలురమై, సత్ప్రవర్తనతో నిజమైన ముస్లింలుగా మారాలి.

నమాజు ఆచరించేందుకు మనం వుజూ చేస్తాం. ఇది మనల్ని బాహ్య పరంగా శుభ్రంగా వుంచుతుంది. వుజూ లేకుండా మన నమాజులు అంగీకరించబడవు. అల్లాహ్‌ను ఆరాధించేందుకు మనం చేసే చిన్న ప్రయత్నమిది.

రక్తమాంసాలు మన శరీరమంతా నిండివున్నాయి; మన మనసు కూడా ఎన్నో అశుద్ధాలకు ఆలవాలం. కాని అల్లాహ్ - అల్ ఖుద్దూస్ మాత్రమే పవిత్రుడు, కాబట్టే ఆరాధనకు అర్హుడు.

اَلسَّلَامُ
5. అస్సలామ్

సలాం అంటే శాబ్దికంగా శాంతి అని అర్థం. ఇస్లాం ధర్మం స్వతస్సిద్ధంగా శాంతియుత జీవనాన్ని, మానవాళిలో శాంతిని ప్రబోధిస్తుంది. శాంతి సోదర భావానికి సారాంశం వంటిది. ఇస్లాం అంటే శాంతికి మారుపేరు. అల్లాహ్ పవిత్రతకు, శాంతికి చిహ్నం. ఏకేశ్వరోపాసన సిద్ధాంతాన్నే ప్రవక్తలంతా– మరీ ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్– మానవాళికి ప్రబోధించారు. అల్లాహ్ ఒక్కడే శాంతికి, సంపూర్ణతకు నిలయం. శాంతి అంటే కేవలం కల్లోలానికి వ్యతిరేక పదం మాత్రమేకాదు, అది సమైక్యతకు, సంపూర్ణతకు మారుపేరు. సోదరభావం శాంతి నుండే జనిస్తుంది తప్ప అనైక్యతలో, అనేక సిద్ధాంతాలతో కాదు. శాంతియుత జీవనమే రక్షణకు రాచబాట వేస్తుంది. అల్లాహ్ పట్ల నిజమైన విశ్వాసం కలిగివుండి, ఆయనకే విధేయత చూపినట్లయితే నిస్సందేహంగా ఎల్లెడలా శాంతి వ్యాపిస్తుంది. ఒక ముస్లిం మరో ముస్లింను 'అస్సలాము అలైకుం' అని ఆశీర్వదిస్తాడు– అంటే 'నీపై శాంతి కలుగుగాక' అని దీవిస్తాడు. కాబట్టి ఈ శాంతి సందేశాన్ని ఎంత మేరకు సాధ్యమైతే అంతమేర వ్యాప్తి చేయాలి. అల్లాహ్‌యే మన శాంతియుత జీవనానికి ఆధారం. ఆ ప్రభువు నుండే పవిత్రత, ప్రశాంతత, పరిపూర్ణత నిత్యం ప్రసరిస్తూ వుంటాయి. మనిషిలో వున్న ఓ సద్గుణం మరో మంచి లక్షణానికి దారితీస్తుంది. సత్యపథకుడైన ఒక వ్యక్తి సద్వర్తనుడై, శాంతికాముకుడై వుంటాడనటంలో ఎలాంటి సందేహమూ లేదు. ఇలాంటి సలక్షణాలన్నీ అల్లాహ్–అస్సలామ్ నుండే మనకు లభ్యమవుతాయి.

ఈ రోజు మనం ప్రశాంత జీవనాన్ని కొనసాగిస్తున్నామంటే, అదంతా అల్లాహ్ చలువే. తనను విశ్వసించిన నిజ దాసులకు అలాంటి ప్రశాంత జీవనాన్ని ప్రసాదిస్తాడు ఆ పరమప్రభువు. తమ ప్రార్థనల్లో ముస్లింలంతా ప్రవక్తకు 'శాంతి సందేశం'– దరూద్– పంపుతారు. దానికి అల్లాహ్ మనకు పదిరెట్లు ప్రశాంతతను ప్రసాదిస్తాడు. కాబట్టి ప్రతివారికి మనం ముందుగా సలామ్ చేయటం అలవరచుకోవాలి. తనకు, తనతోటి వారికి ప్రశాంత జీవనం కొరకు పరితపించేవానికి ఎలాంటి అడ్డంకులు, అవరోధాలు ఎదురుకావు. ఇస్లాం అంటే శాంతి అని అర్థం. తోటి వారికి మనమే ముందుగా 'అస్సలాము అలైకుం' అని చెప్పాలి. సోదరభావం పెంపొందడానికి సాదరపూర్వకమైన సందేశం ఇదే. అల్లాహ్ ఆరాధనలో దుష్టశక్తుల అడ్డంకులు, అవరోధాలు ఏర్పడితే మనం వాటిని నిర్మూలించి తిరిగి శాంతియుత జీవనాన్ని సంస్థాపించాలి. ఇస్లాం కల్లోలాన్ని ప్రేరేపిస్తుందని, ముస్లింలు యుద్ధపిపాసులనే అపోహలు నేడు ప్రపంచమంతా వ్యాపింపజేయబడ్డాయి. ఇవి నిరాధారమైన మాటలు. ఇస్లాం ఎల్లప్పుడూ ప్రశాంతతనే కోరుకుంటుంది. అల్లాహ్– అస్సలామ్ ఈ ప్రపంచంలో ప్రశాంతతను, ఏకేశ్వరోపాసనను పరిఢవిల్లజేయాలని మనమంతా ఆశిద్దాం.

ఇస్లాం ధర్మం శాంతికి చిహ్నం; అల్లాహ్‌ను విశ్వసించిన వారు సదా శాంతి సందేశాన్నే ప్రబోధించాలి. అల్లాహ్– అస్సలామ్ పరమ దయామయుడు, నెమ్మదికి నెలవు.

اَلْمُؤْمِنُ

6. అల్ మోమిన్

అల్ మోమిన్ అంటే విశ్వాసాన్ని పరిరక్షించేవాడు. మనకు సన్మార్గాన్ని విశ్వాసాన్ని ప్రసాదించిన ఆ ప్రభువే స్వయంగా మన విశ్వాసానికి సాక్ష్యం కూడా ఇస్తానని ప్రకటిస్తున్నాడు. అల్లాహ్‌యే ఆయన్ని విశ్వసించేలా చేసి, దాని రక్షణ బాధ్యత కూడా ఆయనపై మోపుకున్నాడు. మోమిన్ పదం ఈమాన్ నుండి వచ్చింది. ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను విశ్వసించిన వారు ఆయన్ని మాత్రమే ఆరాధించాలి. మోమిన్ అంటే మరో అర్థంలో శాంతికి కూడా వర్తిస్తుంది. అదే ప్రశాంత జీవనానికి, సోదరభావానికి ప్రామాణికంగా నిలుస్తుంది. దైవగృహం కాబా ప్రశాంతతకు నిలయం. ప్రపంచ ముస్లింలందరికీ ఇది శాంతి నిలయం.

అల్లాహ్‌ను కాదని ఇతరులను, విగ్రహాలను, గ్రహాలను పూజించేవారు ఎట్టి పరిస్థితిలోనూ మోమిన్ లేక ముస్లిం కాలేరు. అలా భావించటం అది వారి భ్రమ. సన్మార్గం అల్లాహ్ నుండే లభిస్తుంది. ఇస్లాంను స్వీకరించిన తరువాత అల్లాహ్‌యే మన విశ్వాసానికి, శ్వాసకు రక్షకుడు. కాబట్టే అల్ మోమిన్ ఆయన గొప్ప గుణం అయ్యింది. ప్రజల వినాశానికి పాల్పడుతున్నవాడు, అల్లాహ్‌ను విశ్వసించక, ఆయన ఆజ్ఞల్ని, ఖుర్‌ఆన్ మరియు ప్రవక్త (స) ఆదేశాలను పాటించనివాడు, ఏకేశ్వరోపాసనను తృణీకరించినవాడు నరకానికి పోవటం తథ్యం. అలా కాకుండా అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన చూపిన బాటపై నడుస్తూ ప్రవక్త (స) హితవుల ప్రకారం జీవితాన్ని సాగించేవారు శాశ్వతమైన స్వర్గ సుఖాలకు అర్హులవుతారు. మన ప్రతి పనిని, ప్రతి ఆలోచనను అల్లాహ్ గమనిస్తూనే వున్నాడు. అల్లాహ్ మన విశ్వాసానికి రక్షకుడు మాత్రమే కాదు, ఆయన్ని

విశ్వసించని వారిని వినాశపరిచేవాడు కూడాను. అవిశ్వాసులకు అల్లాహ్ ఎంతో విడుపును, వ్యవధిని ఇస్తూ పోతున్నాడు- తిరిగి వారు ఆయన్ని విశ్వసించి సన్మార్గాన్ని స్వీకరిస్తారని. ఇక జీవితాంతం దైవ తిరస్కారంలో పడివున్న వారి కొరకు- ఈ ప్రపంచంలో వారెంతటి ధనవంతులైనా, అధికారులైనా సరే- నరక జ్వాలలు సిద్ధంగా కాచుకొని వున్నాయి. వారు మరణించిన పిదప ఆస్తిపాస్తులు వారి వెంటరావు. అల్లాహ్ పట్ల చూపిన విశ్వసనీయత ఆధారంగానే మనకు న్యాయం జరుగుతుంది. ప్రపంచంలో ఎన్ని కష్టాల్ని ఎదుర్కొన్నా అల్లాహ్ ముస్లిం (విశ్వాసు)లందరికీ శాశ్వతమైన స్వర్గసుఖాలను ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు. కాని అవిశ్వాసులకు వారి దుష్కర్మల కారణంగా నరకమే శాశ్వత నివాసంగా మారుతుంది. అల్లాహ్ షిర్క్ (బహుదైవారాధన)ను ఎన్నటికీ క్షమించడు.

అల్లాహ్ - అల్ మోమిన్ ఆశీస్సులతోనే మనకు విశ్వసనీయత, ఇస్లాం సౌభాగ్యం లభిస్తుంది. ఆయన మాత్రమే మన విశ్వాసాన్ని పరిరక్షించి దానికి సాక్షిగా నిలిచే నిఖిలేశ్వరుడు.

اَلْمُهَيْمِنُ
7. అల్ ముహైమిన్

భయానికిలోనైన శిశువు రక్షణ కొరకు తల్లిని ఆశ్రయిస్తుంది. ప్రమాద సంకేతం గమనించిన కోడిపెట్ట తన పిల్లల్ని రెక్కల్లో దాచి రక్షిస్తుంది. అల్లాహ్-అల్ ముహైమినూ అంతే. ఆయనే మన రక్షకుడు, శరణ్యుడు. మన శ్రేయస్సు ఆయనలోనే వుంది. విశ్వసనీయులైన తన దాసులను అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు. వారికి ఎలాంటి హాని జరగకుండా కాపాడుతుంటాడు. ఎలాంటి పరిస్థితుల్లోనూ మన విశ్వాసం చెక్కుచెదరకూడదు. ఎందుకంటే అల్లాహ్‌యే మనకు అన్ని విధాల ఆదుకునేవాడు.

తౌరాత్, బైబిల్ (ఇన్జీల్) మొదలైన దైవగ్రంథాలు మానవుల 'చేత' ప్రక్షిప్తాలకు లోనయ్యాయి. దైవ గ్రంథాలన్నీ ఒకే సందేశాన్ని అందించాయి. అదే ఏకేశ్వరోపాసన సందేశం- ఆయన ఒక్కణ్ణే మనం ఆరాధించాలని. మన ప్రార్థనలకు ఆయనే అర్హుడు. ఆయన్ను విశ్వసించిన వారు తీర్పుదినాన తగిన రీతిలో సత్కరింపబడతారు.

తౌహీద్ (ఏకేశ్వర సిద్ధాంతం) పదిలత కొరకు అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌ను, ప్రవక్త (స)ను పంపాడు. ప్రపంచమంతటా వేనవేల ముస్లింలు ఖుర్‌ఆన్‌ను కంఠోపాఠం చేసి తమ హృదయాల్లో పదిలపరచుకొంటున్నారు. ఇదెలా సాధ్యమవుతోంది? ఇదంతా అల్లాహ్-అల్ ముహైమిన్ సహాయంతోనే సాధ్యమవుతోంది. అల్లాహ్, ఆయన విశ్వసనీయులైన దాసులను అన్ని విధాల రక్షిస్తాడు. ఆయన పట్ల మనకున్న విశ్వసనీయత బెదరకుండా, చెదరకుండా,

వుందంటే అదంతా ఆయన అండ కారణంగానే; పవిత్ర గ్రంథాన్ని, మన విశ్వాసాన్ని కాపాడే బాధ్యతను ఆయనే తీసుకున్నాడు.

సజ్జనులైన అల్లాహ్ దాసులు చేసిన సత్కర్మలు ఎన్నటికీ వృధాకావు. ముస్లింలకు అల్లాహ్ చేసిన వాగ్దానం ఇది. కాబట్టి అల్లాహ్-అల్ ముహైమిన్ మన శ్వాసనే కాదు, విశ్వాసాన్ని కూడా రక్షిస్తున్నాడు. తన హృదయంలో పవిత్ర ఖుర్ఆన్, పవిత్ర సందేశం పదిలంగా వున్నంతవరకూ నిజమైన ముస్లిం ఎలాంటి భయానికి లోనుకాకూడదు. షైతాన్ ప్రేరేపిత దుష్కర్మల నుండి, చెడు ఆలోచనల నుండి అల్లాహ్ మనల్ని రక్షిస్తూనే వుంటాడు. షైతాన్ మనిషికి బద్ధవిరోధి, మనిషిని సన్మార్గం నుండి తప్పించటానికి, తప్పిదాలకు పురికొల్ప టమే అతని పని. కాని అల్లాహ్- అల్ ముహైమిన్ పట్ల నిజమైన విశ్వాసాన్ని కలిగివున్న ముస్లింలపై అతని పాచికలు పారవు.

పరమ దయామయుడైన అల్లాహ్-అల్ ముహైమిన్ సజ్జనుల విశ్వాసాన్ని, పవిత్ర ఖుర్ఆన్‌ను సదా సంరక్షిస్తానని వాగ్దానం చేశాడు.

اَلْعَزِيْزُ

8. అల్ అజీజ్

అల్లాహ్ పవిత్ర నామం - అల్ అజీజ్ అనేక సద్గుణాల సమ్మేళనం. అల్ అజీజ్ అంటే అత్యంత శక్తిమంతుడు, ఘనతగలవాడు, గౌరవనీయుడు, అత్యున్నతుడు ఇంకా క్షమించేవాడు అనే అర్థాలున్నాయి. ఈ లక్షణాలన్నీ అల్ అజీజ్‌లో నిబిడీకృతమైవున్నాయి. ఆ పేరు వర్ణనకు అతీతమైనది. ఇస్లాం మరియు ప్రవక్త ముహమ్మద్ (స)ల రాక పూర్వం మక్కా అవిశ్వాసులు అనేక విగ్రహాలను ఆరాధించేవారు. వాటిలో ఒకదాని పేరు 'అజ్జా.' ఈ దేవతను కొలిచే అనేకమంది భక్తులుండేవారు. తతిమ్మా మూడొందలకు పైచిలుకు విగ్రహాలతోపాటు దీనిని కూడా ప్రవక్త (స) తొలగించారు.

ప్రవక్త (స) మదీనాకు వలస వచ్చినప్పుడు ఇబ్నా అలీ బిన్ సల్లా అనేవాడు ఓ తెగకు నాయకుడుగా ఉండే వాడు. తెగకు సర్దారు కావటాన ప్రజలు అతన్ని అజ్జూ అని పిలిచేవారు. చాలా సందర్భాలు అతను ప్రవక్త (స)ను అజల్లా అని అమర్యాదగా పిలిచేవాడు. అజల్లా అంటే అమర్యాదను సూచించే పదం. కొంతకాలం తర్వాత అతని కుమారుడు ఇస్లాం స్వీకరించి తండ్రి అజ్జూను అనేక రకాలుగా అవమానపరిచాడు. ఆ అవమాన భారంతో అజ్జూ ఇంట్లో నుంచి బయటికి రావటం మానేశాడు.

గౌరవ మర్యాదలు అల్లాహ్ చేతుల్లో వున్నాయి. ప్రవక్త (స)కు అల్లాహ్ అత్యంత గౌరవాన్ని ప్రసాదించాడు. అయితే అల్ అజీజ్ అనే గుణవాచకం అల్లాహ్‌కు మాత్రమే వర్తిస్తుంది. ఈ నామంలోనే అల్లాహ్‌కు వున్న అమిత

శక్తి, దయ, క్షమ, ఘనత చేరివున్నాయి. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్‌ను అల్ అజీజ్ అని అనేకమార్లు ప్రస్తావించటం జరిగింది.

అల్లాహ్ పట్ల, ఆయన ఏకేశ్వర సిద్ధాంతం పట్ల విశ్వాసాన్ని కలిగిన వారికి గౌరవ ప్రతిపత్తులు ఇవ్వబడతాయి. అల్లాహ్‌ను విశ్వసించనివారికి ఇస్లాంలో ఎలాంటి గౌరవమూ లేదు.

అత్యంత గౌరవనీయుడు, శక్తిమంతుడు అయిన అల్లాహ్-అల్ అజీజ్ ఒక్కడే ఆరాధనకు అర్హుడు.

اَلْجَبَّارُ

9. అల్ జబ్బార్

పాషాణ హృదయులు పరుల పట్ల దయచూపలేరు. ఫిరౌన్ రాజు తన ప్రజల్ని పశువుల్లా, పురుగుల్లా భావించి ఎనలేని కష్టాలకు గురిజేశాడు. ఏ ఒక్కడూ ఆయన్ని ఎదిరించలేకపోయాడు. ఈ విధంగా చరిత్రలో కొంత మంది దుష్ట స్వభావులున్నారు. వారు అధికారాన్ని దుర్వినియోగపర్చారు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో, ఎటువైపు నుంచీ ఎలాంటి సహాయం అందని తరుణంలో ప్రజలు అల్లాహ్ - అల్ జబ్బార్ సహాయాన్ని పొందారు, పొందుతున్నారు. తప్పకుండా అల్లాహ్ అలాంటి సమయాల్లో అన్ని విధాల ఆదుకుంటాడు.

అంతులేని సముద్ర జలనిధిలో చిక్కుకుని మునిగి పోతున్న నౌక, ఇక చావే మనకు దిక్కని తలచిన అలాంటి దిక్కుతోచని సమయంలోనూ అల్లాహ్, అల్ జబ్బార్ మాత్రమే మనల్ని మన నౌకను ఒడ్డుకు చేర్చి కాపాడు తున్నాడు. అదే అల్ జబ్బార్ ప్రత్యేక లక్షణం. విధ్వంస, విపత్కర పరిస్థితులు ఎదురై మృత్యువు ఆసన్నమైన వేళల్లోనూ మనకు ఆ అల్లాహ్- అల్ జబ్బార్ మాత్రమే శరణ్యం, ఆయన ఆశ్రయంలోనే మనకు శ్రేయం వుంది. ప్రవక్త మూసా (అ) మాటను పెడచెవిన పెట్టిన ఫిరౌన్ రాజు, అతని సైన్యం సమూలంగా నాశనమైంది. జబ్బార్ అంటే మనకు వెనుదన్నుగా నిలిచి రక్షించేవాడని అర్థం. ఆ జబ్బార్ మాత్రమే మనకు శత్రువులను ఎదుర్కొనే శక్తిని, యుక్తిని ప్రసాదించి వారిని తుదముట్టేలా లేదా మనకు లొంగిపోయేలా అయినా చేస్తున్నాడు. అంత పెద్ద సైన్యాన్ని గడగడలాడించిన గోలియత్‌ను పిన్న వయస్కులైన దావూద్ (అ) ఎలా కడతేర్చారు! ప్రజా కంటకులు, అహంకారులు, గర్వాంధకారులైన వారిని అల్లాహ్- అల్ జబ్బార్ పరిసమాప్తం చేస్తాడు. అమాయకులను,

సజ్జనులను పీడిస్తున్న వారి ఆటలు అల్లాహ్– అల్ జబ్బార్ ముందు సాగవు. విశ్వసించిన దాసులకు వారి ఆపద సమయాల్లో అల్లాహ్ ఆదుకుంటూనే వుంటాడు.

అధికారాసనంపై కూర్చున్నవారు దయ, దాక్షిణ్యం, శాంతి, ప్రేమ, దాతృత్వం, క్షమ మొదలైన సద్గుణాలను అలవరచుకొని ప్రజలపట్ల సద్భావంతో మెలగాలి. సదా అల్లాహ్‌కు భయపడాలి. అవిశ్వాసులు, మదాంధులు, గర్వాంధ కారులు అయిన దుష్టులు అల్లాహ్ కోపాగ్నికి దహించుకుపోతారు. అల్లాహ్ ఎలాంటి దుష్టులకైనా కొంత విడుపును, వ్యవధిని ఇస్తాడు. అప్పటికీ వారు దారికి రాకపోతే తగిన రీతిలో తగిన వేళ వారిని దండిస్తాడు. విశ్వసనీయులైన తన దాసుల్ని అల్లాహ్– అల్ జబ్బార్ ఇస్లాంకు శత్రువులైన దుష్టశక్తుల నుండి రక్షించుగాక!

అల్లాహ్‌ను విశ్వసించిన దాసులు అంతులేని ఆపదల్లో చిక్కుకుని అంతమై పోయే వేళ అల్లాహ్–అల్ జబ్బార్ తప్పకుండా వారిని కాపాడుతాడు.

اَلْمُتَكَبِّرُ

10. అల్ ముతకబ్బిర్

వయో వృద్ధుడైన ఒక తాత తనను గౌరవించాలని తన మనుమలు మనుమరాళ్ళతో చెబితే అది సబబే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఎవరూ దీన్ని తిరస్కరించరు కూడా. తన బరువు 150 కిలోలని, ఎత్తు ఆరడుగులని ఒక మల్లయోధుడు చెబితే అది కూడా నిజమని నమ్మాలి. అతను డంబాలు పలకటం లేదు. ముతకబ్బిర్ నామం గొప్పతనానికి, ఔన్నత్యానికి, అత్యంత శక్తికి, దయ, క్షమకు సంకేతం. అల్లాహ్‌యే స్రష్ట కాబట్టి కేవలం అతనికే అల్ ముతకబ్బిర్ పదం శోభిస్తుంది. ఎవరైనా మానవ మాత్రుడు హద్దుమీరి తన అధికారాన్ని దుర్వినియోగపరిస్తే దాన్ని గర్వంగా పరిగణించటం జరుగుతుంది. అల్లాహ్‌యే మన సృష్టికర్త అని, ఆయనే అత్యంత శక్తిమంతుడు, అమిత దయామయుడని అందరికీ తెలిసిన వాస్తవమే. అందుకే ముతకబ్బిర్ పదం ఆయన ఔన్నత్యానికి, గౌరవనీయతకు, గొప్పతనానికి సంకేతంగా వాడబడుతుంది.

అల్లాహ్ పవిత్ర నామం ముతకబ్బిర్ మన దగ్గరవున్న ఏ వస్తువు, లేక శక్తి కారణంగా గర్వానికి లోనవరాదని, ప్రవర్తనలో హద్దులు మీరరాదని, పేదల పట్ల బలహీనులపట్ల అమర్యాదగా ప్రవర్తించరాదని, మరెవరినీ కించపరచక ఎల్లప్పుడూ అందరినీ ఆదరించాలనీ, మంచికి మన్ననలకు మారుపేరుగా నిలవాలని బోధిస్తుంది. షైతాన్‌కు వున్న గర్వ గుణం మనిషి పుర్రెలో పురుడుపోసుకొని తనకున్న అధికారంతో మనిషి తలబిరుసువానిగా, బుద్ధిహీనునిగా, నిర్దయుడిగా మారిపోతాడు. మనిషికి, సంపద అధికారం

హోదా ఇచ్చి అల్లాహ్ పరీక్షకు గురిచేస్తాడు. నిజమైన విశ్వాసి అయితే హద్దులు మీరి ప్రవర్తించడు.

కాబట్టి మనిషికి గొప్పతనం దయ, సానుభూతి, క్షమాగుణాల కారణం గానే వస్తుంది. ఈ విశ్వాన్ని సృజించిన అల్లాహ్ మాత్రమే అన్నిటిపై అధికారం కలవాడు. అల్లాహ్, అల్ ముతకబ్బిర్‌కు మాత్రమే సర్వ సద్గుణాలు శోభిస్తాయి. ఆ గుణాల్ని మనము గణించలేము, వర్ణించలేము. మన జ్ఞాన పరిధికి, అవగాహనకు అవి అందనివి. కేవలం మనము ఆ విశ్వాధిపతికి వినయ విధేయతలు గల దాసులమే. ఆయన ఆజ్ఞాపాలన, విధేయతే మనకు శిరోధార్యం.

అన్ని సద్గుణాలూ ఆ అల్లాహ్ అల్ ముతకబ్బిర్‌కే చెల్లు.

اَلْخَالِقُ

11. అల్ ఖాలిఖ్

అల్ ఖాలిఖ్ అంటే సృష్టికర్త, రూపాన్నిచ్చేవాడు, నిర్ణయకుడు. జీవ, నిర్జీవాలను సృష్టించిన అల్లాహ్ ప్రతిదానికి గడువు, పని తీరు, స్థితి, పరిస్థితిని నిర్ణయిస్తాడు. శక్తికి మించిన పనిని ఎవరూ చేయజాలరు. ఎవరూ శాశ్వతంగా ఈ లోకంలో బ్రతకలేరు. ప్రతిదానికీ, ప్రతివారికీ ఓ కాల నిర్ణయం, హద్దంటూ ఉంది. కాబట్టి అల్లాహ్‌యే నిర్ణాయక శక్తి. ప్రపంచంలో లెక్కలేనన్ని వస్తువులున్నాయి. పండ్లు, ఫలాలనిచ్చే ఎన్నో రకాల చెట్లున్నాయి. కొన్ని వైద్యానికి, మరికొన్ని గృహోపకరణాలకు పనికివస్తున్నాయి. అందమైన వాటిని ఎన్నింటినో సృష్టించాడు అల్లాహ్. చంద్రుడు, నక్షత్రాలు, వివిధ రకాలైన పుష్పాలున్నాయి. పుష్పాల్లో దేని సువాసన దానికే ప్రత్యేకం. ఎన్నో రకాల జంతువులున్నాయి. కొన్ని బరువును మోసేవి, కొన్ని పెంపుడు జంతువులు, కొన్ని యుద్ధ రంగంలో ఉపయోగపడేవి. అల్లాహ్ సృష్టించిన వాటి రకాలను, రంగును వర్ణించాలంటే అక్షరాలు సరిపోవు. భూమి వివిధ రకాలైన పంటల్ని అందిస్తోంది. భూమిలో బంగారం, మణులు, మాణిక్యాలు, బొగ్గు, ఎన్నో ఖనిజాలు నిక్షిప్తమైవున్నాయి. సృష్టిలోని ప్రతిదీ మన కోసమే సృష్టించబడిందనీ, అన్నీ మన అవసరాలే తీరుస్తున్నాయని తెలిసినప్పుడు మన మనసు విస్మయానికి గురికాక తప్పదు. కొంత కాలానికి ప్రతిదీ నాశనమైపోయేదే. మరణించిన ప్రతిప్రాణీ తిరిగి లేపబడుతుంది. అదే తీర్పు దినం. ఆ రోజు అల్లాహ్ మాత్రమే అధికారి. అల్లాహ్ మనకు ప్రసాదించిన ప్రతి విషయంలోనూ మనం సమాధానం

చెప్పుకోవాలి. అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించుకోవడానికి మన దగ్గర భాష లేదు. అల్లాహ్ పట్ల మనం విశ్వాసం కలిగివుండటమే నిజమైన కృతజ్ఞత.

అల్లాహ్‌కు మనలో ఎంతమంది కృతజ్ఞతలు చెల్లించుకుంటున్నారు? మనల్ని సృష్టించి సర్వసదుపాయాలు కల్పించిన అల్లాహ్ పట్ల కృతఘ్నత చూపటం, అవిశ్వాసులుగా మారటం మహాపరాధం. మన కోసం లెక్కకు అందని జీవనిర్జీవాలను సృష్టించి ప్రపంచమంతా పరచిన ఆ అల్లాహ్‌యే - అల్ ఖాలిఖ్, సృష్టికర్త, రూపకర్త, నిర్ణాయకుడు, ప్రతిదానికి దాని జతను జనింపజేసినవాడు, ఇంకా నాశనకారి కూడా. ఈ ప్రపంచమంతా ఆయన ఒక్క వాక్కుతోనే ఉనికిలోకి వచ్చింది. అలాంటి అత్యంత శక్తిమంతుణ్ణే మనం ఆరాధించాలి. ఆయనే దానికి అర్హుడు.

اَلْبَارِئُ

12. అల్ బారి

అల్లాహ్, అల్ బారి ఈ ప్రపంచాన్ని శూన్యంలో నుంచి సృష్టించాడు. అంటే శూన్యంగా వున్న ఈ ప్రపంచాన్ని ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, భూమి, పశుపక్ష్యాదులు, చెట్లుచేమలు, క్రిమికీటకాలు, మానవ జాతితో నింపాడు అల్లాహ్. శూన్యంలో నుంచే దేన్నయినా సృజించటం అల్ బారి ప్రత్యేకత. ఇది అల్లాహ్‌కు వున్న సుగుణం. ఇది అల్లాహ్ గొప్పతనానికి, శక్తికి సంకేతం. ఆయన తలచుకుంటే ఏమైనా చేయగలడు. అల్ బారి అనేది అల్లాహ్‌కు వున్న మరో గుణం అల్ ఖాలిఖ్‌తో ముడివడివుంది. అయితే శూన్యంలో నుంచే సృజన చేయటం అల్ బారికి వున్న విశిష్ట గుణం. ఇంకా నిర్జీవం నుంచి జీవంగలదాన్ని ఆయనే సృజించాడు. పశువులు, వృక్షాలు మొదలైనవి జీవమున్న సృష్టితాలు. అల్లాహ్ ఆదమ్‌ను మట్టితో సృజించాడు. హవ్వాను ఆదం (అ) ప్రక్కటెముక నుండి సృజించాడు. ఈసా (అ)ను పురుష స్పర్శ లేకుండానే మర్యమ్ ద్వారా సృజించాడు. దీన్నిబట్టి అల్లాహ్ తాను తలచుకుంటే ఏమైనా చేయగలడనేది స్పష్టం అవుతోంది. మానవునికి అలవికాని పనులు, మానవ మేధకు అందని అనేకమైన పనుల్ని అల్లాహ్ అలవోకగా చేయగలడు. అందంగా సృజించడమే గాకుండా ప్రతి వస్తువుకూ ఒక నిర్దిష్ట జీవితకాలాన్ని కూడా నిర్ణయించాడు ఆ అల్లాహ్. భూత భవిష్యత్ వర్తమానాలూ ఆయన అధీనంలోనే వున్నాయి. ఆయనే ఆధిక్యత కలవాడు, శక్తిమంతుడు, సర్వోపరిజ్ఞాని. మన శ్వాసకు, ఆశకు ఆయనే ఆధారం. మన జాతకానికి, జీవనానికి; చావు పుట్టుకలకు ఆయనే నిర్ణయాధికారి. మరణించిన ప్రతి

మానవుణ్ణీ మళ్ళీ లేపి లెక్క అడిగేదీ ఆయనే. మన కర్మలనుబట్టి స్వర్గ నరకాలను నిర్ణయించేది కూడా ఆయనే. తీర్పు దినానికి ఆయనే అధిపతి.

శూన్యంలో నుంచి సర్వమూ సృజించగల ఆ మహా మహిమాన్వితుడు, శక్తిసంపన్నుడు, నిర్జీవంలోకి జీవాన్ని ఊది ప్రపంచ జీవనానికి గమనానికి కారణ భూతుడైనవాడు ఆ అల్లాహ్- అల్ బారి మాత్రమే.

సృష్టించిన ఆ సృష్టికర్త వైపునకే మనమంతా తరలి మరలిపోవాలి. ప్రపంచంలోని ప్రతి వస్తువూ ఆయన వైపునకే మరలిపోక తప్పదు. మనం ఏదైనా వస్తువును తినే ముందు ఆయన నామం స్మరించి తింటాం- ఎందుకంటే ప్రతి వస్తువూ ఆయనకు చెందినది కాబట్టి. మనమంతా ఆయనకు చెందిన వారమే, తీర్పు దినాన ఆయన సమక్షంలో హాజరయ్యేవారమే. అల్లాహ్-అల్ బారి మనకు సన్మార్గం చూపాలని, మనమంతా ఆయనకు విశ్వసనీయులైన దాసులుగా మారాలని ఆశిద్దాం (ఆమీన్).

అల్లాహ్, సృష్టి వ్యూహాన్ని రచించేవాడు, దానిని అమలుపరచేవాడు, ఆపై దాని ప్రకారం రూపకల్పన చేసేవాడు. (దివ్యఖుర్ఆన్-59:24)

اَلْمُصَوِّرُ

13. అల్ ముసవ్విర్

అల్లాహ్ పవిత్ర నామాలైన -అల్ ఖాలిఖ్, అల్ బారి, అల్ ముసవ్విర్ దాదాపు ఒకే అర్థాన్నిస్తాయి. ఈ పేర్లు అల్లాహ్‌యే సృష్టికర్త, రూపకర్త, పలు విధాలైన సృష్టితాలకు సమగ్ర సంపూర్ణ ఆకృతిని ప్రసాదించేవాడని వర్ణిస్తున్నాయి. అల్ ముసవ్విర్ శాబ్దికంగా రూపాన్నిచ్చేవాడనే అర్థాన్నిస్తుంది. ఓ చిత్రకారుడు లేక శిల్పి ప్రకృతిలో అతను చూసిన వాటికి ప్రతిరూపాన్నిచ్చే ప్రయత్నం చేస్తాడు. అంటే అతను ఇతర వస్తువులపై ఆధారపడితే తప్ప అతనిలో ఆ ఊహ, ఉత్తేజం జనించవు. అవి- ఉదయించే సూర్యుడైనా, అందమైన అబల అయినా, సాహసోపేతుడైన యుద్ధవీరుడైనా కావచ్చు. వీటిపై అతను ఆధారపడక తప్పదు. కాని అల్లాహ్ ఎవరిపైనా ఆధారపడకుండానే అన్నింటినీ సృష్టించగలడు. ఈ ప్రపంచంలో కోటానుకోట్ల మనుషులున్నారు. అన్నిటిలో ఒకే పోలికలున్న ఇద్దరు పురుషులు లేక స్త్రీలు ఎక్కడా కానరారు మనకు. ప్రతి వారి మధ్య ఎక్కడో ఓ చోట, ఏదో కొంత తేడా వుంటుంది. ఆ తేడాతో సృష్టించడం కేవలం ఆ అల్లాహ్- అల్ ముసవ్విర్‌కే సాధ్యం. ఇది అనితరసాధ్యమైన పని- అల్లాహ్‌కు తప్ప. ఎన్ని ఆకృతులు, అచ్చులు (DIES) ఉన్నాయో ఆ కృతికర్త దగ్గర! సంపూర్ణంగా ఒకే పోలికలున్న ఇద్దరు మనుషులు లేరు, ఒకే చెట్టుకు కాసిన రెండు పుష్పాల మధ్య తేడా వుంది- వాసనలోనైనా వన్నెలోనైనా. భూమిలో నిక్షిప్తమైన బొగ్గు రాళ్ళలో అమూల్యమైన రత్నాలలో కూడా ఒకదానికి మరొకదానికి మధ్య తేడా వుంది. ప్రపంచంలో అనేక రకాలైన నేలలున్నాయి. ఒక్కో నేల ఒక్కో పంటకు ప్రసిద్ధి. అరణ్యాల్లో అనేకానేక వృక్షజాతులున్నాయి. దేని ఉపయోగం దానికే ప్రత్యేకం. కొన్ని ఇంటి వాసాలకు, వస్తువులకు వాసి

అయితే మరికొన్ని మందుకో, మరెందుకైనా పనికివస్తాయి. ఆకాశంలో ఆశతో ఎగిరే పక్షుల్ని గమనించండి- ఎన్ని రకాలో, ఎన్ని తేడాలో! ఆకారంలో, అందంలో, చందంలో, పయనగతిలో, శయన రీతిలో దేని ప్రత్యేకత దానిదే. జీవనిర్జీవాల్లో ఇన్ని రకాలు, ఆకారాలు సృష్టించడం ఒక్క అల్లాహ్-అల్ ముసవ్విర్‌కే సాధ్యం. వీటిని గమనించిన మానవ మనస్సు విస్మయానికి లోనవక తప్పదు. శూన్యంలోనుంచే జీవనిర్జీవాలను సృజించి, ఊపిరులూది, జీవన క్రమాన్ని, కాలాన్ని నిర్ణయించిన ఆ అల్లాహ్‌యే అందరికీ ఆధారం.

వాస్తవానికి మానవుడు ఈ సృష్టిని సంపూర్ణంగా ఉపయోగించుకోలేదు. అంతులేని భూమి పొరల్లో, అడవుల్లో ఏ ఏ అమూల్య సంపదలు దాగివున్నాయో; అగాధమౌ జలనిధిలో ఏ ఏ నిధి నిక్షేపాలు నిక్షిప్తమై వున్నాయో మనిషికి తెలియదు. ఎంతో తెలుసుకున్నానని, అనుభవించానని మనిషి తలపోస్తున్నాడు. మనకు తెలియనంత మాత్రాన మరేదీ నిరుపయోగమైనది కాజాలదు.

ఈ ప్రపంచంలో కోటానుకోట్ల స్త్రీ పురుషులున్నారు. పరస్పరం పోలికలున్నా, ప్రతివారి మధ్య ఎంతో కొంత తేడావుంది. ఆలోచించే వారికి ఇందులో అల్లాహ్- అల్ ముసవ్విర్ అద్భుత సృష్టి కనిపిస్తుంది.

اَلْغَفَّارُ

14. అల్ గఫ్ఫార్

పవిత్ర నామం అల్ గఫ్ఫార్ అల్లాహ్ విశిష్ట గుణరాసుల్లో ఒకటైన క్షమాగుణాన్ని తెలుపుతుంది. ఇది ఎన్నో సుగుణాలతో సంకలనమైన సద్గుణం. శ్రమతో నాస్తి దుర్భిక్షం అన్నట్లు. (అల్లాహ్) క్షమతో నాస్తి నరకం అని కూడా చెప్పుకోవాలి.

అల్ గఫ్ఫార్ అంటే శాబ్దికంగా రహస్యాల్ని, వివిధ విషయాల్ని, వ్యవహారాల్ని కప్పిపుచ్చేవాడు అని అర్థం. అల్లాహ్ మన పొరపాట్లను, పాపాలను మన్నించి వాటిపై ఒక తెర వేస్తాడు. మనం నిత్యం చేసే ఎన్నో చిన్నా చితకా పాపాల పట్ల అల్లాహ్ చూపోపు వహిస్తున్నాడు. అనుకోకుండా లేక ఉద్దేశ్య పూర్వకంగానే దాసులు చేసే పొరపాట్లను కూడా ఆయన పరులకు తెలియకుండా పదిలపరుస్తున్నాడు. అసహ్యాన్ని కలిగించే ఒక వస్తువుపై మనం మట్టినో లేక మరో వస్తువునో వేసి కప్పిపెడతాం. అదే విధంగా అల్లాహ్ కూడా మన పొరపాట్లు పరుల కంట పడకుండా వాటిపై తెరవేస్తున్నాడు. మన పొరపాట్లు అల్లాహ్‌కు తెలిసినప్పటికీ ఆయన వాటిని లెక్కలోకి తీసుకోవటం లేదంటే ఆయన ఎంతటి దయాగుణం, క్షమాగుణం కలవాడో మనకు అర్థమవుతోంది. అయినా మనం ఆయన పట్ల కృతఘ్నుతతో మెలుగుతున్నాం. షైతాన్ ఆకర్షణకులోనై ఒకదాని తరువాత మరో పాపం, పొరపాటు చేస్తూనే పోతున్నాం. జరిగిన పొరపాటుపై పశ్చాత్తాపపడితే అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, కరుణించేవాడూను. అయితే మనం ఇకపై అలాంటి పాపాలను చేయకుండావుండాలి.

షిర్క్ (మరొకర్ని అల్లాహ్‌కు సాటి కల్పించటం)ఘోరమైన పాపం. అల్లాహ్ ఇలాంటి పాపాన్ని సహించదు, క్షమించదు కూడా. రాళ్ళు రప్పల్ని, చెట్టుపుట్టల్ని, జంతువుల్ని లేక మనుషుల్ని కొలవడం ఘోరమైన పాపం- వాటిలో లేక వారిలో ఎంతటి శక్తిసామర్ధ్యాలున్నా సరే. అలా చేసినవారు తప్పకుండా నరకజ్వాలల్లో పడిపోతారు. అల్లాహ్ అలాంటి వారిని క్షమించదు. షిర్క్‌ను తప్ప అల్లాహ్ తలిస్తే మరో ఏ పాపాన్నైనా క్షమిస్తాడు. అందుకనే అల్లాహ్- అల్ గఫ్ఫార్ అని పిలవబడుతున్నాడు. ఆయన క్షమిస్తాడని భావించి ప్రతి పొరపాటును పదేపదే చేసుకుంటూ పోవటం విజ్ఞత అనిపించుకోదు. తీర్పు దినాన అది మనకు నష్టదాయకంగా పరిణమిస్తుంది. ఇలాంటి భావనను సదా మనం దృష్టిలో పెట్టుకొని నిజమైన దాసుల్లా మారితే ఆ అల్-గఫ్ఫార్ మనకు తప్పకుండా తోడ్పడతాడు, తీర్పు దినపు పరీక్షలోనూ గట్టెక్కిస్తాడు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిస్తున్నాడు:

ఎవడు పశ్చాత్తాపపడతాడో మరియు విశ్వసించి మంచి పనులు చేస్తాడో, ఆ తరువాత సక్రమంగా నడుచుకుంటాడో, అతనిని నేను అమితంగా మన్నిస్తాను. (తాహా : 82)

اَلْقَهَّارُ

15. అల్ ఖహ్హార్

ఏ మనిషికీ మరొకరిపై అధికారత లేదు. ఏ రాజూ సజ్జనులు, సాధుస్వభావు లైన తన ప్రజలపై బలవంతంగా అధికారాన్నిమోపి వారిని కష్టాలపాల్జెయ్యలేదు. అన్యాయి, హింసాత్ముడు ఎవరూ రాజుగా మనజాలడు. అధికార మదాంధతతో, ధన గర్వంతో విర్రవీగిన ఫిరౌన్ అనే రాజు వుండేవాడు. ఈజిప్ట్ ప్రజలు అనేక సంవత్సరాలు అతని కష్టాలకు, కడగండ్లకు గురి అయ్యారు. ప్రవక్త మూసా (అ) హితబోధను, అనునయాన్ని అతను ఏ మాత్రం లెక్కచేయక బనీ ఇస్రాయీల్ ప్రజల్ని తనకు కట్టుబానిసలుగా మార్చుకున్నాడు. ప్రజల అన్ని హక్కుల్ని, స్వాతంత్ర్యాన్ని హరించివేశాడు. తన ప్రవర్తనను మార్చుకునేందుకు, విశ్వాసిగా మారేందుకు అల్లాహ్ ఫిరౌన్‌కు ఎంతో వ్యవధిని ఇచ్చాడు. ప్రవక్త మూసా (అ)ను, ఆయన (అ) ద్వారా అందించిన అల్లాహ్ సందేశాన్ని ఫిరౌన్ అవహేళన చేశాడు. అతని దుష్ప్రవర్తన హద్దులు మీరిపోయింది. చివరికి అల్లాహ్ అతన్ని, అతని సైన్యాన్ని నడి సముద్రంలో ముంచేసి ప్రవక్త మూసా (అ)ని, ఈజిప్ట ప్రజల్ని రక్షించాడు.

అల్ ఖహ్హార్ అంటే దుష్ట శిక్షకుడని, పాపాత్ముల పని పట్టేవాడని అర్థం. ఎంతటి శక్తిమంతులైన రాజులైనా, చక్రవర్తులైనా, విశ్వాధినేతలైనా సరే, పాపాలకు ఒడిగడితే అల్లాహ్ కోపానికి, శాపానికి గురికాక తప్పదు. కాకపోతే అల్లాహ్ ప్రతి వారికి కొంత వ్యవధిని, అవధిని ఇస్తాడు, సహనం వహిస్తాడు. అంతేగాని అమాయకులైన ప్రజల ఆక్రందనల పట్ల, వారిపై జరిగే దౌర్జన్యాల పట్ల అల్లాహ్ అజాగ్రత్తగా లేడు. ఫిరౌన్ సతీమణి అల్లాహ్‌ను విశ్వసించింది. తన భర్తను అనేకసార్లు అనునయించింది- తన ప్రవర్తనను సరిదిద్దుకోమని.

అయినా వినలేదు. చివరికి ఏం జరిగింది? అధికారం, డాబు, దర్పం, రాజరికం, సంపద సర్వం నాశన మయ్యాయి.

అన్యాయం, అరాచకం హద్దులు మీరినప్పుడల్లా మనుషులు అల్లాహ్-అల్ ఖహ్హార్ కోపానికి గురి అవుతారు. ప్రేమ, దయకు నిధి అయిన అల్లాహ్‌కు కోపం వచ్చిందంటే చాలు, ప్రపంచంలోని ఎంతటి దుష్టశక్తి, లేక సమూహాన్నైనా ఇట్టే మట్టి కరిపిస్తాడు. గతంలో అల్లాహ్ సందేశాన్ని ప్రబోధించిన ప్రవక్తల పట్ల అవహేళన చేస్తూ అమర్యాదగా ప్రవర్తించిన అనేక జాతులు, సమూహాలు నాశనమయ్యాయి. దీని వలన అల్లాహ్‌కంటే మిన్న అయిన మరో ఏ శక్తీ ఈ ప్రపంచంలో లేదని తెలుస్తోంది. అల్లాహ్ శక్తి, యుక్తి ముందు మనిషి శక్తి చీమ, దోమలకు వున్న శక్తిలాంటిదే. షైతాన్ బారిన పడి పాపాలకు పాల్పడకుండా మనల్ని అన్ని విధాలా అల్లాహ్‌యే కాపాడాలని వేడుకుందాం. ఫిరౌన్‌లాంటి దుష్టుల కొరకు నరకాగ్ని జ్వాలలు దహించటానికి సిద్ధంగా వున్నాయి.

"స్వయంగా మీరే ఆలోచించండి, చాలా మంది విభిన్న ప్రభువులు మేలా లేక సర్వశక్తిమంతుడు అయిన ఏకైక దేవుడు అల్లాహ్ మేలా?"

(దివ్యఖుర్ఆన్-12:39)

اَلْوَهَّابُ

16. అల్ వహ్హాబ్

ఒకరికి ఏదైనా సహాయం చేస్తే, మనం వారి నుంచి దాని ప్రతిఫలం ఆశిస్తాం. దాదాపు మనందరిదీ ఇదే పరిస్థితి. అల్లాహ్ మనకు ఆహారాన్ని, వస్త్రాలను, ఆశ్రయాన్ని ఇంకా జీవితానికి కావలసిన సర్వ సదుపాయాల్ని కల్పించాడు. దీనికి ప్రతిఫలంగా అల్లాహ్ మన నుంచి ఏదైనా ఆశిస్తున్నాడా? లేదు. అదే అల్లాహ్- అల్ వహ్హాబ్ ఉన్నత గుణం. మనం అల్లాహ్‌ను విశ్వ సించినా, విశ్వసించకపోయినా ఆయన మన అవసరాలన్నింటినీ తీరుస్తున్నాడు. అయితే ప్రజలు మాత్రం ఏకంగా పాపాల్లో మునిగివున్నారు. అల్లాహ్‌ను విశ్వసించక, ఆయన ప్రవక్త ముహమ్మద్ (స) బాటపై నడవకుండా, ఖుర్ఆన్ బోధనల పట్ల అజాగ్రత్తగా వున్న వారు కొంత మంది అయితే, మరికొందరు అటూఇటూ గాని భావాలతో వున్నారు. అల్లాహ్ పట్ల విశ్వాసం చూపాలన్న తలంపు, తపన హృదయంలో గనక వుంటే తప్పకుండా మనకు విశ్వాస భాగ్యాన్ని ప్రసాదిస్తాడు ఆయన.

ప్రవక్త ఇబ్రాహీం (అ)కు అల్లాహ్ ఇద్దరు కుమారులను ప్రసాదించాడు. వారు కూడా ప్రవక్తలే. వారిలో ఒకరైన హజ్రత్ ఇస్మాయీల్ (అ) అల్లాహ్ ఆరాధనాలయం కాబా నిర్మాణంలో తన తండ్రికి తోడ్పడ్డారు. ముసలితనంలో వున్న హజ్రత్ జకరియా (అ)కు అల్లాహ్ హజ్రత్ యహ్యా (అ)ను ప్రసాదించాడు. హజ్రత్ జకరియా (అ) అల్లాహ్ పట్ల ఎనలేని విశ్వాసం కలిగిన ప్రవక్త. అలాగే హజ్రత్ మర్యమ్ (అ)కు ఈసా ప్రవక్త (అ)ను ప్రసాదించాడు అల్లాహ్. ఇదంతా అల్లాహ్‌కు వున్న అసామాన్యమైన శక్తితోనే జరిగింది. ఆయన తలిస్తే చాలు,

కానిదంటూ ఏదీ లేదు. ఆయనకు అన్నీ సాధ్యమే. ఆదం (అ)ను అల్లాహ్ మన్నుతో సృజించాడు. ఆదం (అ) ప్రక్కటెముక నుండే హవ్వా (అ)ను సృజించాడు. కాబట్టి అల్లాహ్‌కు ఏదైనా, ఏమైనా సాధ్యమే. ఆయన అత్యంత శక్తి సంపన్నుడు.

మూసా ప్రవక్త (అ) వేడుకోగా, తన సోదరుడు అయిన హారూన్ (అ)కు ప్రవక్త పదవిని ప్రసాదించాడు అల్లాహ్. ఈ ప్రపంచంలో మనకు ఏది లభించినా అంతా అల్లాహ్ దయవల్లనే కాని మన శక్తియుక్తుల ప్రమేయం ఏదీ లేదు. ఈ విషయాన్ని మనం గ్రహించినట్లయితే అల్లాహ్ మనకు ఆయన పట్ల గట్టి నమ్మకాన్ని, ప్రవక్త (అ) పట్ల విధేయతను ఖుర్ఆన్ బోధనలకు అనుగుణంగా నడుచుకునే సత్ప్రవర్తనను ప్రసాదిస్తాడు. మన నుండి అల్లాహ్ కోరేదల్లా ఒక్కటే- ఆయన్ని విశ్వసించాలని, కేవలం ఆయన ఒక్కని దాస్యం మాత్రమే చేయాలనీను. సర్వసదుపాయాలూ సమకూర్చినా, ఆయన్ని విశ్వసించని వారి నుండి అల్లాహ్ ఏదీ ఆశించడు. అటువంటి అవిశ్వాసులు తమ కొరకు కణకణమండే నరకాగ్ని సిద్ధంగా వుందని గ్రహించాలి. అల్లాహ్‌ను విశ్వసించక, ప్రవక్త ముహమ్మద్ (అ) మాటను, బాటను కాదన్న వారికి నరకమే శరణ్యం.

అల్లాహ్ మన విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలని, జీవితాంతం ఆయన పట్ల కృతజ్ఞులుగా మెలిగేందుకు సద్బుద్ధిని ప్రసాదించాలని వేడుకుందాం. (ఆమీన్)

اَلرَّزَّاقُ

17. అర్ రజ్జాఖ్

యావత్ప్రపంచానికి సృష్టికర్త అల్లాహ్‌యే. ప్రతి సృష్టిరాశి పోషణ బాధ్యతను ఆయనే వహిస్తున్నాడు. అల్లాహ్- అల్ రజ్జాఖ్ మాత్రమే మనకు ఆహారాన్ని, ఆశ్రయాన్ని ఇస్తున్నాడు. ప్రపంచంలో ఎన్నో రకాల జంతువు లున్నాయి. కొన్ని గడ్డిని, మరికొన్ని ఆకులలములు తింటాయి. మరికొన్ని మాంసాహారులు. ఇలా ప్రతిదీ తనదైన ఆహారపుటలవాటు కలిగివుంది. క్రిమికీటకాల కోవకు చెందిన చీమకు కూడా తన జీవనానికి ఆహారం అవసరమే. బావిలోవున్న కప్పకు లేక రాతిలో వున్న కప్పకు కూడా ఆహారం అవసరమే. వీటికి ఆహారాన్ని ఎవరిస్తున్నారు? అందరికీ ఆహారాన్ని సమకూర్చే వాడు ఆ అల్లాహ్- అల్ రజ్జాఖ్ మాత్రమే. ఆయన ఏ ప్రాణినీ వదలిపెట్టలేదు. ఎవరినీ ఆహారం కొరతకు గురి చేయలేదు.

మన శరీరంలో ఎన్నో రకాల అవయవాలున్నాయి. అవి సక్రమంగా, సాఫీగా పని చేయాలంటే వాటికి తగిన పోషకాహారం కావాలి. మెదడుకు ఒక ఆహారం, గుండెకు, కండకు, మూత్రపిండాలకు, ఎముకలకు ఇంకా ఇతర అవయవాలకు వాటి వాటికి పనికివచ్చే విటమిన్లు, ఖనిజాలు ఆహారంగా కావాలి. ఇవన్నీ మనం తీసుకునే ఆహారం నుండే లభిస్తున్నాయి. పళ్ళు, ఫలాలను గమనించండి. కొన్నిటిలో విటమిన్లు, కొన్నిటిలో ఖనిజాలు, మరికొన్నిటిలో ఎంజైమ్‌లు, ధాతువులున్నాయి. ఏది లోపించినా మన ఎదుగుదలలో లోపమేర్పడుతుంది. ఏది ఏమైనా అందరికీ వారికి అవసరమైన ఆహారాన్నిచ్చేవాడు ఆ అల్లాహ్- అల్ రజ్జాఖ్ మాత్రమే.

శారీరకంగా మన ఆకలిని తీర్చేది ఆహారం. అయితే మనకు ఎన్నో రకాల ఆకలి వుంది. అది జ్ఞానం కోసం, కళాభిరుచి కోసం, మరో పనిని సాధించాలనే తపన కావచ్చు. ఎలాంటి ఆకలినైనా దాన్ని తీర్చేవాడు అల్లాహ్ మాత్రమే. మన ప్రయత్నంలో ఎలాంటి లోపం లేకుండా వుంటేచాలు అల్లాహ్ దాన్ని తప్పకుండా తీరుస్తాడు. ఒక వ్యక్తి దేవుణ్ణి గురించి, ఆత్మజ్ఞానం గురించి, అల్లాహ్ ప్రవక్తల గురించి తెలుసుకోవాలనే తపన కలిగి వుంటాడు. అటువంటి వారికి అల్లాహ్ తప్పకుండా తన రుజుమార్గం చూపి, స్వర్గానికి దారితీసే మార్గాల్ని సుగమం చేస్తాడు.

కాబట్టి అల్ రజ్జాఖ్ మన అవసరానికనుగుణంగా మన ఆకలిని, అవసరాన్ని పరిపూర్తి చేస్తున్నాడు. అది ఆహారం, లేక భౌతికావసరం కావచ్చు; లేక జ్ఞాన సంబంధమైన, ఆత్మ సాక్షాత్కారానిదైనా కావచ్చు. అల్లాహ్ మనకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించాలని, సరియైన రుజుమార్గంలో నడిపించాలని, ఆయన్ను విశ్వసించేలా చేయాలని ఆశిద్దాం. మన ఆరాధనకు, పూజకు అర్హుడు ఒక్కడైన అల్లాహ్– అల్ రజ్జాఖ్ మాత్రమే.

اَلْفَتَّاحُ

18. అల్ ఫత్తాహ్

పవిత్ర ఖుర్ఆన్ అల్‌ఫత్తాహ్ సూరాతో ప్రారంభమౌతుంది. అల్ ఫత్తాహ్ అంటే ప్రారంభం లేక పవిత్ర దైవసందేశ సంపదను తెరిచే తాళం చెవి లేక బీగం అని అర్థం. ఈ సూరా ఖుర్ఆన్‌కు ఉపోద్ఘాతం, కీలకాంశం, ఇంకా హృదయం లాంటిది. కాబట్టి ప్రతి నమాజ్‌లో దీన్ని పఠిస్తారు. అల్ ఫత్తాహ్ సూరా పఠిస్తే చాలు సంక్షిప్తంగా ఖుర్ఆన్‌ను పఠించినట్లే. కాబట్టి అల్లాహ్-అల్ ఫత్తాహ్‌యే ఆద్యుడు, విశ్వప్రజలకు విశ్వాసాన్ని ప్రకటించేలా చేసినవాడు. ఆయనే ప్రజల అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడు, సన్మార్గాన్ని చూపేవాడు. అల్లాహ్ ఒక్కడే, ఆయనే ఆరాధనకు అర్హుడు. ఆయన సర్వాధికారి, దయామయుడు. ఆయన దుష్ట శిక్షకుడే కాదు, పశ్చాత్తాప భావంతో తమ తప్పుల్ని క్షమించమని వేడుకునే దాసుల పట్ల క్షమతో వ్యవహరించి వారి క్షేమాన్ని కాంక్షించేవాడు కూడా. అయితే షిర్క్ (బహుదైవారాధన)ను మాత్రం క్షమించనని ప్రకటిస్తున్నాడు అల్లాహ్. తన పట్ల విశ్వాసం చూపని వారికి నకరమే శరణ్యమంటున్నాడు అల్లాహ్. చనిపోయిన తరువాత ఈ లోకంలో మనం చేసిన మంచీచెడుల గురించి ఆయన సమక్షంలో సమాధానం చెప్పుకోవాలని ఆయనచేత ప్రకటించబడింది. తీర్పు దినానికి అల్లాహ్‌యే యజమాని. ఈ విషయాలన్నీ మనకు తెలియజెప్పడానికి ఆయన ప్రవక్త ముహమ్మద్ (స)నే కాక దివ్యఖుర్ఆన్ గ్రంథాన్నీ పంపాడు. ఖుర్ఆన్ గ్రంథం ద్వారా మనకు మానవ సమాజాల గతం, వర్తమానం ఇంకా భవిష్యత్ వివరాలు కూడా తెలియజేయటం జరిగింది. మన జీవన విధానానికి సంబంధించిన అతి సూక్ష్మమైన విషయం కూడా ఈ గ్రంథంలో పేర్కొనటం

జరిగింది. ప్రపంచంలోని వ్యక్తులు, సమాజాలు, జాతుల చరిత్రలు అన్నింటినీ అల్లాహ్ తెలియజేశాడు. ఈ సృష్టి యావత్తునూ ఆయనే సృజించాడు, మరణించిన తరువాత మనమంతా ఆయన వద్దకే మరలిపోవాలి. అల్లాహ్‌యే అత్యంత శక్తిమంతుడు, సర్వసమర్థుడు. ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేదు. ఆయనే సృష్టికర్త, పోషకుడు, తీర్పు దినానికి యజమాని, ప్రపంచంలోనూ మనకు సర్వ సదుపాయాలు కల్పించాడు. పరలోకంలోనూ శిక్ష లేక బహుమానాన్ని ప్రసాదించేది కూడా ఆ అల్లాహ్‌యే. అంతా మన ప్రవర్తన పైనే ఆధారపడి వుంది. మనం దేనికి అర్హులమో ఆయనే నిర్ణయిస్తాడు. కాబట్టి అల్లాహ్– అల్ ఫత్తాహ్‌యే మన అజ్ఞానాన్ని అంతంచేసి జ్ఞానోదయాన్ని ప్రసాదించే వాడు. ఆయన్ని పిలిచే, కొలిచే సరిఅయిన విధానమేదో మనకు తెలియజేసినవాడూ ఆయనే.

అల్లాహ్ మనందరికీ జ్ఞానోదయం కలుగజేయాలని, ఆయన్ని మాత్రమే ఆరాధించే సద్బుద్ధిని ప్రసాదించాలని వేడుకుందాం.

اَلْعَلِيْمُ

19. అల్ అలీమ్

సర్వ సృష్టినీ, అందులో వున్న జీవనిర్జీవాలను సృష్టించినది అల్లాహ్‌యే. ఏ వస్తువుని లేక ప్రాణిని దేనితో సృష్టించాడో ఆయనకే తెలుసు. ఆదం (అ)ను మట్టితో చేసి ఊపిరిలూదాడు. అల్లాహ్‌యే మనకు జీవితాన్ని ప్రసాదించాడు. ఆయనకు అన్నీ తెలుసు. అతి సూక్ష్మమైన అణువు నుంచి పెద్ద పర్వతం వరకు; చిన్న చీమ నుంచి మానవుని వరకు ప్రతిదీ ఆయన జ్ఞానంలోనే వుంది. వీటి ఉనికికి సంబంధించిన జ్ఞానాన్నీ ఆయనే సృజించాడు. ఈ జ్ఞానం కేవలం అల్లాహ్‌కే తెలుసు. విశ్వంలో వున్న ప్రతిదానిపై ఆయన జ్ఞానం పరివేష్టించి వుంది. ఏదీ ఆయన జ్ఞాన పరిధికి వెలుపల లేదు, మరేదీ ఆయనకు తెలియకుండా లేదు.

అల్లాహ్ జ్ఞానంతో పోల్చుకుంటే మానవుని జ్ఞానం మహా సముద్రంలో నీటి బొట్టుకన్నా తక్కువే. మానవుడు తెలుసుకోవలసింది మరెంతో వుంది. మనకు తెలిసిన దాంతో, లేక యూనివర్శిటీల ద్వారా పొందిన సర్టిఫికేట్‌లను చూసి గర్వపడకూడదు. అల్లాహ్ అల్ అలీమ్ జ్ఞానంతో పోల్చుకుంటే మన జ్ఞానం దేనికీ కొరగాదు. ఆయనకు సర్వకాలాలూ తెలుసు. ప్రతిదాని విధివ్రాత అల్లాహ్‌కు తెలుసు. ఆయనే మన మార్గదర్శకం కోసం దివ్య ఖుర్ఆన్‌ను పంపాడు. ఆ గ్రంథం ఆయన విశ్వసనీయులైన దాసుల హృదయాల్లో పదిలంగా వుంది. భూమిపై వున్నదీ, భూమి లోపలి పొరల్లో దాగి వున్నదీ; ఆకాశం, నక్షత్రాలు, సూర్యచంద్రులు, గ్రహాలు అన్నిటినీ అల్లాహ్‌యే సృష్టించాడు.

మన ఆలోచనలు, వాటి అంతరార్థం కూడా అల్లాహ్‌కు తెలుసు. ఇతరులకు మన రహస్యాలు తెలియకుండా దాచగలం కాని అల్లాహ్‌కు తెలియకుండా మనం ఏదీ దాచలేం. మన ఆలోచనలు, పనులు అన్నీ ఆయనకు తెలుసు. మన అంతర్ బాహ్యాలూ, నిజానిజాలు, మంచీ చెడులు అన్నీ ఆయనకు తెలుసు. కాబట్టే అల్లాహ్– అల్ అలీమ్ అని పిలువబడుతున్నాడు. ప్రతిదాని పుట్టు పూర్వోత్తరాలు అన్నీ కేవలం అల్లాహ్‌కే తెలుసు. ఒక వస్తువు ఉనికిని తెలుసుకోకుండా దాన్ని ఎలా ఆయన సృష్టించగలడు. ఏదీ ఆయన జ్ఞానపరిధికి వెలుపల లేదు. అంతటి మహిమాన్వితుడైన అల్లాహ్ మాత్రమే ఆరాధనకు అర్హుడు. మనమంతా ఆయన్నే విశ్వసించాలి, ఆయన పట్లనే ఆరాధనాభావం కలిగివుండాలి. మన ఆచరణలకు ప్రతిఫలాల్ని ప్రసాదించేది ఆయన మాత్రమే. తీర్పుదినాన మన కర్మలనుబట్టి మనకు స్వర్గమో, నరకమో నిర్ణయించేదీ ఆ అల్లాహ్‌యే. కాబట్టి సదా మనం ఆయన్నే ఆరాధించడం అన్ని విధాల శ్రేయస్కరం.

"మన ప్రభువు మనల్ని సమావేశపరుస్తాడు. తరువాత మన మధ్య తీర్పు చేస్తాడు. ఆయన సర్వజ్ఞుడైన న్యాయాధిపతి."

(దివ్యఖుర్‌ఆన్–34:26)

اَلسَّمِيْعُ

20. అస్ సమీ

అస్ సమీ, అల్ బసీర్, అల్ అలీమ్ అనే మూడు పవిత్ర నామాలు సాధారణంగా సంయుక్తంగానే వుంటాయి. దీని భావం అల్లాహ్ వినేవాడు, చూసేవాడు ఇంకా సర్వమూ తెలిసినవాడూను. అందరి మొరలను ఆలకించేవాడు అల్లాహ్‌యే. మన భాష ఆయనకేమాత్రం గడ్డుకాదు, అడ్డుగోడా కాదు. మన ఆలోచనలు, మన హృదయాంతరాళాల్లోని అంతరార్థాలు సైతం అల్లాహ్‌కు తెలిసినప్పుడు మన భాష ఆయనకు తెలియదా? అసలు అన్ని భాషలూ అల్లాహ్ ప్రసాదించినవేగా!

వినేశక్తిని అల్లాహ్‌యే మనకు ప్రసాదించాడు. అలాంటప్పుడు ఆయన ఎలా వినలేడు? అల్లాహ్‌నే నమ్ముకున్న మనం కష్టాల్లో, నష్టాల్లో వుండి మొరపెట్టుకున్నప్పుడు మన గోడును విని గట్టెక్కించేది ఆయనే కదా! మన పిలుపును విని పలికేది ఆయనే. మన అవసరాల్ని తీర్చేదీ ఆయనే. మనం చేయవలసింది– ఆయన పట్ల ప్రగాఢ విశ్వాసం కలిగివుండటమే. నిత్యం ఆయన మన వెంట వున్నాడు, మనల్ని చూస్తున్నాడు, వింటున్నాడు, మన ప్రతి పనిని, కదలికను గమనిస్తున్నాడు. ఎడతెగని మన ప్రార్థనలకు మనల్ని కనికరించి ఆదుకునేదీ ఆయనే. ఎలాంటి ఆపదల్లో చిక్కుకున్నా అల్లాహ్‌యే మనకు దిక్కని మొక్కాలి. మనం ఏది అర్థించినా న్యాయసమ్మతంగా వుండాలి. అంతేగాని పరుల్ని కష్టాల పాల్జేయమని, ఆపదల్లో పడవేయమని ప్రార్థించరాదు.

వాస్తవానికి ఆయన్నే నమ్ముకుని, ఆయన పట్ల సంపూర్ణ విశ్వాసం కలిగిన దాసులకు అన్ని విధాల సహాయం లభిస్తుంది. ఆ సహాయం సంపద రూపం

లోనైనా, శక్తి రూపంలోనైనా లేక ఆత్మబలం చేకూర్చేదైనా కావచ్చు. కంటికి కానరాని సూక్ష్మజీవుల్ని సంరక్షిస్తున్న ఆయన, విశ్వసించిన తన దాసుల మొరలు ఆలకించడా? అలా ఎన్నటికీ జరగదు. అల్లాహ్ మనల్ని ప్రపంచంలోనే కాదు, పరలోకంలోనూ కాపాడతాడు. అల్లాహ్ - అస్ సమీ మాత్రమే మన మొరల్ని ఆలకించేవాడు, ఆదుకొనేవాడు. ప్రవక్తలు (అ) ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు వారి మొరలు ఆలకించి వారిని అన్నివిధాల ఆదుకున్నవాడు అల్లాహ్‌యే.

"ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను."

(దివ్యఖుర్‌ఆన్-42:11)

اَلْبَصِيْرُ

21. అల్ బసీర్

అల్లాహ్- అల్ బసీర్ మనకు చూసే శక్తిని ప్రసాదించాడు. ప్రపంచంలోని ప్రతి వస్తువును రెండు కళ్ళతో చూడగలుగుతున్నాం. మనకు చూసే శక్తిని ప్రసాదించిన ఆ పరమ ప్రభువే మనల్ని ఎల్లప్పుడూ చూస్తున్నాడు. వెలుతురూ, చీకటి రెండూ ఆయనకు సమానమే. ఆయనకు నిదురకాదు కదా, కనీసం కునుకైనా రాదు. ఈ ప్రపంచంలో ఆయన లేని చోటంటూ ఏదీ లేదు కాబట్టి ప్రతిదాన్నీ, ప్రతివారినీ ఆయన చూస్తున్నాడు. అల్లాహ్ మనల్ని చూస్తున్నాడు అనే ఈ భావనే మనలో భయభక్తుల్ని జనింపజేస్తుంది. ఈ భావన ద్వారానే మనిషి మంచిని చేస్తున్నాడు, మేలైనదాన్ని ఆశిస్తున్నాడు. మన చెడు చేష్టలు పరులకంట పడకుండా చేయగలమేమోగాని, అల్లాహ్‌కు తెలియకుండా మాత్రం చేయలేము. ఆయన మన ప్రతి కదలికను, భావనను కనిపెడుతూనేవున్నాడు. మన ప్రతి పనినీ దైవదూతలు నమోదు చేస్తూనే వున్నారు. పరలోకంలో, తీర్పు దినాన మన చేష్టల చిట్టా బట్టబయలుకాక తప్పదు. మంచి పనులు చేస్తే అల్లాహ్ కరుణానుగ్రహాలతో మనకు స్వర్గం లభిస్తుంది. చెడు చేష్టల ద్వారా నరకం ప్రాప్తమవుతుంది. ఆ భయంకరమైన తీర్పుదినాన క్షమించే శక్తి కేవలం ఆ అల్లాహ్‌కే వుంది. కాబట్టి మనం అల్లాహ్‌నే విశ్వసించి, ఆయనపైనే భరోసా వుంచాలి. ఆరాధనకు అర్హుడు అల్లాహ్ మాత్రమే.

కలిమి బలిమితో, అధికార పీఠాలపై వున్నవారు తాము ఏంచేసినా చెల్లుతుందనీ, ఎవరూ వారిని అడ్డుకోజాలరని భావిస్తూ వుంటారు. కాని అల్లాహ్ అందరినీ గమనిస్తూనేవున్నాడు. మంచీ-చెడూ రెండూ నమోదు అవుతూనే

వున్నాయి. ఏదీ దాగి వుండజాలదు. మనం అజ్ఞానంతో ఏదైనా తప్పుచేసి అల్లాహ్‌ను వేడుకుంటే ఆయన కరుణించి క్షమించవచ్చు, అలాంటి మన తప్పు పరులకు తెలియకుండా దాచే శక్తి కూడా అల్లాహ్‌కే వుంది.

ఏది ఏమైనా పరలోకంలో, పరుల ముందు పరాభవానికి గురిఅయ్యే ఎలాంటి పాపాలకూ పాల్పడకుండా మనల్ని అల్లాహ్ కాపాడాలని కోరు కుందాం. మనమంతా అల్లాహ్‌కే చెందినవారం, చివరకు ఆయన వద్దకే తరలి మరలిపోవలసివుంది. మనం చేసే ప్రతి మంచి పనీ నిస్వార్థంతో నిండివుండాలి. అలాంటి ప్రతి మంచినీ అల్లాహ్‌కే అంకితం చేయాలి. ఒక పని చేసే ముందు అది మంచో చెడో అని ఆలోచించడానికి కావలసిన విచక్షణా జ్ఞానాన్ని కూడా అల్లాహ్ మనకు ప్రసాదించాడు. నిత్యం మనల్ని అల్లాహ్ గమనిస్తున్నాడనే భావన మనసులో మెదిలితేచాలు, ఇక ఏ మనిషి అయినా చెడు చేయటానికి జంకుతాడు. ప్రతి మనిషి ఇలా ఆలోచిస్తే వ్యక్తిగతంగానేగాక సమాజంలో కూడా ఎన్నో సమస్యలు రూపుమాపబడి శాంతీశ్రేయాలు వెల్లివిరుస్తాయి. అల్లాహ్ మన తప్పుల్ని క్షమించి, ఆయన కారుణ్యంతో అనుగ్రహించాలని, పరలోకంలో పరిణమించే పరాభవం నుండి మనల్ని కాపాడాలని వేడుకుందాం.

దివ్యఖుర్‌ఆన్‌లో ఇలావుంది-

"నీ ప్రభువు సర్వాన్నీ చూస్తున్నాడు." (25 : 20)

اَللَّطِيْفُ

22. అల్ లతీఫ్

అల్ లతీఫ్ కూడా అల్లాహ్ పవిత్ర నామాల్లో ఒక నామం. అందమైన ఈ ప్రపంచంలో అల్లాహ్ అనేక అద్భుతాలను సృష్టించాడు. మనకు కనిపించే ఆకాశంలో సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పాలపుంత ఇలా ఎన్నో వింతలు. ఇలాంటి ఈ సృష్టిని చూస్తే మన నోట మాట పెగలదు. భూమి పైన ఎన్నో రకాల వృక్షజాలాలు, జంతుజాలాలున్నాయి. వివిధ ఫలపుష్పాదులున్నాయి. వేటి ప్రత్యేకత వాటికే. భూమి పొరల్లో లభించే బంగారం, వెండి, వజ్ర వైఢూర్యాలు ఇలా ఎన్నో వెలకట్టలేని సంపదలున్నాయి. ఇంకా ఎన్నో నదులు, సముద్రాలను సృష్టించాడు అల్లాహ్. ఇవన్నీ ఒక ఎత్తు, మానవ సృష్టి మరో ఎత్తు. అల్లాహ్ శూన్యంలోనుంచి ఏదైనా సృష్టించగలడు. మనిషికి అల్లాహ్ సృష్టిరాశిలోని వస్తువులతో కొత్త కొత్త వస్తువుల్ని సృష్టించే శక్తిని, యుక్తిని ప్రసాదించాడు. ఫలితంగానే ఈ ప్రపంచంలో ఎన్నో వస్తువులు ఉనికిలోకి వస్తున్నాయి.

అందం అనేది రెండు రకాలు. ఒకటి బాహ్యాపరమైనది. రెండవది అంతరంగ మైనది. పూలు, ముత్యాలు, సూర్య చంద్రులు, నక్షత్రాలు బాహ్యాపరంగా అందంగా కనిపిస్తాయి. అయితే వాటికి గుణాత్మకంగా అంతఃకరణంగా కూడా మరో అందముంది. ప్రతి జీవరాశిలోనూ అల్లాహ్ మన కళ్ళకు కనిపించని గుణాత్మకమైన అందాన్నిచ్చాడు. దీన్ని చూడాలంటే మనిషికి కూడా అంతఃచక్షువులు కావాలి. మంచి నడవడిక, సత్యసంధత, విశ్వసనీయత, పరోపకారబుద్ధి, దయార్ద్రహృదయం, దాతృగుణం ఇవన్నీ మనిషిలో దాగివుండే గుణాలు. మనలో కొంత మంది బాహ్యాపరంగా అంటే

శారీరకంగా అందంగా కనిపించకపోవచ్చు. అయితే అలాంటివారిలో ఎన్నో ఉన్నత భావాలు, గుణాలు వుండవచ్చు. వాస్తవానికి ఇలాంటి వారే అందమైనవారు. కాళ్ళు చేతులు కుంటివైనంత మాత్రాన మనసు కుంటిది కాదు కదా! రూపం బాహ్యపరంగా బాగున్నా మనసుపరంగా కురూపంగా వుంటే లాభం లేదు. రూపం ఒకనాడు రూపుమాసిపోయేదే! కాని సద్గుణం సదా గుబాళిస్తుంది, స్వర్గానికి దారితీస్తుంది.

అల్లాహ్ ఆరాధనలోనే అసలైన అందం దాగివుంది. ఆయన పట్ల విశ్వసనీయత కలిగివుంటే చాలు, మనకు అందం, ఆహ్లాదం రెండూ లభిస్తాయి. ఒక మనిషి బాహ్యపరంగా అందంగా వుండి కూడా చెడుగా ప్రవర్తిస్తే సమాజం అతన్ని క్షమిస్తుందా? లేదు. అలాగే అల్లాహ్ వద్ద కూడా మన గుణాల వల్లనే మనకు విలువ, స్వర్గం ఇవ్వబడుతుందేకాని మన రంగు రూపాల వల్ల కాదు. అల్లాహ్‌కు భయపడుతూ ఆయన ఆజ్ఞ ప్రకారం జీవనాన్ని కొనసాగించేవారే అసలైన అందంగల వారు, అలాంటివారే పరలోకంలో ప్రయోజకులుగా పరిగణించబడతారు. ఇలాంటి వారి కొరకే మన మాటలకు, ఊహలకు అందని అందమైన స్వర్గం అలంకృతమైవుంది. అల్లాహ్– అల్ లతీఫ్ పట్ల ఆరాధనా భావం కలిగివుండటమే అసలైన అందం. అలాంటి అందాన్నే ప్రసాదించమని మనమందరం అల్లాహ్‌ను వేడుకుందాం.

اَلْخَبِيْرُ
23. అల్ ఖబీర్

శూన్యంలో నుంచే సర్వసృష్టినీ సృష్టించిన అల్లాహ్‌కు ప్రతి వస్తువు లేక ప్రాణి గురించిన పూర్తి పరిజ్ఞానం వుంది. ప్రతి సృష్టితం భూత, భవిష్యత్, వర్తమానాలూ అల్లాహ్‌కు తెలిసిందే. మన సమస్త కదలికలు, ఆలోచనలు, ఆచరణలు అన్నీ అల్లాహ్‌కు తెలుసు. ఆయన పట్ల మనం ఏ మేరకు విశ్వాసం చూపుతున్నామో, ఏ మేరకు భయభక్తులతో మెలగుతున్నామో, పరుల పట్ల ఎంత దయార్ద్ర హృదయంతో మెలగుతున్నామో కూడా ఆయనకు తెలుసు. నేటి మన వర్తమాన ప్రవర్తనే రేపు మన మరణానంతరం పరిణమించబోయే తీర్పు దినాన మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. అల్లాహ్‌కు మన ఆచరణలన్నీ తెలుసు కాబట్టి ఆ రోజు వాటి ప్రకారమే తీర్పు జరుగుతుంది- అదే, మంచి చేస్తే స్వర్గం, చెడు చేస్తే నరకం ప్రాప్త మవుతాయి. అల్లాహ్ సర్వాధికారి, దయామయుడు, పరమ కృపాశీలుడు కాబట్టి ఆయన మన చిన్న చిన్న దోషాలను క్షమిస్తాడేమో కాని, ఆయనకు మరొకర్ని సాటికల్పించి, అంటే రాయిరప్పల్ని, చెట్టు పుట్టలను, గ్రహాలు విగ్రహాలను, పశుపక్ష్యాదుల్ని ఆరాధించిన వారిని మాత్రం ఆయన క్షమించనని సెలవిస్తున్నాడు. బహుదైవారాధకులు, వారు ఆరాధించిన రాళ్ళు చివరికి నరకంలో కాలిపోవలసిందే.

ఆ తీర్పుదినం రోజున ఎవరూ మరొకరికి సహాయం చేయలేరు. తల్లిదండ్రులు సంతానానికి, సంతానం తల్లి దండ్రులకుగాని; మిత్రుడు మరో మిత్రునికిగాని సహాయపడలేరు. అల్లాహ్ అనుమతిస్తే తప్ప ఎవరి సిఫారసూ అక్కడ, అప్పుడు చెల్లదు. ఆ రోజు సర్వాధికారాలు ఆయన హస్తగతమై, ఆయన కోరిన వారిని క్షమిస్తాడు.

కేవలం ముస్లిం కుటుంబంలో జన్మించి, ముస్లిం పేరు పెట్టుకున్నంత మాత్రాన సరిపోదు. ఒక ముస్లిం పేరు స్వర్గప్రవేశానికి పాస్‌పోర్ట్‌లా పనిచేస్తుందని భావించడం భ్రమే అవుతుంది. అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన్ని మాత్రమే ఆరాధిస్తూ, దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఆదేశాల ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ (స) ఆచరణానుసారం జీవిస్తే పరలోకంలో స్వర్గం ప్రాప్తిస్తుందని ఆశించవచ్చు. అల్లాహ్-అల్ ఖబీర్ అంటే మన గురించి అన్నీ తెలిసిన వాడని అర్థం. మన స్థితి, మతి, గతి సర్వం ఆయన ఆధీనంలోనే వున్నాయి. చనిపోయాక మనల్ని దహనం చేసినా, ఖననం చేసినా మళ్ళీ మనల్ని లేపి ఈ లోకంలో మనం చేసిన మంచీ చెడుల గురించి అల్లాహ్ మనల్ని తప్పకుండా ప్రశ్నించ నున్నాడు. మనమంతా దానికి సమాయత్తమవుతూనే వున్నాం.

"సజీవుడూ, ఎన్నడూ మరణించనివాడూ అయిన అల్లాహ్‌పై నమ్మకం వుంచు. ఆయనను స్తుతించటంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడు. తన దాసుల పాపాలను గురించి తెలుసుకోవటానికి ఆయనకు ఎవరూ అవసరం లేదు." (దివ్యఖుర్‌ఆన్- 25:58)

اَلْحَلِيْمُ

24. అల్ హలీమ్

ఓర్పు, క్షమాగుణం లాంటి ఎన్నో పరమోన్నత గుణాలు అల్లాహ్- అల్ హలీమ్‌లో కలగలసివున్నాయి. దీనికి మంచి ఉదాహరణ- అల్లాహ్‌ను కాదని రాయిరప్పల్ని, చెట్టుపుట్టల్ని కొలిచే వారికి కూడా వారి జీవితావసరాలను ఇస్తూ పోతున్నాడు ఆ దయామయుడైన అల్లాహ్. మన కృతఘ్నుతాపూర్వకమైన కృత్యాలన్నీ ఆయనకు తెలుసు. మనం మన తప్పును ఏనాడైనా తెలుసుకొని, తప్పక ఆయన వైపునకు మరలివస్తామని మనకు విడుపునిస్తూనే వున్నాడు ఆ దయామయుడైన పరమ ప్రభువు. మన పట్ల ఆయన ఎంతో క్షమాగుణంతో చూస్తున్నాడు. అల్లాహ్ అనుగ్రహగుణమే, ఆయన ఆగ్రహగుణాన్ని ఆవరించి వుంది. ప్రతి వ్యక్తీ తన తప్పులు తెలుసుకొని పశ్చాత్తాపంతో ఆయన వైపునకు మరలుతాడని, ఆయన్నే విశ్వసిస్తాడని, ఆయన్నే ఆరాధిస్తాడని అనుక్షణం అల్లాహ్ ఎదురుచూస్తూనే వుంటాడు. మనం ఒక అడుగువేస్తే ఆయన మన కోసం పది అడుగులు వేస్తాడు. మన తప్పులను, అపచారాలను క్షమించి వాటిపట్ల చూపోపు వహించి మనల్ని కాపాడాలనే చూస్తాడు. మనమే ఆయన్ని అర్థం చేసుకోలేక జీవితకాలాన్ని వ్యర్థం చేసుకుంటున్నాం. జీవితంలోని అంత్యదశలో నిజస్వామి, ఆరాధకుడు ఎవరో తెలుసుకొని పరివర్తన చెందినవారు కూడా అనేకులున్నారు.

మరికొంతమంది ఎన్నిసార్లు అల్లాహ్ హితబోధలు, సూచనలు తమ ముందుకు వచ్చినా, ఆయన్ని విశ్వసించ కుండానే తమ శ్వాసను విడిచారు. సమాజంలో తమకువున్న గౌరవమర్యాదలు, సంపదలు, అధికారం, హోదాలే

అల్లాహ్‌ను విశ్వసించకుండా వారికి అడ్డు గోడలై నిలిచాయి. పూర్తి జీవితకాలం వరకు వారికి వ్యవధినిచ్చినా అది వృధా అయిపోయిందే తప్ప ఎలాంటి పరలోక ప్రయోజనాన్ని చేకూర్చలేదు. అల్లాహ్‌ను మించిన దయామయుడు, క్షమాగుణం కలవాడు ఈ లోకంలో మరెవరైనా వున్నారా? పరమ పాపాత్ముణ్ణయినా క్షమించి ఆయన చల్లని నీడలో ఆశ్రయం కల్పించాలనే అల్లాహ్ ఆశిస్తున్నాడు. అయినా మనం కళ్ళుండి గ్రుడ్డివాళ్ళమయ్యాం, చెవులుండీ చెవిటి వారమయ్యాం, ఆలోచించే మన బుద్ధి వివేకాలు కూడా నిజమైన, సవ్యమైన, దివ్యమైన మాట, బాట ఏదో తెలుసుకోలేకపోతున్నాయి. లోకంలో శాంతిశ్రేయాలు లభించి, మరణానంతరం పరలోకాన శాశ్వత స్వర్గసౌఖ్యా లను ప్రసాదించే ఏకైక మార్గం ఇస్లాం మాత్రమే. ఇక మన పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తం కావాలని ఆశిద్దాం.

అజ్ఞానం వల్ల ఏదైనా చెడ్డపని చేసి వెనువెంటనే పశ్చాత్తాపపడే వారి పశ్చాత్తాపాన్ని మాత్రమే స్వీకరించే బాధ్యత అల్లాహ్‌పై వుంది అని తెలుసుకోండి. అలాంటివారి పట్ల అల్లాహ్ కరుణాదృష్టితో తిరిగి సుముఖుడవుతాడు. (దివ్యఖుర్‌ఆన్: 4 : 17)

اَلْعَظِيْمُ

25. అల్ అజీమ్

అల్లాహ్‌యే సర్వోన్నతుడు, సర్వాధికుడని అల్లాహ్– అల్ అజీమ్ అనే పవిత్ర నామం సూచిస్తోంది. స్థిర, చరాలన్నింటికన్నా గొప్పవాడైన ఆయన ఎప్పుడూ స్థిరంగా వుండేవాడే. ఆయన అభీష్టం మేరకు, ఆయన ఆజ్ఞతో ఉనికిలోకి వచ్చిన ఈ ప్రపంచ వ్యవస్థనంతటినీ రెప్పపాటు ఘడియలోనే ఆయన తలచుకుంటే వినాశంపాలు చేయవచ్చు. అల్లాహ్ మన మేధకు, బుద్ధికి, ఊహకు అందనివాడు, గొప్పవాడు. ఆయన మనపట్ల కనబరిచే ఉదారగుణం, దయార్ద్రత, క్షమాగుణంతోనే ఆయన ఎంత గొప్పవాడో అంచనా వేయవచ్చు. కాబట్టి ఆయన ఒక్కడే ఆరాధనకు, పూజకు అర్హుడు, తగినవాడు. వాస్తవానికి పూజింపబడేవాడు అందరికంటే సర్వాధికుడైవుండాలి. మనపట్ల కరుణ గలవాడు కాబట్టే మన మార్గదర్శకం కోసం, ఆయన ప్రవక్త (స)ను ప్రభవింపజేశాడు. ఆపై సర్వ సూచనలు, ఆదేశాలు నిండిన గ్రంథం దివ్య ఖుర్‌ఆన్‌ను అవతరింపజేశాడు. మానవ నైజానికి సరిపడే ధర్మం ఇస్లాంను మనకోసమే పంపాడు. మన మరణానంతరం మనకు స్వర్గాన్ని ప్రసాదించాలనే ఉద్దేశ్యం, తలంపుతోనే ఈ సర్వసదుపాయాలు కల్పించాడు. ఇదంతా అల్లాహ్– అల్ అజీమ్ తప్ప మరొకరెవరైనా చేయగలరా?

మన పుట్టుక, గిట్టుక అన్నీ అల్లాహ్ చేతుల్లోనే ఉన్నాయి. ఈ ప్రపంచానికి, మన జీవితానికి ఆయనే అధిపతి. ఆయనే మనకు జీవికను ప్రసాదిస్తున్నాడు. సంపదగాని, అధికారంగాని ఆయన ద్వారానే ప్రాప్తమవుతున్నాయి. తీర్పు దినానికీ ఆయనే యజమాని. శిక్ష అయినా, బహుమానమైనా ఆయన ద్వారానే

లభిస్తుంది. కాబట్టి అన్నింటికన్నా, అందరికన్నా అల్లాహ్– అల్ అజీమ్ మాత్రమే గొప్పవాడు, అధికుడు. నేరస్థులకు నరకాన్ని, సజ్జనులకు స్వర్గాన్నీ ఆయనే ప్రసాదిస్తాడు. అయితే ఆయన ఆగ్రహంకన్నా అనుగ్రహమే మిన్న. మనం అల్లాహ్‌కు మాత్రమే భయపడాలి, ఆయన్నే వేడుకోవాలి. ఆయన శిక్షకు పాత్రులయ్యే పనులు చేయకుండా, బహుమానాలు అందుకునే సదాచరణలు చేయడానికే ప్రయత్నిద్దాం. మన ఆచరణల అనుసారమే పరలోక ప్రతిఫలం లభిస్తుంది. కాబట్టి ఆయన్ను తప్ప మరొకరెవర్నీ ఆరాధించకుండా వుండేందుకు మన కృషి సాగాలి. సర్వమానవాళికి అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించే సద్బుద్ధిని ఇవ్వాలని, తద్వారా అందరినీ ఆయన నరక జ్వాలల నుండి కాపాడి స్వర్గాన్ని ప్రసాదించేలా చేయాలని ఆశిద్దాం.

ఒకవేళ అల్లాహ్ అనుగ్రహం, ఆయన కారుణ్యం మీా మీాద లేకపోతే, మీాలోని ఏ వ్యక్తీ పరిశుద్ధుడు కాలేడు. (దివ్యఖుర్ఆన్–24:21)

اَلْغَفُوْرُ

26. అల్ గఫూర్

అల్లాహ్ - అల్ గఫూర్ అంటే అమితంగా క్షమించేవాడని అర్థం. మనమంతా ఆయన సృష్టితాలమే కాబట్టి మనందరి పట్ల ఎంతో దయతో కనికరంతో మెలగుతాడు ఆయన. తెలిసీ తెలియక చేసిన మన చిన్నాచితక తప్పుల్ని ఆయన అమిత క్షమాగుణంతో క్షమిస్తున్నాడు. కొన్నిసార్లు మన తప్పుల్ని నమోదు చేయకుండా దైవదూతల కళ్ళు కూడా కప్పుతున్నాడు ఆయన. ఒక్కోసారి మనం చేసిన పొరపాటుకు స్వయంగా మన ఆత్మ, మనస్సే చీదరించు కుంటాయి. మన పట్ల ఉన్న ఆయన దయాగుణం, క్షమాగుణంతోనే ఆయన మనల్ని క్షమించి ఆదరిస్తున్నాడు. అంతా ఆయన చలువ. క్షమించమని సిఫారసు చేసే శక్తి ఎవరిలోనూ లేదు. అల్లాహ్ మాత్రమే తీర్పు దినానికి యజమాని. ఆ రోజు ఎవరి అధికారమూ, సిఫారసూ చెల్లదు. అల్లాహ్ మాత్రమే మనల్ని క్షమించేవాడు. ఒక్క షిర్క్‌ను (అల్లాహ్‌ను కాదని మరొకర్ని ఆరాధించడం) తప్ప ఆయన తలిస్తే మన ఏ తప్పునైనా క్షమించగలడు. అయితే మనం చేసిన తప్పుల పట్ల, పొరపాట్ల పట్ల నిజమైన పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ వాటిని తప్పకుండా క్షమిస్తాడు. మనో నిగ్రహం కోసమని మనం విగ్రహాలను, గ్రహాలనుగాని, చెట్టుపుట్టల్ని కొలిచినట్లయితే అల్లాహ్ మనల్ని ఎన్నటికీ క్షమించడు. ఇలా చేస్తే నరకంపాలవక తప్పదు.

జీవితపు చరమాంకంలోనైనా మన తప్పును తెలుసుకొని అల్లాహ్ వైపు మరలి, ఆయన్ని మాత్రమే నమ్ముకొని, ఆయన్ని మాత్రమే విశ్వసిస్తే తప్పకుండా మనల్ని క్షమించే అవకాశం, ఆశ వుంది. అల్లాహ్ ధర్మాన్ని స్వీకరించడంలో

ఎవరి పట్లా ఎలాంటి బలాత్కారం లేదు. ఆలోచన, అవగాహనతో మాత్రమే మనిషిలో పరివర్తన రావాలి. అలాంటి పరివర్తన కోసం, ప్రవర్తన కోసం అల్లాహ్ మన కొరకు దివ్య గ్రంథం ఖుర్ఆన్‌ను, ప్రవక్త ముహమ్మద్ (స)ను పంపాడు. ఆరాధనకు అర్హులు ఎవరు? అనే విషయాన్ని ఖుర్ఆన్ ద్వారా, ప్రవక్త (స) సంప్రదాయం ద్వారానే మనకు తెలిసింది. ప్రవక్త (స) జన్మించక ముందు ప్రజలు మూడు వందలకు పైచిలుకు విగ్రహాలను పూజించేవారు. వారి కోరికల పరిపూర్తి కొరకు, వారు క్షమించబడటానికి అల్లాహ్‌తో సిఫారసు చేయమని విగ్రహాలను ఆరాధించేవారు ఆనాటి అరబ్బు నివాసులు. తీర్పుదినాన విగ్రహాలుగాని, మరే పుణ్యపురుషులుగాని మనల్ని రక్షించలేరని, మనం చేసుకున్న సత్కర్మలు, సదాచరణలే పనికి వస్తాయని ప్రవక్త (స) ఏనాడో చాలా విపులంగా సెలవిచ్చారు ఈ ప్రపంచానికి. అల్లాహ్ మనందరినీ క్షమించాలని, ఆయన ప్రవక్త (స) చూపిన మార్గానుసారం మన జీవనం సాగాలని ఆశిద్దాం.

మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను.

(దివ్యఖుర్ఆన్- 24 : 22)

اَلْعَلِيُّ

27. అల్ అలియ్యు

అల్లాహ్– అల్ అలియ్యు అంటే సర్వాధికుడు, సర్వోత్తముడు అని అర్థం. అన్ని విధాల గొప్పవాడు, తగినవాడు అయిన వారికే అల్ అలియ్యు నామం శోభిస్తుంది. భౌతికంగా, మానసికంగా, సృష్టిరీత్యా ఇంకా సర్వవిధాలా అల్లాహ్‌యే గొప్పవాడు. అన్నీ తెలిసినవాడు, సర్వవ్యాపి. భూత, భవిష్యత్, వర్తమానాలూ తెలిసినవాడు. ఆయన ఒక్క మాటతో ఈ సర్వసృష్టి ఉనికిలోకి వచ్చింది. ఒక్క మాటతోనే ఈ ప్రపంచ వ్యవస్థ సమస్తమూ భస్మీపటలమవు తుంది. కాబట్టి అంతటి గొప్పవాడైన ఆయనే ఆరాధనకు అర్హుడు. మన ప్రాణదాతా, ప్రాణహరుడూ ఆయనే. తీర్పు దినానికి యజమాని, మనకు స్వర్గనరకాలు ప్రసాదించేదీ ఆయనే. ఇంతటి మహిమాన్వితుడైన ఆయన్నే ఆరాధించడం మనిషికి అన్ని విధాలా శ్రేయస్కరం. దయ, క్షమ, ప్రేమ మొదలైన సుగుణాలతో ఎల్లప్పుడూ మన పట్ల మెతకవైఖరిని అవలంబిస్తూ మనల్ని ఎల్లప్పుడూ కనికరిస్తూనే వున్నాడు. అందువలన మనం ఆయన్ని మన ప్రాణంకన్నా మిన్నగా గౌరవించాలి. మన మేలుకోరి ఆయన మన కోసం పవిత్ర ఖుర్‌ఆన్‌ను పంపి అందులోని ఆదేశాల ప్రకారం ప్రపంచంలో జీవనాన్ని సాగించమన్నాడు. ఆయన్ను విశ్వసించి, ఆరాధించే వారికి అల్లాహ్ ఎన్నో శుభవార్తలనిచ్చాడు.

మానవాళికి సన్మార్గం చూపటానికి ఈ ప్రపంచంలో ఎందరో ప్రవక్తల్ని ప్రభవింపజేశాడు ఆ విశ్వప్రభువు. ఆ ప్రవక్తలకు వారి పరిస్థితుల్నిబట్టి ఎన్నో శక్తియుక్తుల్ని, ఆత్మజ్ఞానాన్ని ఇంకా మహత్యాల్ని ప్రసాదించాడు. ప్రతి దోషం

నుండి వారిని దూరంగా వుంచి వారిపై ఆయన ప్రత్యేక అనుగ్రహాన్ని కురిపించాడు ఆ పరమ ప్రభువు. ప్రవక్తలందరూ ప్రబోధించింది ఒక్కటే- అదే: మానవాళి అంతా ఒకే దైవాన్ని విశ్వసించాలి, ఆయనే మన ఆరాధనకు అర్హుడు, మన జీవన్మరణాలు ఆయన చేతిలోనే వున్నాయి, ఆయన అనుగ్రహంతోనే మనం జీవిస్తున్నాం, మన అవసరాలన్నింటినీ ఆయనే తీరుస్తున్నాడు, మరణించాక మనమంతా ఆయన వద్దకే మరలి వెళ్ళాలి, మన కర్మల లెక్కను అప్పజెప్పాలి.

అల్లాహ్- అల్ అలియ్యు గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని గ్రహించి ఆయన చూపిన మార్గానుసారం మన జీవితాలు సాగాలని ఆశిద్దాం.

ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను.

(దివ్యఖుర్ఆన్-2:255)

اَلْكَبِيْرُ

28. అల్ కబీర్

దివ్యఖుర్ఆన్‌లో అనేకచోట్ల అల్లాహ్- అల్ కబీర్ అని ప్రస్తావించబడింది. అల్ కబీర్ నామంలో కూడా ఆధిక్యత, అధికారం, గొప్పతనం మొదలైన గుణాలు మిళితమైవున్నాయి. ఒకరోజు ఒక ప్రాంతానికి, చక్రవర్తి ఒక దేశానికి శాసకులు, పరిపాలకులుగా మనగలుగుతారు. కాని అల్లాహ్- అల్ కబీర్ మన శ్వాసకే కాదు, ఈ విశ్వం మొత్తానికే అధినేత, శాసకుడు, పాలకుడు, పోషకుడు. కాబట్టి ఆయన రాజులకు రాజు. ఒక రాజు కొన్ని సంవత్సరాల వరకు రాజుగా వుండగలడు; కాని అల్లాహ్ ఈ ప్రపంచం మొత్తానికి ఎల్లప్పుడూ రాజే. ఆయనే మన సృష్టికర్త కాబట్టి మన నఖశిఖపర్యంతమూ ఆయన ఆదేశానుసారం సాగాలి. అల్లాహ్ అనుగ్రహంతోనే ఒక వ్యక్తి ఒక రాజుగా లేక అధికారిగా మనగలుగుతాడు. కాని అల్లాహ్‌కు ఎవరి అనుగ్రహమూ, దయ అక్కరలేదు. ఆయనే మనందరిపై, ఈ ప్రపంచ వ్యవస్థపై కరుణాను గ్రహాలను కురిపిస్తున్నాడు.

సమస్త సదుపాయాలను కల్పించి మన జీవితావసరాలను పరిపూరిస్తున్న ఆయనే మన జీవనం పావనం కావాలని ఒక ధర్మాన్ని కూడా ప్రసాదించాడు. సృష్టి ఆది నుండీ మనిషి మార్గదర్శకం కోసం అల్లాహ్ ప్రవక్తల్ని పంపుతూనే వచ్చాడు. మొట్టమొదటి మానవుడు, ప్రవక్త ఆదం (అ). చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స). ప్రళయదినం వరకు ఇక మరో ప్రవక్త రాబోడు. ముహమ్మద్ (స) ప్రవక్తతోనే ప్రవక్తల రాక ముగిసింది కాబట్టి ప్రపంచ మానవాళి అంతా ఆ ప్రవక్త (స) అనుసరించి చూపిన మార్గానుసారం నడుచుకోవటంలోనే

అన్ని విధాల శ్రేయోదాయకం. మన మేలుకోరి, మనపై దయజూపే మన కోసం ప్రవక్త ముహమ్మద్ (స)ను ప్రభవింపజేశాడు ఆ దాత, విధాత. ప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్ర, విధానం, ప్రవచనాలు ఇప్పటికీ భద్రంగానే వున్నాయి. ప్రవక్తపై అవతరింపజేసిన గ్రంథం ఖుర్ఆన్ కూడా భద్రంగానే వుంది. మనమే అభద్రతకు లోనయ్యే మార్గాల వెంటబడి నిత్యం సంకట స్థితుల్లో చిక్కుకుంటున్నాం. ప్రతి మనిషీ తన ఆలోచనా లోచనాల్తో చూసి తన పుట్టుకకు గిట్టుటకు కారకుడైన ఆ స్వామి చూపిన మార్గాన్ని పట్టుకుంటే జీవితం ధన్యమైపోతుంది, లేకుంటే మన్యమై మిగుల్తుంది.

అల్లాహ్ గోప్యంగా వున్నటువంటి, బహిరంగంగా వున్నటువంటి ప్రతి వస్తువును గురించీ తెలిసిన పండితుడు. ఆయన గొప్పవాడు సర్వకాల సర్వావస్థలలో ఆధిక్యం కలిగి వుండేవాడు.

(దివ్యఖుర్ఆన్: 13:9)

❋

اَلْحَفِيْظُ

29. అల్ హాఫీజ్

అల్ హాఫీజ్ అంటే సంరక్షకుడని అర్థం. అల్లాహ్ - అల్ హాఫీజ్ ఈ చరాచర సృష్టికి కర్త కాబట్టి ఆయన అందరికీ రక్షకుడు, కాపాడేవాడు. కని, పెంచుతూ తమ సంతానాన్ని ఏ విధంగా తల్లిదండ్రులు నిత్యం కాపాడుతూ వుంటారో అంతకన్నా ఎన్నో రెట్లు దయాభావంతో మెలుగుతూ నిత్యం మనల్ని అల్లాహ్ కనిపెట్టుకుని వుంటాడు. సమాజంలో మన అంతస్తు, హోదా ఎలావున్నా ఆయన మనకు, మన కుటుంబానికీ ఆహారాన్ని, ఆశ్రయాన్ని సమకూరుస్తున్నాడు. ఎలాంటి తారతమ్యం చూపకుండా సర్వప్రాణుల పట్ల దయతో, కనికరంతో మెలుగుతూ కాపాడుతున్నాడు. మనిషికి ఆయన ఆలోచించి నిర్ణయాలు గైకొనే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించాడు. మనిషికి తప్ప మరే ప్రాణికీ బుద్ధీ జ్ఞానాలను ప్రసాదించలేదు. ఇంతటి ఉద్ధిష్టగుణాన్నిచ్చినప్పటికీ మనిషి జంతుజాలం, పశుపక్ష్యాదులకంటే కూడా హీనంగా దిగజారి మెలుగుతున్నాడు. మనవద్ద పనిచేసే ఒక నౌకరు మన అభీష్టానికి వ్యతిరేకంగా నడుచుకుంటే మనం అతన్ని ఉద్యోగంలో వుంచుతామా? లేదు. అలా ఎన్నటికీ జరగదు. కాని మనం సర్వసదుపాయాలూ కల్పించిన ఆ దయామయుడైన అల్లాహ్ మాటను, బాటను కాదని గుడ్డిగా నీచాతినీచమైన, మనకంటే హీనమైన వాటిని పూజిస్తున్నాం. భుజించేది ఒకరిది, భజించేది మరొకరిని. ఇదెక్కడి న్యాయం, ధర్మమో ఎవరికివారే ఆలోచించాలి. ఇంత చేస్తున్నా పరమ దయామయుడైన అల్లాహ్ మనకు ఆహారాన్నీ ఇస్తున్నాడు, అహరహం రక్షిస్తున్నాడు కూడా- ఏనాటికైనా మనిషి నిజమార్గం తెలుసుకొని ఆయన వైపునకు మరలిరాకపోతాడా అని.

అల్లాహ్ మన శ్వాసనేకాదు, విశ్వాసాన్ని కూడా రక్షిస్తున్నాడు. సర్వ కాలాల్లోనూ ఆయన గ్రంథం ఖుర్ఆన్‌ను కూడా కాపాడతానని ఈ గ్రంథంలోనే ప్రకటించాడు అల్లాహ్. ఎవరు ఎంతగా ప్రయత్నించినా ఆ గ్రంథంలోని ఓ హల్లును కాదుకదా పొల్లును కూడా మార్చలేరు. అలాగే ప్రవక్త ముహమ్మద్ (స)ని కూడా అల్లాహ్ అన్నివేళలా కాపాడాడు. అల్లాహ్ చూపిన బాటపై నడుస్తూ ఆయన మాటనే ప్రపంచ ప్రజలందరి వరకూ చేరవేసిన ప్రవక్త (స)పై కష్టాల కడగండ్లు విరుచుకుపడ్డాయి. కాని అల్లాహ్ ప్రతి కష్టకాలంలోనూ ప్రవక్త (స)కు రక్షకుడుగా నిలిచాడు.

పుట్టుక రీత్యా ప్రతి మనిషీ ముస్లిమే. కాని వారి కుటుంబం, పరిస్థితుల ప్రభావం కారణంగా నిజమైన మార్గానికి దూరమవుతున్నాడు. అయినా అల్లాహ్ ప్రతి మనిషికీ ఏదో ఒక సమయంలో, సందర్భంలో నిజమైన మార్గాన్ని చూపిస్తూనే వున్నాడు- ఎప్పటికైనా ఇస్లాం వైపునకు మరలివస్తాడనే ఆశతో. ఇదంతా మనల్ని నరకజ్వాలల నుండి కాపాడాలనే కదా ఆయన తాపత్రయం.

అల్లాహ్‌కు మీరు ఏమాత్రం హాని చెయ్యలేరు. నిశ్చయంగా నా ప్రభువు ప్రతి వస్తువునూ కనిపెట్టి వుంటాడు.

(దివ్యఖుర్ఆన్-11:57)

اَلشَّكُوْرُ

30. అష్ షకూర్

అష్ షకూర్ అంటే అంగీకరించేవాడు, స్వీకరించేవాడని అర్థం. అల్లాహ్- అష్ షకూర్ మాత్రమే మన వేడుకోలును, ప్రార్థనను అంగీకరించేవాడు. మనం నిజమైన విశ్వాసులై నిత్యం అల్లాహ్‌నే ఆరాధిస్తూ, సత్కార్యాలను చేస్తూ వుంటే తప్పకుండా అల్లాహ్ మన మొరల్ని ఆలకిస్తాడు; మన విశ్వాసంలో, ధార్మికతలో సమృద్ధిని సంప్రాప్తం చేస్తాడు. ఫలితంగా సత్కార్యాచరణలో మనం మరింత చురుకుగా పాల్గొని అల్లాహ్‌కు చేరువవుతాం. ఇదంతా కల్మషరహితమైన మన ప్రార్థన, ఆచరణల ద్వారానే సాధ్యమవుతుంది. ఒకవైపు ఇది విశ్వసనీయులైన దాసుల ప్రవర్తన.

మరొక వైపు అవిశ్వాసుల ప్రవర్తన వుంది. సృష్టికర్త ఒక్కడే అని, ఆయనే స్వామి, పాలకుడు, పోషకుడని నమ్మనివారు బహుదైవారాధన పథంలో సంచరించేవారు కూడా చాలా మందివున్నారు. వారు ప్రజల కొరకు ఎన్నో ఉపయోగకరమైన పనులు చేస్తూవుంటారు. వారు అవిశ్వాసులైనంత మాత్రాన ప్రజలకు వారు చేసే మేలును మరువలేము. అయితే అటువంటి వారికి వారు చేసిన సత్కార్యాలకు, మేళ్ళకు తగ్గట్టు అల్లాహ్ వారికి ఈ లోకంలోనే ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. ఇంకా ఈ లోకంలోని సర్వ సదుపాయాల్ని, సౌఖ్యాల్ని ప్రసాదిస్తాడు. కాని వారికి పరలోకంలో ఏ మాత్రం చోటు దొరకదు- నరకం తప్ప. ఎందుకంటే వారు సృష్టికర్తనే కాదన్నారు. వారి పుట్టుకకు, గిట్టుకకు కారణభూతుడైన వాణ్ణి, ఈ లోకంలో కూడా వారి నిజమైన పోషణకర్త అయిన అల్లాహ్‌ను కాదన్నారు. ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, వివిధ రకాలైన

పంటల్ని పండిస్తూ అందర్నీ పోషిస్తున్న అసలైన కర్తనే తృణీకరించారు. అయినా ఈ లోకంలో అలాంటి వారికి కూడా ఆయన దయాగుణంతో ఆహారాన్ని ప్రసాదిస్తూనే వున్నాడు- ఏదో ఒకనాడు ఆయన్ని తెలుసుకోకపోతారా అని.

ముస్లింల కుటుంబంలో పుట్టినంత మాత్రాన కూడా ఇట్టే స్వర్గం లభించదు. అలా భావించడం ఒక అపోహ మాత్రమే. ముస్లింల పేరు పెట్టుకున్నంత మాత్రాన స్వర్గానికి టికెట్ కొనుక్కున్నట్టు కాదు. కావలసింది సదాచరణ- అదీ అల్లాహ్, ఆయన ప్రవక్త (స) ద్వారా చూపిన విధంగా మసలుకోవడం. అప్పుడే మనం స్వర్గానికి అర్హులమవుతామని ఆశించవచ్చు. జీవితాంతం మనం సదా సత్యపథంలో నడుస్తూ, సత్కర్మలు చేస్తూ ఏ మాత్రం గర్వం లేకుండా అణకువతో మసలుకుంటూ వుంటే తప్పకుండా ఆ కరుణామయుడైన అల్లాహ్ మన ప్రార్థనల్ని స్వీకరిస్తాడు. అల్లాహ్ మనందరికీ అలాంటి సద్బుద్ధిని ప్రసాదించాలని ఆశిద్దాం.

> **ఆకాశంలో బురుజులను నిర్మించినవాడూ, అందులో ఒక దీపాన్ని, ఒక మెరిసే చంద్రుణ్ణి వెలిగించినవాడూ ఎంతో శుభప్రదుడు. ఆయనే రేయింబవళ్ళను ఒకదానివెంట ఒకటి వచ్చేలా చేశాడు, గుణపాఠం నేర్చుకోదలచిన లేదా కృతజ్ఞతలు తెలుపుకోదలచిన ప్రతి వ్యక్తి కోసం.**
>
> **(దివ్యఖుర్‌ఆన్-25 : 61,62)**

اَلْمُقِيْتُ

31. అల్ ముఖీత్

అల్లాహ్- అల్ ముఖీత్ అంటే సర్వ సమర్ధుడు, ఉపాధి ప్రదాత అని అర్థం. అల్లాహ్ మనిషికి శారీరకంగా ఓ రూపాన్నిచ్చి, మనస్సును, ఇంకా ఆత్మను ప్రసాదించాడు. ఆలోచించే శక్తిని, జ్ఞానాన్నిచ్చాడు. జీవించడానికి మనకు అనుదినం ఆహారాన్ని అందిస్తున్నాడు కాబట్టి అల్లాహ్- అర్రాజిఖ్, అంటే ఉపాధి ప్రదాత కూడాను. ఆహారం ద్వారానే మనకు శారీరక శక్తి లభిస్తుంది. మన శరీరంలో ఎన్నో అవయవాలున్నాయి. దేనికి కావలసిన ఆహారం దానికి సరఫరా అవుతోంది. అప్పుడే అన్ని అవయవాలు సక్రమంగా పని చేయగలుగుతున్నాయి. మనసు ఆలోచించగలుగుతోంది, కళ్ళు చూడ గలుగుతున్నాయి, చెవులు వినగలుగుతున్నాయి, కాళ్ళతో నడవగలుగుతున్నాము, ఇలా మొత్తం మీద మనిషి ఎన్నో చేయగలుగు తున్నాడు. మనిషికే కాదు ప్రపంచంలోవున్న జంతుజాలానికి, చెట్లు చేమలకు, పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాలకు ఇంకా మనకు తెలియని ఎన్నో జీవరాసులకు ఆహారాన్ని ప్రసాదిస్తున్నాడు అల్లాహ్. భూచరాలకే కాదు, జలచరాలకు, భూమి పొరల్లో దాగిన వాటికి, రాతి పొరల్లో దాగివున్న జీవరాసులకు సైతం సర్వ లోకాల ప్రభువే ఆహారాన్ని అందిస్తున్నాడు. మన కుటుంబ సభ్యులకు, ఇంకా మన అతిధులకు ఆహారాన్ని సమకూర్చాలంటే ఎంతో ప్రయాసపడతాం- అది కూడా అల్లాహ్ ప్రసాదించేదే. పుట్టుక మొదలు గిట్టే వరకు సమస్త ప్రాణికోటికి జీవికను ప్రసాదించేది అల్లాహ్‌యే.

అల్లాహ్‌యే మనకు ఆహారమూ ఇస్తున్నాడు, ఇంకా దాని ద్వారానే ఆరోగ్యాన్నీ ఇస్తున్నాడు. మనం సేవించే ఆహారం ద్వారానే మనకు

తెలియకుండానే ఎన్నో రకాల రోగాలు నయమవుతున్నాయి, ఇంకా మన శరీరానికి కావలసిన శక్తి లభిస్తోంది, మనసుతో ఆలోచించే మేధాశక్తీ ప్రాప్తమవుతోంది. మానవుడు తన జ్ఞానాన్నుపయోగించి ఏది మంచి, మరేది చెడు అనే విచక్షణను కూడా చేయగలడు. సదా మనం సన్మార్గాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను కోరుకోవాలి. మనం మార్కెట్‌కు వెళితే మంచి వస్తువుల్ని ఎంచి మరీ కొనుగోలు చేస్తాం. పరలోకంలో మనం సుఖంగా స్వర్గంలో వుండాలంటే ఆ మార్గమేదో ఎంచుకోవాలి. దానికి మన మేధను ఉపయోగించాలి. అప్పుడే మానవ జన్మ ధన్యమవుతుంది. అప్పుడే మనిషికీ మేధాశక్తి లేని పశువుకు తేడా ఏదో తెలిసిపోతుంది. అల్లాహ్ మనందరికీ సరియైన మార్గాన్ని ఎంచుకునే సద్బుద్ధిని ప్రసాదించాలని ఆశిద్దాం.

اَلْحَسِيْبُ
32. అల్ హసీబ్

అల్ హసీబ్ అంటే శాబ్దికంగా లెక్క వుంచేవాడు, గణకుడు అని అర్థం. అల్లాహ్– లెక్కల దినం లేక తీర్పు దినాన ఈ లోకంలో మనం చేసిన మంచీ చెడుల లెక్క తీసుకుంటాడు. అల్లాహ్– అల్ హసీబ్ మన కర్మలను బట్టి ప్రతి ఫలాన్నిస్తాడు. మన ఇసుమంత పని– అది మంచైనా, చెడైనా– వదలపెట్టబడదు. ఏదీ రహస్యంగా ఉంచబడదు. ఎవరు అల్లాహ్‌ను విశ్వసించారో, ఎవరు విశ్వసించలేదో ఆ రోజు తేలిపోతుంది. ప్రతిదీ ఆ తీర్పు దినాన లెక్క తీసుకోబడుతుంది. అల్ హసీబ్ మాత్రమే మన పరలోక జీవితాన్ని నిర్ణయిస్తాడు. లెక్కకు మించిన, మనిషి ఊహకు అందని కోటానుకోట్ల మంది జనం ఆ రోజు– తీర్పుదినాన– ఒక్కచోట ప్రోగుచేయబడినప్పుడు అందరి లెక్కా ఒకేసారి ఎలా తీసుకోబడుతుంది అనే సందేహం మనకు కలగవచ్చు. కానీ, అది అల్లాహ్ – అల్ హసీబ్‌కు సాధ్యమే. అది ఎలా అంటే– ఈ ప్రపంచంలో మనుష్య జాతేకాదు, మనం చూసేవి, చూడలేనివి ఎన్నో రకాల జీవులకు, ప్రాణులకు– నింగిలో, నేలపై, నీటిలో – అవి ఎక్కడున్నా వాటికి ఒకేసారి ఆహారాన్ని సమకూరుస్తున్నాడు ఆ స్వామి, పోషకుడు అయిన అల్లాహ్. మరి ఆ లెక్క తీసుకోవటం కూడా ఆయనకు ఏ మాత్రం లెక్కలోని విషయం కాదు. మానవ జీవితం, మేధ పరిమితమైనవి. మనం కొంతకాలం మాత్రమే ఈ ప్రపంచంలో జీవించగలుగుతాం, కొంతమేరకు మాత్రమే ఆలోచించగలం, అలాగే మన దృష్టి, వినికిడి పరిమితమైనవి. అల్లాహ్ వీటన్నింటికీ అతీతుడు. ప్రతిదీ ఆయనకు సాధ్యమే. కాబట్టి అలాంటి శక్తిమంతుడు, మహిమాన్వితుడు, మన సృష్టికర్త, పోషకుడు, తీర్పు దినానికి యజమాని అయిన ఒక్క అల్లాహ్– అల్ హసీబ్‌ను

మాత్రమే విశ్వసించి, ఆయన్ని ఆరాధించడమే మనిషికి అన్ని విధాల శ్రేయస్కరం.

చీకటితోపాటు వెలుగు, రాత్రి తరువాత పగలు వున్నట్లే మనకు కష్టాల వెంట సుఖాలూ వున్నాయి. మనిషికి ఈ ప్రపంచంలో ఎన్నో సమస్యలు ఎదురవు తాయి. అల్లాహ్ పట్ల విశ్వాసముంచి, ఆయనపైనే భారం మోపితే ఎంతటి పెద్ద కష్టాల కడలి అయినా, పర్వతమైనా ఇట్టే ఒక్క క్షణంలో మాయమైపోతుంది. ఆయన తప్ప మరెవ్వరూ మనిషిని ఆదుకునేవారు లేరు. ఆయన తప్ప మనల్ని రక్షించేవాడు ఎవరూ లేరనే రహస్యాన్ని మన మనస్సుల్లో పాదుకునేలా చేయాలి. ఈ విశ్వాసం మన తుది శ్వాస వరకు వుంటే మన జీవితం సాఫీగా, సజావుగా ఈ లోకంలోనూ సాగిపోతుంది, పరలోకంలోనూ మంచి ప్రతిఫలముంటుంది. విశ్వసించిన తన దాసుల్ని ఆయన ఎన్నడూ వదలిపెట్టలేదు. అల్లాహ్ మనల్ని అన్ని విధాలా ఆదుకోవటానికి మన వెన్నంటే వున్నాడు.

అల్లాహ్ ప్రతిదానికీ లెక్క తీసుకుంటాడు. అల్లాహ్- ఆయన తప్ప వేరే దైవం లేడు. ఆయన మీ అందరినీ ప్రళయ దినం నాడు సమావేశపరుస్తాడు. అది రావటంలో ఏ మాత్రం సందేహం లేదు. అల్లాహ్ మాటకంటే మరెవరి మాట నిజం కాగలదు?

దివ్యఖుర్ఆన్- 4 : 86,87)

اَلْكَرِيْمُ

33. అల్ కరీమ్

నిస్వార్థంగా, ప్రతిఫలం ఆశించకుండా ఎవరైనా మనకు సహాయ సహకారాలు అందిస్తే వారిని మనం కరీమ్ అని అంటాం. ఈ విషయంలో కూడా అల్లాహ్– అల్ కరీమ్ అందరికన్నా ఎక్కువ అనుగ్రహం కలవాడు. ఆయన దయ మనపై ఒక్క క్షణం లేకున్నా మనం ఈ లోకంలో జీవించలేము. ఈ ప్రపంచం వడ్డించిన విస్తరిలాంటిది. ఎవరికి ఏది అవసరమో అది వారికి లభిస్తూనే వుంది. అలా లభ్యం కావటం లేదంటే అది మనిషి చేసే నిర్వాకం వల్లనే జరుగుతోంది కాని మరెవరి దోషం లేదు. ప్రభుత్వం పంపకం చేయమని నిత్యావసర వస్తువుల్ని పంపిణీదారులకు సరఫరా చేస్తోంది. కాని న్యాయంగా పంపిణీ జరుగుతోందా? లేదు. స్వార్థం నిండిన మనిషి వాటిని స్వాహా చేస్తున్నాడు. కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాడు. ప్రపంచ జనాభాకు సరిపడేలా అన్ని పంటలు పండుతున్నాయి, వస్తువులూ తయారవుతున్నాయి. కాని పంపిణీయే సరిగా జరగటం లేదు. తప్పు మనం చేసి, నింద మరొకరిపై మోపుతున్నాం. ఎప్పటినుంచో ప్రవహిస్తున్న జీవ నదులు కూడా ఇంకి పోతున్నాయి. కాని మనుషుల అవినీతి, స్వార్థం జీవనదులకన్నా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఫలితంగా ప్రపంచం మొత్తం ఈ ప్రవాహంలో కొట్టుకు పోతూనే వుంది. ఇందులో మనుషులే కాదు, మనిషి చేసిన, చేస్తున్న తప్పిదాలకు ప్రాణికోటి యావత్తూ బలి అయిపోతోంది. ఇది మనిషి సాగుచేసి, సాగిస్తున్న స్వార్థం కాకపోతే మరేమటి? ఒక మనిషి మరో మనిషిని, ఒక దేశం మరో దేశాన్ని అంతమొందించాలని అణువణువునా ఆలోచించటం మూలానే అణు బాంబులు తయారవుతున్నాయి. ప్రపంచం మొత్తమే అగ్నిగుండమై

మండుతోంది. రసాయన బాంబుల ఫలితంగానే ఆయనాలు మారిపోతున్నాయి, ఋతువుల క్రమం వాతావరణ సమతౌల్యం దెబ్బతిన్నాయి. చివరికి మనిషి మనుగడే ముప్పుకు గురి అవబోతోంది.

అల్లాహ్– అల్ కరీమ్ అంటే అనుగ్రహం, కరుణ కలవాడని అర్థం. మనపై ఆయన ఎనలేని అనుగ్రహం కలవాడు కాబట్టే మనల్ని పుట్టించాడు, సకల సదుపాయాల్ని సమకూర్చాడు. మనం ఈ లోకంలో ఎలా జీవించాలో తెలుపటానికి ఖుర్ఆన్ గ్రంథాన్ని, మన మార్గదర్శకం కోసం ప్రవక్త ముహమ్మద్ (స)ని పంపాడు. ఖుర్ఆన్ గ్రంథం, ప్రవక్త (స) జీవన విధానం జీవ నదుల్లా ప్రవహిస్తున్నాయి. నిస్తేజమై, నిర్వీర్యమై, నిర్జీవమైపోయిన మనిషి ఆత్మకు జవజీవాల్ని ప్రసాదించేది ఈ జీవజలధారయే. ఇదే సరికొత్త జీవితాన్ని ప్రసాదించి ఇహపరలోకాల్లో మనిషి జీవితాన్ని సుఖమయం చేస్తుంది.

> **ఓ మానవుడా! పరమదాత (అల్ కరీమ్) అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడవేసింది? ఆయనే నిన్ను సృష్టించాడు, ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు, నిన్ను తగిన రీతిలో పొందికగా రూపొందించాడు, తాను తలచిన రూపంలో నిన్ను మలిచాడు. (దివ్యఖుర్ఆన్ – 82 :6–8)**

اَلرَّقِيْبُ
34. అర్ రఖీబ్

మనల్ని అల్లాహ్ ఎల్లప్పుడూ చూస్తూనే వున్నాడు. మన ప్రతి కదిలికనూ ఆయన గమనిస్తూనే వున్నాడు. సర్వ కాలాలూ ఆయన హస్తగతమై వున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో కూడా ఆయనకు తెలుసు. మరుక్షణంలో మనకు ఏం జరగనుందో తెలియదు, అయినా మనం అన్నీ తెలిసినట్లు నటిస్తాం. మన యోగక్షేమాల కోసం ఆయన తపిస్తూ వుంటాడు. కాని ఓ మనిషి తన సాటివాణ్ణి శపిస్తూ వుంటాడు. అల్లాహ్ మానవులందరినే కాదు, సర్వ ప్రాణుల్నీ సర్వదా సంరక్షిస్తూ వుంటాడు. అపాయాల్లో చిక్కుకున్నప్పుడు మన మనసుకు ఉపాయాలు తట్టేలా చేసేదీ ఆయనే. ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు మనల్ని గట్టెంకించి ప్రమోదాన్ని ఇచ్చేదీ ఆయనే. అల్లాహ్- అర్ రఖీబ్ అంటే అర్థం దాసుల్ని, అంటే మనల్ని, మన వ్యవహారాల్నీ గమనించేవాడని, కనిపెట్టేవాడని అర్థం. మనం కష్టాలకు గురిఅయినప్పుడు మన సహాయార్థం మరొకర్ని పంపిస్తాడు. ఇది మనపై ఆయనకు వున్న దయగాకపోతే మరేంటీ? వరదలు, తుఫానులు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు లేక మరేవైనా విపత్తులు సంభవిచ్చినప్పుడు మనల్ని కాపాడటానికి వచ్చేది మనుషులే కదా! అల్లాహ్ దయ, కరుణానుగ్రహాల వల్లనే మరొకరు వచ్చి మనల్ని రక్షిస్తున్నారు. తల్లిదండ్రులు తమ సంతానాన్ని కనిపెట్టుకొనివుంటూ, వారి ప్రతి బాధను, వ్యధను ఏ విధంగా తీరుస్తున్నారో, అదే విధంగా అల్లాహ్ కూడా మనల్ని కనిపెట్టుకొని వుంటూ మన కష్టాల్ని దూరం చేస్తూ సుఖవంతమైన జీవితాన్ని ప్రసాదిస్తున్నాడు. మరి అంతటి కరుణామయుడైన అల్లాహ్‌ను కాదని మరొకర్ని పూజించడం, ప్రార్థించడం, అర్థించడంలో అర్థం వుందా?

మనిషి తనను తాను కాపాడుకోవటానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాడు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఆపదలు అతన్ని ఎటునుండైనా చుట్టుముట్టే అవకాశ ముంది. ఆకాశంనుంచైనా, భూమి క్రిందినుంచైనా, పెను తుఫాను, వరదల నుంచైనా మనకు ఆపదలు రావచ్చు. కాని అన్ని ఆపదల్లోనూ మనల్ని కాపాడేది ఆ అల్లాహ్ మాత్రమే. ఆయన శరణు వేడుకుంటే చాలు, ఇక ఎటువంటి ఆపద, ప్రమాదమైనా క్షణాల్లో దూరమవుతుంది. పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు మనిషికి శారీరకంగా, భౌతికంగా, మానసికంగా ఇంకా ఆధ్యాత్మికంగా అల్లాహ్‌యే మనకు సహాయసహకారాల్ని సమకూరుస్తున్నాడు. జీవితాంతం ఆయన అమూల్యమైన, అగణితమైన మేళ్ళను అనుభవిస్తూ కూడా ఆయన దైవత్వాన్ని కాదనటం మనిషి అజ్ఞానానికి అద్దంపడుతోంది. అల్లాహ్‌ను మనం పూజించనంతమాత్రాన, ఆరాధించనంతమాత్రాన ఆయన దైవత్వంలో ఎలాంటి కొరతా ఏర్పడదు. అలా ప్రవర్తించడం మూలాన మన పరలోకమే ప్రమాదంలో పడుతుంది తప్ప ఆ పరమోన్నత ప్రభువు గొప్పతనంలో, ఘనతలో ఏ మాత్రం లోటు రాదు.

మానవులారా! మీ ప్రభువుకు భయపడండి.... అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి. (దివ్యఖుర్‌ఆన్–4 : 1)

اَلْقَرِيْبُ

35. అల్ ఖరీబ్

అల్లాహ్- అల్ ఖరీబ్ అంటే అతి సమీపంగా ఉండేవాడు అని అర్థం. పిలిచేవాని పిలుపును వింటానని, మన కంఠనాళానికన్నా సమీపంలో వున్నానని స్వయంగా అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో సెలవిచ్చాడు. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ గుణగణాల ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఒక గుణంతోపాటు మరో సద్గుణం మిళతమై వుంటుంది. ఉదాహరణకు రహ్మాన్- రహీం; సమీ-బసీర్. అల్లాహ్ లేని చోటంటూ ఎక్కడా లేదు. మన అవయవాల శక్తి కొంతమేర వరకే పనిచేస్తుంది. అలాగే మన గుణగణాలు కూడా. మన కంటితో కొంత దూరం మాత్రమే చూడగలం, కొంత పరిధిలోని శబ్దాన్ని మాత్రమే మనం వినగలం. అలాగే మనం ఒకరికి కొంతమేరకు, కొంత కాలం వరకే సహాయం చేయగలం; కొంత సమయం వరకే కరుణ చూపగలం. కాని అల్లాహ్ శక్తికి అంతం, మేర అంటూ లేదు. మన సంపదను దానం చేస్తే అది కరిగిపోతుంది. కాని అల్లాహ్ సంపదలో తరుగుదలే లేదు, ఆయన మనకు ఇస్తూనే వుంటాడు. పుట్టినప్పటి నుండి గిట్టే వరకు మనల్ని అన్ని విధాల పోషిస్తూనేవున్నాడు.

మనం మనసులో వేడుకున్నా, బిగ్గరగా ప్రార్థించినా ఆయన వింటాడు. పెద్దగా కేకలు, రంకెలు వేసి ప్రార్థిస్తేనే వింటాడని లేదు. మన ఆలోచనలు, తలంపులు సైతం ఆయనకు తెలుసు. ఆయన ఎంతో దూరంలో లేదు, మనకు అత్యంత సమీపంలోవున్నాడు. కాబట్టే మన ప్రతి మొర ఆలకించబడుతోంది. మన అక్కరలు, అవసరాలు తీర్చబడుతున్నాయి. అర్థిస్తేనే తప్ప మనం ఇతరుల అవసరాలు పూర్తి చేయము. అల్లాహ్‌ను అర్థించకపోయినా, ప్రార్థించకున్నా ఆయన మన. అవసరాలన్నింటినీ పూర్తి చేస్తున్నాడు. దీన్నిబట్టి ఆయన ఎంతటి

కరుణానుగ్రహాలు కలవాడో మనకు తెలుస్తోంది. ఈ ప్రపంచం, ఇందులో వున్న సమస్తమూ అల్లాహ్‌దే. ప్రతి క్షణం ఆయన ప్రసాదించిన వస్తువులతోనే మనం జీవనం గడుపుతున్నాం, ఆయన భూమిపైనే నడుస్తున్నాం, ఆయన ప్రసాదించిన గాలినే పీలుస్తున్నాము. అయినా ఆ స్వామిని గుర్తించలేక పోతున్నాం. ఆయన్ని వదలి సృష్టిలోని ప్రతి వస్తువుకూ మొక్కుతున్నాం. రాయి రప్పల్ని, చెట్టు పుట్టల్ని, జంతువుల్ని, చివరికి సాటి మనిషిని కూడా పూజిస్తున్నాడు మనిషి. కాని తన సృష్టికర్తను మాత్రం మరచిపోయాడు. ఇది ఎంతో ఘోరం, నేరం. తమ కళ్ళముందే తమ సంతానం తమ్ముకాదని, వేరొకర్ని నాన్న అని లేక అమ్మ అని పిలవటం, వారిని సేవించటం ఏ తల్లిదండ్రికి మింగుడుపడు తుంది. కని, పెంచిన తల్లిదండ్రుల్ని కాదని వేరొకరి పరిచర్యలు చెయ్యటంలో విజ్ఞతలేదు. అలాగే మనల్ని సృష్టించింది, పోషిస్తుంది అల్లాహ్ అని తెలిసి వేరొకర్ని పూజించటం అజ్ఞానం.

నా దాసులు నన్ను గురించి నిన్ను అడిగితే, నేను వారికి అత్యంత సమీపంలోనే వున్నాననీ, పిలిచే వాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను అనీ, ఓ ప్రవక్తా నీవు వారికి తెలుపు. కనుక వారు నా సందేశం విని దానిని స్వీకరించాలి. (దివ్య ఖుర్ఆన్: 2 : 186)

اَلْمُجِيْبُ

36. అల్ ముజీబ్

అల్ ముజీబ్ అంటే దాసుల మొరలను ఆలకించేవాడు, స్వీకరించేవాడు అని అర్థం. అల్లాహ్– అల్ ముజీబ్ మాత్రమే మన ప్రార్థనలను ఆలకించి వాటికి సమాధానం ఇచ్చేవాడు. ఆయన్ని వదలి ఇతరుల ముందు మొరపెట్టుకోవటం అర్థించడం కాలయాపన, నిరర్థకం తప్ప మరేమీ కాదు. ప్రతి రోజూ మనిషి ఎన్నో సమస్యల్లో, చిక్కుల్లో చిక్కి సతమతమవుతూ వుంటాడు. అలాంటి సమయాల్లో మనల్ని రక్షించేది ఆ అల్లాహ్‌యే కదా. ఆపదల్లో అల్లాహ్‌ను వేడుకుంటూ, ఆహ్లాదంలో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ వుండాలి. మన ఆందోళన భౌతికమయినదయినా, మానసికమయిన దయినా, ఆర్థికమయినదయినా లేక మరేదయినా కావచ్చు, నిర్మలమైన హృదయంతో మనం ప్రార్థిస్తే చాలు, ఆయన మన ఆమోదయోగ్యమైన ప్రతి కోరికను నెరవేరుస్తాడు. ఆపదల్లో, అవసరాల్లో మనల్ని ఆదుకున్నవాణ్ణే మనం నిజమైన స్నేహితునిగా భావిస్తాము. మరి మనం నిత్య జీవితంలో ఎన్నో ఆపదలకు గురి అవుతున్నాం, అప్పుడు వాటి నుండి గట్టెక్కించేదీ ఆ స్వామియే కదా, అలాగే ఎన్నో అవసరాలు కలుగుతూవుంటాయి, వాటిని తీర్చేది కూడా ఆ అల్లాహ్‌యే కదా. దీన్నిబట్టి చూస్తే మన జీవితంలోని అనుక్షణం మనం ఆయన మీదనే ఆధారపడి వున్నాం అని అర్థమవుతోంది. అలాంటి ఆధారభూతుడైన పరమోన్నత ప్రభువును వదలి, ఎలాంటి ఆధారంలేని సృష్టితాలకు మొక్కటం, మొరపెట్టుకోవటం ఎంతవరకు సబబో మీరే ఆలోచించండి?

పేదవానికి అల్లాహ్ ఎంతో సమీపంలో వుంటాడు. కాని ధనికులకు ఆయన దూరంగా వుంటాడు. ఎప్పుడైతే మనిషి వద్దకు సంపద చేరిపోతుందో

అల్లాహ్ ఆరాధనలో అలక్ష్యం చూపబడుతుంది. సంపద లేనప్పుడు వేళకు దైవారాధన చేసే మనిషే, సంపద కూడితే ఇక అతనికి అల్లాహ్ గుర్తుకురాడు. ఇక మనిషి శరీరం, మనస్సు సదా సంపద చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వుంటాయి. క్రమంగా ఎన్నో చెడులకు చేరువై నరకం పాలవుతాడు మనిషి. మన కళ్ళముందే ఇలాంటి సంఘటనల్ని మనం చూస్తూనే వుంటాం. అయినా మనం ధన దాహంతో పరితపిస్తూ వుంటాము. ధనాన్ని తన అదుపులో ఉంచుకున్నంత వరకు ఫరవాలేదు కాని, ధనమే మనిషిని అదుపులో పెట్టే పరిస్థితి దాపురిస్తే ఇక మనిషి గతి అధోగతికి దారితీయక తప్పదు.

ఏది ఏమైనా అందరి మొరలను ఆలకించి ఆదుకునేది ఆ అల్లాహ్ తప్ప మరెవ్వరూ లేరు. ఆయన మీద నమ్మకం పెట్టుకోవటంలోనే మనకు అన్ని విధాలా శ్రేయస్కరం.

అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. ఆయనే మిమ్మల్ని భూమి నుండి సృష్టించాడు. ఇక్కడ మీకు నివాసం ఏర్పాటు చేశాడు. కనుక మీరు ఆయనను క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలండి. నిశ్చయంగా నా ప్రభువు దగ్గరలోనే ఉన్నాడు. ఆయన ప్రార్థనలకు సమాధానం కూడా ఇస్తాడు. (దివ్య ఖుర్‌ఆన్-11 : 61)

اَلْوَاسِعُ

37. అల్ వాసి

అల్ వాసి అంటే అత్యంత ఉదార స్వభావుడు అని అర్థం. ప్రతి విషయంలో, ప్రతి ప్రాణి పట్ల అల్లాహ్ అత్యంత ఉదార స్వభావంతో మెలుగుతూనే వుంటాడు. అల్లాహ్ ఎప్పుడూ ఉదార స్వభావంతో మెలుగుతుంటే, మనిషి సదా 'ఉదర' స్వభావుడై ప్రవర్తిస్తుంటాడు. నిత్యం తన మేలు కోసం, 'వేల' కోసం పాటుపడుతూ వుంటాడు. పరుల కోసం పాటుపడేది బహు స్వల్పం. పైపెచ్చు పరులు ఇరుల్లో చిక్కుకుంటే పగలబడి నవ్వటం, పొరుగువారిని పురుగుల్లా చూడటం మనిషి స్వభావంగా మారింది.

భూమి, ఆకాశం ఎంతో విశాలంగా ఉన్నాయి. సూర్యుడు, చంద్రుడూ, నక్షత్రాలు, గ్రహాలు ఎంతో ఎత్తులో అలంకరించబడివున్నాయి. ఇవన్నీ మనిషి ఉపయోగం, మేలు కొరకే సృష్టించబడ్డాయి. ఇవి, అల్లాహ్ విశాలగుణాన్ని, విశిష్టతను చాటి చెబుతున్నాయి. ఇది మన కళ్ళకు కనిపించే సృష్టి. ఇంకా మన కళ్ళకు కనిపించని, మన మనోదృష్టికి అందని అల్లాహ్ సృష్టి ఎంతో ఉంది. కళ్ళకు కనిపించే సృష్టి అద్భుతాలనే కానలేని మనిషికి, కనిపించని అద్భుతాలను గురించి చెబితే ఒప్పుకుంటాడా? దీన్నిబట్టి మనిషి ఎంత సంకుచిత దృష్టి కలవాడో అర్థమవుతోంది. మనిషిని సృష్టించిన అల్లాహ్ అతన్ని ఇట్టే వదలిపెట్టలేదు. అతని కోసం సర్వసృష్టిని, సర్వ సదుపాయాలను, నీరు, గాలి, వెలుతురు, చీకటి ఒక్కటేమిటి? మనిషి కోసం ఏం చేయలేదు. అన్నిటికంటే మించి మనిషి ఈ ప్రపంచంలో ఎలా జీవితాన్ని గడపాలి, ఎవరిని పూజించాలి, ఎవర్ని పూజించకూడదు, దేని ప్రతిఫలం పరలోకంలో ఎలా పరిణమిస్తుందో

కూడా అల్లాహ్ ఆయన ప్రవక్తల ద్వారా, పవిత్ర గ్రంథాల ద్వారా తెలుపుతూనే వచ్చాడు. సౌర కుటుంబంలో ఏం జరుగుతుందో అనే ఆరా తప్ప తన సౌర కుటుంబంలో ఎలా నడుచుకోవాలో నేర్చుకోలేకపోతున్నాడు మనిషి.

ఆయన్నే ఆరాధించాలని మనిషికి తెలియజెప్పేందుకు అల్లాహ్ అనేకమంది ప్రవక్తల్ని పంపాడు, దివ్య గ్రంథాలనూ పంపాడు. ఈ పరంపరలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స), ఆఖరి గ్రంథం దివ్య ఖుర్ఆన్. ఇక ప్రళయం వరకూ మరో ప్రవక్తగాని, మరో దైవ గ్రంథంగాని ప్రభవించటం జరగదు. సర్వ మానవాళి ముక్తికి ప్రవక్త ముహమ్మద్ (స) మార్గమే శరణ్యం. మనిషికి లభించిన ఈ మార్గం కూడా అల్లాహ్ ఉదార గుణం మూలంగానే లభించింది. ఆయన క్షమాగుణం కూడా ఎంతో గొప్పది. చివరి శ్వాస వీడక ముందైనా మనిషి ఆయన వైపునకు మరలి రాకుండా ఉంటాడా అని అల్లాహ్ ఎంతో క్షమాగుణంతో, ఉదార స్వభావంతో ఎదురు చూస్తూనే వుంటాడు.

> **"మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని, అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ అత్యంత ఉదార స్వభావుడు, అన్నీ తెలిసిన వాడు. తాను కోరిన వారికి దివ్య జ్ఞానం ప్రసాదిస్తాడు."**
>
> **(దివ్య ఖుర్ఆన్- 2 : 268,269)**

اَلْحَكِيْمُ

38. అల్ హకీమ్

సర్వమూ తెలిసినవాడు అల్లాహ్‌యే. ప్రతి ప్రాణి అంతర్ బాహ్యాలను తెలిసినవాడు కాబట్టి అల్లాహ్- అల్ హకీమ్ అని పిలవబడుతున్నాడు. ఒక వస్తువును మనం బాహ్యాపరంగా చూడగలం. కాని దాని అంతర్ కోణం మనకు తెలియదు. ఒక వస్తువు లేక ఒక విషయం మనకు బాహ్యాపరంగా ఎంతో మంచిదనిపిస్తుంది. మనసుకు ఎంతో నచ్చుతుంది. కాని కాలక్రమేణా దాని దుష్ఫలితాలు మనకు తెలిసివస్తాయి. అలాగే మరొకటి చూడటానికి ఎంతో చెడుగా, పెద్దగా మనకు లాభం చేకూర్చేదిగా కనిపించదు. కాని క్రమేణా అదే మనకు మున్ముందు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చగలదు. మనిషి సదా పైపై మెరుగులకు, తాత్కాలిక లాభాలకే ఆకర్షితుడవుతాడు. శాశ్వత ప్రయోజనాన్ని, సత్ఫలితాలను చేకూర్చే వాటిపట్ల అలక్ష్యం చూపెడతాడు. ఇది మనిషి నైజం.

పరలోకంలో శాశ్వతంగా స్వర్గ సుఖాల్లో తేలియాడాలంటే ప్రపంచంలో ఎన్నో పరీక్షల్ని ఎదుర్కోవాలి, ఎంతో సహనం చూపాలి. అందుకే మహాప్రవక్త ముహమ్మద్ (స) ఒక ప్రవచనంలో అన్నారు: నరకం పూలతో కప్పబడి ఎంతో ఆకర్షవంతంగా తయారు చేయబడింది. అజ్ఞానం చేత మనిషి బాహ్యాకర్షణకు లోనై నిజమైన, సత్యమైన మార్గాన్ని కాదని తాత్కాలిక ప్రయోజనాల్ని పొందే వక్రమార్గాల్ని అవలంబిస్తున్నాడు. కాని రేపు పరలోకంలో ఎంతో పశ్చాత్తాపానికి గురవుతాడు. అలాగే స్వర్గం ముండ్లతో కప్పబడివుంది. అంటే కష్టాలతో కప్ప బడివుంది. చూస్తూ చూస్తూ ఎవరూ తన ఇష్టాన్ని కాదని కష్టాల్ని కోరుకోరు కదా! అందుకే అల్లాహ్ చూపిన సవ్యమైన, దివ్యమైన మార్గాన్ని అవలంబిం

చడానికి వెనకాడతారు. కాని వాస్తవానికి సరళీకృత మార్గం, ధర్మం ఇస్లాం మాత్రమే. ఈ మార్గానుసరణలోనే శాశ్వత స్వర్గసుఖాలున్నాయి. మనల్ని సృష్టించిన స్వామి మార్గానుసరణలోనే మన శాశ్వత శ్రేయస్సు ఇమిడివుంది.

మన నిజజీవితంలో ప్రతిరోజూ మనం ఎన్నో సంఘటనల్ని ఎదుర్కొంటూ వుంటాం. ఒక్కోసారి ఏది మంచో, మరేది చెడో నిర్ణయించుకోలేని సందిగ్ధావస్థలో పడిపోతాం. చూడటానికి బాగానే కనిపిస్తుంది ఒక వస్తువు, కాని దాన్ని ఉపయో గిస్తే గాని దాని అసలు రంగు మనకు తెలిసిరాదు. గాలానికి ఎరపెట్టి చేప కోసం నీటిలో వదులుతాము. తెలియని చేప ఎరకు ఆకర్షితురాలై మింగేస్తుంది. ఫలితంగా వేటగాని బుట్టలోపడి ప్రాణాలు వదిలేస్తుంది. అలాగే బాహ్యాకర్షణలకు లోనై చేపలాగా మోసపోవద్దని అల్లాహ్ ఆయన ప్రవక్తల ద్వారా, గ్రంథాల ద్వారా హెచ్చరిస్తూనే వున్నాడు మనిషిని. కాని చాలా కొద్దిమంది మాత్రమే సన్మార్గానికి వచ్చారని చివరి గ్రంథం ఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది.

గాలి, వెలుతురు, నీరులాగే అల్లాహ్ ధర్మం ఇస్లాం కూడా అందరిదీ. ఎవరు దీన్ని సొంతం చేసుకుంటారో ఉభయ లోకాల్లోనూ సఫలీకృతులౌతారు.

> **“నిశ్చయంగా అల్లాహ్ గొప్ప జ్ఞాని, గొప్ప వివేకి; తాను కోరిన వారిని తన కారుణ్యచ్ఛాయలోనికి తీసుకుంటాడు. దుర్మార్గుల కొరకు ఆయన అత్యంత బాధాకరమైన శిక్షను తయారు చేసి ఉంచాడు.”**
>
> **(దివ్యఖుర్ఆన్- 76 : 30,31)**

❀

اَلْوَدُوْدُ

39. అల్ వదూద్

అల్ వదూద్ అంటే అఖండమైన, అమితమైన ప్రేమగల వాడు. మానవ ప్రేమ పరిమితమైనది. క్షణక్షణానికి మారుతుంది. కాని అల్లాహ్ వల్ వదూద్ ప్రేమ ఎడతెగనిది, అంతం లేనిది. పుట్టుక మొదలు గిట్టే వరకు మనిషిపై అల్లాహ్ కారుణ్య వాత్సల్యాలు కురుస్తూనే వుంటాయి. చివరికి మరణించిన పిదప కూడా మనిషిపై అల్లాహ్ కారుణ్యం వర్షిస్తూనే వుంటుంది. భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు సంతానం మధ్య, సోదర సోదరీల మధ్య, మిత్రుల మధ్య బంధువుల మధ్య, సాటి మనిషి పట్ల, ప్రాణుల పట్ల వున్న ప్రేమ వాత్సల్యాలు వేరువేరుగా వుంటాయి. మనం ఎవరి పట్ల చూపాల్సిన ప్రేమను వారి పట్ల చూపుతూ వుంటాము. మనం చూపే ప్రేమలో స్వార్థం వుండవచ్చు, సంకుచితత్వం ఉండవచ్చు, కాలానుగుణ్యత వుండవచ్చు. కాని అల్లాహ్–అల్ వదూద్ మనపట్ల చూపే ప్రేమలో ఏ మాత్రం స్వార్థంలేదు, తారతమ్యత లేదు, ప్రాంతీయ భేదం లేదు, దేశకాల పరిస్థితుల తేడాలేదు – సర్వప్రాణుల పట్లా సమంగా ఆయన కారుణ్యాన్ని, ప్రేమను కురిపిస్తూనే వున్నాడు.

ఇంతగా మనల్ని ప్రేమిస్తున్న అల్లాహ్‌ను మనం ఏ మేరకు పూజిస్తున్నాం. ఆయన పట్ల మన భక్తిప్రపత్తులు ఎంతవరకున్నాయి. మన అవసరాలన్నీ ఆయనే తీరుస్తున్నాడు, కావలసిన వరాలనూ ఆ స్వామియే ఇస్తున్నాడు. మరి మనం అలాంటి నిజస్వామిని కొలుస్తున్నామా? ఆయన ప్రవక్త (స) ద్వారా పంపిన బాటలో మనం నడుస్తున్నామా? ఒక్కసారి ఆలోచించాలి. ఏ పని చేసినా మనిషి ఆలోచించే చేస్తాడు కదా! మరి ఈ ఆరాధన విషయంలో ఆలోచించ

లేదా? మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించారు: మనిషి పట్ల అల్లాహ్‌కు వున్న ప్రేమ తల్లి ప్రేమకన్నా 70 రెట్లు ఎక్కువ.

తమ సంతానం దొంగతనం చేసినా, దోపిడీ చేసినా, చివరికి ఒక మనిషిని హత్య చేసినా తల్లిదండ్రులు వారిని క్షమిస్తారు. ఎన్ని ఘోరాలు, నేరాలు చేసినా తమ సంతానాన్ని నిర్దోషులుగానే భావిస్తారు. వారిని ఇంకా వెనకేసుకు వస్తారు తల్లిదండ్రులు. వీరి పరిస్థితే ఇలా వుంటే 70 తల్లుల ప్రేమకన్నా అధిక ప్రేమను కలిగివున్న అల్లాహ్ మనిషి చేసిన తప్పుల్ని క్షమించడా? తప్పకుండా క్షమిస్తాడు. కాకపోతే మనిషి చేయవలసిందల్లా ఒక్కటే అదే పశ్చాత్తాపం చెందటం. ఎవరయితే తమ తప్పుల పట్ల పశ్చాత్తాపం చెంది, తమ నడవడికను తీర్చుదిద్దుకుంటారో వారిని క్షమిస్తానని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో అనేకమార్లు సెలవిచ్చాడు. కాని మనిషే ఇంకా మగతకు, మంకుపట్టుకు గురై ప్రమత్తతలో పడివున్నాడు. శ్వాస వున్నంతవరకే ఈ అవకాశం వుంటుంది. ప్రాణం పోయిన తదుపరి ఇక వున్నది తీర్పు దినమే. ఇకనైనా మన తప్పుని తెలుసుకొని పశ్చాత్తాపపడి, ఒకే ఒక్క స్వామి అయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించడం సర్వదా శ్రేయస్కరం.

"నిశ్చయంగా నీ ప్రభువు పట్టు బహుగట్టిది. ఆయనే మొదటిసారి పుట్టించాడు, మళ్ళీ ఆయనే రెండోసారి పుట్టిస్తాడు. ఆయన క్షమించేవాడు, ప్రేమించేవాడు, అధికార పీఠాధిపతి, మహిమాన్వితుడు."

(దివ్యఖుర్‌ఆన్ 85 : 12-14)

اَلْمَجِيْدُ

40. అల్ మజీద్

ఘనమైన గౌరవోన్నతులు, సర్వశ్రేష్ట గుణోన్నతుడు కాబట్టే అల్లాహ్-అల్ మజీద్ అని పిలువబడుతున్నాడు. ప్రతి విషయంలో, ప్రతి కోణంలో ఆయనే అందరికన్నా అధికుడు - అది శక్తియుక్తులలో, బలాధ్యితలో, ప్రేమా వాత్సల్యాల్లో, క్షమాగుణంలో, సృజన శక్తిలో - ఏ దృష్టితో చూసినా సరే ఈ విశ్వసృష్టికర్త అయిన అల్లాహ్-అల్ మజీద్ మాత్రమే ఘనతగలవాడు. ఆయన మాత్రమే మన ఆరాధనకు, పూజకు, అర్హుడు. ఆయన్ని వదలి మరిదేన్ని ఆరాధించినా అది వ్యధా ప్రయాస, చివరికి అడియాసగానే మిగులుతుంది. పరమ కృపాశీలుడైన ఆ స్వామి మన పట్ల ఎంతో వాత్సల్యంతో అనేక మంది ప్రవక్తల్ని పంపాడు. ప్రవక్తల పరంపరలో చిట్టచివరి వారే ప్రవక్తాగ్రేసరులైన ముహమ్మద్ (స). వారి (స) ద్వారానే మనకు సత్యమార్గం ఇస్లాం, దివ్యగ్రంథం ఖుర్ఆన్ ప్రాప్తమయ్యాయి. ఈ మార్గం ద్వారానే మనకు ఇహలోకంలో శాంతి, పరలోకంలో స్వర్గసౌఖ్యాలు సంప్రాప్తమవుతాయి. ఈ ప్రపంచంలో ఎంతో మంది విశ్వాసులున్నారు. మరెంతో మంది అవిశ్వాసులూ వున్నారు. మరి కొంతమంది మనకంటే హీనమైన సృష్టిరాశుల్ని పట్టి పూజిస్తున్నారు, ఇంకా కొందరు ప్రవక్తల్ని పూజించే వారూ వున్నారు. ప్రవక్తలూ మానవులన్న సంగతి వారు మరిచిపోయారు. పుట్టి గిట్టేవారు పూజకు, ఆరాధనకు అర్హులెలా అవుతారు. పుట్టించి, పాలించేవాడే మన ఆరాధనకు అర్హుడు.

మనిషి ఎంతటి ప్రతిభాపాటవాలు కలవాడైనా మరెంతటి యుక్తిపరుడైనా అతను సృష్టిలోని ఒక జీవి మాత్రమే. అతను ఈ విశ్వవీణాతంత్రులను తన

గోటితో మీటి ఎన్ని అద్భుతాలను సృష్టించినా అతను బుద్బుధప్రాయుడే. చూస్తుండగానే బాల్యం నుంచి కౌమారం, కౌమారం నుంచి యవ్వనం, యవ్వనం నుంచి ముసలితనం ఆపై మరణం చకాచకా సంభవిస్తాయి. సృష్టి ఆరంభం నుండి ఈ ప్రక్రియ సాగుతూనే వుంది. ప్రమతత్తకులోనైన మనిషిని అప్రమత్తుణ్ణి చేయటానికి, సవ్యమైన మార్గంలోకి తీసుకురావటానికి పరమోన్నత ప్రభువైన అల్లాహ్ అనేక మంది ప్రవక్తల్నీ, గ్రంథాలను పంపాడు. ఎన్నో జాతులు, తెగలు ఈ పుడమిపై పుట్టి గిట్టాయి. కాల గర్భంలో కలిసిపోయాయి. మనమూ ఓనాడు ఇట్టే మట్టిలో మిళితమైపోయే వారమే. ఎవరు ప్రవక్త (స) మార్గానుసారం తమ నడవడిని సరిదిద్దుకుంటారో మరెవరు అల్లాహ్ చూపిన మార్గాన పయనిస్తారో అట్టి వారి భవిష్యత్తు మాత్రమే అన్ని విధాల సఫలీకృతమవుతుంది. ఆనాడు ఆయా ప్రవక్తల సముదాయాలు ప్రవక్తల మాటను పెడచెవిన పెడితే ఏ దుష్పరిణామాల్ని ఎదుర్కొన్నారో సవివరంగా దివ్యఖుర్ఆన్‌లో తెలుపబడింది. మనిషికి గుణపాఠం గరిపే ఎన్నో గాథలు వివరించబడ్డాయి ఈ గ్రంథంలో. చివరి ప్రవక్త ముహమ్మద్ (స) కూడా మనకు హితబోధ లెన్నో చేశారు. వాటి ప్రకారం ఆచరించి కూడా చూపాడు. మరి ఆ మార్గమేదో ఆరాతీసి, ఆరాధనకు ఎవరు అర్హులో తెలుసుకోవటంలోనే విజ్ఞత వుంది.

అల్లాహ్ కారుణ్యమూ, ఆయన శుభాశీస్సులూ మీపై ఉన్నాయి. నిశ్చయంగా అల్లాహ్ స్తోత్రానికి ఎంతో అర్హుడూ, మహాఘనత కలవాడూ." (దివ్యఖుర్ఆన్ 11 : 73)

اَلشَّهِيْدُ

41. అష్ షహీద్

అల్లాహ్ - అష్ షహీద్ అంటే ప్రతిదానికి సాక్ష్యంగా ఉండేవాడు. ప్రతి చోటునీ, ప్రతి ప్రాణినీ ఆయన గమనిస్తూనే ఉన్నాడు. ఒక సంఘటన జరిగినప్పుడు దానికి సాక్షులెవరనీ మనం మన నిత్య జీవితంలో అడుగుతూ ఉంటాం. న్యాయస్థానాల్లో కూడా సాక్ష్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. మనిషి డబ్బుకు ఆశపడి, లేక నిజం చెబితే ఎదుటివారు తనను హతమారుస్తామని బెదిరించటం వల్లనో సాక్ష్యాన్ని కిందా మీదా చేయొచ్చు. దాని ఆధారంగా మనం న్యాయస్థానంలో ఓ కేసును సునాయాసంగా గెలువవచ్చు. దీనివలన దోషులు నిర్దోషులుగా నిరూపించబడతారు. ఇదే నేడు ఎక్కువగా జరుగుతోంది. ఒక నిజాన్ని అంటే సాక్ష్యాన్ని తల్లక్రిందులు చేయగలం ఈ లోకంలో. కాని పరలోకంలో అంతా బయటపడుతుంది. తీర్పు దినాన స్వయంగా తన అవయవాలే మనిషికి వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతాయి. తనకున్న బలంచేత మనిషి ఈ లోకంలో తన తప్పిదాలను ఒప్పిదాలుగా మార్చి ఈ లోకానికి చూపించవచ్చు. దానికి పత్రికలూ, ప్రసారమాధ్యమాలూ వంతపాడవచ్చు. అంత మాత్రాన అది నిజం అవుతుందా? అది ఎన్నటికీ కాదు. ప్రాపంచిక ప్రయోజనాలకు, ప్రలోభాలకు గురైన వ్యక్తులు, పత్రికలు ప్రసార మాధ్యమాలు, చివరికి ప్రభుత్వాలు కూడా ఈ సాక్ష్యాన్ని, నిజాన్ని నొక్కేస్తున్నాయి. అన్యాయానికి ఎదురు తిరిగిన వారిని ఉగ్రవాదులని చిత్రీకరించి ప్రజల్లో ప్రచారం చేసి తమ పబ్బం గడుపుకుంటున్నారు.

సమాజంలో బలహీనుడే ఎప్పుడూ బలవంతుల దౌర్జన్యాలకు బలవుతున్నాడు. అతను నిజం చెప్పినా ఈ సమాజం నమ్మదు అనాదిగా జరుగుతున్న

అన్యాయమే ఇది. నిజం నిష్ఠూరంగానే ఉంటుంది. అలాగే సత్యం ఎప్పుడూ చేదుగానే ఉంటుంది. పెద్దవాళ్ళు పేదలపైనే తమ ఆగ్రహాన్ని, కోపాన్ని వ్యక్తం చేయగలరు. ఇదంతా ఈ లోకంలో చెలామణి అవగలదు. కాని పరలోకంలో ఈ దౌర్జన్యాలు సాగవు. అల్లాహ్‌ను వదలి తాము పూజించిన విగ్రహాలు కూడా ఆనాడు నరకానికి ఇంధనంగా మారక తప్పదు. మిథ్యావాదులు, వాదాలు మటుమాయమయ్యే తీర్పుదినం తప్పక రాబోతోంది. వారి ఆటలు కట్టించి నరకంలో పడవేసే సమయం తప్పక వస్తుంది. ఆ రోజు సత్యం, అసత్యంపై ఆధిపత్యం వహిస్తుంది. సర్వలోకాల సృష్టికర్త అయిన అల్లాహ్‌ను నమ్ము కున్నవారు, అల్లాహ్ వచనాలకు ఈ లోకంలో సాక్షులుగా వున్నవారు పరలోకంలో శాశ్వత స్వర్గసౌఖ్యాలలో తేలియాడతారు.

విశ్వసించినవారు, యూదులుగా మారినవారు, సాబియీలు, క్రైస్తవులు, మజూసీలు (అగ్ని పూజారులు) షిర్క్ చేసినవారు - వారందరిని గురించి అల్లాహ్ ప్రళయం నాడు తీర్పు చెబుతాడు.

(దివ్యఖుర్ఆన్ 22 : 17)

❋

اَلْحَقُّ
42. అల్ హఖ్

అల్‌హఖ్ అంటే నిజమైన ఉనికి గలవాడు, విశ్వసింపదగినాడు అని అర్థం. ఒక మనిషి అల్లాహ్ లేడన్న మాత్రన ఆయన ఉనికికి ఎలాంటి కొరతా ఏర్పడదు. అల్లాహ్‌ను విశ్వసించని వారు కూడా ఆయన దయతోనే ఈ లోకంలో జన్మించారు, పోషించబడతున్నారు, సర్వసదుపాయాలూ పొందుతున్నారు. అయినా అల్లాహ్ ఉనికి పట్ల, నిత్యత, సత్యత పట్ల వారికి ఏ మాత్రం విశ్వాసం లేదు. అంత మాత్రాన అల్లాహ్‌కు వున్న ఉనికికి ఎలాంటి ముప్పూ, కొరతా వాటిల్లదు. కేవలం అల్లాహ్‌ను విశ్వసిస్తే చాలు- ఇక ఆయన పంపిన ధర్మం ఇస్లాం సత్యమని, ఆయన పంపిన ప్రవక్తలు సత్యమని, వారి ద్వారా మనకు లభించిన గ్రంథాలూ సత్యమని, అసలు ఈ ప్రపంచ ఉనికే సత్యమనే ఇరుసును ఆధారంగా చేసుకొని పరిభ్రమిస్తుందని నమ్ముతాడు ప్రతి మనిషి. న్యాయ స్థానంలో ఒక న్యాయమూర్తి కూడా తన వద్దకు వచ్చిన ఓ కేసులో ఇద్దరు న్యాయవాదుల వాదప్రతివాదాలూ వింటాడు. కాని సత్యం, నిజం ఎటుంటే అటే తన తీర్పును వెలువరించి దోషికి శిక్షపడేలా చేస్తాడు. ఇక్కడ కూడా 'సత్యం' ఆధారంగానే నిర్ణయం గైకొనబడిందన్నమాట. అలాగే జీవితంలోని ఏ అంశంలోనైనా సత్యమే ఆధారంగా అదే అన్నిటికి ఆయువుపట్టు.

అల్లాహ్ సత్యం, ఆయన పంపిన ధర్మం ఇస్లాం, ఆయన చివరి ప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధించి ఆచరించిన మార్గమూ సత్యమైనదే. ఇక ఏది మంచి, ఏది చెడు అనేది నిర్ణయించుకోవటం మనిషి విచక్షణా జ్ఞానానికి వదలివేయబడింది. మిథ్యావాదాల్ని పట్టుకొని తన విచక్షణని కోల్పోతాడో,

సత్య మార్గాన్ని అవలంబించి స్వర్గాన్ని పొందుతాడో అది మనిషి నిర్ణయానికే వదలివేయబడింది. సత్యాన్ని తిరస్కరించిన ప్రతివాడూ షైతాన్‌కు చేరువవు తున్నాడు, మనిషిని షైతాన్ ఎన్నో ఆకర్షణలకు గురిచేసి తన ఉచ్చులో బిగిస్తున్నాడు. అల్లాహ్ మార్గం – ఇస్లాం తప్ప – అన్ని మార్గాలూ సత్యమని ప్రబోధిస్తూ ఉంటాడు. చివరికి మనిషిని నరకంపాలు చేసి సంతోషించాలని చూస్తున్నాడు షైతాన్. అతని మోసానికి గురైన ప్రతి మనిషీ ముందు తన విచక్షణని కోల్పోతాడు. ఆపై తనకంటే ఈ సృష్టిరాశిలోని హీనాతిహీనమైన వాటినీ పూజించడం మొదలెడతాడు. ఆలోచించే మనస్సే మొద్దుబారితే ఇక మనిషి షైతాన్‌కు బానిస అయిపోతాడు. ఒక్క అల్లాహ్‌ను తప్ప అన్నిటికీ మొక్కుతాడు.

దారితప్పి చీకటి మార్గాల్లో తచ్చాడే మనిషికి సరిఅయిన మార్గం చూపటానికి అల్లాహ్ ప్రతికాలంలో ప్రవక్తల్ని పంపుతూనే వచ్చాడు. ఈ పరంపరలో చిట్టచివరి వారు ముహమ్మద్ ప్రవక్త (స). సత్యమార్గం, సవ్యమార్గం ఇస్లాంలోనే ఆయన (స) బోధించారు. సత్య మార్గాన్ని ఆశ్రయించి అల్లాహ్ ఆశ్రయంలో, ఆశ్రమంలో చేరటమే మనకు సదా శ్రేయోదాయకం.

ఆయన ఉనికి యదార్థం (సత్యం)తో కూడుకున్నది. వీరు అల్లాహ్‌ను కాదని పిలుస్తున్నవన్నీ అసత్యంతో కూడుకున్నవి. ఇంకా అల్లాహ్ మాత్రమే ఉన్నతుడు, మహనీయుడు. (దివ్యఖుర్ఆన్ 31 : 30)

اَلْوَكِيْلُ

43. అల్ వకీల్

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆనాడు మక్కా ఖురైషీయులకు ఇస్లాం సందేశాన్ని వినిపించే సమయంలో వారు 300 పైచిలుకు రాతి విగ్రహాలను పూజిస్తూ వుండేవారు. ఆ విగ్రహాల్లో దేవీ దేవతల విగ్రహాలుండేవి. సంపద కొరకు, సంతానం కొరకు ఇంకా మరెన్నో కోరికలు తీర్చుకోవటానికి వారు ఆ విగ్రహాలు చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. అంతేకాదు చనిపోయాక తమను స్వర్గంలో ప్రవేశింపజేయడానికి అల్లాహ్‌కు సిఫారసు చేయమని కూడా ఆ విగ్రహాలను వేడుకునేవారు. ప్రవక్త (స)ను వారు ఎన్నో విధాల నచ్చజెప్పుతూ, తమ మతంలో చేరి గ్రహాలను ఆరాధించమని విన్నవించేవారు. వారి ధర్మంలో చేరితో తమ నాయకునిగా చేసుకుంటామని, మరెన్నో విధాల హోదాలను కల్పిస్తామని ప్రవక్త (స)ను ఆశపెట్టే వారు నాటి ఖురైషీయులు. కాని ప్రవక్త (స) మాత్రం అల్లాహ్ ఒక్కడే అని, ఆయనే ఆరాధనకు అర్హుడని, ఆయన్ను మాత్రమే ఆరాధించాలని లేకపోతే నరకజ్వాలలకు ఆహుతి కావల్సి వస్తుందని ఎన్నో విధాల ఖురైషీయులకు ప్రబోధించేవారు. కాని విగ్రహారాధనలో కూరుకుపోయి నానా చెడులకు అలవాటు పడిన వారికి ప్రవక్త (స) ప్రబోధం చెవికెక్కేది కాదు. ఫలితంగా ప్రవక్త (స) పట్ల వారు శత్రుత్వం పెంచుకోసాగారు. చివరికి ప్రవక్త (స) ఖురైషీయులకు మీ ధర్మం మీది, నా ధర్మం నాది; మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించను, నేను ఆరాధించే శక్తిని మీరు పూజించే వారు కాదు అని సెలవిచ్చారు.

అల్ వకీల్ అంటే దాసుల పనులు పూర్తి చేసేవాడు అని అర్థం. మనిషి తాను తలపెట్టిన కార్యం నెరవేరకపోతే తలపట్టుకు కూర్చుంటాడు. నిరాశా

నిస్పృహలకు లోనై విరక్తి చెందుతాడు. అలాంటి సందర్భంలోనైనా మనిషిని ఆదుకునేది, అతని మొరను ఆలకించి గట్టెంకించేది కూడా కేవలం ఆ అల్లాహ్-అల్ వకీల్ మాత్రమే. ఏ పని ప్రారంభించాలన్నా ఆయన శుభనామంతో ప్రారంభిస్తే సర్వ విఘ్నాలూ తొలిగి కార్యసిద్ధి చేకూరగలదు. మనమేది చేయలన్నా ఆయన సహాయం మనకు సదా అవసరమే. అల్లాహ్ సహాయ సహకారాలు లేనిదే మనం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేము. అలాంటి సహాయకుణ్ణి వదలి నిస్సహాయులైన సృష్టితాలను పట్టి పూజించడం, వాటి ముందు మోకరిల్లడం, మొక్కుకోవటం వట్టి భ్రమ తప్ప మరేమీ కాదు. కళ్ళుండీ మనం కానలేని గ్రుడ్డివాళ్ళతో సమానమవుతున్నాం. కళ్ళులేని గ్రుడ్డివాడు తచ్చాడు తున్నట్లు, మనిషి జ్ఞాని అయివుండి కూడా అజ్ఞాన తిమిరంలో పరిభ్రవిస్తున్నాడు. అసలైన తన సృష్టికర్తను, ఆరాధ్యుడ్ని, సహాయకుణ్ణి వదలి హీనమైన సృష్టితాలకు మొక్కి నరకానికి చేరవవుతున్నాడు.

మాకు అల్లాహ్ చాలు. ఆయనే శ్రేష్టుడైన కార్యసాధకుడు.

(దివ్యఖుర్ఆన్ 3 : 173)

ప్రతి వస్తువునూ సృష్టించిన వాడు అల్లాహ్‌యే. ప్రతి వస్తువునకూ సంరక్షకుడు కూడ ఆయనే. భూమిలో, ఆకాశాలలో ఉన్న నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. అల్లాహ్ వాక్యాలను తిరస్కరించే వారే నష్టానికి గురిఅయ్యేవారు.

(దివ్యఖుర్ఆన్ 39: : 62, 63)

❋

اَلْقَوِيُّ

44. అల్ ఖవి

ఖవి అంటే అత్యంత శక్తిసామర్థ్యాలు కలవాడు. ఆ శక్తి శారీరకమైనది, భౌతికమైనది, మానసికం, మేధాపరమైనది లేక ఆధ్యాత్మికమైనదైనా కావచ్చు. అన్ని విధాలా అల్లాహ్ – అల్ ఖవి మాత్రమే అందరికంటే అధిక శక్తిసామర్థ్యాలు కలవాడు. మనిషి జీవితమే క్షణభంగురం, అందులో అతని శక్తి ఏ పాటిది? మనిషికి కూడా అల్లాహ్ ప్రతి విషయంలోనూ కొంత వరకు శక్తి సామర్థ్యాలను- అవి శారీరకం, మానసికం లేక ఆధ్యాత్మికమైనవయినా - ప్రసాదించాడు. యౌవనంలో వున్న శారీరక శక్తి కొన్నేళ్ళ వరకే ఉండి, ఆపై అది సన్నగిల్లి పోతుంది, అలాగే కొంతకాలం వరకే మేధాశక్తి ఉంటుంది. ముసలితనం ఆవరిస్తే అన్నీ మరచిపోతాడు మనిషి. కాబట్టి మనిషికి ఏ శక్తి సామర్థ్యాలిచ్చినా అల్లాహ్ వాటికి పరిమితులుంచాడు. ఇన్ని పరిమితులున్నప్పటికీ మనిషి మితిమీరి ప్రవర్తిస్తుంటాడు. తనకు ఎదురే లేదన్నట్లు. ఇక అపరిమితులైన శక్తి సామర్థ్యాలుంటే ఇంకేం చేస్తాడో ఆలోచించండి.

అసలు ఏ శక్తి కావాలన్నా మనం అల్లాహ్‌పైనే ఆధారపడాలి. శారీరక శక్తి కావాలంటే ఆయన ప్రసాదించిన ఆహార పదార్థాల్ని ఆరగిస్తే తప్ప ఆ శక్తి మనకు రాదు. అలాగే మానసిక శక్తికి, ఆధ్యాత్మిక శక్తికి మనం ఆయనపైన్నే ఆధారపడాలి. మనకు ఈ వాస్తవం తెలిసినా, తెలియకపోయినా మనమంతా ఆ మహాశక్తిమంతుడైన అల్లాహ్‌పైనే ఆధారపడి బ్రతుకుతున్నాం. ఆయన ఆధారం మనకు ఒక్క క్షణం లేకున్నా ఇక ఒక్క అడుగు కూడా మనం ముందుకు వేయలేం. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్ళాలంటే కాలినడకన

వెళ్తాం లేదా వాహనంపై వెళ్తాం. మన కాళ్ళకు లేదా వాహనానికి శక్తిని ప్రసాదించింది ఆ అల్లాహ్‌యే కదా. ప్రపంచంలో నేటి ప్రతిభా పాటవాలకు, అభివృద్ధికి కావలసిన శక్తియుక్తులను మనకు ప్రసాదించింది అల్లాహ్‌యే కదా. అలాంటి శక్తిమంతుణ్ణి వదిలేసి ఏమీ సృష్టించలేని, ఎలాంటి శక్తీలేని జీవనిర్జీవాలను కొలవటం, పిలవటంలో అర్థం ఉందా? ఒకే దైవాన్ని ఆరాధించనీయకుండా మనుషుల్ని వర్గాలుగా, తెగలుగా, జాతులుగా చీల్చి హీనమైన వాటిని పూజించేందుకు ప్రేరణ కల్పిస్తున్న షైతాన్‌తో పోరాడే శక్తిని మనందరికీ ప్రసాదించాలని వేడుకుందాం. మనిషి మరో మనిషికి శత్రువు కాదు. మనుషుల్ని విడదీసి సన్మార్గంపై రాకుండా చేస్తున్న మన ఉమ్మడి శత్రువు షైతాన్ మాత్రమే. మనమంతా కలిసి వాడి ఆట కట్టిస్తే అంతా ప్రశాంతతే ఏర్పడుతుంది.

అల్లాహ్ తన దాసుల పట్ల ఎంతో దయ కలవాడు; తాను ఎవరికి ఏది ఇవ్వాలని కోరుకుంటాడో, అది వారికి ఇస్తాడు. ఆయన ఎంతో బలవంతుడు, ఎంతో శక్తిమంతుడూను.

(దివ్యఖుర్ఆన్ 42 : 19)

❋

اَلْمَتِيْنُ

45. అల్ మతీన్

మతీన్ అంటే బలశాలి, పరిపూర్ణమైన శక్తిమంతుడు అని అర్థం. ఇంతకుముందు ప్రస్తావించిన 'ఖవి' అనే నామానికి ఇది పర్యాయపదమే. అయితే రెంటిలో తేడా ఉంది. మనశక్తి ఒకటి రెండుసార్లు ఉపయోగిస్తేనే సన్నగిల్లిపోతుంది. మళ్ళీ ఉపయోగించాలంటే ఆ శక్తి సముపార్జనకు ఎంతో కొంత ఆహారాన్ని మనం సేవించాల్సి ఉంటుంది. కాని అల్లాహ్ – అల్ మతీన్ శక్తి అంతంలేనిది. దానికి విచ్ఛిన్నత లేదు, అంతమూ లేదు. శాశ్వత శక్తి, సర్వకాలాల్లో సజీవంగా ఉండే శక్తి ఒక్క అల్లాహ్‌కే ఉంది. మనిషి చేసే సహాయమైనా, దానమైనా కొంత మేరకే. కాని అల్లాహ్ సహాయానికి, దాతృత్వా నికి మేరలేదు. ప్రపంచంలోని చరాచరాలన్నీ ఆయన మీదనే ఆధారపడి వున్నాయి. సమస్త ప్రాణికోటికంతటికీ ఆయనే జీవితాన్ని, జీవికను ప్రసాది స్తున్నాడు. ప్రళయం వరకు, ప్రళయం తరువాత కూడా మనిషి ఆయన దయపై, క్షమాభిక్షపై ఆధారపడాలి. అలాంటి సృష్టికర్త, స్వామి, దయామయుడైన అల్లాహ్‌ను వదలి మరొకర్ని పూజించడం ఘోరం నేరం అవుతుంది.

మనకంటే కొంచెం శక్తిలో, యుక్తిలో ఆధిక్యత కలిగిన ప్రతి సృష్టితాన్నీ పట్టి పూజించడం అడుగడుగునా అడ్డంకుల్ని, అవరోధాల్ని సృష్టించుకోవడమే అవుతుంది. ఇలా చేయడం వలన మనుషులు ఎన్నో వర్గాలుగా చీలి ముక్కలుగా మారిపోతారు. ఒక్కటేయ్యే మార్గమేదో దొరకదు. ప్రపంచ ప్రజలు వసుధైక కుటుంబంలా మారాలంటే అందరి సృష్టికర్త అయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. ప్రపంచ మానవాళి మొత్తానికి మూలం ఆదం(అ), హవ్వా

(అ)లే. ఈ విధంగా ప్రజలంతా పరస్పరం సోదరులే. ఒక్కో మనిషికి ఒక్కో నేర్పు, ప్రత్యేకతను ప్రసాదించాడు అల్లాహ్. అన్ని ప్రత్యేకతలు ఏకమైతేనే ప్రపంచంలో పరిపూర్ణత ఏర్పడింది. మన దేహాన్నే పరికించి చూడండి మనసుతో ఆలోచిస్తాం, చేతులతో పని చేస్తాం, కాళ్ళతో నడుస్తాం ఇలా ఏ అవయవం పని ఆ అవయవం చేస్తుంది. దేని ప్రత్యేకత దానిదే అన్నీ కలిస్తేనే మనిషికి సంపూర్ణత చేకూరింది. మన అవయవాల్లో ఏ ఒక్క అవయవం స్తంభించినా దాని ప్రభావం వేరే అవయవాలపై పడుతుంది.

అలాగే అన్ని పనులూ ఒక్కరే చేయలేరు. ఒకరు వైద్యంలో, మరొకరు ఇంజనీరింగ్‌లో, ఇలా ఒక్కొక్కరు ఒక్కో రంగంలో నైపుణ్యాన్ని సంపాదిస్తారు. అన్ని రంగాలు కలిస్తేనే ప్రపంచంలో పరిపూర్ణత ఏర్పడింది. ఈ విధంగా ఒక మనిషి మరో మనిషిపై ఆధారపడి జీవించే ఏర్పాటును ఆ సృష్టికర్తే చేశాడు. ఇలాగైనా అందరూ కలిసిమెలిసి జీవిస్తారని, ఒకరినొకరు అర్థం చేసుకుంటారని ఆ పరమోన్నత ప్రభువు ఓ ప్రణాళికను రూపొందించాడు. అన్ని శక్తులు, యుక్తులు కలిగిన ఆ అల్లాహ్‌ను పూజించడంలోనే మనకు ముక్తి, మోక్షాలు లభిస్తాయి.

నిస్సందేహంగా అల్లాహ్ పుష్కలంగా ఉపాధినిచ్చువాడు. బలశాలి, పటిష్టమయినవాడు, అత్యంత దృఢమయినవాడూను.

(దివ్యఖుర్‌ఆన్ 51 : 58)

الولِيُّ

46. అల్ వలీ

ఆహారాన్ని, ఆశ్రయాన్ని ఇచ్చి అనుక్షణం మనల్ని కాపాడుతున్నాడు కాబట్టి అల్లాహ్ అల్ వలీ అని పిలువబడుతున్నాడు. దాసులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించటమే కాకుండా వారిని అన్ని సమయాల్లోనూ సంరక్షిస్తూ ఉంటాడు అల్లాహ్. అందుకనే ఆయన్ని మనం వలీ (సంరక్షకుడు) అని పిలుస్తున్నాం. పుట్టించి, పోషిస్తూ నిత్యం రక్షిస్తున్న స్వామిని వదలి తనతోటి మానవుల్ని, ఇతర సృష్టితాలను ఇంకా ప్రవక్తల్ని, సమాధుల్ని కొలవడం ఎంతో ఘోరమైన నేరం. మన ప్రతి చిన్న అవసరాన్ని కూడా అల్లాహ్‌యే నెరవేరుస్తున్నాడు. గాలి, నీరు, వెలుతురు అన్ని ఆయన ప్రసాదించినవేగా. ఒక్కక్షణం ఊపిరాడకపోతే మనం ఎంతగా తల్లిడిల్లిపోతామో అందరికీ తెలిసిన విషయమే. అలాగే నీటి విలువ కూడా ఎంతో ఉంది. ఆకాశం నుంచి నీరు కురువకున్నా, భూమిలో నీరు లభించకున్నా మనకు ఆహారం దొరికే అవకాశమే లేదు. వివిధ రకాలైన పంటలు పండటానికి నీటి అవసరం ఎంతో ఉంది. మరి ఆకాశం నుండి నీరు కురిపించి అన్ని పంటలు పండించి మనకు ఆహారం ప్రసాదించేది కూడా అల్లాహ్‌యే కదా. మనిషి దీనికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాడా?

మనం ఒక మనిషిని నౌకరుగా నియమించుకుని అతనికి జీతభత్యాలేగాక, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తాము. మనం కల్పించిన సౌకర్యాలతో బ్రతుకుతున్న నౌకరు మన పని చేయకుండా ఇతరుల పని చేస్తూ, ఇతరుల్ని గౌరవిస్తూ, ఆదరిస్తూ ఉంటే మనం ఊరుకుంటామా? ముమ్మాటికీ ఒప్పుకోం.

వెంటనే అతన్ని పని నుండి తొలగిస్తాం. మరి మనల్ని సృష్టించి, పోషిస్తూ సకల సదుపాయాలు కల్పించటమే కాకుండా నిత్యం మనల్ని ప్రతి ఆపద నుండి సంరక్షిస్తున్నాడు ఆ సకల లోకాల స్వామి. మరి అతని పట్ల మనం ఎంతగా కృతజ్ఞతలు తెలుపుకోవాలి అనే విషయాన్ని ఆలోచించాలి. ఈ లోకంలోనే కాదు, మరణించాక కూడా మనకు స్వర్గంలో సకల సౌకర్యాల్ని కల్పిం చేవాడు కూడా ఆ అల్లాహ్‌యే. అలాంటి స్వామిని వదిలేసి మరొకర్ని ఆరాధ్య దైవంగా కొలవడం, అవసరాలు తీర్చమని వేడుకోవడం, వారిపై భరోసా పెట్టుకోవడంలో ఎంత విజ్ఞత ఉందో ఆలోచించండి.

మనిషి తప్ప ప్రాణులన్నీ అల్లాహ్‌నే వేడుకుంటూ ఆయన్నే కీర్తిస్తున్నాయి. జ్ఞానమున్న మనిషి నిత్యం ఆయన సొమ్మును ఆరగిస్తూ తనకంటే హీనమైన, నీచమైన వాటిని కొలుస్తున్నాడు. అతని విజ్ఞత, జ్ఞానం ఏమయ్యాయో! ఇక్కడే కాదు, అక్కడ (పరలోకంలో) మరెక్కడైనా మనకు రక్షకుడు (వలీ) ఆ అల్లాహ్‌యే.

సంరక్షకుడు ఒక్క అల్లాహ్ మాత్రమే. ఆయనే మృతులను బ్రతికిస్తాడు. ఆయన ప్రతి దానిపై అధికారం కలవాడు.

(దివ్యఖుర్‌ఆన్ 42 : 9)

اَلْحَمِيْدُ
47. అల్ హమీద్

అల్లాహ్– అల్ హమీద్ అంటే స్తుతింప దగినవాడు, పొగడ్తలకు అర్హుడు. సాధారణంగా మనిషి తనకంటే గొప్పవాళ్ళనో లేక తన పనులు నెరవేర్చు కోవటానికో మరొకర్ని పొగుడ్తూ వుంటాడు. తను పొగిడినవాళ్ళనే, మరుక్షణంలో తెగడటం కూడా మనిషి నైజమే. పుట్టించి, పోషిస్తూ మనల్ని జీవితాంతం ప్రతి సమయంలోనూ సంరక్షిస్తూ వుంటాడు కాబట్టే అల్లాహ్ స్తుతింపదగిన వాడు. ఆయన్ని స్తుతించినా, లేకున్నా పుట్టించిన ప్రతి మనిషికీ గిట్టే వరకూ అన్న పానీయాల్ని, రక్షణను కల్పిస్తూనే వుంటాడు. ఇది అల్లాహ్ ఉదారగుణానికి చిహ్నం. మన పొగడ్తలవల్ల ఆయనకు ఎలాంటి లాభమూ లేదు, మనం స్తుతించనంత మాత్రాన ఆయనకు నష్టమూ చేకూరదు. మనం ఆయన్ని స్తుతించటం వల్ల మనకే లాభ దాయకం, ఇది మన విశ్వాసానికి, కృతజ్ఞ తలు చెల్లించుకోవటానికి ప్రతీక మాత్రమే. నిత్యజీవితంలో మనకు ఎవరైనా సహాయం చేస్తే వారికి మనం కృతజ్ఞతలు తెలుపుకుంటాం. మరి మనల్ని పుట్టించి నిత్యం పోషిస్తున్న ఆ మహోన్నత స్వామికి సరిగ్గా మనం కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామా? ఎన్నిసార్లు ఆ స్వామిని పొగిడినా, ఆయన ఘనకీర్తిని స్తుతించినా తక్కువే. మనపట్ల ఆయన చూపుతున్న కరుణాకటాక్షాలు అగణిత మైనవి. అడక్కుండానే మన అవసరాల్ని తీరుస్తున్నాడు. మనం ఊహించిన దానికన్నా ఎక్కువ ప్రసాదిస్తున్నాడు.

ఈ లోకంలోనే కాదు పరలోకంలో కూడా మన తప్పుల్ని క్షమించి స్వర్గాన్ని ప్రసాదించేది కూడా ఆ స్వామియే. మన మొరల్ని ఆలకించి వాటికి సమాధానం పలికి మనకు సావధానపరచేదీ ఆయనే. ఆపదల్లో చిక్కుకున్న

మనకు అభయ హస్తాన్నిచ్చి ఆదుకునేది కూడా ఆయనే. అలాంటి సద్గుణుడు, సర్వోన్నతుడైన స్వామిని వదలి మనిషి ఎంతటి కృతఘ్నుతకు పాల్పడుతున్నాడో స్వయంగా ఆలోచించుకోవాలి. ప్రళయం తరువాత ఈ ప్రపంచం అంతమై అందరూ ఆ స్వామి ముందు హాజరవక తప్పదు. ఆయన ముందు ప్రతి వారూ తమ తమ లెక్కలు సమర్పించుకోవాలి. ఇక్కడ ఎలా నడుచుకున్నా అడిగేవాడు లేడు. కాని అక్కడ మాత్రం అందరూ తమ లెక్కల్ని సమర్పించుకోవాలి. అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన చూపిన మార్గాన మెలకువతో, అణకువతో నడుచుకున్న వారు తమ లెక్కల్ని సునాయాసంగా సమర్పించుకోగలుగుతారు. కాని ఆ స్వామి చూపిన మార్గానగాక ఇతర మార్గా లనుసారం తమ జీవనాన్ని సాగించిన వారికి ఆ లెక్కల దినం (తీర్పుదినం) ఎంతో కష్టంగా వుంటుంది. వారి కృతఘ్నుతకు ఫలితంగా వారికి నరకశిక్ష విధించడం జరుగుతుంది. అది ఒక రోజుతో అంతమయ్యేది కాదు. స్వర్గమైనా, నరకమైనా అది శాశ్వతంగా వుంటుంది. మనకు స్వర్గం కావాలనే అభిలాష వుంటే మనమూ ఆ స్వామికి కృతజ్ఞులమై ఆయన చూపిన మార్గంలో నడచుకోవటంలోనే మన పరలోక సాఫల్యం దాగివుంది.

ఎవడైనా కృతజ్ఞతలు తెలిపితే, అతని కృతజ్ఞతలు అతనికే లాభకరం, ఎవడైనా కృతఘ్నుతకు పాల్పడితే నిజానికి అల్లాహ్ అతీతుడు, తనకు తానే స్తుతిపాత్రుడు. (దివ్యఖుర్‌ఆన్-31 : 12)

❊

اَلْحَيُّ

48. అల్ హయ్యు

మన ప్రాణానికి మూలం అల్లాహ్‌యే. అల్ హయ్యు అంటే మన ఉనికికి మూలమైన వాడు. ఆదం (అ)ను ఆయన మన్నుతోనే సృజించి అందులోకి ప్రాణాలూదాడు. మనం చూస్తున్న మృత భూమినుండే అనేకరకాలైన చెట్లు, చేమలు, పంటలు, ఫలాలు, పుష్పాలు మనకు లభిస్తున్నాయి అల్లాహ్ కాక-మృతభూమి నుండి వీటిని సృష్టించేవాడెవడైనా వున్నాడా? చెట్లు చేమల్లో కూడా జీవం వుంది. వాటికి కూడా చావు పుట్టుకలున్నాయి. కాలాను గుణ్యంగా అల్లాహ్ వర్షాన్ని కురిపిస్తాడు, మృతభూమికి చెట్లు చేమల్తో జీవాన్ని పోస్తాడు. అలాగే మరణించిన మనుషులందర్నీ మళ్ళీ తీర్పు దినాన జీవంతో నిలబెట్టేది కూడా ఆ అల్లాహ్‌యే. ఆ దినాన మనం ఈ లోకాన చేసిన మంచీ చెడుల గురించి జవాబు చెప్పుకోవలసి వుంటుంది. అల్లాహ్ ఆదిలో వున్నాడు, అంతంలో కూడా వుంటాడు. ఈ లోకంలోవున్న సమస్తమూ నశించేదే. కాని ఒక్క అల్లాహ్ మాత్రమే మిగిలివుంటాడు. జీవం నుండి నిర్జీవాన్ని, నిర్జీవం నుండి జీవాన్ని సృజించగల శక్తి కేవలం కేవలం అల్లాహ్‌కు మాత్రమే వుంది. ఆయన మన ఊహకు అందనివాడు. ఈ ప్రపంచంలో మన కంటికి కనిపించని ఎన్నో ప్రాణులున్నాయి. చరాచర సృష్టి యావత్తునూ పోషిస్తుంది ఆ సర్వలోకాల స్వామియే. ఇదంతా తెలిసికూడా ఆయన్ని వదిలేసి ఏమీ సృజించలేని వాటిని ఆయనకు సాటి కల్పించడం, మొక్కడం మనిషి అవివేకం తప్ప మరేమీ కాదు.

జీవితానికి మూలనిధి ఆయనే, ఆయనకు నిద్ర కాదు కదా, కనీసం కునుకూ రాదు. మనిషి కొన్ని గంటలు పనిచేస్తే చాలు, అలసిపోతాడు. అది

కూడా, ఇలా కొంత కాలం మాత్రమే పని చేయగలడు. వృద్ధాప్యం వస్తే ఆ పని కూడా చేయలేడు. సృష్టి ఆరంభంనుండి అంతం వరకు అందరినీ పోషిస్తున్న స్వామి ఎంతటి శక్తి సంపన్నుడు, మహిమాన్వితుడు, మరెంతటి శాశ్వత సజీవశక్తి కలవాడో అందరికీ ఇట్టే బోధపడగలదు. ప్రతివారూ ఆయనపైనే ఆధారపడి జీవించాలి. ఒక్క క్షణం కూడా మన చేతిలో లేదు. మన ప్రాణం, మానం, శక్తి, జీవనం అంతా ఆయన దయాభిక్షపైనే ఆధారపడి వుంది. మరణించాక కూడా స్వర్గ ప్రాప్తి ఆయన దయాభిక్షతోనే ప్రాప్తమవుతుంది. అలాంటి స్వామిపై సదా భరోసా వుంచడం సర్వదా శ్రేయస్కరం.

"అల్లాహ్- సజీవుడు, నిత్యుడు, విశ్వ వ్యవస్థకు ఆధారభూతుడు. వాస్తవానికి ఆయన తప్ప మరొక దేవుడు లేడు." (దివ్యఖుర్ఆన్-3:2)

اَلْقَيُّوْمُ

49. అల్ ఖయ్యూమ్

చావు పుట్టుకలకు అతీతుడు, నిత్యుడు అయిన కారణంగానే అల్లాహ్- అల్ ఖయ్యూమ్ అని పిలవబడుతున్నాడు. ఈ విశ్వ వ్యవస్థ అంతా ఒక రోజు నశించి పోయేదే. అయితే అల్లాహ్ ఒక్కడే మిగిలి వుంటాడు. దివ్య ఖుర్ఆన్‌లో, ఇలా వుంది:

"కుల్లుమన్ అలైహేఫాన్ వ యబ్ఖా వజ్హు రబ్బిక జుల్‌జలాలి వల్ ఇక్రామ్"- ఈ పుడమిపై వున్న ప్రతి వస్తువూ నాశనమై పోయేదే. కేవలం మహోన్నతుడూ, మహోప కారి అయిన నీ ప్రభువు మాత్రమే మిగిలి వుండేవాడు.

మనల్ని ప్రతిక్షణం మృత్యువు వెంటాడుతూనే వుంది. ఎక్కడ, ఏ క్షణంలో మనం మరణిస్తామో తెలియదు. కాబట్టి స్పృహ వచ్చినప్పట్నుంచి మనిషి మరణించేవరకు సదా ఆ స్వామి తెలిపిన బాటపై, మాటపై నడచుకోవటం అన్ని విధాలా శ్రేయస్కరం. వయస్సులో వున్నప్పుడు మనిషికి కన్నూ మిన్నూ కానరాదు. ముసలితనంలో దేవుని పట్ల భయభక్తులు కలిగివుండాలని మనిషి సర్వసాధారణంగా తలపోస్తూవుంటాడు. కాని ఆ ముసలితనం వచ్చేంతవరకూ తాను జీవించివుంటాడనే నమ్మకం వుందా? మన జీవితం క్షణగండం నూరేళ్ళ ఆయుష్షు లాంటిది. అందువల్ల మనిషి సదా తన లెక్కను సిద్ధంగా వుంచు కోవాలి. అందుకని అల్లాహ్ పట్ల భక్తిభావాలు కలిగివుండటానికి వయస్సుతో ముడిపెట్టుకోరాదు. మృత్యువు మనల్ని ఏ వయసులో, ఏ సమయంలో కబళిస్తుందో తెలియదు. నిత్య జీవితంలో, ఏ సమయంలోనైనా ఇన్‌కంటాక్స్‌వారో లేక సేల్స్‌టాక్స్‌వారో వచ్చి మన వ్యాపారలావా దేవీల లెక్కలు అడుగుతారని

లెక్కల్ని ఎప్పటికప్పుడు సిద్ధంగా వుంచుకుంటాం. అలాగే మృత్యువు కూడా మనల్ని ఏ క్షణంలో నయినా స్వాధీనం చేసుకోవచ్చు. దానికి మన వయస్సుతో పనిలేదు. చిన్నాపెద్దా అందరూ దానికి సమానమే. ఒకరు తల్లి గర్భంలోనే మరణిస్తారు, మరొకరు శైశవంలో, మరొకరు కౌమారంలో, ఇంకొకరు యుక్త వయస్సులో, మరికొందరు పండు ముసలి తనంలో మరణిస్తారు. ఏ దశలో ఆ స్వామి మనల్ని పిలుస్తాడో మనకు తెలియదు. కాబట్టి మన లెక్కను సదా సిద్ధంగా, శుభ్రంగా వుంచుకోవాలి. నిత్య జీవితంలో మనల్ని ఎవరైనా వారి అవసరానికి పిలిస్తే మనకు ఇష్టమైతే వారితో వెళ్తాం లేకపోతే మానేస్తాం. కాని ఆ సర్వలోకాల స్వామి పిలిస్తే చాలు – మనకు ఇష్టమున్నా లేకున్నా వెళ్ళి తీరాల్సిందే. అది కూడా వున్న పళంగానే వెళ్ళాలి. ఏ స్థితిలో వున్నా, ఎక్కడున్నా, ఎలా వున్నా ఆ స్వామి పిలుపును కాదనే శక్తి ఎవ్వరికీ లేదు.

కాబట్టి మనల్ని సృష్టించి, పాలించి, పోషించే ఆ ఏకైక స్వామిని మాత్రమే నమ్ముకొని, ఆయన్ని మాత్రమే పూజిస్తూ జీవన యానాన్ని కొనసాగిస్తూ వుండటంలోనే మన శ్రేయం ఇమిడివుంది.

"అల్లాహ్ – సజీవుడు, నిత్యుడు, విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు. వాస్తవానికి ఆయన తప్ప మరొక దేవుడు లేడు."

(దివ్య ఖుర్ఆన్ : 3 :2)

اَلْوَاحِدُ

50. అల్ వాహిద్

పుట్టినప్పటి నుండి గిట్టే వరకు మనం ప్రతి సందర్భంలో మరొకరి సహాయ సహకారాలు లేనిదే ఏ పనీ చేయలేము. పుట్టినప్పుడు మనం తల్లిదండ్రులపై ఆధారపడితే తప్ప మన పనులు మనం చేసుకోలేం. ఎంత తెలివైన వారైనా తమ అవసరాలకై మరొ కరిపై ఆధారపడవలసిందే. అన్ని అవసరాల్ని మనంతట మనం నెరవేర్చుకోలేం. ఒకరు వ్యవసాయంలో, మరొకరు సాంకేతిక రంగంలో, ఒకరు విద్యారంగంలో, ఒకరు వైద్యంలో, రాజ్యవ్యవస్థను నడపడంలో నిష్ణాతులై వుంటారు. అందరూ కలిస్తేనే అందరి అవసరాలు తీరుతున్నాయి. ఎవరూ గొప్ప వారు కాదు, మరెవరూ హీనులుకారు.

కాని ఎవరి అవసరమూ, ఏ అవసరమూ లేనివాడు ఒక్క అల్లాహ్ మాత్రమే. అల్ వాహిద్ అంటే ఒక్కగానొక్కడు. ఉనికిలో, శక్తిసామర్థ్యాల్లో, గుణగణాల్లో ఎవరూ ఆయనకు సాటి, పోటీలేరు. మనకు తోడు లేనిది ఒక్క క్షణం కూడా మన మనుగడ సాగదు. కాని ఆయనకు ఎవరితోడూ, అవ సరంలేదు. అన్ని అవసరాలకు, సహాయాలకు ఆయన అతీతుడు. మన ఉనికికి, అవసరా లకు అనుక్షణం ఆ సర్వోన్నతుడు, అత్యంత శక్తిమంతుడైన అల్లాహ్‌పైనే ఆధారపడాలి.

ఒక చిన్న సంస్థను, లేక రాజ్యవ్యవస్థను నడపటానికి మనకు ఎందరో సహాయ సహకారాలు అందించాలి. లేకపోతే మనం ఏమీ సక్రమంగా నడపలేము. మన ఒక్కరితో ఏమీ కాదు. కాని ఈ విశ్వవ్యవస్థను చూడండి. దీన్ని నడపడానికి అల్లాహ్‌కు ఎవరి సహాయ సహకారాలు, శక్తి సామర్థ్యాలూ

అవసరం లేదు. కేవలం ఆయన ఒక్కడే ఈ ప్రపంచ ఉనికికి, చలనానికి కారణభూతుడు. ఆయన ఒక్క ఆజ్ఞతోనే ఈ భూనభోంత రాశాలు ఉనికిలోకి వచ్చి, ఆయన ఆజ్ఞానుసారం సంచరిస్తున్నాయి. చివరికి ఆయన ఒక్క ఆజ్ఞతోనే ఆకాశం, భూమి, పర్వతాలు, సముద్రాలూ చెల్లాచెదురైపోతాయి. మొన్నకు మొన్న త్సునామీ ప్రభావానికి ఎన్నో దేశాలు అతలాకుతలమై హాహాకారాలు చేశాయి. సహాయ సహకారాలకు ప్రపంచ దేశవాసులందరితో మొరపెట్టు కున్నాయి. ఈ ప్రపంచ విలయంలోనైనా, లేక ప్రళయంలోనైనా మనం మొరపెట్టుకోవలసింది, ఆ అల్లాహ్‌నే. బాధిత ప్రజలను ఆదుకోవటానికి మన హృదయాలను మెత్తబరిచేది కూడా ఆ స్వామియే.

అందువలన మనం ఎల్లప్పుడూ ఆధారపడ వలసిందీ, సహాయానికై అర్థించవలసిందీ, పూజించవలసిందీ ఒక్క అల్లాహ్‌ను మాత్రమే.

"మీకు వినేశక్తినీ చూసే శక్తినీ ఇచ్చిన వాడు, ఆలోచించటానికి హృదయం ఇచ్చినవాడూ అల్లాహ్‌యే. కాని మీరు కృతజ్ఞత చూపటం చాలా అరుదు." **(దివ్యఖుర్‌ఆన్ - 23 : 78)**

الأحَدُ

51. అల్ అహద్

అల్ అహద్ అంటే సాటిలేనివాడు, సరి సమానులు లేనివాడు అని అర్థం. లా ఇలాహ ఇల్లల్లాహు, అల్ వాహెద్, అల్ అహద్ దాదాపు అన్నీ దేవుని ఏకత్వాన్ని తెలిపే సమానార్థకాలే. అన్నీ అల్లాహ్ ఒక్కడే అని, ఆయనే ఆరాధనకు అర్హుడని తెలుపుతున్నాయి. ఎప్పుడైతే మనిషి "లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదు రసూలుల్లాహ్" అనే కలిమా (సద్వచనాన్ని) పఠించి దేవుని ఏకత్వం పట్ల తన విశ్వాసాన్ని ప్రకటించాడో ఇక అతను అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు. ప్రపంచంలో ఎలాంటి ప్రచండ శక్తి తనను అడ్డుకున్నా తాను మాత్రం దేవుడు ఒక్కడే అన్న సిద్ధాంతానికి కట్టుబడి తన వాక్కర్మలతో నిరూపించాలి. అప్పుడే అతను నిజమైన ముస్లిం, అంటే దైవ విశ్వాసి.

నోటితో కేవలం అల్లాహ్ ఒక్కడే అని పలికి సృష్టితాలను కూడా అల్లాహ్‌తోపాటు ఆరాధిస్తూ వుంటే ఇక తాను దేవుడు ఒక్కడే అని చెప్పడంలో ఎలాంటి వాస్తవికతను తన కర్మల ద్వారా నిరూపించడం లేదన్నమాట. కేవలం నోటితో కలిమా పఠించి చేతల్లో దానిని ఆచరించనట్లయితే పరలోకంలో ఎలాంటి ప్రయోజనమూ చేకూరదు. ఇక్కడయితే మనిషి పరుల్ని సంతోష పెట్టటానికి, లేక మరేదైనా అధికారం, పదవీ హోదాలకు ఆశపడి అలా ప్రవర్తించవచ్చు. కాని అతనికి పరలోకంలో దొరకవలసిన స్వర్గసుఖాలు మాత్రం దొరికే అవకాశం లేదు. ఉదాహరణకు - తెల్లని మల్లెపూవు, తెల్లదనానికి, సువాస నకు ప్రతీతి. మనం కూడా ఒక తెల్లని కాగితాన్ని కత్తిరించి మల్లెపూవులా తయారు చేయగలం. కాని దానికి స్వాభావిక సువాసనలు, సుకుమారాలు

కల్పించలేం. అలాగే ఒక మనిషి అల్లాహ్ ఒక్కడే అని చెప్పినంత మాత్రాన సరిపోదు. ఆయన చెప్పినట్లు ఆయన్ని మాత్రమే ఆరాధించాలి, ఆయన ప్రవక్త ముహమ్మద్ (స) ఆచరించి చూపిన బాటలోనే నడవాలి. అప్పుడే అల్లాహ్ ఒక్కడే అని పలికినదానికి సార్థకత చేకూరుతుంది. మాటలకు చేతలకు పొంతన కుదిరి మన ప్రవర్తనలో పరావర్తన శక్తి జనిస్తుంది. కాంతి కొన్ని వస్తువుల గుండానే పరావర్తనం చెందుతుంది, కాని నిజమైన దైవవిశ్వాసి సత్ప్రవర్తన కరగని రాతిగుండెల్ని కూడా చీల్చుకొని వారి హృదయాల్లో పరివర్తనం జనింప జేస్తుంది. అలాంటి విశ్వాసి ఎటువెళ్ళినా అతని గుణ గణాల గుబాళింపు వెదజల్లబడుతుంది. వెదజల్లిన విత్తనాలు ఎలాగైతే మొలకెత్తి, వృక్షాలై ఫలపుష్పాదుల్ని ప్రసాదిస్తాయో, అలాగే విశ్వసనీయుడైన మనిషి సత్ప్రవర్తన కూడా జనావళికి సరిగ్గా అలాంటి ప్రయోజనాల్నే ఇస్తుంది.

> **"ఆయన అల్లాహ్- అద్వితీయుడు, నిరపేక్షాపరుడు; ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరాలేనివాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడ ఎవరి సంతానమూకాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు."**
>
> **(దివ్యఖుర్ఆన్ - 112 :1-4)**

اَلصَّمَدُ

52. అస్ సమద్

అస్ సమద్ అంటే నిరపేక్షాపరుడు, ఎవరిపైనా ఆధారపడనివాడు. మన శరీరాన్నే తీసుకోండి. మనస్సు శరీరంపై, శరీరం మనస్సుపై; కళ్ళు, చెవులు, చేతులు, కాళ్ళు, ఉదరం ఇంకా ఏవైతే అవయవాలున్నాయో అన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి పనిచేస్తు న్నాయి కాబట్టే మనం జీవనాన్ని సాగిస్తున్నాం. ఏ ఒక్కటి లోపించినా మనకు అంగవైకల్యం వున్నట్లే. అలాగే పంటలు పండాలంటే నీరు, గాలి, సూర్యరశ్మి, ఎరువు తదితరాలు కావాలి. ఇలా ఈ ప్రకృతిలో ఏది గమనించినా, దేన్ని చూసినా అన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి వున్నాయి. చివరికి ఈ ప్రపంచ వ్యవస్థ అంతా అల్లాహ్‌పై ఆధారపడివుంది. పట్టాలుంటేగాని రైలు నడవదు, రోడ్డు వుంటేనే బస్సూ నడిచేది; ఎవరి అవసరం, ఎప్పుడు ఎవరితో తీర్చబడుతుందో ఆయా సందర్భాలే చెబుతాయి. మన ఒక్క క్షణం కూడా ఆధారం లేనిదే గడవజాలదు.

అల్లాహ్- అస్ సమద్‌కు ఎవరి ఆధారమూ అక్కర్లేదు. ఆయన ఎవరికీ జన్మించలేదు, మానవ అవసరాలన్నింటికీ అతీతుడు. మనకు నిద్ర, ఆకలి, పుట్టుక, గిట్టుక ఇవన్నీ వున్నాయి. కాని ఆయన వీటన్నింటికీ అతీతుడు. ఈ ప్రపంచంలో ఎంతటి పెద్ద శక్తి అయినా ఒకరిపై ఆధారపడి నడిచేదే. కాని అల్లాహ్‌కు ఎవరి ఆధారమూ, అవసరం లేదు. అలాంటి గొప్ప శక్తిని, మహిమాన్వి తుణ్ణి, సృష్టికర్తను, పోషకుణ్ణి వదిలేసి ఒకరిపై ఆధారపడి జీవిస్తున్న సృష్టిరాసుల్ని పూజించడం, వారిపై లేక వాటిపై ఆధార పడటం మన బుద్ధిమాంద్యానికి నిదర్శనం. ఈ సృష్టిలో మనిషే సర్వశ్రేష్టుడు. అటువంటి

మనిషి తన శ్రేష్టతను స్వయంగా తనే కాదనుకొని తనకంటే హీనమైన, దీనమైన వాటిని పూజిస్తూ భ్రష్టతకు గురౌతున్నాడు. మనం పూజించాల్సింది, మ్రొక్కుకోవాల్సింది ఒక్క దైవాన్నే తప్ప మరొకర్ని కాదని బోధించడానికి వేలమంది ప్రవక్తలు ప్రభవింపబడ్డారు. కాని ఒక్క దైవాన్ని విశ్వ సించినవారు, ప్రవక్తల్ని అనుసరించినవారు ప్రతి కాలంలోనూ, ప్రతి సందర్భంలోనూ కొద్దిమంది మాత్రమే. ఒక్క దైవాన్ని విశ్వసించడమంటే ఒకే సృష్టితాన్ని జీవితాంతం పూజించడం కాదు. అందరినీ సృష్టించి, అందరి అవసరాలూ తీరుస్తూ, ఏ అవస రమూ లేనివాడైన ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించడం అన్నమాట.

అల్లాహ్ ఒకడే నిరపేక్షా పరుడు, అందరూ ఆయన పైనే ఆధారపడి వున్నారు. (దివ్యఖుర్ఆన్-112 : 1, 2)

اَلْقَادِرُ

53. అల్ ఖాదిర్

అల్ ఖాదిర్ అంటే ప్రతిదీ చేయగల సమర్థుడు అని అర్థం. అల్లాహ్-అల్ ఖాదిర్‌కు అసాధ్యమంటూ ఏదీ లేదు. ఆయన ఆది మానవుడు, ఆదం (అ) ప్రక్కటెముక నుండే హవ్వా (అ)ను సృజించాడు. అలాగే పురుష స్పర్శ లేకుండానే మర్యం (అ) గర్భం నుండి ఈసా (అ)ను సృజించాడు. మానవ సృష్టికి ముందు ఈ భూమిపై అగ్నితో సృజించబడిన జిన్నాతులుండేవి. ఈ విధంగా అల్లాహ్ ఎప్పుడు, ఏది కావాలంటే దాన్ని సృజించగల శక్తి సామర్థ్యాలు కలవాడు. ఆయన ఒక్క ఆజ్ఞచాలు, క్షణాల్లో ఏది కావాలంటే అది ఉనికిలోకి వస్తుంది. మనం నింగివైపు అలా చూస్తూవున్నప్పుడే క్షణాల్లో ఆకాశం మేఘావృతమై, కారుమబ్బులు కమ్ముకొని వర్షం పడుతుంది. మళ్ళీ క్షణాల్లో మేఘాలన్నీ మాయమై ఆకాశం నిర్మలమైపోతుంది. వేసవిలో నేల నాలుగు చెరగులా చెట్లు చేమలు మాడి అంతా నిర్జీవమైపోతాయి. పచ్చదనం కరువైపోతుంది. నాలుగు చినుకులు కురిస్తేచాలు మళ్ళీ నేలంతా చెట్లు చేమలతో జీవం పోసుకొని పచ్చటి తివాచీ పరచినట్లు కళకళలాడుతుంది. ఇదంతా చేయగల సమర్థత కేవలం ఒక్క అల్లాహ్‌కు మాత్రమే వుంది.

మనిషి సదా అర్థం కాని విషయాల వెంటపడి కాలాన్ని వ్యర్థం చేస్తున్నాడు తప్ప - ప్రవక్త బోధనానుసారం జీవనాన్ని సాగించడానికి ఒప్పుకోవటం లేదు. ప్రతి కాలంలో, ప్రతి జాతిలో, ప్రతి దేశంలో ప్రవక్తలనేకమంది ప్రభవించబడ్డారు.

అల్లాహ్ ఆజ్ఞల్ని బోధించి, తాము ఆచరించి చూపారు. అయినా కొద్దిమంది తప్ప తతిమ్మా వారంతా వారి బోధనల్ని పెడచెవిన పెట్టారు.

అల్లాహ్ సృష్టి మనిషి మేధకు అందనిది, కాబట్టి చెప్పిన విధంగా నడవండని ఎంతగా ప్రవక్తలు బోధించినా మానవులు ససేమిరా అంటూ వచ్చారు. నేడు కూడా మన కళ్ళ ముందు చివరి ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు, ఆయనపై అవత రించిన చిట్ట చివరి గ్రంథం దివ్యఖుర్ఆన్ ఉన్నాయి. కాని ఎంతమంది వాటి ప్రకారం ఆచరిస్తున్నారు. బాబూ మనిషికి సరిపడే జీవన వ్యవస్థ ఇదేను, ఇది తప్ప మరో విధానం పనికిరాదని ఖుర్ఆన్‌లో పదేపదే అల్లాహ్ బోధిస్తు న్నప్పటికీ మనిషి వింటున్నాడా? తన స్వంత ఆలోచనతో, చేతులతో తయారు చేసుకున్న దైవాల్ని, జీవన విధానాన్ని నమ్ముకొని నానా అవస్థలు పడు తున్నాడు, చివరికి మరణా నంతరం నరక జ్వాలలకు చిక్కడానికే సిద్ధమవుతున్నాడు.

> **"ఆయన ప్రతి వస్తువును పుట్టించాడు. ఆయనకు ప్రతి వస్తువును గురించీ తెలుసు. ఆయనే అల్లాహ్. మీ ప్రభువు. ఆయన తప్ప మరొకదేవుడు లేడు. ఆయన సర్వానికీ సృష్టికర్త. కనుక మీరు ఆయననే ఆరాధించండి." (దివ్యఖుర్ఆన్ - 6 : 103)**

اَلْمُقْتَدِرُ

54. అల్ ముఖ్తదిర్

అల్లాహ్– అల్ ముఖ్తదిర్ అంటే ప్రతి ప్రాణిపై, వస్తువుపై సంపూర్ణ అధికారం, ఆధిక్యత కలవాడని అర్థం. రాజు, ఒక రాజ్యానికి శాసనకర్త, పాలకుడు. తన రాజ్యంలో తనకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ, అల్లకల్లోలాన్ని సృష్టించిన వారిని రాజు దండిస్తాడు. రాచరిక వ్యవస్థలో రాజునైనా లేక ప్రజాస్వామ్యంలో ప్రధాన మంత్రి నయినా, ముఖ్యమంత్రినయినా ఎన్ను కునేది ప్రజలే. కాని ప్రవక్తల్ని ఎన్నుకునేది అందరి ప్రభువైన అల్లాహ్ మాత్రమే. రాజు కూడా ప్రవక్తల ద్వారా అల్లాహ్ పంపిన ఆజ్ఞల్ని, ఆదేశాలను పాటించి నడచుకో వలసిందే. అలా నడచుకోని రాజులైనా, చక్రవర్తులైనా తుదముట్టించబడ్డారని ఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది మనకు.

అల్లాహ్ ఒక్కడే అని, ఆయన్నే ఆరాధించాలని, మనల్ని సృష్టించి, పోషిస్తూ, పాలిస్తు న్నది ఆయనే అని, ఆయన్నే నమ్ముకోవాలని బోధించినందుకు ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)ను ఆనాటి రాజు అగ్నిలో పడవేశాడు. కాని అల్లాహ్ ఆజ్ఞతో ఆ అగ్ని చల్లారి ఇబ్రాహీమ్ (అ) క్షేమంగా ఆ ఆపదనుండి రక్షించబడ్డారు. అలాగే లూత్, ఆద్, సమూద్, మద్యన్ మొదలైన జాతుల ప్రజల వద్దకు కూడా అల్లాహ్, ప్రవక్తల్ని పంపాడు. కాని ఆ సమూహాలు, జాతులు ప్రవక్తల మాటల్ని పెడచెవిన పెట్టిన కారణంగా అల్లాహ్ వారిపై శిక్షలు అవతరింప జేశాడు. ఒక్కో జాతి ఒక్కో చెడులో కూరుకుపోయి దైవశిక్షకు గురి అయ్యింది. ఇలా దివ్యఖుర్ఆన్‌లో ఎన్నో జాతులగాథలు మనకు తెలియజేసి, గుణపాఠం నేర్చు కునేందుకు దోహదం చేశాడు దేవుడు.

నేనే దేవుణ్ణి, నన్నే ఆరాధించండని ఫిరౌన్ రాజు తన దేశ ప్రజలను నానా యాతనలకు గురిచేశాడు. ఆ సందర్భంలో అల్లాహ్ మూసా (అ)ను ప్రభవింపజేసి, ఆరాధనకు, పూజకు అర్హుడు కేవలం అల్లాహ్ మాత్రమే అని ప్రజలకు హితవు గరిపాడు. ఫలితంగా ఫిరౌన్ రాజు ఇంకా విర్రవీగుతూ ప్రవక్త మూసా (అ)ను, ఇంకా ఆయన్ని అనుసరించిన ప్రజల్ని తుదముట్టించేందుకు వెంటబడ్డాడు. చివరికి ఫిరౌన్, అతని సైన్యం సముద్రంలో ముంచబడి ప్రపంచ ప్రజలకు గుణపాఠం గరిపే గాథలా మిగిలిపోయారు. ఓ మానవులారా! ఇదిగో చూడండి, ఫలానా వారు ఈ విధంగా నా పట్ల తిరస్కారులై పోయారు. వారిని ఈ విధంగా శిక్షించాను; కాబట్టి మీరు బుద్ధి తెచ్చుకొని నా చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స) ఆచరించి చూపిన బాటలో నడవండని అల్లాహ్ ఖుర్ఆన్ ద్వారా మనల్ని హెచ్చరిస్తూనే వున్నాడు. పుట్టి గిట్టేవారు, ప్రలోభాలకు లొంగేవారు, ఏమీ సృష్టించ లేనివారు మానవులైనా, ఇతర సృష్టితాలైనా పూజకు, ఆరాధనకు అర్హులు ఎలా అవుతారు? ప్రవక్తలు (అ) కూడా తమ జీవితాంతం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించారు, అదే ప్రజలకు బోధించారు తప్ప బాధించ లేదు.

"వారి ముందుకు (పూర్వపు జాతుల) స్థితిగతులు వచ్చాయి; తలబిరుసు తనం నుండి వారిని దూరంగా ఉంచటానికి వాటిలో కావలసినంత గుణపాఠం ఉంది." (దివ్యఖుర్ఆన్-54 : 4, 5)

اَلْاَوَّلُ اَلْاٰخِرُ اَلظَّاهِرُ اَلْبَاطِنُ

55. అల్ అవ్వల్, 56. అల్ ఆఖర్, 57. అజ్జాహిర్,, 58. అల్ బాతిన్

పైన తెలిపిన పవిత్ర నామాలన్నీ దివ్య ఖుర్‌ఆన్‌లోని ఒకే సూరా, ఒకే ఆయత్‌లో వున్నాయి. అల్ అవ్వల్ అంటే ఆద్యుడు, అల్ ఆఖిర్ అంటే సృష్టి వినాశం తరువాత కూడా మిగిలివుండేవాడు, అజ్జాహిర్- సృష్టి లోని ప్రతి పరమాణువు ద్వారా కూడా దైవత్వాన్ని వ్యక్తపరిచేవాడు, అల్ బాతిన్ - అగోచరుడు అని అర్థం.

మన శరీరంలో పైకి కనిపించే అవయవాలన్నింటినీ ప్రసాదించింది ఆ పరమోన్నత ప్రభువే. మాతృగర్భం నుండి ఒక్క అవయవం లోపించి జన్మించినా దాన్ని ఏ మానవ మాత్రుడైనా లేక ఎంత పెద్ద వెద్యుడైనా ప్రసాదించలేడు. కాబట్టి అన్ని అవయవాలు ప్రసాదించి మనల్ని సుందరంగా తీర్చిదిద్దిన ఆ ప్రభువుకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పుకున్నా తక్కువే. అవయవ లోపంతో జన్మించిన మనిషిని అడిగితే దాన్ని గొప్పతనమేదో మనకు తెలిసి వస్తుంది. ఇలా అన్ని అవయవాలు ప్రసాదించబడటం ఒక ఎత్తు. పైకి కనిపించని జ్ఞానేంద్రియాలు కూడా ప్రసాదించి మనిషికి ఎంతో మేలు చేశాడు దేవుడు. అవి ఆలోచించే మనస్సు, విషయావగాహన, సత్ప్రవర్తన, భావవ్యక్తీకరణ, ఇంకా ఎన్నో లక్షణాలు మనకు ప్రసాదించాడు ఆ అల్లాహ్. అవయవాలన్నీ ఇచ్చినా పశుపక్ష్యాదులకు ఇంగిత జ్ఞానాన్నివ్వలేదు. కాని మనిషికి ఏ జీవరాశికీ ఇవ్వనటువంటి జ్ఞానాన్ని ప్రసాదించాడు దేవుడు. దాని ద్వారా మంచి ఏది, చెడు ఏది; సన్మార్గమేది, అపమార్గమేది; వెలుగుబాట ఏది, చీకట్లకు గొనిపోయే

మార్గమేదో గ్రహించి ఒక్క సృష్టికర్త అయిన అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన్ని మాత్రమే ఆరాధిస్తున్నాడు. ఇది కూడా విశ్వాసులకు అల్లాహ్ ప్రసాదించిన వరమే. ఈ ప్రపంచంలో జంతువులకంటే హీనంగా ప్రవర్తించే మనుషులు ఎంతమంది లేరు? వారికి కూడా అవయవాలన్నీ ఇచ్చాడు; కాని ఆలోచించే శక్తి, సత్యాసత్యాలను గ్రహించే జ్ఞానం లేకుండా చేయడం జరిగింది. అలాంటి వారు, మనసున్నా దానితో ఆలోచించరు, కళ్ళున్నా వాటితో చూడలేరు, చెవులున్నా వాటితో వినలేరు - అందుకే దేవుడు అలాంటి వారిని కళ్ళున్న గ్రుడ్డివారు, చెవులున్న చెవిటివారని సంబోధించాడు ఖుర్ఆన్‌లో. అలాంటివారి హృదయాలకు అల్లాహ్ సీలు వేశాడు. ప్రపంచమే సర్వస్వమని, స్వర్గమని తలపోసి పరమ కిరాతకంగా ప్రవర్తిస్తూ వుంటారు అలాంటివారు. బొందిలో ప్రాణ మున్నప్పుడే ఆలోచించి, అవగాహన చేసుకొని నిజమైన ఆరాధ్యుడు, సృష్టికర్త, పోషకుడు అయిన స్వామిని పూజించడంలోనే విజ్ఞత దాగివుంది.

ఆయనే ఆరంభమూ, ఆయనే అంతమూ, ఆయనే బాహ్యమూ, ఆయనే గూఢమూ. ఆయనకు ప్రతి వస్తువును గురించి తెలుసు.

(దివ్యఖుర్ఆన్ - 57 : 3)

اَلْوَالِیْ

59. అల్ వాలీ

వాలీ అనే పదం మిశ్రమ అర్థాల సంచయనం. అల్లాహ్– అల్ వాలీ సృష్టికర్త; తీర్పు దినానికి యజమాని; విశ్వపాలకుడు; ప్రపంచంలోని ప్రతిప్రాణిని, వస్తువును అధీనంలో వుంచినవాడు; మన ప్రాణాన్ని, విశ్వాసాన్ని పరిరక్షించే వాడు; మనకు సహాయకుడు స్నేహితుడూను. ఇన్ని సద్గుణాల సమ్మేళన పదమే ఈ అల్ వలీ.

ప్రతి మనిషి ఏదో ఒక సందర్భంలో ఏదో ఒక సంకటంలో చిక్కుకుంటూనే వుంటాడు. ఎలాంటి ఆపదలో చిక్కుకున్నా దాన్నుండి కాపాడేవాడు, రక్షించేవాడు ఒక్క అల్లాహ్‌యే. ఆయన సహాయ సహకారాలు ఎటునుంచి అందుతాయో మనిషి ఊహకు కూడా అందదు ఒక్కోసారి. ఇది ప్రతి మనిషికీ అనుభవంలోకి వచ్చే విషయమే. ఆ పరమోన్నత అదృశ్య శక్తి మనల్ని ఎల్లప్పుడూ కాపాడుతూనే వుంటుంది. మనకు కనిపించకపోయినా, మనల్ని కనిపెట్టుకునే వుంది ఆ శక్తి. కని పెంచిన తల్లిదండ్రులు మనిషికి కొంత వయస్సు వచ్చేవరకే కనిపెట్టు కొని వుంటారు. కాని అల్లాహ్ మాత్రం అందరినీ, అన్నివేళలా సంరక్షిస్తూనే వుంటాడు, పోషిస్తూనే వుంటాడు.

ఆయన్ని విశ్వసించిన దాసుల్ని ఆయన అనుక్షణం ప్రతి ప్రమాద సమయంలోనూ కాపాడాడు, కాపాడుతూనే వుంటాడు. ఇలాంటి ఉదాహరణలు మనకు ఖుర్ఆన్‌లో ఎన్నో దొరుకుతాయి.

విశ్వసించిన దాసులకు అల్లాహ్ స్వర్గం నుండే మన్నసల్వా అనే ఆహారాన్ని ప్రసాదించటం, బనీ ఇస్రాయీల్ సంతతికి బండ రాళ్ళ నుండే పన్నెండు

ఊటల జలధారల్ని ప్రవహింపజేయడం, సముద్రాన్ని చీల్చి రహదారిగా మార్చి దుష్టుడైన ఫిరౌన్ రాజు దుర్మార్గం నుండి ఆ ప్రజల్ని కాపాడడం, ఆపై ఫిరైన్‌ను సముద్రంలో ముంచడం- ఇవన్నీ అల్లాహ్ మహిమలే. నిత్యం మన కళ్ళముందే ఎన్నో మహిమలు జరుగుతుంటాయి. కాని మనం వాటిని కొట్టి పారేస్తుంటాము. అల్లాహ్ ఆయన మహిమలతో మనల్ని అనుక్షణం రక్షిస్తూనే వుంటాడు. మన గ్రహణశక్తికి గ్రహణం పట్టటం మూలంగానే దాన్ని మనం గ్రహించ లేకపోతున్నాం. విశ్వసించిన మనిషికి విశ్వంలోని ప్రతిదీ మహిమలానే కని పిస్తుంది. ఎందుకంటే విశ్వాసపు కళ్ళు మామూలు కళ్ళుకావు, అవి జ్ఞాన నేత్రాలు. ఆ జ్ఞాన నేత్రాలు అల్లాహ్‌ను ధ్యానించడం ద్వారానే లభిస్తాయి.

ప్రతి మనిషికీ ముందూ వెనకా అల్లాహ్ నియమించిన కావలి వాళ్ళు అంటివున్నారు. వారు అల్లాహ్ ఆజ్ఞానుసారం అతనిని కాపాడుతూ ఉంటారు. (దివ్యఖుర్ఆన్-13 : 11)

اَلْمُتَعَالُ

౬౦. అల్ ముతఆల్

అల్ ముతఆల్ అంటే అన్నిటికీ అతీతమైన వాడు, అన్ని సమయాల్లోనూ ఉన్నతమైన వాడని అర్థం. సృష్టి ఆది నుండీ నేటి వరకే కాదు, ప్రళయం వరకూ మనల్ని పోషించేది, పరిపాలించేది కేవలం ఆ అల్లాహ్ మాత్రమే. అన్ని కాలాల్లోనూ ఆరాధనకు, పూజకు అర్హుడు ఆయనే. కాలానికి తగ్గట్టు మనిషి మారాలని, అదే అభివృద్ధి అనీ, బుద్ధి జీవి అయిన మనిషి ఆలోచిస్తూ వుంటాడు. అంటే ఈ రోజు సత్యమైన దాన్ని, మరుసటిరోజు ప్రజలంతా దాన్నే అసత్యమని వాదిస్తే మనమూ అసత్యమనే వాదించాలన్నమాట! ఈ రోజు ధర్మమైనది, రేపటికి అదే అధర్మ మవుతుందన్నమాట! ఇదెక్కడి న్యాయం, ఇదెక్కడి ధర్మమో ఆలోచించండి.

సర్వకాలాల్లోనూ, సర్వావస్థల్లోనూ మనిషికి శ్రేయోదాయకమైన ధర్మాన్నే ప్రసాదించాడు దేవుడు. ఈ రోజు, మరుసటి రోజు 'నిన్న'గా పరిగణించబడుతుంది. అలాగే నేటి తరం, రేపు పాతతరంగా పరిగణించబడుతుంది. నడుస్తున్న ప్రతిక్షణాన్నీ, గడచిన కాలంగానే గణిస్తాం. కానీ 'ధర్మం' మాత్రం నిలకడ కలది. కాలాలు మారినా, అవస్థలు మారినా ధర్మం మారనిది. ఏ అవస్థలోనూ మనిషికి అవస్థలపాలు కాకుండా కాపాడగలిగేది ధర్మం ఒక్కటే. అది ఎప్పుడూ నూతనంగానే వుంటుంది. మనిషి రూపకల్పనతోటే ఇస్లాం ధర్మం మొదలయింది. రేయి అయినా, పగలయినా; నిన్న, నేడు, రేపయినా ధర్మం ధర్మంగానే వుంటుంది, వుండాలని మనమూ కోరుకుంటాం.

ఎన్నివేల సంవత్సరాలు గడచినా ప్రళయం వరకూ ఈ పుడమిపై నిలకడగా వుండేది అదొక్కటే. దాన్ని వదలిపెడితే చాలు ఇక మనిషికి 'నిలకడే' దొరకదు. ఎంత సంపద వున్నా, ఎన్ని సదుపాయాలున్నా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలైనా ఎందుకు నిలకడగా, శాంతియుతంగా లేవు? మదికి నెమ్మదిని, శాంతిని ప్రసాదించి, మనసును, మనుగడను నిలకడగా వుంచగలిగేది కేవలం ఇస్లాం మాత్రమే.

అలాంటి జీవన వ్యవస్థను, సన్మార్గాన్ని వదలి చేతులతో తయారు చేసుకున్న వాటిని పూజిస్తూ, తన మనిషికన్నా శ్రేష్ఠమైనది మరేదీ లేదు. సృష్టియావత్తూ నీ దాసోహం చేస్తున్నాను, కానీ నువ్వు మాత్రం నా ఒక్కడికే దోసోహం చేయాలని, ఇదే సరిఅయిన మార్గమని, ధర్మమని అల్లాహ్ ఎన్నో చోట్ల ఖుర్ఆన్‌లో సెలవిచ్చాడు. కానీ మనిషి మాత్రం ఒక్క అల్లాహ్ దాస్యం కాదని– వేలాది దాస్యాలకు దాసోహం అయిపోయాడు, ప్రతిదానికి, ప్రతివారికి తలొగ్గుతున్నాడు మనిషి.

ఆయన గొప్పవాడు. సర్వకాల సర్వావస్థలలో ఆధిక్యం కలిగి వుండేవాడు. మీలో ఎవరైనా బిగ్గరగా మాట్లాడినా లేక మెల్లగా మాట్లాడినా; మీలో ఎవరైనా రాత్రి చీకటిలో దాగివున్నా లేక పగటి వెలుగులో నడుస్తూవున్నా ఆయనకు వారంతా సమానమే.

(దివ్యఖుర్ఆన్–13 : 9)

اَلْبَرُّ

61. అల్ బర్

అల్ బర్ అంటే ఉపకారం చేసేవాడని అర్థం. అల్లాహ్ తన సృష్టితాలపట్ల నిరంతరం ఉపకారం చేస్తూనే వుంటాడు. నిత్యజీవితంలో మనకు ఎవరైనా మేలుచేస్తే, ప్రతిగా మనం మేలుచేస్తాం. అలా కాకుండా ఎవరైనా మనకు అపకారం తలపెడితే మనమూ అతనికి అంతకు పదిరెట్లు అపకారం చేయాలని తలుస్తాం. ఇది మనిషి నైజం. తనకు ఎవరైనా హానిచేసినా, పగ తీర్చుకునే బదులు వారిని క్షమించి వదిలివేస్తే అది ఎంతో ఉన్నతమైన సుగుణమే. ఈ సుగుణం కొందరిలోనే వుంటుంది. అలాంటి వారికి అల్లాహ్ వద్ద గొప్ప ప్రతి ఫలముంది. శాశ్వత స్వర్గసుఖాలు వారికోసం ఏర్పాటు చేయబడ్డాయి.

అపకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ! అని ఓ శతకకర్త అన్నాడు. అంటే అపకారికి కూడా ఉపకారం చేసేవాడే అసలైన నేర్పరి అని, మేలుకు మేలు; మంచికి మంచి; సహాయానికి సహాయం చేసిన వాడు ఎలాంటి ఘనకార్యం చేయలేదని, తనకు హాని చేసినవారికి మేలు చేసిన వాడే నిజమైన నేర్పరి అని దీని భావం.

ఆ మాటకు వస్తే అల్లాహ్‌యే అందరి కంటే ఎక్కువ నేర్పరి. సర్వసదు పాయాల్ని కల్పించి ఈ చరాచర సృష్టికి కర్తయైన అల్లాహ్ మనకు ప్రతిక్షణం ఎన్ని మేళ్ళు, ఉపకారాలు చేస్తున్నాడో అనే విషయాన్ని మనం ఆలోచిస్తున్నామా? ఆయన చేసే మేళ్ళని మనం ఎన్నగలమా? గాలి, వెలు తురు, ఎండా, వానల్ని ఇచ్చింది, ఎన్నో రకాల పంటలు పండించి ఇంకా ఎన్నో సౌకర్యాల్ని కల్పించింది ఆయనే కదా! మనిషి తన తెలివితో ఒక్క విత్తనాన్నైనా సృష్టించగలడా?

లెక్కలేనన్ని మేళ్ళు చేస్తున్నా మనిషి దేవుణ్ణి లెక్కే చేయటం లేదు! ఏమీ సృష్టించలేని, ఎందుకూ పనికిరాని జీవ నిర్జీవాల వెంటపడి వాటిని పూజిస్తూ వున్నాడు మనిషి. తనకు నచ్చిన మార్గాన్నే ఎన్నుకొని అదే నిజ మైన, సవ్యమైన మార్గమంటున్నాడు గాని, ప్రభువుమెచ్చిన మార్గమేది అని ఆలోచించటం లేదు. "ఇన్నద్దీన ఇన్ద ల్లాహిల్ ఇస్లామ్" అని దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు. అంటే అల్లాహ్ దృష్టిలో నిజమైన మార్గం ఇస్లామ్ మాత్రమే అని దీని అర్థం. ఒక వస్తువును కొనుగోలు చేసేటప్పుడు దానిపై ఐ.ఎస్.ఐ. మార్కు వుందా లేదా అని పరికిస్తాడు మనిషి. కాని తను పాటించే జీవన ధర్మం కూడా అది అసలైనదా కాదా అని ఆలోచించే అవసరం లేదా మనిషికి?

నిస్సంశయంగా, ఆయన అమితంగా మేలు చేసేవాడు, దయానిధి.

(దివ్యఖుర్ఆన్-52 : 28)

اَلتَّوَّابُ

62. అత్ తవ్వాబ్

అల్లాహ్ – అత్ తవ్వాబ్ అంటే పాపుల పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు అని అర్థం. తప్పు చేయటం మానవ సహజం. చిన్న దోషమైనా, పెద్ద దోషమైనా దానిపట్ల పశ్చా త్తాపం చెందటం, క్షమించమని అల్లాహ్‌ను వేడుకోవటం సజ్జనుల లక్షణం. పశ్చాత్తాపం చెందటం కూడా ఒక సుగుణమే. జరిగిన తప్పిదాల్నుండి తప్పించుకోవాలంటే వాటి పట్ల పశ్చాత్తాపపడటం ఒక్కటే మార్గం. ఈ మార్గంకన్నా ఉత్తమ మార్గం మరొకటి లేదు. అయితే మళ్ళీ అలాంటి తప్పు చేయకుండా జాగ్రత్తగా మసలుకోవాలి. పొరపాట్లు జరగకుండా కాపాడమని కడు వినయంగా అల్లాహ్‌ను మాత్రమే వేడుకోవాలి.

ప్రళయదినం నాడు ఒక్క అల్లాహ్ నీడ తప్ప మరే నీడా దొరకని పరిస్థితిలో ఏడుగురు వ్యక్తులకు అల్లాహ్ నీడ దొరుకుతుందని మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించారు. అలాంటి ఏడుగురిలో – తనచే తప్పులు దొర్లినప్పుడు రాత్రివేళ ఏకాంతంలో వాటిపట్ల పశ్చాత్తాపం చెంది, క్షమించమని అల్లాహ్‌ను ప్రాధేయపడిన వేళ తన కళ్ళనుండి అశ్రు ధారాలు కురిపించిన వ్యక్తి – ఒకడు. మరి అలాంటి నీడ దొరకాలంటే జరిగిన తప్పిదాల పట్ల మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడాలి, మళ్ళీ అలాంటి దోషాలు పునరావృతం కాకుండా చూసుకోవాలి.

నలువైపుల నుంచేకాదు, మనిషి అంతరంగంలో కూడా షైతాన్ నక్కి వున్నాడు. వాణ్ణి తొక్కిపట్టాలంటే మనం అల్లాహ్ సహాయాన్ని అర్థించాల్సిందే. షైతాను స్వయంగా చెడ్డ వాడు, ఇతరుల్ని కూడా చెడగొడ్తాడు. ఇది షైతాన్

లక్షణం. ఇంత పెద్ద తప్పు చేశావు, కాబట్టి నువ్వు అల్లాహ్‌ను క్షమించమని వేడుకున్నా లాభం లేదు అని మనిషి అంత రంగంలో దుష్ట ఆలోచనతో తిష్ట వేస్తాడు షైతాన్. ఆ ఆలోచన కలగ్గానే, ఇక నేను మంచి పని ఏం చేసినా లాభంలేదు, ఎటూ నరకానికే పోతానని తలపోసి అన్నీ తప్పుడు పనులే చేస్తాడు మనిషి. కాని ఇది సరియైనది కాదు. ఎలాంటి తప్పు నైనా క్షమిస్తానని, స్వర్గాన్ని ఇస్తానని అల్లాహ్ సెలవిస్తున్నాడు ఖుర్‌ఆన్‌లో. అయితే పశ్చాత్తాపం చెందటం ఒక్కటే దానికి షరతు. అందువలన శ్వాస వున్నప్పుడే మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెంది, సత్కార్యాలు చేసే సద్బుద్ధిని ప్రసాదించమని దైవాన్ని వేడుకుంటూ వుండాలి.

> **తమను కాపాడుకోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు - వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూను. (దివ్యఖుర్‌ఆన్-9 : 118)**

اَلْعَفُوُّ

63. అల్ అఫువ్

అల్లాహ్– అల్ అఫువ్ అంటే అత్యధికంగా క్షమించేవాడు. తోటివాడెవ డైనా తప్పు చేస్తే వెంటనే అతన్ని శిక్షించాలని తలపోస్తాడు మనిషి. కాని అల్లాహ్ ప్రతి మనిషికీ వ్యవధి, విడుపునిస్తూ పోతాడు. అది కూడా జీవి తాంతం వరకూ మనల్ని అల్లాహ్ మన్నిస్తూనే వుంటాడు. మనిషిలానే దేవుడూ భావిస్తే అందరూ దండనార్హులే. కాబట్టే ఆయన అందరికంటే అధికంగా మన్నించేవాడు. ఆయన కరుణ, మన్నింపు, కనికరం లేక పోతే మనం ఒక్క క్షణం కూడా మనుగడ సాగించలేము.

దుర్గంధపూరితమైన వ్యర్థ పదార్థాలను భూమిలో పాతిపెట్టడమో లేక అగ్నికి ఆహుతి చేయటమో చేస్తుంటాము. అలాగే మనం చేసిన తప్పులపై దేవుడు అవి పరుల కంట పడకుండా వుండటానికి ఒక తెర వేస్తాడు. అదే విధంగా కట్టెలు అగ్నికి ఆహుతి అయి పోయినట్లు, మనం చేసే దానధర్మాలతో కూడా మన చిన్నాచితకా చిల్లర పనులు, దోషాలు మాయమై పోతాయి. అల్లాహ్ కరుణ, క్షమ మనిషికి ఉభయలోకాల్లోనూ దొరుకుతుంది. అయితే ఆయన చెప్పిన విధంగా నడుచు కుంటేనే మనిషి సఫలీకృతుడవుతాడు. అప్పుడే అతనికి పరలోకంలో సకల స్వర్గ సౌఖ్యాలు లభిస్తాయి.

తమ సంతానం తమ మాటవిని తాము చెప్పిన విధంగా, తాము చూపిన మార్గాన నడవాలని ప్రతి తల్లిదండ్రీ కోరుకుంటారు. తమ మాట వినని సంతానాన్ని దండించటం కూడా జరుగుతుంది. అందరినీ సృష్టించి అన్ని సదుపాయాలను కల్పించిన దేవుడు కూడా మానవులంతా ఆయన్నే పూజించా

లని, ఆయన ప్రవక్తల ద్వారా పంపిన జీవన మార్గం (ఇస్లాం)లోనే అందరూ జీవనాన్ని సాగించాలని కోరుకోవటం కూడా సబబే కదా!

ఏది ఏమైనా నిత్య జీవితంలో ప్రతి మనిషి వల్ల ఎన్నో పొరపాట్లు జరుగుతూ వుంటాయి. పరుల తప్పుల్ని క్షమిస్తూ, అందరినీ కలుపుకొని జీవనం సాగించటం తోనే సమాజంలో శాంతిశ్రేయాలు నెల కొంటాయి. ఒకర్ని మనం క్షమించకపోతే రేపు పరలోకంలో దేవుడు కూడా మనల్ని క్షమించడు. ఆయన క్షమించకపోతే, మనపట్ల కరుణ చూపకపోతే మనం స్వర్గం ఛాయలకు కూడా చేరుకోలేము. నేలనున్నవారిపై కనికరిస్తే నింగినున్నవాడు కూడా మనపై కరుణిస్తాడని మహాప్రవక్త ముహమ్మద్ (స) సెలవిచ్చారు.

నేను అమితంగా మన్నించేవాణ్ణి, అధికంగా కరుణించేవాణ్ణి.

(దివ్యఖుర్ఆన్ - 2 : 160)

اَلرَّءُوْفُ

64. అర్ రవూఫ్

ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సాటి సోదరునికి సాయపడితే అది నిజంగానే గొప్ప దాతృగుణమే. ఈ సుగుణం చాలా కొద్ది మందిలోనే వుంటుంది. మాతృ గర్భంలో వున్న మనిషిపట్ల దేవుడు దయ చూపకపోతే, ఆయన కరుణానుగ్రహాల కిరణాలు మనిషిపై ప్రసరించకపోతే మనిషి ఆపాద మస్తకం లోపభూయిష్టంగానే జన్మిస్తాడు. మాతృగర్భంలో కేవలం ఒక్క వీర్య బిందువు మూలంగా సర్వాంగాలతో ఎంతో సుంద రంగా తయారై జన్మిస్తున్నాడు మనిషి. చూడ టానికి కళ్లు, వినటానికి చెవులు, నడవ టానికి కాళ్ళు, పనిచేయటానికి చేతులు, ఆలోచించడానికి మేధస్సును, శరీరంలో ఓజస్సును, తేజస్సును ప్రసాదించింది ఆ దయామయుడైన అల్లాహ్‌యే కదా! ఇందులో ఏది లోపించినా మనిషి అవిటి వాడిగానే పరిగణించబడతాడు గదా! దాసుల మీద ఇంతగా దయచూపుతున్నాడు కాబట్టే అల్లాహ్– అర్ రవూఫ్ అని పిలవబడుతున్నాడు.

మాతృగర్భంలో వున్నప్పుడేకాదు, ఈ ప్రపంచంలోకి అడుగిడిన ప్రతి శిశువుకూ తల్లి దండ్రులు, బంధువులు, ఇరుగుపొరుగు స్వాగతం పలుకు తున్నారు. ఏ వయసులో ఏది అవసరమో, అవన్నీ సమకూర్చబడుతున్నాయి మనిషికి. ఒకవేళ ఎవరికైనా సదు పాయాలు లభించటం లేదంటే అది మనిషి చేసే నిర్వాకం వల్లనే అలా జరుగుతోంది కాని, సృష్టికర్త మాత్రం అన్నీ సమకూర్చాడు. సృష్టి యావత్తూ మనిషికి వడ్డించిన విస్తరి లాంటిదే. మనిషి పుట్టి, గిట్టే వరకు పోషించేది ఆ అల్లాహ్ మాత్రమే. ఈ ప్రపంచంలోనే కాదు, పరలోకంలో స్వర్గ సుఖాలను ప్రసాదించేది కూడా ఆ స్వామియే. మనిషి పట్ల ఆ స్వామికి ఎంత దయ, కరుణయో ఆలోచించండి! ఇంతగా మేలు చేసినా

దేవుని పట్ల నిత్యం కృతఘ్నుడిగానే మెలగుతున్నాడు మనిషి. ఆయన్ని కొలవకున్నా, పిలవకున్నా దేవుడైతే పుట్టించిన ప్రతి మనిషికీ ఆహారాన్ని, ఆశ్రయాన్ని సమకూరుస్తూనే వున్నాడు.

అయితే ఆయన్ని మాత్రమే విశ్వసించి, ఆయన చూపిన బాటపై, మాటపై నడిచిన ప్రతి విశ్వాసికీ ఉభయలోకాల్లోనూ విజయమే వరిస్తుంది. ఇలాంటి వారిపై అల్లాహ్ కరుణానుగ్రహాలు ఎల్లప్పుడూ కురుస్తూనే వుంటాయి. ఎవరైనా మనకు మేలు చేస్తే ఎల్లప్పుడూ వారిని జ్ఞాపకం పెట్టుకొని వారి పేరును ప్రస్తావించుకుంటూ వుంటాం. మరి పుట్టించి, పోషిస్తున్న ఆ పరమోన్నత ప్రభువుని జ్ఞాపకం చేసే బాధ్యత మనిషిపై లేదా?

మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. చేసిన మేలును మరువకండి. (దివ్యఖుర్ఆన్ : 2 : 152)

اَلْجَامِعُ

65. అల్ జామె

మన దేహంలో దేవుడు ఐదు ఇంద్రియాలను అమర్చాడు. అవి : చూపు, వినికిడి, రుచి, వాసన మరియు స్పర్శ. వీటిలో చూపు ప్రధానమైనది. అందుకే పంచేంద్రియానామ్ నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అంటే అన్నిటిలో కళ్ళు ప్రధానమైనవి, అన్ని అవయ వాలుండీ కళ్ళులేకపోతే జీవితమే అంధకార మవుతుంది. అలాగని తతిమ్మావి అప్రధాన మైనవని ఎంతమాత్రం కాదు. వినేశక్తి లేకున్నా ఎన్నో విధాలుగా ఇబ్బంది పడాల్సివస్తుంది. రుచి చూసే నాలుకే లేకపోతే మనిషి ఏమీ తినలేడు. జ్వరంతో లంకణాలు చేసిన మనిషి ఏమీ తినలేడు. ఎందుకంటే అతని నాలుక రుచే మారిపోతుంది. ఏది తిన్నా చప్పగానే వుంటుంది. ఈ ప్రపంచంలో ఎన్నో రకాల పళ్ళు, ఆహార పదార్థా లున్నాయి. ఎవరికి ఏ రుచి అంటే అభిరుచో వారు వాటినే సేవిస్తూ వుంటారు. జిహ్వా లేకపోతే ప్రపంచంలో వున్న ఏ వస్తువునూ ముట్టుకోడు మనిషి! వహ్వా, జిహ్వా ఎంత ప్రధాన మైనదో దీన్నిబట్టి తెలుస్తోంది.

మనిషి సువాసనలు వెదజల్లే వాతావరణంలో ఎంతసేపైనా వుండగలడు. అలాంటి వాతావరణంలో తన పనులు కూడా సక్రమంగా నెరవేర్చగలడు. వాతావరణం దుర్గంధ పూరితమైతే అన్ని విధాలా అతనికి ముప్పు తప్పదు. అందుకని పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా వుంచుకుంటాం. అలాగే శరీరానికి కూడా స్పర్శ జ్ఞానం వుంది. శరీరం స్పర్శను కోల్పోతే ఎన్నో అనర్థాలు వాటిల్లు తాయి. ఇలాంటి అద్భుతమైన ఇంద్రియాలను ఒకచోట ప్రోగుచేసి అంటే మన శరీరంలో అమర్చి ఈ ప్రపంచ వ్యవస్థను నడిపిస్తున్నాడు దేవుడు.

అల్ జామె అంటే ప్రోగుచేసేవాడు, ప్రళయదినాన మానవులను సమావేశ పరచేవాడు అని అర్థం.

ఈ ప్రపంచంలో ఎన్నో రకాల మనుషుల్ని, జాతుల్ని, పంటల్ని, ప్రోగుచేసి ప్రపంచాన్ని నడిపిస్తున్నవాడు కూడా ఆ అల్లాహ్‌యే. ఒక ఇంటిని నిర్మించాలంటే రాళ్ళు, ఇటుకలు, ఇసుక, ఇనుము ఇంకా ఎన్నో పరికరాలు కావాలి. అలాగే ఈ ప్రపంచాన్ని సాఫీగా నడిపేందుకు లెక్కలేనన్ని జీవనిర్జీవాలను సృష్టించి ఒకే ప్రపంచ వ్యవస్థలో ప్రోగుచేసి వేటి పని వాటి ద్వారా నెరవేరేలా ఏర్పాటు చేసినవాడు ఆ అల్లాహ్‌యే. ఇక్కడ ప్రవక్తల్ని, రాజులను, డాక్టర్లను, ఇంజనీర్లను, ఇంకా ఏ రంగానికి ఎవరి అవసరమో వారందరినీ ఇంకా సామాన్య మానవుల్ని ఈ ప్రపంచ వ్యవస్థలోనే ప్రోగుచేసి ఎవరి పని వాళ్ళకు అప్పజెప్పాడన్నమాట. అందరినీ ఇక్కడ ఎలా ప్రోగు చేశాడో ప్రళయం తరువాత కూడా సర్వమానవుల్నీ మళ్ళీ ప్రోగుచేసి వారి కర్మల గురించి ప్రశ్నించే సమర్థత కూడా ఒక్క దేవునికే వుంది.

ప్రభూ! నీవు నిశ్చయంగా మానవులందరినీ ఒక రోజున సమావేశ పరుస్తావు. ఆ రోజు రావటంలో ఏ మాత్రం సందేహం లేదు.

(దివ్యఖుర్‌ఆన్ - 3 : 9)

اَلْغَنِيُّ

66. అల్ గని

మనిషి కేవలం డబ్బుపై ఆధారపడి జీవించలేడు. అతనికి తిండి, బట్ట, ఆశ్రమం కావాలి. కావలసినంత డబ్బుంది, కానీ కొందామంటే విపణిలో ఆహార పదార్థాలే లేవు. వర్షాలు లేవు, దాని కారణంగా పంటలు లేవు, పచ్చిక లేదు. మన దగ్గర ఎంత డబ్బున్నా ఏం లాభం? సకాలంలో వర్షాలు కురిపించి, పంటలు పండించేది ఎవరు? కేవలం అల్లాహ్‌యే. కాలానికి తగ్గట్టు కావలసిన పంట ఫలాలు పండించి జీవరాసులన్నిటినీ పోషిస్తున్న వాడు ఆ కరుణామయుడైన దేవుడే. అవసరానికి మించి ఎవరికైనా అల్లాహ్ అనుగ్రహిస్తే, అటువంటి వారు పేదవారికి సహాయం చేయాలి. పిసినారితనం వహించ కూడదు. ఒక మనిషి మరో మనిషిపై ఒక సమాజం మరో సమాజంపై, ఒక దేశం మరో దేశంపై కరువు కాటకాల్లో, సంక్షోభాల్లో సహాయ సహకారాలు అందించకపోతే ఈ నేలపై మనిషి నిలదొక్కుకోవటం ఎంతో కష్టం. దేవుడైతే అందరిపై కరుణిస్తూనే వున్నాడు. మనిషే సంకుచిత స్వభావం కలవాడు.

సంపన్నులైన ముస్లింలు ప్రతీ యేటా తమ సంపదపై నిర్ణీత జకాత్‌ను చెల్లించాలి. ఇది ఇస్లామీయ శాసనాంగం ముస్లింలకు తప్పనిసరి చేసిన విధి, బాధ్యత. అంతేగాని జకాత్ చెల్లించటంలో వారి ఉదార స్వభావం ఏమీ లేదు. జకాత్‌గాక ఇంకా అదనంగా ఎవరైనా పేదవారికి దానధర్మాలు చెల్లిస్తే అది వారి దాతృగుణానికి ప్రతీక. దాని ప్రతిఫలాన్ని దేవుడు తప్పకుండా వారికి వారి ఇహపరాల్లో ప్రసాదిస్తాడు. సంపన్నులు సరిగ్గా తమ సంపదపై జకాత్ చెల్లిస్తే ఆర్థిక అసమానతలు క్రమంగా రూపుమాపబడతాయి. దీనికి హజ్రత్

అబూబకర్ (రజి), హ్రజత్ ఉమర్ (రజి), హ్రజత్ ఉస్మాన్ గని (రజి), హ్రజత్ అలీ (రజి)ల పరిపాలనలే సాక్ష్యం.

ఇస్లాం సిరిసంపదలు ప్రజలందరి మధ్య పరిభ్రమించాలని చెబుతుంది. కాని కొంత మంది శ్రీమంతుల మధ్యనే కేంద్రీ కృతమవ్వాలని కోరుకోదు. దివ్యఖుర్ఆన్‌లో ఇలా వుంది: "మీ సంపదలో అల్లాహ్‌కు, ప్రవక్తకూ, బంధువులకు, అనాధులకు, నిరుపేదలకు, బాటసారులకు హక్కు ఉన్నది. అది మీ ధనికుల మధ్యనే పరిభ్ర మించకుండా ఉండేందుకు ఇలా నిర్ణ యించబడింది." దీన్నిబట్టి జకాత్ చెల్లింపు పేదల హక్కేగాని, చెల్లించేవారి దయా గుణం ఏమీలేదని స్పష్టం చేసింది ఖుర్ఆన్.

అల్లాహ్ - అల్ గని అంటే అక్కరలేనివాడు, నిరపేక్షాపరుడు అని అర్థం. మన అన్ని అవసరాలూ, అక్కరలూ తీర్చేవాడు ఆ అల్లాహ్‌యే.

అల్లాహ్ మీ అక్కర ఎంతమాత్రం లేనివాడు. (దివ్యఖుర్ఆన్-39:7)

اَلنُّوْرُ
67. అన్ నూర్

నూర్‌కు శాబ్దిక అర్థం కాంతి అని. అల్లాహ్- అన్‌నూర్ కాంతికి, శాంతికి నిలయం. సూర్యచంద్రులు, నక్షత్రాలు అన్నీ తమ తమ కాంతిని అల్లాహ్ నుండే సంగ్రహిస్తాయి. ఫలితంగానే మనం పగలు రాత్రి వెలుగును గ్రహిస్తు 0న్నాము. విద్యుశ్శక్తిని కూడా దేవుడే ప్రసాదించాడు మనకు. దేవుడిచ్చిన మేధశ్శక్తితో మానవుడు విద్యుశ్శక్తిని కనుగొని తన నిత్యావసరాలకు నిత్యం వాడుకుంటూ వున్నాడు. నేడు అభివృద్ధి అంతా ఈ శక్తి పైనే ఆధారపడివుంది. ఒకనాడు మంత్రాలను నమ్మిన మనిషి నేడు యంత్రాలపై ఆధార పడ్డాడు. యంత్రాలు మనిషిని మంత్ర ముగ్ధుణ్ణి చేసే విధంగా పని చేస్తున్నాయి నేడు.

మనిషి నిత్యం వెలుగునే కోరుకుంటాడు. రాత్రిని కూడా పగటిలా మార్చే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇది భౌతికపరమైన కాంతి. ఇంతగా కాంతి, వెలుగులు విరజిమ్ముతున్నా మానవ బ్రతుకును చిమ్మచీకట్లు ఆవరిస్తున్నాయి. రోజుకు రోజు మానవ విలువల వలువలు ఊడదీయబడుతున్నాయి. మోసం, అన్యాయం, అక్రమం, దౌర్జన్యం సమాజ వృక్షాన్ని సమూలంగా పెకలించేం దుకు సమాయత్తమవుతున్నాయి. దీనికంతటికీ కారణం మనిషి భౌతికతపై ఆధారపడడమే. బ్యానరిజం పెరిగేకొద్దీ మ్యానరిజం నశించి పోతోంది. అభివృద్ధి జరుగుతోందని భ్రమిస్తు న్నాము కాని అరాచకం, అన్యాయం రాజ్యమేలు తున్నాయన్న సంగతిని పట్టించు కోవటంలేదు మనం.

నైతిక విలువలు వుంటే చాలు భౌతిక అభివృద్ధి దానంతట అదే వస్తుంది. మనకు కాంతిని ప్రసాదించిన ఆ అల్లాహ్‌ను నమ్ముకుంటే మన చుట్టూ

వ్యాపించిన చీకట్లు వాటంతటవే పటాపంచలవుతాయి. ఉత్తమ నడవడిని అలవరచుకున్న మనిషి ఎటు సంచరిస్తున్నా అక్కడ కాంతి ప్రసరిస్తూనే వుంటుంది. అతని మాటలు చేతలు నిత్యం వెలుగునే విరజిమ్ముతూ వుంటాయి. అసలైన దైవాన్ని వదలి, సృష్టితాలను పూజిస్తున్నవారు కటిక చీకట్లల్లోకి తరలి వెళుతున్నారు. భ్రమతో శ్రమ పడుతున్నారు తప్ప దానివల్ల ప్రయోజనం లేదు. మన ఉనికికి కారణం ఆ అల్లాహ్‌యే. ఆయనే మనల్ని పోషిస్తున్నాడు, కాపాడుతున్నాడు. నిత్యం మనల్ని గమనిస్తున్నాడు. కాబట్టి ఆయన్ని మాత్రమే నమ్ముకొని, ఆయన్ని ఆరాధించటంలోనే విజ్ఞత, వెలుగు దాగి వున్నాయి. ఆయన ఆరాధనే మన జీవితానికి వెలుగు. మనలో ఆ వెలుగు ప్రవేశిస్తే చాలు చీకట్లు వాటంతటవే పటాపంచలవుతాయి. సత్యం వెలుగుతో సమానం, అసత్యం చీకటికి మారుపేరు. ఎవరు దేన్ని అనుసరిస్తే దాన్నే పొందుతారు.

అల్లాహ్ ఆకాశములకూ, భూమికీ వెలుగు. (దివ్యఖుర్‌ఆన్-24:35)

اَلْهَادِیْ

68. అల్ హాది

అల్లాహ్ అల్ హాది అంటే రుజుమార్గాన్ని చూపించేవాడని అర్థం. పుట్టినప్పుడు తల్లి దండ్రులు, విద్య నభ్యసించేటప్పుడు గురువు గారు మనిషికి మార్గాన్ని చూపిస్తూ వుంటారు. తల్లిదండ్రులు లేక గురువు మనిషికి చూపే మార్గంలో లోటుపాట్లు, పొరపాట్లు జరగవచ్చు. కాని పుట్టించిన దేవుడు చూపే మార్గంలో ఏమాత్రం వక్రత, పొరపాటు వుండదు. ప్రతి మనిషి పుట్టి నప్పుడు ఇస్లాం పద్ధతిలోనే పుడుతున్నాడు. అయితే తల్లిదండ్రుల పెంపకం కారణంగా అతను అవిశ్వాసిగా మారిపోతున్నాడు.

ఒకేదైవాన్ని విశ్వసించిన తల్లిదండ్రులు తమ సంతానాన్ని కూడా విశ్వాసులుగానే మలచాలని ప్రయత్నిస్తారు. అయితే అవిశ్వాసుల ఇంట పుట్టిన వారు వారి వంశపారంపర్యంగా తమకు సంక్రమించిన ధర్మంలోనే జీవనాన్ని సాగిస్తూ వుంటారు కాని, అసలైన తిన్నని మార్గమేదో, ఏ మార్గాన్ని, ఏ జీవన విధానాన్ని, ఏ ధర్మాన్ని అనుసరిస్తేవారు ఇహపరలోకాల్లో సుఖంగా వుంటారో అనేది ఆలోచించరు. ఆలోచించినా వారికి వారి కులగోత్రాలు, వంశపారం పర్యత, సాంఘిక కట్టుబాట్లు వారిని చిక్కుముడుల్లో బంధించి సత్య సందేశ స్వీకారానికై అభేద్య అడ్డు గోడలుగా మారతాయి. కాని తన మేధాశక్తితో ఆలోచించి, అసలైన సత్యధర్మాన్ని స్వీకరించిన శుభాత్మలు ఎంతో అదృష్టానికి నోచుకుంటాయని చెప్పవచ్చు. వారి త్యాగానికి ప్రతిఫలం స్వర్గ సౌఖ్యాల్లో వారికి పెద్ద భాగం, భాగ్యం లభించనుంది. ఎందుకంటే వారు చేసింది సామాన్య మైన త్యాగం కాదు.

అంతకు ముందు, ఒక మనిషికి సమాజంలో ఎంతో పలుకుబడి, హోదా, గౌరవం ఇంకా సంపద వుండవచ్చు.

కాని ఎప్పుడైతే సత్య ధర్మమైన ఇస్లాం స్వీకరించాడో వెంటనే ఆ హోదాలు, గౌరవ ప్రతిష్టలు మాయమైపోతాయి. నిజంగా ఆలోచిస్తే సత్య ధర్మ స్వీకారం ముందు ఈప్రాపంచిక గౌరవప్రతిష్టలన్నీ ఎందుకూ కొరగానివి. మనిషికి ఈ లోకమేశాశ్వతం కానపుడు ప్రాపంచిక వస్తుసంపద, గౌరవాలు శాశ్వతంగా వుంటాయా? మనం చూస్తూవుండగానే నిన్నటి వరకు కోటీశ్వరుడైనవాడు తెల్లారితే పరిస్థితుల అననుకూలతల్లో, మరో కారణంగానో నిరుపేదగా మార వచ్చు. కాబట్టి ప్రతి మనిషి తనకు తిన్నని మార్గంచూపమని, సదా దైవాన్ని వేడుకుంటూ వుండాలి.

నిశ్చయంగా అల్లాహ్, విశ్వసించే వారికి ఎల్లప్పుడూ రుజువైన మార్గం చూపుతాడు. (దివ్యఖుర్ఆన్:22-54)

اَلْبَدِيْعُ

69. అల్ బదీ

ప్రతి విషయంలో ఒక క్రమం వుంది, నియమం వుంది. నియమాలను పాటించక పోతే నష్టపోయేది మనమే. రోడ్డుపై వాహనం నడపాలన్నా, పట్టాలపై రైలు నడవాలన్నా నియమాలను పాటించాలి. అప్పుడే ప్రయాణం సాఫీగా, సజావుగా సాగి, సరి అయిన సమయంలో గమ్యానికి చేరుకుంటాం. అలాగాక, నియమాలను ఉల్లంఘించి ఇష్టమొచ్చినట్లు వాహనాన్ని నడిపితే ప్రమాదాలకు లోనవుతాం. మనిషి జీవితం సాఫీగా సాగాలన్నా దేవుడు నిర్ణయించిన నియమాలకు, హద్దులకు లోబడి జీవించాలి. ఇష్టమ్యాటిక్‌గా కాకుండా సిస్ట మ్యాటిక్‌గా జీవించినప్పుడే మనిషి అన్ని విధాలా బాగుంటాడు.

పంటలు పండించాలంటే అంతకు ముందు నేలను దున్నాలి, విత్తనాలు నాటాలి, సకాలంలో నీరందించాలి, తెగులు వస్తే మందేయాలి, పగలు రేయనక, ఎండా వాన అనక కష్టపడితే గాని పంట చేతికందదు. అలాగాక మన యిష్టం వచ్చినప్పుడు ముందు చేయవలసింది, వెనక, వెనక చేయాల్సింది ముందు చేస్తే నష్టపోయేది మనమే.

ఈ లోకంలో మనిషి ఎలా జీవించాలి? ఎవరిని ఆరాధించాలి? ఇంకా పరలోక సాఫల్యత ఎలా లభిస్తుంది? మొదలైన అనేక విషయాలను తెలుపటానికి దేవుడు ప్రతి దేశంలో, ప్రతి ప్రాంతంలో ప్రవక్తల్ని పంపుతూ వచ్చాడు. ఈ ప్రవక్తల పరంపరలో చిట్టచివరి వారు ప్రవక్త ముహమ్మద్ (స). అల్లాహ్, ఆదేశాలను పాటించి చూపేవారు ప్రవక్తలు. అంటే వారు మనకు ఆదర్శనీయులు. అలాంటి మహాపురుషుల జీవితాలు సామాన్య మానవు

లందరికీ మార్గదర్శకాలు. వారి జీవిత విధానాలను అనుసరించి నడుచు కున్నప్పుడే మనిషి ఇహపరలోకాల్లో సఫలీకృతుడవుతాడు. దేవుణ్ణి, దైవప్రవక్తను విడనాడిన ప్రతిజాతి, తెగ సర్వనాశనమై పోయాయని మనకు ఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది.

మన పుట్టుకకు పూర్వం మన ఉనికే ప్రపంచంలో లేదు. మన ప్రస్తావనే మన కుటుంబంలో లేదు. కేవలం మాతృగర్భంలో వీర్య బిందువుతో తయారైన మానవుడు ఎంతటి జగడాలమారిగా తయారయ్యాడు? ఎంతటి ధిక్కారిగా మారుతున్నాడు? దేవుణ్ణి, దేవుని సృష్టినే ప్రశ్నిస్తున్నాడు. అంతా తన చేతిలో వున్నట్లే భావిస్తున్నాడు. మరణాన్ని మరచిపోయాడు. మరణించాక దేవునితో కలవాలనే తలంపే రావటం లేదు నేటి మానవునికి. ఏమీ సృష్టించ లేని మానవుడు తన సృష్టికర్తనే ఎదిరిస్తున్నాడు.

అల్లాహ్ - అల్ బదీ అంటే ఎలాంటి నమూనా లేకుండానే దేన్నైనా సృష్టించ గల సమర్ధుడు, అనన్య ప్రతిభాశాలి అని అర్థం.

ఆయన ప్రతి వస్తువును పుట్టించాడు. ఆయనకు ప్రతి వస్తువును గురించీ తెలుసు. ఆయనే అల్లాహ్. మీ ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేదు. ఆయన సర్వానికీ సృష్టికర్త. కనుక మీరు ఆయననే ఆరాధించండి. (దివ్యఖుర్ఆన్ : 6-101, 102)

اَلرَّبُّ

70. అల్ రబ్

అల్లాహ్– అర్ రబ్ అంటే ఆయన కేవలం సృష్టికర్తయే కాదు, పోషకుడు, రక్షకుడని అర్థం. తల్లిదండ్రులు తమ సంతానాన్ని పోషించటమే కాకుండా వారు ప్రమాదాలకు లోనుకాకుండా అన్ని జాగ్రత్తలూ తీసు కుంటూవుంటారు. అలాగే మనల్ని సృష్టించిన దేవుడు కూడా మనల్ని పోషిస్తూ, మనకు తెలీకుండానే మన రక్షణకు కావలసిన అన్ని ఏర్పాట్లూ చేశాడు. ప్రతి దశలో అంటే మన బాల్యంలో, యవ్వనంలో, వృద్ధాప్యంలో ఎప్పుడు ఏది అవ సరమో ఆ సదుపాయాన్ని మనకు సమ కూరుస్తూనే వున్నాడు ఆ దేవుడు. సదా మన సర్వతోముఖాభివృద్ధికి ఆయన తోడ్పడుతూనే వున్నాడు.

మనిషి శారీరకంగా, మానసికంగా లేక సంపదరూపేణా ఎంత అభివృద్ధి చెందినా, ఆధ్యాత్మికంగా కుంటుపడితే అన్ని చోట్లా అభివృద్ధి కుంటుపడినట్లే. జంతువులు కూడా మనలాగే శారీరకంగా ఎదుగుతూనే వుంటాయి. కాని మానసిక పరివర్తన, ఇంగిత జ్ఞానం వాటికి లేవు. ఆధ్యాత్మిక చింతన వుంటేనే మనిషి దైవాన్ని, ఇంకా ఆయన గొప్పదనాన్ని గుర్తించగలుగుతాడు. ఈ లోకంలో ఎంత మంది మనుషులు పుట్టి గిట్టారో, ఇంకా ప్రళయం వరకు ఎన్ని కోట్ల మంది పుడతారో ఆ ఒక్క దైవానికే తెలుసు. ఒక్క మనుషులే కాదు, నేలపై, నింగిపై, నీటిలో, ఇంకా మనిషి జ్ఞాన పరిధికి అందని అనేక స్థానాల్లో, స్థావరాల్లో అగణిత జీవ రాసులున్నాయి. వీటన్నిటినీ పుట్టించి, పోషిస్తూ నిత్యం వాటి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న ఆ పరమోన్నత ప్రభువు ఎంత గొప్పవాడు! మన ఇంటికి ఒక్క రోజు, ఒక అతిథి వస్తేనే భరాయించలేం.

కాని అనుక్షణం ఎన్ని కోటానుకోట్ల జీవరాసులకు ఆహారాన్ని ప్రసాదిస్తున్నాడు ఆ దేవుడు! తలచుకుంటేనే బుర్ర స్థంభించిపోతుంది.

అలాంటి సృష్టికర్తను కాదని మనిషి ఎవర్ని ఆరాధిస్తున్నాడు? తనకంటే హీనమైన, నీచమైన జీవనిర్జీవాల్ని పట్టి పూజిస్తున్నాడు. ఎంత దిగజారిపోయాడు మానవుడు. మానవుడు మార్గం తప్పినప్పుడల్లా అతన్ని సరియైన మార్గాన నడపడానికి అనేకమంది ప్రవక్తల్ని పంపుతూ వచ్చాడు దేవుడు. ఆ పరంపరలోని చిట్టచివరి ప్రవక్తే ముహమ్మద్ (స). ప్రళయం వరకు మరో ప్రవక్త రాడు. మరో ఆకాశ గ్రంథం రాదు. క్ఫాబట్టి మానవాళి మొత్తానికి మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆదర్శనీయులు. ఆయన (స) ఆచరించి చూపిన బాటే అందరికీ అన్ని చోట్లా శరణ్యం.

అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు. అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, ప్రతిఫల దినానికి స్వామి. (దివ్యఖుర్ఆన్–1:1–3)

اَلْمُبِيْنُ

71. అల్ ముబీన్

కొంతమంది అల్లాహ్ ఎక్కడో ఏడవ ఆకాశంలో ఎవరికీ కనిపించకుండా, సింహాస నాధీషుడై వున్నాడని, ఆయన ఎప్పుడూ అందనివాడని తలపోస్తూ వుంటారు. ఇది పూర్తిగా తప్పుడు తలంపు. ఆయన మనకు ఎంత దగ్గరవున్నా డంటే మన బృహద్ధమని కంటే దగ్గర వున్నానని, పిలిచేవాని పిలుపును వింటున్నా నని, సమాధానం ఇస్తానని దివ్య ఖుర్ఆన్‌లో సెలవిచ్చివున్నాడు దేవుడు. ఆ మహిమాన్వితుడు మహిలోని అణువణువునా దాగి వున్నాడు. చూసే దృష్టి, వినే చెవులు వుండాలేగాని ఆయన లేనిదెక్కడ? మానవుని దృష్టి సంకుచితమైనది. తనకు నచ్చకపోతే సత్యాన్ని అసత్యమని, అసత్యాన్ని సత్యమని వక్రీకరిస్తాడు. దేవుడున్నాడని మనిషి సాక్ష్యం చెప్పకున్నా సృష్టిలోని ప్రతిదీ - చరాచరాలు, జీవనిర్జీవాలు అన్నీ - సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. మరి ఒక్క మనిషే తలబిరుసుతనానికి, అహంభావానికి గురయ్యాడు. తన సృష్టికి కారణమై, తనను పోషిస్తూ, నిత్యం తనను కాపాడుతూవున్న ఆ పరమోన్నత ప్రభువు పట్ల ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు మానవుడు?

అల్లాహ్ దృష్టిలో సర్వమానవులూ సమానమే. అందరినీ ఆయనే సృష్టించాడు, ఆయనే పోషిస్తున్నాడు. ఆయనకు ఎలాంటి తార తమ్యాలు లేవు. ఆయన్ని ఎవరు పిలిచినా, కొలిచినా వారి మొరలను తప్పకుండా ఆలకిస్తాడు. మన ప్రార్థనల్ని విని, మన అవసరాలు పూరించేది కూడా ఆయనే. ఆయన్ని వదలి మరొకర్ని అర్థించడం, మానవ మాత్రులపై లేనిపోని ఆశలు పెట్టు కోవటం అర్థం లేని విషయం. దేవునికి మనకూ మధ్య ఎలాంటి మధ్యవర్తులు,

దళారులు, ఏజెంట్లు లేరు. నేరుగా మనం ఆయనతోనే మన సంబంధ బాంధవ్యాలు పెట్టుకోవాలి. ఆయన ప్రతిక్షణం మనకు సహాయం చెయ్యాలనే ఎదురుచూస్తున్నాడు. కాని మనమే ఆయన్ని అర్థం చేసుకోవటం లేదు. నేరుగా ఆయనతో నిత్యం హాట్‌లైన్‌లో సంభాషించే అవకాశాన్ని వదలుకొని ఎక్స్ఛేంజ్‌లోవున్న ఆపరేటర్‌ని సహాయం చేయమని అర్థించటం ఎలా వుంటుందో ఇతరులపై భరోసా ఉంచటం కూడా అలాంటిదే. అల్లాహ్‌తో సంభాషిం చేందుకు ప్రతి మనిషికీ డైరెక్ట్‌లైన్ వుంది. అదే వినయపూర్వకమైన వేడుకోలు లేక ప్రార్థన. మనస్ఫూర్తిగా మనం వేడుకోవాలే గాని, నెరవేరని కోరికంటూ ఏదీలేదు. ఆయన వద్ద దేనికీ కొరత లేదు. ఆయన ఇచ్చేవాడే గాని, పుచ్చుకునేవాడు కాదు. ప్రపంచంలో ఎంతపెద్ద ధనికుడైనా కొంతమేరకే సహాయం చేయగలడు. ఆ తరువాత అతని సంపదలో కొరత ఏర్పడుతుంది. కాని అల్లాహ్ సంపద పెరిగేదే కాని తరిగేది కాదు.

అల్లాహ్- అల్ ముబీన్ అంటే సత్యాన్ని సత్యంగా నిరూపించేవాడని అర్థం. సత్య స్వీకారం కన్నా మించిన సంపద ఈ ప్రపంచంలో లేనేలేదు.

“ఆ రోజు అల్లాహ్ వారికి తగిన ప్రతి ఫలాన్ని పూర్తిగా ఇస్తాడు. ఇంకా సత్యాన్ని సత్యంగా నిరూపించే అల్లాహ్‌యే సత్యమని వారికి తెలిసి పోతుంది.” (దివ్యఖుర్ఆన్: 24 : 25)

اَلْقَدِيْرُ
72. అల్ ఖదీర్

అల్లాహ్– అల్ ఖదీర్ అంటే ప్రతి వస్తువుపై, ప్రతి ప్రాణిపై పూర్తి ఆధిపత్యం, అధికారాలు కలవాడని అర్థం. మనం ఏదైనా కార్యాలయానికి, లేక కార్ఖానాకు వెళ్ళామంటే అక్కడ అనేక మంది వివిధ హోదాల్లో పని చేస్తుండటాన్ని గమనిస్తూ వుంటాం. అక్కడ కొంతమంది ఆఫీసర్లు గా, గుమస్తాలుగా, గణకులుగా ఇంకా క్రింది స్థాయి సేవకులుగా పని చేయటాన్ని గమనిస్తూవుంటాం. ఏమైనా అందరూ కలిసికట్టుగా, జట్టుగా పని చేసినప్పుడే కార్యాలయమైనా, కార్ఖానా అయినా అబివృద్ధికి నోచుకుంటుంది. దేవుడు ఎవరిని ఏ స్థానంలో వుంచాలో, ఎవరిచేత ఏ పని నెరవేరేలా చేయాలో ముందుగానే నిర్ణయించాడు. ఎవరు ఎక్కడ పుట్టాలో, ఏ పని చేయాలో, ఎవరికి ఎంత జీవన కాలాన్ని ఇవ్వాలో అంతా ముందుగానే నిర్ణయించాడు దేవుడు. ఎవరి అంతస్థులు, హోదాలు వారివే, ఎవరి పనితనం వారిదే.. ఇలా బ్రతికి పోండి అని అల్లాహ్ ఒక్కొక్క రికి ఒక్కో నైపుణ్యాన్నిచ్చాడు. దీని వలన తెలిసేదేమంటే అధికారం, అధిపత్యం అంతా అల్లాహ్ హస్తగతమైవుంది.

అవనిలోనే కాదు, ఆకాశంలో, సముద్రాల్లో ఇంకా ప్రతి చోటా అల్లాహ్ ఆధిపత్యమే చెల్లుతుంది. సర్వలోకాలకు అధిపతి అయిన ఆ అల్లాహ్ కేవలం మనుషుల విధి వ్రాతల్నే కాదు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాల్ని కూడా నియంత్రించాడు. సూర్యుడు ఎప్పుడు ఉదయించాలో, దాని తరువాత చంద్రుడు, నక్షత్రాలు ఎప్పుడు ప్రకాశమానమవ్వాలో, గ్రహాలు ఎలా పరిభ్రమించాలో, వాటి హద్దుల్ని, పొద్దుల్ని, పొలిమేరల్ని నిర్ణయించింది ఆ సృష్టికర్త అల్లాహ్‌యే.

ఒకవేళ వీటిపై అల్లాహ్ ఆధి పత్యమే లేకుంటే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు తమ తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తే ఒక్కక్షణం కూడా మనిషి ఈ పుడమిపై జీవించలేడు. భూగోళమంతా గందరగోళంలో మునిగిపోతుంది.

పుట్టిన ప్రతి జీవి గిట్టక మానదు. పుట్టుకే మన చేతిలో లేనప్పుడు గిట్టుకను మనం నిలిపివేయగలమా? గిట్టటమంటే ఏ మనిషికీ గిట్టదు. వందేళ్ళు కాదు కదా, వెయ్యేళ్ళు బ్రతికినా మనిషికి తన కోరికలీడేరవు. ఆశలకు అంతం లేదు. ఎంత తిన్నా మనిషి కడుపునిండదు. యవ్వనంలో వున్నప్పుడు అవయవాలన్నీ ఎంతో పటుత్వాన్ని కలిగివుంటాయి, చూస్తూ చూస్తూనే యవ్వనం ఉడిగిపోతుంది. శరీరం పటుత్వాన్ని కోల్పోతుంది. మనసులో కోరిక వున్నా, ఒడలు ఉడిగిపోతుంది, పట్టు సడలిపోతుంది. దీనికంతటికీ కారణం అల్లాహ్‌యే.

"సప్తాకాశాలనూ, అలాంటివే ఎన్నో భూమండలాలనూ సృజించిన వాడు అల్లాహ్‌యే. వాటిపై అల్లాహ్ ఆజ్ఞ అవతరిస్తూ వుంటుంది. అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలిగివున్నాడనీ, అల్లాహ్ జ్ఞానం ప్రతి వస్తువును పరివేష్టించి ఉన్నదనీ మీరు తెలుసుకోవటానికి ఈ విషయం మీకు తెలియజేయబడుతోంది."

(దివ్యఖుర్ఆన్: 65: 12)

اَلْحَفِيْظُ

73, అల్ హాఫీజ్

ప్రతి ప్రమాదం నుండి, ఆపద నుంచి అనుక్షణం తన దాసుల్ని పరిరక్షిస్తు న్నాడు కాబట్టే అల్లాహ్- అల్ హాఫీజ్ అని పిలువబడుతున్నాడు. ప్రతి జీవరాసి తన సంతానాన్ని సాకటమే కాకుండా, వారిని శత్రువుల బారినుండి కాపాడ టానికి తగు ఏర్పాటు కూడా చేస్తుంది, ఇంకా ప్రతిక్షణం అప్రమత్తమై వుంటుంది.

సర్వసృష్టికి కర్త అయిన అల్లాహ్‌యే ఒక వస్తువును లేక ప్రాణిని రక్షించదలచు కుంటే మానవ ప్రపంచం మొత్తం ఏకమైనా వాటికి ఎలాంటి హానీ చేయలేరు. సృష్టి ఆది నుండి మనిషి మార్గదర్శకం కొరకు అల్లాహ్ తన ప్రవక్తల్ని పంపుతూ వారిపై గ్రంథాలను కూడా అవతరింపజేశాడు. ఈ గ్రంథాల పరంపరలో మనం మచ్చుకు కొన్నిటిని ప్రస్తావించు కోవటం సముచితం. హజ్రత్ మూసా (అలై)కు తౌరాత్‌ను, హజ్రత్ ఈసా (అలై)కు ఇంజీల్‌ను ప్రసాదించాడు. చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స)కు దివ్యఖుర్ఆన్ ప్రసా దించి పంపాడు దేవుడు. ఒక్క ఖుర్ఆన్ తప్ప అంతకు ముందు పంపిన గ్రంథాలన్నీ ప్రక్షిప్తాలకు గురిఅయ్యాయి. ఆయా కాలాల్లో రాజులు, ధార్మిక గురువులు, ప్రవక్తలు పరమపదించిన తరువాత తమ ఇష్టానుసారం వాటిలో మార్పులు చేర్పులు చేసుకున్నారు. అంటే దైవగ్రంథంలోని ఏదైనా విషయం తమకు నచ్చకపోతే దాన్ని తొలగించటం, తమకు నచ్చిన విధానాన్ని అందులోకి చేర్చడం లాంటి దుష్కృత్యాలకు పాల్పడటం మూలంగా అసలు దైవగ్రంథం, దైవాదేశం ఏది అనే సందేహం కలిగేది.

కాని చివరి దైవగ్రంథమైన దివ్యఖుర్ఆన్ అలాంటి ప్రక్షిప్తాలకు, మార్పులు

చేర్పులకు అతీతంగా వుండేలా స్వయంగా దేవుడే దాని రక్షణ బాధ్యతను తీసుకున్నాడు. 1400 ఏళ్ళకు పూర్వం ప్రవక్త (స)పై అవతరించిన గ్రంథం నేటికి కూడా ఒక హల్లుకాదు కదా, పొల్లులో కూడా తేడా లేకుండా వుందంటే ఎంత ఆశ్చర్యకరం! అంతేకాదు ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఎక్కడికెళ్ళినా - అన్నీ ఒకే విధంగా వుంటాయి. దుష్టులు ఈ గ్రంథానికి ఏదైనా హాని చేకూర్చాలన్నా వారివల్ల కాదు, ఎందుకంటే ప్రపంచంలోని కోట్లాది ముస్లింలు దీన్ని కంఠోపాఠం చేసుకొని వుంటారు. ఈ గ్రంథం రక్షణ విషయంలో దేవుడే ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: (వారు తిరస్కరించినంత మాత్రాన ఈ ఖురాన్‌కు నష్టమేమీ వాటిల్లదు) ఈ ఖుర్‌ఆన్ మహత్తరమైనది, ఫలకంపై వ్రాయబడి భద్రంగా ఉన్నది.

ఇలాంటి మహిమాన్విత గ్రంథంలోని ఆదేశాలను పాటించిన ప్రతి మనిషీ ఎంతో అదృష్టానికి నోచుకున్నట్లే. ఇందులో ఎన్నో జాతుల గాధలు, గుణపాఠాన్ని గరిపే సంఘటనలున్నాయి. ఈ గ్రంథం సత్యాసత్యాలను విడమరచి చెబుతుంది. ఏ మార్గం అనుసరిస్తే మనిషి స్వర్గానికి చేరుకుంటాడు, మరేమార్గం అవలంబిస్తే కష్టాల పాలై చివరికి నరకంలో పడవేయబడతాడో అనే విషయాన్ని వివరంగా చెబుతుంది. మరి మనమూ ఈ రోజు నుంచి, కాదు ఈ క్షణం నుంచి ఈ గ్రంథాన్ని పారాయణం చేద్దామా?

"ఆయనకు మీరు ఏ మాత్రం హాని చెయ్యలేరు. నిశ్చయంగా నా ప్రభువు ప్రతి వస్తువునూ కనిపెట్టి ఉంటాడు."

(దివ్యఖుర్‌ఆన్: 11 : 57)

اَلْكَفِيْلُ

74. అల్ కఫీల్

ఆహారాన్ని, ఆశ్రయాన్ని ఇవ్వడమేగాక ఆపదల్లో చిక్కుకున్నప్పుడు మనల్ని ఆదుకునే వాడు కూడా ఆ అల్లాహ్‌యే కదా! కష్టాల్లో నష్టాల్లో కూరుకుపోయి నప్పుడు వాటిని అధిగమించి, వాటి నుండి బయటపడేలా చేయటానికి మన మనసులో ఆలోచనలు రేకెత్తించేలా చేసేది కూడా ఆ అల్లాహ్‌యే. అందుకనే ఆయన్ని మనం అల్ కఫీల్ అని పిలుస్తున్నాం. ఆయనే మనల్ని అనుక్షణం రక్షించే స్వామి. శారీరకంగానే కాదు మన విశ్వాసాన్ని కూడా ఆయనే కాపాడు తున్నాడు. ఒకసారి దైవాన్ని విశ్వసించిన తరువాత మనిషి మళ్ళీ ఎలా అవిశ్వాసిగా మారతాడు? అని మనం తలపోయవచ్చు. మనిషి చపల చిత్తుడు. క్షణక్షణం ఆలోచనలు మారుతూ వుంటాయి. మనిషిని తన వలలో వేసుకొని పెడమార్గం పట్టించాలని షైతాన్ మాటువేసి వున్నాడు. మరి అలాంటి దుష్టుడైన షైతాన్ బారి నుండి మనంతట మనం రక్షించు కోవాలంటే అయ్యేపనికాదు. అందుకనే అనుక్షణం అల్లాహ్ నామ స్మరణకు మన జిహ్వా, ఆలోచనలు అలవాటుపడాలి. అదే మనకు రక్షణగా పనిచేస్తుంది. అలా చేయక పోతే మనల్ని షైతాన్ ఏ క్షణాన్నయినా వశ పరచుకునే అవకాశముంది.

మనం ఒక విత్తనాన్ని నాటి లేక పైరు పోసి అలాగే వదిలేయం. విత్తిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు మనిషి ఎంతో ప్రయాసపడతాడు. పైరుకు సకాలంలో నీరందిస్తాడు, చీడపీడలు తెగుళ్ళబారి నుండి కాపాడటానికి తగిన ఉపాయాలు వెతుకు తాడు, పశుపక్ష్యాదుల నుంచి, పరులు దొంగిలించ

కుండా ఉండటానికి ఇలా పలు విధాల జాగ్రత్తలు తీసుకుంటాడు. ఇన్ని తంటాలు పడితేగాని పంట చేతికిరాదు.

అలాగే దేవుడు కూడా మనిషిని సృష్టించినది మొదలు గిట్టే వరకూ సన్మార్గాన వుంచాలని, తద్వారా అతని మరణానంతరం స్వర్గాన్ని ప్రసాదించాలనే కోరుకుంటాడు. కాబట్టే మనిషి మార్గదర్శకం కోసం, మేలు కోసం లక్షకు పైచిలుకు ప్రవక్తల్ని, పవిత్ర గ్రంథాల్ని పంపుతూవచ్చాడు. మనిషి పుట్టి గిట్టే వరకు ఎన్నో అవకాశాల్ని ఇస్తూపోతున్నాడు దేవుడు. అయినా మనిషి స్పృహలోకి రావటం లేదు. సృష్టి ప్రారంభంలోనే దేవుడు మానవుల ఆత్మలన్నిటినీ జమచేసి నేను మీ ఆరాధ్య దైవాన్ని కానా? అని అడిగినప్పుడు, "అవును ప్రభూ! నీవే మా ఆరాధ్య దైవానివి" అని విన్నవించుకున్నాయి. దేవునితో చేసిన ప్రమాణాన్ని ఎంతమంది నిలబెట్టు కుంటున్నారో అందరూ ఆలోచించాల్సిందే. నిన్నే ఆరాధిస్తానని చెప్పిన మనిషి లోకంలోకి వచ్చాక దైవాన్ని కాదని సాటి సృష్టితాలను ఆరాధించి కష్టాలు కొని తెచ్చు కుంటున్నాడు.

మీరు అల్లాహ్‌తో ఏదైనా వాగ్దానం చేసివుంటే ఆ వాగ్దానాన్ని నెరవేర్చండి. అల్లాహ్ సాక్షిగా చేసిన ప్రమాణాలను ధృడపరచిన తరువాత భంగపరచ కండి. అల్లాహ్ మీ పనులన్నిటినీ ఎరుగును.

(దివ్యఖుర్ఆన్-16 : 91)

اَلشَّاكِرُ
75. అష్ షాకిర్

ప్రపంచంలో కోటాను కోట్ల ప్రజలున్నారు. అందరినీ సృష్టించింది ఆ అల్లాహ్‌యే. ఒక్కొక్కరికి ఒక్కో రంగు, ఒక్కో రూపం ఇచ్చాడు. ఒకరికి జ్ఞాన సంపదను, మరొకరికి ధన సంపదను ప్రసాదించాడు. ఎవరికి ఏది ప్రసాదించినా, ప్రసాదించకపోయినా అన్నీ మనిషి పరీక్ష కొరకే. కొందరికీ అన్నీ ఇచ్చినా, వారికి సంఘంలో గౌరవమే వుండదు. మరికొందరికి ఏమీ లేకున్నా సమాజంలో వారికి గౌరవోన్నతులు దక్కుతాయి. ఈనాడు సమాజంలో గౌరవం అనేది ప్రాపంచిక సంపదతో ముడివడి వుంది. ఎవరు ఎక్కువ ఆస్తిపాస్తులు కలిగి వుంటారో అలాంటివారికే నేటి సమాజం దాసోహమం టోంది. ఆ సంపద ఎలా సంపాదించినా సమాజం దాన్ని పట్టించు కోవటం లేదు. అలాంటి అక్రమార్జనతోనే అన్నీ సక్రమమవుతాయనీ, దీనితోనే దైవప్రీతి పొందవచ్చని తలపోస్తూవుంటారు కొందరు.

కాని తన మార్గంలో ఎవరు ఏది ఖర్చు చేసినా అది సక్రమార్జన ద్వారానే లభించినదై వుండాలని షరతు బెట్టాడు దేవుడు. పరుల సొమ్ము దోపిడీ చేసి దేవుని హుండీలో లక్షలు వేస్తే సరిపోతుందా? అలాంటి అపవిత్ర సొమ్ము దైవమార్గంలో అసలు స్వీకరించబడదు. పైగా అలాంటివారికి యాతన తప్పదని హెచ్చరిస్తున్నాడు దేవుడు. అల్లాహ్‌ను సంతోష పెట్టాలంటే మరొకర్ని బాధించడం కాదుగా! న్యాయంగా నడచుకోవడం ద్వారానే ఇహపరలోకాల్లో విజయం చేకూరుతుంది.

మనిషికి ఏది లభించినా అది దైవప్రసాదితమే. ఎన్నిసార్లు కృతజ్ఞతలు తెలుపుకున్నా అది తక్కువే. నిత్యం కృతజ్ఞతలు చెల్లించుకుంటూ దైవాన్ని స్మరించే

దాసు లంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. తెలిసో తెలియకో మనిషివల్ల ప్రతిరోజూ ఏదో ఒక తప్పు, పొరపాటు జరుగుతూనే వుంటుంది. దేవుడేగనక చూసీచూడనట్టు వహించకపోతే అందరూ పట్టుబడతారు. ఆయన కరుణా కటాక్షాల వల్లనే మనం అనుక్షణం రక్షించబడుతున్నాం.

కాబట్టి నిత్యం ఆ మహోన్నతుడైన స్వామిని మాత్రమే ఆరాధిస్తూ, ఆయనకు కృతజ్ఞతలు చెల్లించుకుంటూ వుండాలి. ఈ లోకంలో మన గౌరవోన్నతులకు కారణం ఆయనే. ఆయన కారణంగానే మనకు సమాజంలో అంతో ఇంతో గౌరవం, ప్రతిష్ట దక్కాయి. అల్లాహ్– అష్ షాకిర్ అంటే దాసుల ప్రయత్నాలకు, పనులకు విలువనిచ్చేవాడని అర్థం. అందువల్ల ఒక్కడైన ఆ స్వామిని మొక్కటంలోనే మన విజ్ఞత దాగివుంది.

యోగ్యతలకు ఎంతో విలువ ఇస్తాడు అల్లాహ్. ఆయన అందరి స్థితినీ ఎరిగినవాడు. (దివ్యఖుర్‌ఆన్–4 :147)

اَلْاَكْرَمُ

76. అల్ అక్రమ్

అల్లాహ్ అల్ అక్రమ్ అంటే గౌరవోన్నతులు కలవాడు అని అర్థం. మనిషి అల్లాహ్‌ను ప్రార్థించినా, ప్రార్థించకపోయినా, ఆయన్ని గుర్తించినా గుర్తించకపోయినా అల్లాహ్ గౌరవోన్నతుల్లో ఎలాంటి అధిక్యత, లోపమూ ఏర్పడదు. మనం అల్లాహ్‌ను గుర్తించి ఆయన్ని ఆరాధిస్తున్నామంటే అది మన మంచి కొరకు, మన గౌరవోన్నతుల కొరకే అని మరువరాదు. సమాజంలో ధర్మవర్తను లైన గురువుల్ని, పెద్దల్ని మనం గౌరవిస్తూ వుంటాం. దానికి కారణం వారి నిష్టాగరిష్టతే. అవే వారికి సమాజంలో గౌరవాన్ని, ప్రతిష్టను ఇచ్చాయి.

మనిషిని సన్మార్గాన వుంచటానికి దేవుడు ప్రతికాలంలో, ప్రతిదేశంలో ప్రవక్తల్ని పంపుతూవచ్చాడు. దేవుడు ఒక్కడే అని, ఆయన్నే ఆరాధించాలనీ, ఆయన ఆదేశాల ప్రకారం జీవితాన్ని కొనసాగించాలనీ, అందరూ చివరికి ఆయన్ని కలుసుకోవాలని, ఈ లోకంలో చేసిన చేష్టలన్నిటికీ ఆయన సమక్షంలో సమాధానం చెప్పుకోక తప్పదని... ఇలా ప్రవక్తలందరూ బోధిస్తూవచ్చారు. తమ తాతముత్తాతలు గడచిన బాటలోనే - అది నరకానికి దారితీసేదైనా- జీవిస్తామని అధిక సంఖ్యాకులు ప్రవక్తల మాటలు పెడచెవిన పెట్టారు. అతికొద్ది మంది మాత్రమే నిజ ధర్మాన్ని తెలుసుకొని నడుచుకునేవారు. ఎవరు విన్నా వినకపోయినా సత్యమార్గాన్ని బోధించటంలో ఎలాంటి హెచ్చుతగ్గులు చూపలేదు దైవప్రవక్తలు. సమాజంలోని ప్రజలు వారిని అగౌరవపరచినా, హింసించినా, చివరికి వారిని హత్యచేసినా దైవసందేశ ప్రచార బాధ్యతని మాత్రం వారు విస్మరించ లేదు. అందులో ఎలాంటి లోటూ రానివ్వలేదు. కొందరు వందల

సంవత్సరాలు బోధించారు. అయినా అనుకున్న సంఖ్యలో ప్రజలు దారికిరాలేదు.

నేడు కూడా మనం చూస్తూవుంటాం. కొందరు దైవాదేశాల ప్రకారం న్యాయవర్తనులై నడుచుకుంటూ వుంటారు. ప్రజలు వారిని గౌరవిం చినా లేకున్నా వారు జీవితాంతం అలానే జీవించి పరలోకానికేగుతారు. ఎందుకంటే వారు దైవానికి భయపడి జీవించారు - ప్రజలకు భయపడి కాదు. అలాంటి వారికే రేపు పరలోకంలో స్వర్గసుఖాలు దక్కేది.

చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స) కూడా మక్కా వాసులకు ఎంతో బోధించారు. కొద్దిమంది తప్ప, ఎవరూ ప్రవక్త (స) మాటల్ని వినలేదు. పైగా ప్రవక్త (స)ను పలు విధాలుగా బాధించి చివరికి మక్కా పట్టణం నుంచి మదీనాకు వలసపోయేలా చేశారు. మదీనా ప్రజలు వారి బోధనల్ని విన్నారు, సత్యధర్మాన్ని స్వీకరించారు. ప్రవక్త (స)ను తమ ప్రాణంకన్నా మిన్నగా చూసుకున్నారు. మక్కాలోని దైవ విరోధులు ఎంతగా పన్నాగాలు పన్నినా ప్రవక్త (స) గౌరవ ప్రతిష్టలకు ఎలాంటి లోటూ రాలేదు- సరికదా స్వయంగా దేవుడే ముహమ్మద్ ప్రవక్త గౌరవ ప్రతిష్టల్ని పెంచే ఏర్పాటు చేశాడు. కాబట్టే నేడు కోటానుకోట్ల ముస్లిములు ప్రవక్త పట్ల తమ గౌరవభావాన్ని చాటుతున్నారు.

(ఓ ప్రవక్తా) పఠించు, సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో.
ఆయన పేరుకు పోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు.
పఠించు: నీ ప్రభువు అత్యంత ఆదరణీయుడు.

(దివ్యఖుర్ఆన్: 96 : 1-3)

الْأَعْلٰى

77. అల్ ఆలా

పిన్నలు పెద్దల్ని, సంతానం తమ తల్లి దండ్రుల్ని, విద్యార్థులు తమ అధ్యాపకుల్ని, క్రింది తరగతి ఉద్యోగస్తులు తమ పై అధికారిని గౌరవిస్తూ వుంటారు. అలాగే భార్య భర్తను గౌరవిస్తుంది. ఇలా సమాజంలో ఒకరు మరొకరి పట్ల గౌరవభావం కలిగివున్నప్పుడే అన్నీ సవ్యంగా సాగుతుంటాయి. అలాకాకుండా ఎవరంతటవారు తామే గొప్పోళ్ళమని తలపోసి ఎవరినీ లెక్క చేయకపోతే అన్ని చోట్లా గొడవలు మొదలై సమాజ వ్యవస్థే అస్తవ్యస్తంగా తయారవుతుంది. చట్టాలు, శాసనాలు కకావికలమై రాజ్యవ్యవస్థకే ముప్పేర్పడు తుంది. ఒకరు మరొకరిని గౌరవించటమంటే ఎదుటి వారిలో వున్న గొప్పదనాన్ని గుర్తించటమే. అయితే ఒకరు మరొకరికంటే గొప్పోళ్ళైనంత మాత్రాన తమ క్రింది వారిని పురుగుల్లా చూడమని అర్థం కాదు, వారిచేత నానా చాకిరీ చేయించుకొని తమనే పూజించమని ఆనటం భావ్యంకాదు. ఇతరులకు నమస్కారం పెట్టేది మనలోవున్న సంస్కారాన్ని చాటుకోవటానికే. ఈ నమస్కారమే సంస్కార సౌధానికి మొదటిమెట్టు. అందుకే 'సలాం ఖబ్లుల్ కలాం' అన్నారు. అంటే సంభాషణను సలాంతో ప్రారంభించాలని అర్థం. ఒకరికి సలాం చేసినంత మాత్రాన మనం అతనికి గులాం అని కాదు.

మనం అసలు విధేయత చూపవలసింది కేవలం ఒక్క అల్లాహ్‌కు మాత్రమే. సాష్టాంగ పడవలసింది కూడా అల్లాహ్‌కు మాత్రమే కాని చెట్టుపుట్ట లకు, రాయారప్పలకు, జంతువులకు ఇంకా తోటి మనుషులకు కాదు. ఎదుటి మనిషి మనకంటే ఎంతటి గొప్పవాడైనా కావచ్చు. ఈ ప్రపంచాన్ని పాలించే

సామర్థ్యం కలిగివుండవచ్చు. కాని పుట్టిగిట్టేవాడు సాష్టాంగ ప్రణామానికి అనర్హుడు. మనల్ని పుట్టించి, పోషిస్తూ ఈ భూనభోంతరాళాల్ని పాలిస్తున్న పరమోన్నత ప్రభువే పూజకు, సాష్టాంగ ప్రణామానికి అర్హుడు. మానవ మార్గదర్శకత్వం కొరకు పంపబడిన ప్రవక్తలు ఏనాడూ తమకు సాష్టాంగపడమని ఏ మనిషినీ కోరలేదు. పూజకు, విధేయతకు, స్తుతికి అర్హుడు కేవలం అల్లాహ్ మాత్రమే అని ప్రబోధించారు. మనమంతా మొక్కవలసింది కేవలం ఒక్క అల్లాహ్‌ను మాత్రమే. ఈ సృష్టిలోని ప్రతి చరాచర వస్తువూ, ప్రాణీ నిత్యం అల్లాహ్‌ను స్తుతిస్తూ కృతజ్ఞతలు తెలుపుతోందని ఖుర్ఆన్ తెలుపుతోంది. కాని జ్ఞానమున్న మనిషే అల్లాహ్ పట్ల విముఖుడై పోయాడు. పొద్దస్తమానం అల్లాహ్ ప్రసాదించిన సృష్టిని అనుభవిస్తున్నాడు గాని, సృష్టికర్తను వదలి సృష్టితాలను పూజిస్తున్నాడు. భుజించేది ఒకరిది, భజించేది మరొకర్ని. ఇదెక్కడి న్యాయం?

అల్–ఆలా అంటే అందరికన్నా అధికుడు, మహోన్నతుడు అని అర్థం.

“మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని కొనియాడు; ఆయన విశ్వాన్ని సృష్టించాడు.” (దివ్యఖుర్ఆన్:87 : 1,2)

اَلْخَلَّاقُ
78. అల్ ఖల్లాక్

ఎప్పుడైనా, దేన్నైనా పరిపూర్ణంగా సృజించ గల సృష్టికర్తనే అల్ ఖల్లాక్ అంటారు. వర్షాకాలంలో నేల నాలుగు చెరగులా పచ్చని తివాచీ పరచినట్లుగా చెట్లు చేమలతో కళకళ లాడుతూ వుంటుంది. అదే ఎండా కాలంలో నేలంతా మోడువారిపోతుంది. పచ్చదనం కరువైపోతుంది. ఇలా ఒక సంవత్సరం కాదు, ప్రతి సంవత్సరమూ జరుగుతూనే వుంటుంది. అప్పటివరకూ కనిపించని క్రిమికీటకాదులు వర్షాకాలం వస్తే చాలు పచ్చదనంతో అవి కూడా పుట్టు కొస్తాయి. అంతే మృత భూమికి జీవజలంతో జీవం పోసి, మన జీవనానికి కావలసిన పంటలన్నింటినీ పుష్కలంగా పండించి యిచ్చేది ఆ సృష్టికర్త అయిన అల్లాహ్– అల్ ఖల్లాకే. అంటే మళ్ళీ మళ్ళీ సృష్టించి మనకు మళ్ళీ మళ్ళీ ఆహార పదార్థాలను సమకూర్చకపోతే ఇక మన గతి అధోగతి అయ్యేదే. ఒక్క సంవత్సరం పుష్కలంగా పంటలు పండితే సరిపోదుగా! ప్రతి సారీ అలా జరిగితేనే మనకు కావలసిన భుక్తి దొరికేది.

దివ్య ఖుర్ఆన్ సర్వశాస్త్రాల సంచయనం. మనిషి పుట్టుక, ప్రవక్తల గాథలు, జాతుల ఉత్థాన పతనాలు, భౌతిక రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రం, ఖగోళశాస్త్రం ఒక్కటే మిటి సకల శాస్త్రాలూ నిక్షిప్తమై వున్నాయి ఈ గ్రంథంలో.

ఒక్కో జీవరాసి ఒక్కో శాస్త్రమే. స్వయంగా మానవుడే ఒక శాస్త్రం. తనపైనే ఒక్కో అవయవానికి ఒక్కో శాస్త్రాన్ని తెరచి నిరంతర అధ్య యనం చేస్తూనేవున్నాడు. అయినా ఏదీ అంతు చిక్కటంలేదు. ఇక ఈ పృధ్విపై ఎన్ని కోటానుకోట్ల జీవరాసులున్నాయో, నీటిలో ఎన్ని వున్నాయో, నింగిపై ఎన్ని

వున్నాయో ఆ సకల లోకాల స్వామికే ఎరుక. ఒక్కో ప్రాణి సృజన మహాద్భుత ప్రక్రియ. దేని ప్రత్యేకత దానిదే. ప్రపంచంలో కోటానుకోట్ల మనుషులున్నారు. ఎవరి ఆకారం వారిదే. అల్లాహ్ వద్ద ఎన్ని సారెలు (Dies) ఉన్నాయో? ఎన్నిసార్లు ఆలోచించినా మనకు అంతు పట్టదు. బుద్ధ్యభిప్రాయుడు, కాయుడు అయిన మనిషి సృష్టిలో ఇన్ని అద్భుతాలు చూసినా అల్లాహ్‌ను గుర్తించటం లేదే? ఒక చిన్న నూతన ఆవిష్కరణకే (అది కూడా దేవుడిచ్చిన మేధస్సంపత్తితోనే) ఉబ్బి తబ్బిబ్బయి పోతున్నాడు మనిషి. మహా మహి మాన్విత స్వామి సృష్టించిన ఈ చరాచార జగత్తులోని అద్భుతాలను గురించి ఆలోచించటానికి మనకు అంత జ్ఞానముందా? ఏ మాత్రంలేదు. కాబట్టి దివ్య ఖుర్ఆన్ ఆదేశాల ప్రకారం సాగిన మహాప్రవక్త ముహమ్మద్ (స) సంప్రదాయ సరళిలో సాగిపోవటమే సర్వోత్తమం.

భూమ్యాకాశాలను సృజించగలిగిన వాడు వీరిలాంటి వారిని పుట్టించ లేడా? ఎందుకు చేయలేడు, ఆయన మహానిపుణుడైన సృష్టికర్త అయి నప్పుడు? (దివ్య ఖుర్ఆన్:36 : 81)

اَلْمَوْلٰى

79. అల్ మౌలా

ప్రతి విషయంలోనూ విశ్వసించిన వారు అల్లాహ్‌పైనే భరోసా పెట్టుకుంటారు. సుఖదుఃఖాల్లో, ప్రమాదాల్లో ప్రమోదాల్లో ఆయన నామాన్ని స్మరించడం సర్వవిధాలా శ్రేయస్కరం. అన్ని వేళల్లోనూ మనల్ని ఆదుకుంటూ, మనకు కొండంత అండగా నిలిచి, మన పనులన్నింటినీ నెరవేరుస్తున్నాడు కాబట్టే అల్లాహ్‌ను మనం అల్ మౌలా అని కూడా పిలుస్తున్నాం. మన మూలానికి కారణం ఆ మౌలాయే. అలాంటి మూలవిరాట్టును వదలి మరొకరి పట్ల నమ్మకం వుంచుకోవటం, అర్హతలేని వారిని ఆరాధించటం అన్ని విధాలా అగచాట్లనే ఆహ్వానించినట్లవుతుంది.

మానవ సృష్టి అల్లాహ్‌కు అత్యంత ప్రియతమమైనది. మనం ఎన్నిసార్లు తప్పు చేసినా మనకు విడుపునిస్తూనే ఉన్నాడు. నిత్యం మనల్ని క్షమిస్తూ మన అవసరాలన్నింటినీ పూరిస్తున్నాడు. సంతానం పట్ల కూడా తల్లిదండ్రులకు ఎనలేని ప్రేమ. తమ సంతానం ఎంత పెద్ద తప్పు చేసినా తల్లిదండ్రులు వారిని వెనకేసుకొస్తారు తప్ప మరెలాంటి ఖండన, దండన చేయరు. ప్రేమతో ప్రపంచాన్ని జయించవచ్చు. ద్వేషంతో అన్నీ దూరమైపోతాయి. ప్రతివాడూ సాటి మనిషిని ప్రేమించడం, ఆదరించడం అలవాటు చేసుకున్న నాడు ప్రపంచం మొత్తం ఒకే కుటుంబంలా అలరారుతుంది.

అల్లాహ్ మనల్ని సృష్టించి ఈ సృష్టిని అంటే ఈ ప్రపంచం మొత్తాన్నీ మన హస్తగతం చేశాడు. ఈ లోకంలో మనిషికంటే మరే ప్రాణీ లేక జీవి గొప్పది కాదు. మానవుడే ఈ మహిలో మహోత్కృష్ట జీవి. దీన్నిబట్టే అల్లాహ్

మనపట్ల ఎంత ప్రేమమయుడో తెలుస్తోంది. సకల సౌకర్యాలూ కల్పించి నిత్యం మనల్ని కనిపెట్టుకొని కాపాడే ఆ స్వామి మన నుండి ఏం కోరుతున్నాడు?

కేవలం ఆయన్ని మాత్రమే ఆరాధించమంటున్నాడు. ఇది తప్ప మరి ఏమీ కోరట్లేదు. ఆయన్ని ఆరాధిస్తే ఈ లోకంలో శాంతి సుఖాలు దక్కుతాయి. ఇక పరలోకంలో అయితే స్వర్గం సుఖాలున్నాయి. ఆ స్వర్గ సుఖాలు మన ఊహకు అందనివి.

కాబట్టి మనిషి భయపడాల్సింది కేవలం అల్లాహ్‌కు మాత్రమే. అల్లాహ్ భయం వదిలేస్తే మనిషి అన్నిటికీ భయపడాల్సి వస్తుంది. ఆయన దాస్యాన్నికాదంటే సృష్టిరాసులన్నింటి దాస్యమూ చేయవలసి వస్తుంది. సృష్టికర్త అయిన ఒక్క అల్లాహ్ దాస్యం మేలా? లేక అందరి దాస్యంమేలా? అనేది మనమంతా ఆలోచించుకోవాలి. మనమంతా చివరికి అల్లాహ్ వద్దకే చేరుకోవాలి. ప్రతి విషయానికీ పరలోకంలో జవాబు చెప్పుకోవాలి.

"మళ్లీ వారంతా తమ నిజమైన ప్రభువు, అల్లాహ్ సన్నిధికి మరలించబడతారు. తెలుసుకోండి. తీర్పు చేసే సర్వాధికారాలు ఆయనకే ఉన్నాయి." **(దివ్యఖుర్‌ఆన్ 6 :62)**

اَلنَّصِيْرُ
౮౦. అన్ నసీర్

అల్ నసీర్ అంటే విశ్వసనీయులైన దాసుల్ని ప్రతి ఆపదలో ఆదుకునేవాడు అని అర్థం. బహుదైవారాధకులు, విగ్రహారాధకులైన మక్కా ఖురైషులు మహా ప్రవక్త ముహమ్మద్ (స)కు బలమైన ప్రాణ శత్రువులుగా మారారు. ఆ సమయంలో ప్రవక్త (స) మక్కాను వీడి మదీనాకు వలస వెళ్ళక తప్పలేదు. వలస వెళ్ళే సమయంలో కూడా ప్రవక్తను, వారి అత్యంత సమీప సహచరులైన హజ్రత్ అబూ బక్ర్ (రజి)ను ఖురైషులు వెంటాడారు. ఆ సందర్భంలో ఇరువురూ వెళ్లి ఒక గుహలో తలదాచుకున్నారు. అప్పటికీ బలవద్విరోధులైన ఖురైషులు ఆ కొండ మొత్తాన్నీ గాలించారు. చివరికి ప్రవక్త (స), అబూ బక్ర్ (రజి) దాగిన గుహముందే తిష్టవేశారు ఆ ఖురైషులు. కాని అల్లాహ్ వారిరువురినీ ఆ శత్రు మూకల నుండి కాపాడాడు. ఇదంతా ఆ అల్లాహ్ మహిమ. ఆయన కాపాడదలచుకుంటే ఈ భూమిపైన ఎంతటి బలవంతుడైనా మనల్ని ఏమీ చేయలేడు. ఆయన్ని నమ్ముకుని, ఆయనపైనే విశ్వాసం పెట్టుకున్న భక్తులను తప్పకుండా కాపాడతాడు ఆ పరమోన్నత ప్రభువు. ఇలాంటి సంఘటనలు మనకు మన నిత్య జీవితంలో కూడా తరచూ కానవస్తుంటాయి.

అలాగే ప్రవక్త ఇబ్రాహీం (అ) విషయంలో ఏం జరిగింది? ఒక్కడైన ఆ అల్లాహ్‌ను ఆరాధించమని బోధించినందుకు ఆనాటి రాజు వారిని అగ్నిలో పడవేయించాడు. అప్పుడు అల్లాహ్–అల్ నసీర్ ఆ అగ్నికి ఆరిపొమ్మని ఆజ్ఞాపించాడు. వెంటనే అగ్ని చల్లారి ప్రవక్త ఇబ్రాహీం (అ) సురక్షితంగా బయట పడగలిగారు. ఇదంతా దేవుని మహిమే కదా! ఈ మహిమను చూసిన ప్రజలకు

తౌహీద్ (దేవుని ఏకత్వం) గొప్పతనం ఏమిటో అర్థమయింది. అంతేకాదు ప్రవక్త ఇబ్రాహీం (అ) దేవుని ప్రతి ఆజ్ఞనూ శిరసావహించారు. సంపూర్ణంగా దేవునికి స్వయం సమర్పణ చేసుకున్నారు. చివరికి ప్రవక్త ఇబ్రాహీం (అ) దేవుని ఆజ్ఞ మేరకు తన కన్న కొడుకు ఇస్మాయీల్ (అ)ని బలి ఇవ్వడానికి సంసిద్ధులయ్యారు. ఆ సందర్భంలో అల్లాహ్ ఇస్మాయీల్ (అ)ని ఎలా రక్షించాడో లోక విదితమే.

అలాగే ప్రవక్త మూసా (అ) దైవధిక్కారి అయిన ఫిర్‌ఔన్ దర్బారులో దేవుని ఏకత్వాన్ని గురించి తెలిపినప్పుడు, ఫిర్‌ఔన్ మూసా (అ)ని అంతమొందించేందుకు తన సైన్యంతో వెంటబడ్డాడు. ప్రవక్త మూసా (అ) దేవుని మహిమతో సముద్రాన్ని దాటి వెళ్లిపోగా, ఫిర్‌ఔన్ ఇంకా అతని సైన్యాన్ని నడి సముద్రంలో ముంచివేశాడు దేవుడు. ఈ గాథలన్నీ మనకు దేవుని ఏకత్వ మహిమల్ని ఇంకా ఆయనపై భరోసా పెట్టుకుని, ఆయన్నే విశ్వసించిన దైవదాసులకు కష్టాల నుంచి ఏ విధంగా రక్షిస్తాడో అనే విషయం తెలుస్తోంది.

అల్లాహ్‌తో గట్టి సంబంధం కలిగి ఉండండి. ఆయన మీకు సంరక్షకుడు. ఎంతో మంచి సంరక్షకుడు, ఎంతో మంచి సహాయకుడు.

(దివ్యఖుర్ఆన్ 22 : 78)

اَلْاِلٰهُ

81. అల్ ఇలాహ్

అల్ ఇలాహ్ అంటే ఆరాధనకు అర్హుడు. మన పూజకు, ఆరాధనకు అర్హత కలిగిన వాడు అల్లాహ్ - అల్ ఇలాహ్ తప్ప మరొకరెవరూ కారు. ఆయన ఆరాధనలో మరొకర్ని భాగస్వామ్యం కల్పించినవారు స్వర్గానికి అర్హులు కాలేరని దివ్య ఖుర్ఆన్ బోధిస్తోంది.

అర్హత లేనిదే మనమూ దేన్నీ పొందలేము. ఒక వస్తువును కొనాలంటే మనదగ్గర కొనుగోలు శక్తి, అంటే డబ్బులు కావాలి– అప్పుడే మనం ఆ వస్తువును కొనే 'అర్హత' కలిగివున్నాం. అలాగే ఒక ఉద్యోగం సంపాదించాలంటే దానికి తగిన విద్యార్హతలు కావాలి. కొన్ని ఉద్యోగాల్లో విద్యతోపాటు శారీరక అర్హత కూడా కావాలి. యజమాని లేక ప్రభుత్వం అర్హుల్నే ఎంపిక చేస్తారుగాని పనికిరాని వారిని ఎన్నుకొని జీతాలివ్వరు గదా!

ఇలా అన్నిచోట్లా, దేనికైనా 'అర్హత' ముఖ్య మైనది. మరి మన పూజకు కూడా ఒకరు అర్హులైతేనే కదా మనం వారిని పూజించేది. మనం ఆరాధించే ఆ స్వామి మనల్ని పుట్టించిన వాడై వుండాలి, ఇంకా మనల్ని పోషించాలి, మన ప్రతి చిన్న అవసరాన్నీ తీర్చగలగాలి. ఆయన నిదురపోకూడదు, మనల్ని ఎల్లప్పుడూ కనిపెట్టుకొని వుండాలి, సకాలంలో వర్షాలు కురిపించాలి, పంటలు పండించాలి, మనల్నే కాదు ఈ సృష్టిలోని ప్రాణికోటినీ పుట్టించాలి, పోషించాలి మనలాగే వాటి అవసరాలూ తీర్చేవాడై వుండాలి. ఈ సృష్టి సర్వాన్నీ సంరక్షించే వాడై ఉండాలి ఆ స్వామి. అలాంటి స్వామినే మనం మొక్కాలిగాని, దేన్నీ సృజించలేని, పోషించలేని సృష్టితాలు మన పూజకు ఎలా అర్హత

కలిగివుంటాయి? సాటి సృష్టితాలకు మనమే లేనిపోని అర్హతలు కల్పించి వాటిని పూజిస్తున్నాం. అవి మన మొరలను ఆలకించ లేవు, ఎలాంటి అవసరాన్నీ తీర్చలేవు అయినా వాటిని మనం పూజిస్తున్నాం. ఎందుకంటే ఇది మన తాతముత్తాతల నుంచి వస్తున్న సంప్రదాయమని తల పోస్తున్నాం. మన పూజా పునస్కారాలు చాలా పురాతనమైనవని, అవే ముక్తి మార్గాలని కూడా నమ్ముకొని వున్నాం. ఆ మాటకొస్తే అన్నింటికన్నా పురాతనమైనది, ఆది మానవుడు, ప్రవక్త అయినటువంటి ఆదం అలైహిస్సలాంతో వచ్చిన ధర్మం 'ఇస్లాం' అన్నిటికన్నా పురాతనమైనది. మనమంతా ఆదం సంతతే. మన నిజధర్మం ఇస్లాం మాత్రమే. ఇదే మన ముక్తికి మూల మంత్రం. అల్లాహ్ ఒక్కడే మన ఆరాధనకు అర్హుడు.

వాస్తవమేమిటంటే, దేవుడు ఒక్కడే. మరొక దేవుడు లేడు.

(దివ్యఖుర్ఆన్-5:73)

اَلْعَلَّامُ

82. అల్ అల్లామ్

మనిషికి దేవుడు పంచేంద్రియాలను ప్రసాదించాడు. ఈ ఇంద్రియ జ్ఞానమే లేకుంటే మనిషి ప్రాణంతో జీవించి వున్నా లాభంలేదు. వాటి ద్వారానే మనం చూడగలుగుతున్నాం. వినగలుగుతున్నాం, స్పర్శజ్ఞానం కలిగివున్నాం, వాసన చూడగలుగుతున్నాం. అన్నిటికన్నా కళ్ళు ప్రధానమైనవి. అన్నీ వుండి కళ్ళు లేకపోతే అంతా అంధకారమే. అందమైన ఈ సృష్టిని మనం కళ్ళతోనే చూడగలుగుతున్నాం. కాళ్ళు లేకున్నా ఒకరి సహాయం వల్లనో, వాహనం ద్వారానో మరో చోటికి వెళ్ళవచ్చు. కాని కళ్ళు లేకపోతే మరొకరి కళ్ళతో చూడలేం. దీనివలన కళ్ళ ప్రాముఖ్యత ఎలాంటిదో మనం తెలుసుకోవచ్చు. అలాగే మన నాలుకకు రుచి లేకపోతే మనం దేన్నీ తినలేము. ఇలా ఒక్కో ఇంద్రియానికి దేవుడు ఒక్కో ప్రత్యేకతను ఇచ్చాడు.

ఈ ప్రపంచంలో వున్న వస్తువుల్ని, మన కళ్ళతో చూస్తాం. కళ్ళతో చూడలేని వాటిని మన మనో నేత్రంతో, ఊహలతో అంచనాలువేసి, ఆకారాలు దిద్దుకుంటాం. ఏమైనా మనిషి జ్ఞానం చాలా పరిమితమైనది. ఎన్ని కొత్త ఆవిష్కరణలు వెలిసినా, మనిషికి తెలిసింది తక్కువే. నేటి మనిషి ఈ నూతన ఆవిష్కరణలు చూసుకొనే విర్రవీగుతున్నాడు. భౌతికతకు ఇచ్చిన విలువను నైతిక ప్రమాణాలకు ఇవ్వటంలేదు.

ప్రపంచంలో ఎన్నో సిద్ధాంతాలు, మార్గాలు వెలిసి మనిషిని తికమక పెడుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ సిద్ధాంతమే గొప్పదని, అదే సాఫల్య మార్గమనని వాదిస్తున్నారుగాని తమ ఆలోచనాలోచనాలతో చూడటంలేదు.

తాము ఆచరిస్తున్న విధానం సరియైనదా కాదా అనే చింతనే లేకపోయింది. మనిషికో జీవన విధానంతో ఎవరూ మనుషుల్ని ఏకం చేయలేరు. ఏకం చేసే విధానం ఒక్కటే. అదే ఏకేశ్వర సిద్ధాంతం. ప్రవక్తలందరూ బోధించింది, ఆచరించి చూపింది ఈ ఏకేశ్వర సిద్ధాంతాన్నే. ఈ సిద్ధాంతాన్ని నమ్మి ప్రవక్తల్ని అనుసరిం చిన వారు సఫలీకృతులయ్యారు. అలా కాకుండా ప్రవక్తల మాటల్ని వినకుండా తమ తాతముత్తాతల సిద్ధాంతాలను లేక తమ మనసుకు నచ్చిన విధానాలను నమ్ముకున్నవారు శిక్షింపబడ్డారని దివ్యఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది. మనం ఈ ప్రపంచంలో ఎల్లకాలం జీవించి వుండలేం. ఎల్లప్పుడూ వుండేది ఆ అల్లాహ్ మాత్రమే. ఎల్లలన్నింటినీ చెరిపి ఎల్లరనూ ఏకం చేసేది అల్లాహ్ విధానం మాత్రమే. మనకు తెలియని ఆ మార్గం ప్రవక్తల ద్వారా లభించింది. బాహ్య విషయాలనే కాదు ఈ ప్రపంచంలో గుప్త విషయాలన్నీ తెలిసినవాడు ఆ అల్లాహ్ - అల్ అల్లాహ్ మాత్రమే.

"నా మనస్సులో ఏముందో నీకు తెలుసు. నీ మనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవు గుప్తంగా వున్న యదార్థాలన్నీ తెలిసిన మహా జ్ఞానివి." ***(దివ్యఖుర్ఆన్ 5 : 116)***

اَلْقَاهِرُ

83. అల్ కాహిర్

అల్ ఖాహిర్ అంటే సంపూర్ణ అధికారం, శక్తితోపాటు ఆధిక్యత, ఆధిపత్యం కలవాడు. హిమాలయ పర్వతాలు ఎంతో ఎత్తయినవి కావచ్చు. కాని అవి ఆకాశాన్ని తాకలేవు. ఒక మనిషి ఒక రాజ్యానికి రాజు, లేక కొంత భూభాగానికి చక్రవర్తి కావచ్చు. కాని పూర్తి ప్రపంచాన్నేలే ఏకఛత్రాధిపతికాలేడు. అలాగే ఒక మనిషి వందేళ్ళు లేక ఇంకొన్ని సంవత్సరాలు జీవించి వుండవచ్చు. కాని ఒకనాడు అతనూ మరణించక తప్పదు. ఈ ప్రపంచంలో ఎవరూ శాశ్వ తంగా వుండలేరు. అలాగే ఒక వ్యక్తి ఒక శాస్త్రపరిజ్ఞానంలో నోబుల్ బహుమతి గ్రహీత కావచ్చు. కాని ఆ మనిషి ఆ శాస్త్ర పరిజ్ఞానంలోనే ఇంకా ఎంతో తెలుసుకోవలసి ఉంది. అంటే ఏ ఒక్కరూ దేనిలోనూ పరిపూర్ణత సాధించలేదు, సాధించలేరు కూడా. కాని ఈ సృష్టికి మూలకారకుడైన అల్లాహ్ మాత్రం పరిపూర్ణుడు, సర్వాధికారాలు కలవాడు, అందరిపై, అన్నిటిపై ఆధిపత్యం కలవాడు.

ఆనాడు మక్కాలో దేవుని ఏకత్వాన్ని ప్రబోధించే తరుణంలో ముహమ్మద్ ప్రవక్త (స) కు ఖురైషులు ఎన్నో ఆటంకాల్ని సృష్టించారు. తమ వద్ద బానిసలుగా వున్నవారు కూడా ప్రవక్త (స) సందేశానికి ఆకర్షితులై ఇస్లాం స్వీకరించారు. దానిపై ఖురైషులు ఇంకా కోపోద్రేకులై ఆ బానిసల్ని నానా యాతనలకు గురి చేశారు. కాలుతున్న ఇనుప కడ్డీలతో బానిసల దేహాలపై వాతలు పెట్టేవారు, ఎండ వేడిమికి కాలే ఇసుకపై వారిని నగ్నంగా పడుకోబెట్టి నానాయాతనలకు గురిచేసేవారు. అయినా ఆ బానిసలు మాత్రం ఏకేశ్వర సిద్ధాంతాన్ని వీడలేదు.

బానిసల కష్టాల్ని చూసిన ప్రవక్త (స), ఖురైషులతో "మీరూ ఒక యజమానికి బానిసలే, ఆ యజమాని అయిన దేవుడు ఈ భూమిపై మిమ్మల్ని శిక్షించదలచు కుంటే ఈ భూమిపై మిమ్మల్ని రక్షించేనాధుడేలేడు. కాబట్టి సర్వలోకాల ప్రభువైన ఆ నిజ యజమానికి భయపడండి" అని హెచ్చరించేవారు.

మనిషి పుట్టింది మొదలు గిట్టేవరకు దేవుని అపార దయాగుణంతో జీవిస్తున్నాడు. కాని ఆయన్ని మాత్రం పూజించడం లేదు. తనకంటే హీనమైన వాటిని పూజిస్తున్నాడు. ఒకవేళ దేవుడే గనక విడుపునివ్వకుండా పట్టుకుంటే ఈ లోకంలో ఎవ్వరూ మిగలరు. ఏదో ఒకనాడైనా నిజ ధర్మాన్ని తెలుసుకుని తన వైపునకు మరలి వస్తారనే ఎదురు చూస్తున్నాడు దేవుడు. ఆ మహా ప్రభువును ఇక్కడ కాపోయినా అక్కడ పరలోకంలోనైనా కలుసుకోక తప్పదు. ఎన్నాళ్ళు జీవించినా ఆయన వద్దకు మరలిపోవటం తథ్యం. జీవితంలో మనం చేసిన చిన్నా పెద్ద వ్యవహారాలకు తప్పులకు సమాధానం చెప్పుకోవాలి. కాబట్టి మనిషి ఈ లోకంలో షైతాను ఆధిపత్యం, అంటే చెడుల ఆధిప్యం నుంచి రక్షించబడా లంటే అల్లాహ్-అల్ ఖాహిర్ ఆధిపత్యంలో జీవించటమే సర్వవిధాలా శ్రేయో దాకం.

ఆయనకు అన్నింటిపైనా అధికారం ఉంది. ఆయన తన దాసులపై సంపూర్ణమైన ఆధిపత్యం, అధికారాలు కలిగి వున్నాడు.

(దివ్యఖుర్ఆన్ 6 : 18)

اَلْغَافِرُ
84. అల్ గాఫిర్

పశ్చాత్తాపం కంటే మించిన ప్రాయశ్చిత్తం మరొకటి లేదు. ప్రమత్తతకులోనై మనిషి ఎన్నో తప్పులు చేస్తుంటాడు. చేసింది తప్పని తెలిసినప్పుడు వెంటనే పశ్చాత్తాప పడటం సజ్జనుల లక్షణం. అలాగాకుండా తాను చేసింది ప్రతిదీ ఒప్పని భావిస్తూ ఇంకా తప్పులు, పొరపాట్లు చేయటం అవివేకం, అహంకారంతో కూడుకున్న ప్రవర్తన అవుతుంది. నిత్య జీవితంలో కూడా మనం చూస్తుంటాం - తన నేరాన్ని ఒప్పుకున్న నేరస్థునికి శిక్షలో సడలింపు నిస్తాడు న్యాయమూర్తి. అలాగాకుండా నేరస్థుడు తను చేసింది ఒప్పని వాదించటం మొదలెడితే న్యాయమూర్తి ఇంకా కఠిన శిక్షలకు గురిచేసి, శిక్షా కాలాన్ని కూడా పొడిగిస్తాడు.

అల్లాహ్– అల్ గాఫిర్ అంటే దాసుల పాపాలను క్షమించేవాడని అర్థం. ఆయన కరుణ, క్షమ లేనిదే ఎవరూ స్వర్గంలో ప్రవేశించలేరు. తెలిసో, తెలియకో ప్రతి మనిషి తప్పు చేస్తూనే వుంటాడు. అలాంటి తప్పుల్ని లేక పాపాల్ని దేవుడు క్షమించటమేగాక వాటిని కప్పిపుచ్చుతాడు. దేవుడు మనిషికి ఎంతో వ్యవధిని, విడుపును ఇస్తూనే వున్నాడు - ఏనాటికైనా మనిషి తన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపపడతాడని, తన ప్రవర్తనను మార్చుకుంటాడని.

స్వర్గం కష్టాలతో, ముళ్ళతో కప్పబడి వుందనీ; నరకం సుఖాలు, సౌఖ్యాలతో కప్ప బడివుందని ప్రవక్త ముహమ్మద్ (స) ఒక ప్రవచనంలో సెలవిచ్చారు. అంటే స్వర్గాన్ని కోరుకునేవారు నిత్యం కష్టాల్ని కడగండ్లను ఎదుర్కోవాలి. జీవితంలో ఎన్నో వ్యయ ప్రయాసలను భరించాలి. ఎన్నో ముళ్ళ బాటల్ని

అధిగమించాలి. సత్యాపత్య వ్రతంతో జీవితాంతం సాగాలి. ధర్మ సంపాద నను మాత్రమే ఆరగించాలి. ఈ ప్రపంచ ఆకర్షణపు లోనుకాకూడదు. ఈ ప్రపంచంలో ఎన్నో ఆకర్షణలున్నాయి. దైవాదేశాలను ఉల్లంఘించి ప్రపంచా కర్షణలకు లోనైతే ఇక్కడ అన్నీ అనుభవించవచ్చు. అప్పుడు అలాంటి వారికి ఈ లోకమే స్వర్గమైపోతుంది. తినవద్దు, త్రాగవద్దు అని దేవుడు చెప్పలేదు. దివ్యఖుర్ఆన్‌లో దేవుడు ఇలా సెలవిచ్చాడు: తినండి, త్రాగండి కాని హద్దులు మీరకండి. దీనివలన మనకు తెలిసేదే మంటే ధర్మసమ్మతంగా ఈ ప్రపంచంలో అన్నీ అనుభవించవచ్చు. దేవుడు ఏ తప్పునైనా క్షమిస్తానని, ఆయనను కాదని మరొకర్ని పూజిస్తే మాత్రం క్షమించనని సెలవిచ్చాడు. పూజకు అర్హుడు కేవలం అల్లాహ్ మాత్రమే.

> **"ఈ గ్రంథం అల్లాహ్ తరఫు నుండి అవతరించింది. ఆయన మహాశక్తి మంతుడు. మహాజ్ఞాని, పాపాలను క్షమించేవాడూ, పశ్చాత్తాపాన్ని అంగీ కరించే వాడున్నూ." (దివ్యఖుర్ఆన్ : 40 : 2, 3)**

اَلْفَاطِرُ

85. అల్ ఫాతిర్

ప్రతిదాన్నీ సృష్టించగలవాడు గొప్పవాడా? లేక దేన్నీ సృష్టించలేనివాడు గొప్పవాడా? ఎవరైనా ఇట్టే చెప్పగలరు - అన్నింటినీ సృష్టించగలవాడే గొప్పవాడని. అల్లాహ్- అల్ ఫాతిర్ అంటే సృష్టిలోని ప్రతిదాన్నీ సృష్టించిన వాడని అర్థం. మన్ను-మిన్ను, నన్ను-నిన్ను ఇంకా సృష్టిలోని చరాచరాల్నీ ఆయనే సృష్టించాడు. ఆయనే అల్లాహ్. మనిషి ఎంత ప్రయత్నించినా నిర్జీవ వస్తువులో జీవాన్ని పోయలేడు. ఎంతగింజుకున్నా ఒక్క గింజనూ తయారు చేయలేడు. అలాగే మరణించిన మనిషిలో మళ్ళీ జీవాన్నీ పోయలేడు. కాని అల్లాహ్‌కు మాత్రం ఇవన్నీ సాధ్యమే. మనిషి సూర్యచంద్రుల్ని, నక్షత్రాలను, గ్రహాలను మొదలైనవాటిని సృష్టించనూలేడు, వాటి గమనంలో అంతరాయాన్నీ కలిగించలేడు. గడచిన సమయాన్ని మళ్ళీ పొందటం మనకు గగనం. సాంకేతికంగా మనం ఎంతో అభివృద్ధిని సాధించామని భ్రమపడుతున్నాం. కాని సర్వలోక సృష్టికర్తయైన అల్లాహ్ గొప్ప తనం ముందు మన ఆవిష్కరణలు దేనికీ పనికిరావు.

మన సృష్టి గురించే మనం ఆలోచించుకుంటే ప్రతిదీ అద్భుతమే. ఎక్కడ ఏ అవయవం అమరాలో అక్కడ దాన్ని ఎంతో అందంగా అమర్చాడు ఆ దేవుడు. మన ఆహార సంపాదనకు పగటినీ, విశ్రమించటానికి రేయినీ సృజించిన వాడు ఆ కరుణామయుడే. ఇలా రేయింబవళ్ళ ద్వారా కాలాల్ని, రుతువుల్ని, ఆయనాలను ఆవిర్భవింపజేశాడు. మన జీవన్మరణాలను చివరికి ప్రపంచ మనుగడను కూడా ఆయనే శాసించాడు. అంటే ప్రళయ గడియను ఆయన

నిర్ణయించి వుంచాడు. ఆయన సృష్టిలో ఎలాంటి లోపమూ లేదు. మన ఆలోచనలో, దృష్టిలో అనేక లోపాలు, వక్రత్వాలుండవచ్చు. కాని దేవుడు లోపాలన్నిటికీ అతీతుడు.

కాబట్టి సర్వశక్తిమంతుడు, నిత్యుడు అయిన ఆ దేవునియందు సంపూర్ణ భయభక్తులు కలిగి వుండటంకన్నా ఉత్తమమైన జీవన విధానం మరొకటి లేదు. ఆ జీవన విధానాన్ని మనిషికి బోధించటానికి వేల కొలది ప్రవక్తల్ని కూడా సృష్టించాడు దేవుడు. ఆ పరంపరలో చిట్టచివరి ప్రవక్తే ముహమ్మద్ (స). ప్రవక్త (స) ఆచరించి చూపిన జీవన విధానం వల్లనే మనకు ఇహంలో శాంతి, పరంలో స్వర్గం లభిస్తాయి. సౌర కుటుంబంలో ఏం జరుగుతుందో అని తెలుసుకోవటం కన్నా, ముందు పౌర కుటుంబంలో చెలరేగుతున్న అశాంతి అలజడిని రూపుమాపేందుకు మార్గాన్ని వెతకటం ఉత్తమం. ఆ ఉత్తమ మార్గాన్నే మనకు మహాప్రవక్త ముహమ్మద్ (స) బోధించారు. అదే దేవుని దృష్టిలో సరియైన మార్గం.

> **"ఆయనే ఈ భూమిని విశాలంగా పరచినవాడు; అందులో పర్వతాలను గుంజలవలె పాతిపెట్టినవాడు, నదులను ప్రవహింప జేసినవాడు, ఆయనే అన్ని రకాల పండ్ల జతలను పండించినవాడు, ఆయనే పగలుపై రాత్రిని కప్పేవాడు." (దివ్యఖుర్ఆన్ - 13:3)**

اَلْمَلِكُ

86. అల్ మలిక్

అల్ మలిక్ అంటే ప్రపంచం మొత్తానికి సార్వభౌముడు అని అర్థం. ఈ లోకానికే కాదు, పరలోకానికి కూడా ఆయనే అధిపతి. ఈ ప్రపంచంలో ఎన్నో దేశాలు, ప్రాంతాలు వున్నాయి. ఒక్కో దేశానికి ఒక్కో రాజు లేక పాలకుడు వున్నాడు. ఆయా దేశాల్లో వున్న పాలితులు తమ దేశ నియమాలకు కట్టుబడి జీవిస్తూ ఉంటారు. కాని అల్లాహ్ ఒక ప్రాంతానికి, ఒక దేశానికి మాత్రమే రాజు కాదు, ఆయన ప్రపంచం మొత్తానికే రాజు. ఆయన ఆజ్ఞ లేనిదే ఏదీ జరగదు. చివరికి ప్రపంచంలో రాజులుగా చెలామణి అయ్యేవారు కూడా అల్లాహ్ దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడి వున్నారు. అల్లాహ్ దయాభిక్ష వల్లనే వారికి రాజరికం, అధికారాలు లభించాయి. అల్లాహ్ కృప వల్లనే వారి వారి ప్రాంతాల్లో, రాజ్యాల్లో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి, పంటలు పండు తున్నాయి. అంతేకాదు ఈ ప్రపంచంలో ఎందరో రాజులు వచ్చారు, పోయారు. ఎవరూ శాశ్వతంగాలేరు. చివరికి వారి కళ్ళ ముందరే తమ రాజ్యాలు పోగొట్టు కున్నారు.

కాని అల్లాహ్ నిత్యుడు. ఆయన సార్వభౌమాధికారం శాశ్వతమైనది. అందులో ఎవరి ప్రమేయమూ లేదు, దయాదాక్షిణ్యాలూ లేవు. మనం ఔనన్నా, కాదన్నా సర్వలోకాలకూ ఆయనే ప్రభువు. మనమంతా ఆయన దయతోనే ఉనికిలోకి వచ్చాం, ఆయన కరుణానుగ్రహాల మూలంగానే మనకు భుక్తి శక్తి లభిస్తున్నాయి. అలాంటి మహోన్నత శక్తి సామర్థాలు కలస్వామిని పూజించటం మేలా? లేక నిర్జీవమైన, ఉలుకూ పలుకూ లేని రాయిరప్పల్ని, చెట్లు చేమల్ని కొలవటం మేలా? ఈ ప్రపంచంలో మనిషికన్నా మేలైన సృష్టిరాశిలేదు. అలాంటి

సృష్టిశ్రేష్ఠుడైన మనిషి హీనాతి హీనమైన వాటి ముందు, దీనాతిదీనంగా మోకరిల్లు తున్నాడు. తనకు తానే మోసంలో పడేసుకుంటున్నాడు. మంచి మాటను బాటను వదలి అంధకారాల్లోకి వెళుతున్నాడు. చివరికి నరక కూపంలో పడిపోతున్నాడు.

ఆ నరక జ్వాలల నుండి మనల్ని రక్షించటానికే దయామయుడైన దేవుడు మహాప్రవక్త ముహమ్మద్ (స)ను మన మార్గదర్శిగా పంపించాడు, ఇంకా విధి విధానాలను, సత్యాసత్యాలను విడమరచి వివరించే గ్రంథమైన దివ్యఖుర్ఆన్‌ను కూడా అవతరింపజేశాడు. ఇక ఈ గ్రంథాన్ని, మహాప్రవక్త (స) ఆదర్శ జీవితాన్ని చదివి, అర్థం చేసుకుని వాటి ప్రకారం నడచుకోవటమే మనవంతు కర్తవ్యం, అదే మనకు మంచి భవితవ్యం.

"ఓ అల్లాహ్! విశ్వసామ్రాజ్యాధిపత్యానికి ప్రభూ! నీవు కోరిన వారికి ప్రభుత్వాధికారాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారి నుండి దాన్ని లాక్కుంటావు. (దివ్యఖుర్ఆన్ 3 : 26)

اَلْحَفِیُّ

87. అల్ హాఫీ

అల్ హాఫీ అంటే సర్వలోకాలలోవున్న సృష్టి తాలన్నిటిని కనిపెట్టుకొని ఇంకా గుర్తు పెట్టుకొని వుండేవాడు. మనం మన సృష్టికర్త అయిన అల్లాహ్‌ను గుర్తుంచుకుంటే ఆయన కూడా మనల్ని సదా గుర్తుంచుకొని స్వర్గ సుఖాలను ప్రసాదిస్తాడు. తల్లిదండ్రు లకు తమ సంతానాన్ని గుర్తుంచుకోవటమే మహాకష్టం. అలాగే సంతానం కూడా తమ తల్లిదండ్రుల్ని పట్టించుకోవటం చాలా కష్టంగా అనిపిస్తోంది ఈ రోజుల్లో. ఒకరి కొకరు పట్టించుకోని ఈ ప్రపంచంలో సృష్టితాలన్నిటినీ పట్టించుకొని, అన్నిటికీ సరియైన వేళకు ఆహారాన్ని సమకూర్చి, అన్ని ప్రమాదాల్నుంచి కాపాడుతున్న ఆ అల్లాహ్ మన పట్ల ఎంతదయామయుడో చూడండి. ఒక మనిషి మరో మనిషిని, ఒక జంతువు మరో జంతువును, ఇలా ప్రతి జీవి తన సాటి జీవిని కొంతవరకే పట్టించుకో గలదు. ఒక్కోసారి మన పనుల్ని, బాధ్యతల్ని మనమే గుర్తుంచుకోలేం. అలాంటప్పుడు మరొకర్ని గురించి ఆలోచించగలమా? మనమంతా శక్తిహీనులం.

ఏ సమయంలో ఏ జీవికి ఏది కావాలో దాన్ని సమకూరుస్తున్నాడు ఆ అల్లాహ్. మనం ఎలాంటి ఆపదల్లో చిక్కుకున్నా మనల్ని రక్షించేది కూడా ఆయనే. మన పిలుపుకు స్పందించి సమాధానం పలికేది కూడా ఆయనే. మనకు మనశ్శాంతిని ఇచ్చేది కూడా ఆయనే. కొంతమంది సకల ఐశ్వర్యాలు కలిగి ఉంటారు. కాని మనశ్శాంతి మాత్రం వుండదు. ఏమీ లేకున్నా కొంత మంది ఎంతో ప్రశాంతంగా మనశ్శాంతితో మనుగడను సాగిస్తూవుంటారు. అలాంటి శాంతియుత జీవనమే సర్వదా శ్రేయస్కరం. ఏది దొరికితే దానితోనే

తృప్తి పడితే అందులోనే ఆనందం లభిస్తుంది. ఎంతవున్నా తృప్తి చెందకపోతే మనిషికి అశాంతే మిగులుతుంది. కాబట్టి తృప్తి అనేది అమూల్యమైన వరం.

ఈ వరం, దైవప్రసాదితం. ఏ మానవ మాత్రుడూ దీన్ని ప్రసాదించలేడు. అల్లాహ్‌పై విశ్వాసముంచి, సదా ఆయన్ని ధ్యానించటంలోనే తృప్తి, ప్రశాంతత లభిస్తాయి, అన్నీ లాభిస్తాయి. దైవ చింతనలోనే మీ మనస్సుకు నెమ్మది లభిస్తుందని ఖుర్‌ఆన్ బోధిస్తోంది. మదిలో నెమ్మది లేకపోతే మనిషి ఏమీ చేయలేడు. అలాంటి నెమ్మది కావాలంటే ఒక్కడైన ఆ అల్లాహ్‌ను మొక్కడమే నిక్కమైన మార్గం. ప్రతిదానికి, ప్రతివారికీ ప్రభువు అల్లాహ్‌యే.

మా ముందు ఉన్నదానికీ, మా వెనుక ఉన్నదానికీ, ఈ రెండింటి మధ్య ఉన్న దానికీ, ప్రతిదానికీ ప్రభువు ఆయనే. నీ ప్రభువు ఎన్నడూ మరచిపోయేవాడు కాడు. (దివ్యఖుర్‌ఆన్ - 19 : 64)

اَلْمُقِيْتُ

88. అల్ ముఖీత్

అల్ ముఖీత్ అంటే ఈ చరాచర సృష్టి సర్వాన్ని పరివేష్టించి ఉన్నవాడు అని అర్థం. మొదలు–చివర, ఆది–అంతం, పుట్టుక– గిట్టుక ఇవన్నీ మనకే–కాని సృష్టికర్తకు కాదు. అంతర్ బాహ్యాలు కూడా మనకే కాని అల్లాహ్ - అల్ ముహీత్‌కు కాదు. మన జీవితం, జ్ఞానం, శక్తి, ఆరోగ్యం, ఆహ్లాదం, సంపద ఒక్కటేమిటి? అన్నీ మనకు పరిమితంగా ప్రసాదించబడ్డాయి. ఇంత పరి మితంగా ప్రసాదించబడ్డ మనిషి కూడా విర్ర వీగుతుంటాడు. తానే గొప్పవాడని తల పోస్తుంటాడు కొన్ని సందర్భాల్లో. అసలు స్వయంగా తన సృష్టి, తన ఉనికి, తన మంచి చెబ్బరలు ఏమిటో తనకే తెలియదు. అయినా అహంభావంతో ప్రవర్తిస్తుంటాడు అనేక సందర్భాల్లో. అసలైన జ్ఞాని ఎప్పుడూ మిడిసిపడడు. గర్వంతో ప్రవర్తించడు. ప్రజలకు ప్రయోజనాన్ని, లాభాన్ని చేకూర్చే వృక్షాలు కూడా పంట కొచ్చిన వేళ వంగిపోతాయి. కాని నిష్ప్రయోజనమైన ఫలాలు కలిగివున్న కొన్ని వృక్షాలు ముళ్ళతో నిక్క పొడుచుకొని నిటారుగా గర్వంతో నిలబడి వుంటాయి. ఇలాంటి తేడానే మనం జ్ఞాని– అజ్ఞాని మధ్య చూస్తుంటాం. వెండి బంగారాలు, మణిమాణిక్యాలు నేల అడుగు భాగాల్లో నిక్షిప్తమయి వుంటాయి. పనికిరాని రాయి రప్పలు మాత్రం ఎక్కడ చూసినా అక్కడ లభ్యమవుతూనేవుంటాయి.

మణిమాణాక్యాలు, వజ్రవైఢూర్యాలు, వెండి బంగారాలే ఇంతగా లోతైన అగాధాల్లో దాగివుంటే - మరి వీటినే కాదు, ఇంకా వీటి కంటే విలువైన జీవు లను, వస్తుసంపద లెన్నింటినో సృష్టించిన సృష్టికర్త ఎంతగా ఒదిగి వుండాలి?

ఎదిగినవారు ఎప్పుడూ ఒదిగి వుంటారు. ఏమీ తెలియనివారు మాత్రం ఎగిరిపడుతుంటారు.

ఆ మహాజ్ఞాని అయిన సృష్టికర్తను ఈ లోకంలో ఏ మానవుడూ చూడలేదు, చూడలేడు కూడా. అంతటి శక్తి ఎవరికీ లేదు. ఆ దైవదర్శన సౌభాగ్యం లభించేది స్వర్గవాసులకు మాత్రమే. స్వర్గంలో దైవాన్ని చూసిన మనిషి అక్కడ వున్న సకల సౌభాగ్యాల్ని కూడా మరచిపోతాడని మహా ప్రవక్త ముహమ్మద్ (స) ఓ ప్రవచనంలో సెలవిచ్చారు. ఈ లోకంలో కూడా మనం అందమైన దృశ్యాన్ని, లేక ఒక అద్భుతాన్ని చూశామంటే అలానే నిలబడిపోతాం. పనులన్నీ పక్కనపెట్టి అలానే స్తబ్దతకు లోనవుతాం. ఈ ప్రాపంచిక వస్తువులే మనకు ఇంతగా విస్మయానికి లోను చేస్తుంటే సృష్టికర్త దర్శన సౌభాగ్యం లభిస్తే ఎలావుంటుందో మీరే ఆలోచించగలరు. ఆయన దర్శన సౌభాగ్యం మనకు లభించాలంటే ఆయన చూపిన మార్గం 'ఇస్లాం' ప్రకారమే నడవాలి కదా!

ప్రతి వస్తువునూ అల్లాహ్‌యే సృష్టించాడు. ఆయన అద్వితీయుడు. అందరిపై ఆధిక్యం కలవాడు. (దివ్యఖుర్ఆన్ - 13 :16)

اَلْمُسْتَعَانُ
89. అల్ ముస్తఆన్

పరుల సహాయ సహకారాలు లేనిదే మనిషి ఒక్క క్షణమూ జీవించలేడు. పుట్టినప్పుడు తల్లిదండ్రులు అన్ని సేవలూ చేస్తారు. అలా సేవ చేయక పోతే, ఏ మనిషీ తమ తమ స్థానాలకు ఎదగలేరు. పశు పక్ష్యాదులు తమ సంతానాన్ని మానవ సంతానంలా సాక లేవు, అలాంటి అవసరమూ ఆ సంతానానికి లేదు. మనం చూస్తూనే వుంటాం - లేగదూడ మాతృగర్భం నుంచి బైటపడిన కొన్ని గంటల్లోనే నడక ప్రారంభిస్తుంది. పాలు త్రాగుతుంది. కాని మానవ జన్మ చూడండి ఎంత బలహీన మైందో! తల్లి సహాయం అందించనంతవరకు ఏమీ చేయజాలదు మానవ శిశువు. అలానే నిస్సహాయ స్థితిలో పడివుంటుంది. అలాంటి స్థితిలో వున్న శిశువుకు తల్లి రూపంలో సహాయం అందిస్తుంది దేవుడేకదా!

అలా ఆ శైశవ దశ నుంచి బయటపడి కొంచెం ఎదగ్గానే విద్యాబుద్ధుల కొరకు పాఠశాలకు వెళ్తాడు. అక్కడ గురువుగారి సహాయం- అలా చదువు సంధ్యలు పూర్తయ్యేసరికి యవ్వనంలోకి అడుగు పెడ్తాడు. ఆ స్థితిలో శారీరక అవసరాలు ఏర్పడతాయి. ధర్మబద్ధంగా తల్లి దండ్రులు, సమాజ పెద్దలు కలిసి వివాహాన్ని జరుపుతారు. ఇలా మనిషి జీవనచక్రం మొత్తం పరుల సహాయం లేకుండా నడవజాలదు. మనం ఒక స్థానం నుండి మరో స్థానానికి కాళ్ళపై నడచి వెళ్తాం, ఆ కాళ్ళిచ్చింది కూడా దేవుడే కదా! పని చేయటానికి చేతులు, ఆలోచించటానికి మనసు మేధను ప్రసా దించిందీ ఆ దేవుడే కదా! అన్నీ దేవుడివే అయినప్పుడు ఇక మనిషికి తనవంటూ ఏం మిగిలాయి? ఏమీ లేవు. అయినా అంతా నాదేనంటాడు మనిషి. అలా అని తంటా తెచ్చుకుంటాడు.

ఇంతటి నిస్సహాయ శూరుడు కూడా అసహాయ శూరుడు, వీరుడు అని తనకు తాను కీర్తించుకుంటాడు. ఇదంతా అతని అజ్ఞానం వల్లనే అలా ప్రవర్తిస్తుంటాడు. సకల సదుపాయాలతో నిండిన ఈ సృష్టి కూడా అల్లాహ్ సృష్టితమే కదా! నిత్యం మనం ఈ సృష్టినే కదా అనుభవిస్తుంది!

కాబట్టి అన్ని విధాల మనకు సహాయ సహకారాలు అందిస్తుంది ఆ అల్లాహ్‌యే. మనం పూజించాల్సింది ఆ ఒక్క దేవుణ్ణే. అన్నిటికీ ఆయనపైనే ఆధారపడాలి. అల్లాహ్- అల్ ముస్తఆన్ అంటే సహాయం అర్థించదగిన శక్తి మాన్యుడు. అసలైన సహాయకుడు ఆయనే. కాబట్టి మనం ఆయన్నే ఆరాధించాలి.

సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి. (దివ్యఖుర్‌ఆన్-12:18)

اَلرَّفِيْعُ

౯౦. అర్ రఫీ

గౌరవ ప్రతిష్టలు మనిషి కొనుక్కుంటే దొరికేవి కావు. అవి దైవప్రసాదితాలు. డబ్బుతో కొన్న పేరు ప్రతిష్టలు కొంతకాలం వరకే మనగలుగుతాయి. సాధారణంగా మనం చూస్తూనే వుంటాం– ఒకరు మంత్రిగా మనగలిగినంత కాలం జనం అతని చుట్టూ చేరి అతన్ని పొగుడ్తూ వుంటారు. మంత్రి పదవి ఊడిపోగానే అందరూ అతనికి దూరమైపోతారు. దీనికి భిన్నంగా దేవుడిచ్చిన పేరు ప్రతిష్టలు, గౌరవాలు శాశ్వ తంగా మనగలుగుతాయి. అవి సత్య సంధతపై ఆధారపడివుంటాయి. దేవుడు కొంతమంది ప్రవక్తలకు శాశ్వత మైన గౌరవోన్నతులు ప్రసాదించాడు. మూసా ఇంకా ఇబ్రాహీమ్ ప్రవక్త (అ)లతో దేవుడు సంభా షించాడు. అలాగే ప్రవక్త ముహమ్మద్ (స)ను మేరాజ్ యాత్ర సందర్భాన స్వర్గ నరకాలను సందర్శింపజేశాడు. కలిమా సద్వచనం 'లా ఇలాహ'తో ముహమ్మద్ (స) పేరును చేర్చి దేవుడు ప్రవక్త (స) పేరును, ప్రతిష్టను ఎంతో ఉన్నతం చేశాడు. ఐదు పూటల నమాజు కొరకు ఇచ్చే అజాన్‌లో కూడా ప్రవక్త ముహమ్మద్ (స) పేరును చేర్చి ఆయన (స) గౌరవాన్ని ఇంకా ఉన్నతం చేశాడు దేవుడు. అంతేకాదు ప్రవక్త (స)పై దరూద్ పంపమని దేవుడు మాన వాళిని ఆదేశించాడు ఖుర్ఆన్‌లో. అల్లాహ్ – అర్ రఫీ అంటే ఉన్నత స్థానాలు కలవాడు అని అర్థం.

సత్య ధర్మమైన ఇస్లాం సందేశాన్ని ఆచరించి మనవరకు చేర్చిన ప్రవక్త (స) అంటే ప్రపంచ ముస్లింల హృదయాల్లో శాశ్వతమైన గౌరవ స్థానం వుంది. ఇంతటి గౌరవోన్నతులకు కారణం సత్యమార్గంలో ఆయన (స) చేసిన ఎనలేని

త్యాగాలే. సత్యసంధులు, సజ్జనులైన అనేక మంది సహాబాలు (రజి), ఇంకా వారి శిష్యులన్నా మనం ఎంతో గౌరవాన్ని చూపుతాము. దీనికంతటికీ కారణం వారు చేసిన త్యాగాలే. స్వర్గంలో భాగస్వాములం కావాలంటే మనం ఎన్నో త్యాగాలను చేయ వలసివుంటుంది. ఎలాంటి త్యాగం లేకుండా స్వర్గసౌఖ్యాలు కావాలని కోరు కోవటం అత్యాశే అవుతుంది. విద్యార్థి పరీక్షలో ఉత్తీర్ణుడు కావాలంటే రేయింబవళ్ళు కష్టపడి చదవాలి. పంట చేతికి రావాలంటే రైతు రేయింబవళ్ళు కష్టపడాలి, ఎండకు ఎండి వానకు తడిసి రెక్కల్ని ముక్కలు చేసుకోవాలి. అప్పుడుగాని పంట చేతికిరాదు.

ఏది ఏమైనా మనకు శాశ్వతమైన గౌరవ ప్రతిష్టలు కావాలంటే దేవుడు చూపిన మార్గంలో నడవాలి. ప్రవక్త (స) ఆచరించి చూపిన విధానాన నడుచు కోవాలి. అప్పుడే మనకు దేవుని తరపున గౌరవాదరణలు లభిస్తాయి, స్వర్గమూ సంప్రాప్తమవుతుంది.

అల్లాహ్ మాత్రమే స్తుతింపదగిన వాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు. (దివ్యఖుర్‌ఆన్- 1 : 1)

❃

اَلْكَافِيْ

91. అల్ కాఫీ

ఒకే ఒక్క దేవుడు కోటాను కోట్ల మానవుల అవసరాలు ఎలా నెరవేరుస్తాడు, వారి ప్రార్థనలు మొరలు ఎలా వింటాడు? వారి సమస్యలు ఎలా తీరుస్తాడు అని మక్కా ఖురైయులు ప్రవక్త ముహమ్మద్ (స)తో తరచూ తర్కించేవారు. ఒకే దేవుడు ఇన్ని పనులు నెరవేర్చటం సాధ్యం కాదు గనకనే తాము ఎంతో మంది దేవీ దేవతలను పూజిస్తాన్నామని కూడా తమంతట తాము సమాధానపడేవారు ఖురైషీయులు. అంతేగాకుండా తామెంతో ఎదిగిన వారమని, జ్ఞానఖనులని, అన్ని విషయాల అవగాహన తమకే వుందని, ప్రవక్త (స)కు చదువరాదని హేళన చేసేవారు. అలాంటి సంక్లిష్ట స్థితిలో కూడా ప్రవక్త (స) అల్లాహ్ ఒక్కడే అన్ని విషయాల్లో సహాయపడతాడని ఖురైషీయులకు సమాధానంగా చెప్పేవారు. ఇంకా వారి విగ్రహాల ముందు మోకరిల్లే అవసరం, అగత్యం లేదని ఖరాఖండీగా చెప్పేవారు ప్రవక్త (స).

అల్లాహ్ ఒక్కడే ఆరాధనకు అర్హుడు. ఆయనే మన సృష్టికర్త, సమస్త ప్రాణులకూ ఆయనే ఆహారం సమకూరుస్తున్నాడు. తీర్పు దినానికి ఆయనే యజమాని. అలాంటి స్వామిని వదలి, ఎలాంటి ఉలుకూ పలుకూలేని, ఎవరికీ ఎలాంటి సహాయం చేయలేని విగ్రహాలను మొక్కడం, వాటి ముందు మొరపెట్టుకోవటం, నిష్ప్రయోజనమని ఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది. ఖుర్ఆన్ సమస్త మానవాళి మార్గదర్శకం కోసం అవతరించిన గ్రంథం. ఇది చిట్టచివరి గ్రంథం. ఇక ప్రళయం వరకు ఎలాంటి గ్రంథమూ అవతరించబోదు. కాబట్టి ప్రపంచ మానవులంతా దీని హిత బోధను గ్రహించి వారి జీవితాలను అంటే ఇహపరలోకాలను సఫలీకృతం చేసుకోమని అంటోంది దివ్యఖుర్ఆన్.

అల్లాహ్ - అల్ కాఫీ అంటే సమస్త మానవుల అవసరాలు తీర్చగల స్వామి. మన శారీరక, మానసిక ఆధ్యాత్మిక అవసరాల పరిపూర్తికి ఆయనొక్కడే చాలు. మన ప్రతి కోరకను, అవసరాన్ని ఆయనే తీరుస్తున్నాడు కాబట్టి మనం ఆయనకు భయపడాలి. ఆయన్ని మాత్రమే ఆరాధించాలి. ఇదే తౌహీద్ (దేవుని ఏకత్వం) సందేశం. ఏ దేశంలో నివసిస్తున్నా ప్రజలందరికీ ఈ సందేశమే వర్తిస్తుంది. ఏ తెగకు, వంశానికి చెందినా ఎలాంటి రంగు రూపులున్నా సమస్త మానవులకూ ఈ దేవుని ఏకత్వ సూత్రమే ఆమూలాగ్రం మేలైనది. ప్రతి విషయంలో ఆయనపై ఆధారపడటం సర్వదా శ్రేయోదాయకం.

నాకు అల్లాహ్ ఒక్కడే చాలు, నమ్ముకునే వారు ఆయననే నమ్ము కుంటారు. (దివ్యఖుర్ఆన్ 39 : 38)

اَلْغَالِبُ

92. అల్ గాలిబ్

తమకు లభించిన వస్తు సంపద వలన, వెండి బంగారాలు వజ్ర వైఢూర్యాలు కలిగి వుండటం వలన లేక సమాజంలో తమకు లభించిన అధికారం హోదాల వల్లనో చాలా మంది గర్వంతో విర్రవీగుతుంటారు. పొరుగువారిని పురుగులకన్నా హీనంగా ఎంచి హేళన చేస్తుంటారు. ఇంకా పేద ప్రజలను నానా యాతనలకు గురిచేస్తుంటారు. ఈ ప్రపంచంలో ఎంతోమంది దుష్ట పాలకులు పుట్టి గిట్టారు. చివరికి వారి అంతం ఎలా జరిగిందో ప్రపంచ ప్రజలు తమ కళ్ళతో చూశారు. అలాంటి మదాంధులు సమాజంలో అతి నికృష్ట స్థాయికి చేరి ప్రాణాలను వదిలారు. నేటికీ ఇలాంటివారు ఎంతోమంది వున్నారు ఈ ప్రపంచంలో. వారు రాజులే కానక్కరలేదు. వారు రాజకీయ నాయకులైనా, ప్రభుత్వాధికారులైనా కావచ్చు. తమకు లభించిన అధికారం హోదాలతో తమ మూలాన్నే మరిచి ప్రజలపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ అన్యాయాలకు ఒడిగడతారు. అలాంటి వారు దైవం చేత నలిపివేయబడ్డారు. వారి ఉనికే లేకుండా పోయింది.

దేవుడు ఎంతో దయామయుడు. ప్రతి మనిషికి ఆయన విడుపునిస్తూ పోతాడు. తప్పు తెలుసుకొని ప్రవర్తనను మార్చుకునేందుకు ఎంతో అవకాశాన్నిస్తాడు దేవుడు. ఆయన్నే నమ్ముకొని తమ జీవితాలను గడిపిన ప్రజలే ప్రయోజకులుగా, విజయులుగా నిలిచారని ప్రపంచ చరిత్ర చెబుతోంది. మన నిజ జీవితంలో కూడా ఇలాంటి సంఘటనల్ని చూస్తుంటాం. ప్రజాకంటకుడుగా మారిన ఈజిప్టు రాజు ఫిరౌన్ గతి ఏమయింది? దేవుడు ఎప్పుడూ బలహీనులు, అణగారిన ప్రజల పక్షానే వుంటాడు. ఆయన్ను నమ్ముకున్న

విశ్వసనీయ దాసులకు కొండంత అండగా నిలుస్తాడు. ప్రతి ఆపదలో విపత్తులో నిజ దాసుల్ని రక్షిస్తూనే వుంటాడు ఆ స్వామి. ప్రవక్త యూసుఫ్ (అ)ను సోదరులు బావిలో పడ వేశారు. అలాంటి ఆపదలో అల్లాహ్ ఆయన్ని (అ) రక్షించి ఈజిప్టు గవర్నరుగా చేశాడు. ప్రవక్త ఇబ్రాహీం (అ) కూడా ఆనాటి రాజుచేత అగ్నిలో పడవేయబడ్డారు. అలాంటి సమయంలో దేవుడే ఆయన్ని రక్షించాడు. నూహ్ (అ)ను ప్రజలు నానా యాతనలకు గురి చేశారు, పిచ్చివానిగా జమకట్టి హేళన చేశారు. చివరికి అలాంటి దుష్టజన సంహారం ఎలా జరిగిందో దివ్యఖుర్ఆన్ వివరించింది. మనిషి జీవితం, ఇంకా అతనికి ప్రసాదించిన శక్తియుక్తులు, అధికార హోదాలు చాలా పరిమితమైనవి. అల్లాహ్- అల్ గాలిబ్ అంటే సమస్త సృష్టిపై సంపూర్ణ అధికారాలూ, ఆధిక్యం కలవాడు అని అర్థం. ఆయన శక్తి ముందు అందరూ బలహీనులే. మనిషికి లభించిన శక్తియుక్తులు, ధనసంపదలు, అధికారం- అన్నీ అల్లాహ్ ప్రసాదితాలే. వాటిని సక్రమరీతిలో వాడుకోవటంలోనే విజ్ఞత దాగివుంది. అలా చేయక హద్దుమీరి ప్రవర్తిస్తే విపత్కర పరిస్థితుల్ని, విపత్తుల్ని చవిచూడవలసి వస్తుంది.

"మేము ఇష్టపడిన వారిని కాపాడాము. హద్దులు మీరిన వారిని నాశనం చేశాము." (దివ్యఖుర్ఆన్-21 : 9)

اَلْمَنَّانُ
93. అల్ మన్నాన్

ఒకరికి మేలు చేసి, దానిని పదేపదే వారి ముందు ప్రస్తావించడం పాపంగా పరిగణించ బడుతుంది. మనం ఎవరికైనా ఏదైనా మేలు చేస్తే దాన్ని మరచిపోవటం ఉత్తమం. మనం ఇతరులకు ఏ మేలు చేసినా అందుకు పరలోక ప్రతిఫలాన్నే ఆశించాలిగాని వారి మెప్పును ఆశించటం తప్పు. ప్రతిఫలం పొందినవారు మనకు కృతజ్ఞతలు తెలుపు కోవటం వారి సత్ప్రవర్తనకు సంకేతం. ముహమ్మద్ ప్రవక్త (స) కాలంలో ఆయన (స) సందేశానికి ప్రభావితులైన ఎంతోమంది యూదులు మొదలగువారు ఇస్లాం స్వీకరించి ప్రవక్త (స)కు మేలు చేశామనే ధోరణిలో మాట్లాడం, ప్రవర్తించటం పరిపాటి అయిపోయింది. దీనిపై ప్రవక్త (స) – మీరు సత్యధర్మమైన ఇస్లాంను స్వీకరించింది మీ ఇహపరాల సాఫల్యం కొరకు తప్ప, నా పట్ల ఏదో మేలు చేశారని భావించటం మీ భ్రమే అవుతుంది. అల్లాహ్ నన్ను ప్రవక్తగా ప్రభవింపజేసి నా ద్వారా మీకు సత్య సందేశాన్ని చేరవేశాడు. అందుకు నేను ఆ మహోన్నత స్వామికి కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను అని సెలవిచ్చారు.

అనేక దురాచారాల్లో కూరుకుపోయి అగణిత దేవీదేవతల విగ్రహాలను కల్పించుకొని అంధకారంలో పడి కొట్టుమిట్టాడుతున్న ఆనాటి అరబ్బులకు ఆశాజ్యోతిగా, కారుణ్యమూర్తిగా ప్రభవింపజేయబడిన ప్రవక్త (స) ఆనాటి అరబ్బులకే కాదు యావత్ ప్రపంచ మానవాళికి కూడా ప్రవక్తయే. ప్రళయం వరకు మరో ప్రవక్త రాబోడు. ఆయనే చిట్టచివరి ప్రవక్త. నాటి అరబ్బుల్లోలానే నేటి ప్రపంచ సమాజాల్లో కూడా ఎన్నో రుగ్మతలు నెలకొని ఉన్నాయి. శారీరక

రుగ్మతలకు ఎలాగైతే వైద్యుణ్ణి సంప్రదిస్తామో, మన నైతిక రుగ్మతలు దూరం కావాలన్నా, ప్రపంచ సమస్యలు సునాయాసంగా పరిష్కరించబడాలన్నా ప్రవక్త (స) సత్యసందేశమే శిరోధార్యం.

అల్లాహ్– అల్ మన్నాన్ అంటే మహోపకారం చేసేవాడని అర్థం. స్వయం కల్పితమైన అనేక విశ్వాసాల్లో చిక్కుకొని బ్రతుకుల్ని దుర్భరం చేసుకున్న ప్రపంచ మానవాళి కొరకు ముహమ్మద్ ప్రవక్త (స)ను ప్రభవింప జేయటం దేవుడు మానవులకు మహోపకారం చేసినట్లే. జీవితంలోని ప్రతి విషయంలో ప్రవక్త (స) అడుగుజాడల్లో నడిస్తే శాంతియే, శాంతి. మానవ జీవితాలే కాదు, నేడు యావత్ప్రపంచమే అశాంతితో అల్లకల్లోలానికి గురియై చెల్లాచెదురైపోతోంది. దీనికి పరిష్కారం ఎక్కడో లేదు. ఒక్కడైన అల్లాహ్‌ను మొక్కడంలోనే వుంది.

> **వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు: స్వయంగా వారినుండే వారి మధ్య ఒక ప్రవక్తను లేపాడు. అతడు ఆయన ఆయతులను వారికి వినిపిస్తాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు. వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ నేర్పుతాడు. వాస్తవానికి వారు ఇంతకు పూర్వం స్పష్టమయిన అపమార్గాలలో పడివున్నారు.**
>
> **(దివ్యఖుర్ఆన్–3:164)**

اَلْجَلِيْلُ

94. అల్ జలీల్

అల్లాహ్ గుణగణాల్ని గణించడం మనిషి శక్తికిమించిన పని. ఆయన సర్వోన్నత సృష్టికర్త, మహా శక్తిమంతుడు, అన్నీ తెలిసిన వాడు, అన్ని చోట్లా, అందరినీ పరివేష్టించి వున్నాడు. అదే విధంగా ఆయన అత్యంత దయామయుడు, అందరిపట్ల ప్రేమ, కనికరం కలవాడు, ఇంకా అత్యంత క్షమా గుణం కలిగి దాసుల తప్పిదాలను కప్పిపుచ్చి తన కారుణ్య ఛాయలో ఆశ్రయమిచ్చేవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన గుణ గణాల్ని మనం వర్ణించలేము. సముద్రాలన్నీ సిరాగా మార్చి, భూమిపైవున్న వృక్షాలన్నిటినీ కలాల్లాచేసి ఆయన గుణాల్ని వ్రాస్తూపోతే సముద్రాల సిరా అయిపోతుంది కాని ఆయన గుణాల వర్ణన మాత్రం ఇంకా మిగిలే వుంటుందని ఖుర్ఆన్ అంటోంది. దీన్నిబట్టి ఆయన ఎంత గొప్పవాడో మనకు అర్థమవుతోంది. అల్లాహ్‌యే గొప్పవాడని ఒప్పుకోవటంలోనే మనిషి విజ్ఞత దాగివుంది. ఆయన్ని గొప్పవాడని భావిస్తే మనిషి గౌరవం, గొప్పతనం పెరిగిపోతాయి. నేనే గొప్పవాణ్ణని ఎప్పుడైతే మనిషి భావిస్తాడో, అప్పుడే తన పతనం మొదలౌతుందని భావించాలి.

ఈ ప్రపంచంలో కోటానుకోట్ల మనుషులు పుట్టిగిట్టారు, ప్రళయం వరకు ఈ ప్రక్రియ సాగుతూనే వుంటుంది. ఒక్కోళ్ళకు ఒక్కో తెలివిని, నేర్పరితనాన్ని, ప్రత్యేకతను ప్రసాదించి పంపాడు దేవుడు. ఏది ఇచ్చినా దైవమే ఇస్తాడు. మనిషి స్వయంగా ఏదీ పొందలేడు. అంతా తన తెలివితో, జ్ఞానంతో, శక్తితో సాధిస్తున్నానని తలపోస్తాడు మనిషి. నిజంగా ఆలోచిస్తే ఏదీ తనదికాదు, అన్నీ దైవప్రసాదితాలే. దైవంచేత తనకు ప్రసాదించ బడ్డ శక్తియుక్తుల్ని, జ్ఞాన

సంపదల్ని, వస్తు సంపదల్ని దైవాదేశాలకులోబడి ఉపయోగిస్తే అన్ని చోట్లా అన్ని వేళలా విజయమే చేకూరుతుంది మనిషికి. అలాగాక హద్దులు మీరి ప్రవర్తిస్తే ఏనాటికైనా పతనం తప్పదు. అలా ప్రవర్తించిన పెద్దపెద్ద రాజులు, చక్రవర్తులు కాలగర్భంలో కలిసిపోయారు. అందుకే ఖుర్‌ఆన్ మనిషిని- భూమిపై విర్రవీగుతూ నడవకండి, మీరు మీ కాలి గోటితో భూమిని చీల్చనూలేరు, పర్వతాల ఎత్తుకు ఎదగనూ లేరు- అని హెచ్చరిస్తోంది. కాబట్టి మనిషి సదా వినమ్రతను అలవరచుకోవాలి. తనకు ఏ కాస్త గొప్పతనం, గౌరవం లభించినా అది దైవ ప్రసాదితమని భావించాలి. దానిపై అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించుకోవాలి. దీని ద్వారానే మనిషి మరింత ఉన్నత స్థానానికి చేర్చబడి పరమోన్నత స్వామి అయిన అల్లాహ్‌కు ప్రీతిపాత్రుడవుతాడు. అల్లాహ్ నామ సంకీర్తనం సర్వదా శుభకరం.

"మహా మహిమాన్వితుడూ, దయామయుడూ అయిన నీ ప్రభువు పేరు ఎంతో శుభకరమైనది." (దివ్యఖుర్‌ఆన్-55 : 78)

اَلْمُحِيُ

95. అల్ ముహీ

భూమి, సముద్రాలు ఇంకా కొండకోనల నుంచి మానవుడు ఎన్నో వస్తువుల్ని ఆవిష్క రించాడు. టెలిఫోన్, విద్యుత్, కంప్యూటర్ ఒక్కటేమిటి తన మదిలో ఏది మెదిల్తే ఆ సౌలభ్యాన్ని తన గదిలోనే సమకూర్చుకుని జీవనాన్ని సాగిస్తున్నాడు. సకల సదుపాయాలతో విలాసవంతమైన జీవితాన్ని గడుపు తున్నాడు. పురాతన కాలంలో ఒక చోటి నుండి మరోచోటికి వెళ్ళాలంటే ఎంతో వ్యయప్రయాసలకు లోనయ్యేవాడు మనిషి. మరి నేడు- ఖండాంతర ప్రయాణం కూడా గంటలకు కుదించబడింది. ఇక తన జీవిత కాలాన్ని పొడిగించుకొని ప్రపంచంలో దీర్ఘాయుష్మంతునిగా జీవించాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్నో మందు మాకులు సృష్టించుకున్నాడు. ఎంత ప్రయ త్నించినా మనిషి తన ప్రాణాన్ని కాపాడుకోలేడు. జీవన్మరణాలు అన్నీ అల్లాహ్ చేతిలో వున్నాయి. అల్లాహ్ నిర్ణయించిన జీవిత కాలాన్ని అతిక్రమించటం ఎవరి తరమూ కాదు. అల్లాహ్ ఆదం (అ)ను మట్టి నుండి సృజించాడు. ఆ మట్టి నుండే మనకు కావలసిన పంటలు పండుతున్నాయి. అంటే మృతభూమి నుండే మన జీవనానికి కావలసిన పంటలు, ఫలాలను ప్రసాదిస్తు న్నాడు దేవుడు. మరణించిన మానవులందరూ తీర్పుదినాన మళ్ళీ లేపబడతారు అని దివ్య ఖుర్ఆన్ పదేపదే హెచ్చరిస్తూనే వుంది. ఆ రోజు కర్మలు విచారించ బడతాయి. సన్మార్గగాములు స్వర్గానికి, దుర్మార్గగాములు దుష్ట యాతనలతో కూడిన నరకానికి పంపబడతారు.

అల్లాహ్-అల్ ముహీ అంటే జీవన్మరణాల ప్రదాత అని అర్థం. "అయిపో" అని ఆయన ఆజ్ఞాపిస్తే చాలు అది అయిపోతుంది. మట్టి నుంచి పుట్టించబడిన

మానవుడు మరణించాక మళ్ళీ ఆ మట్టిలో కలిసి పోతున్నాడు. ఆ మట్టి నుండే మళ్ళీ అల్లాహ్ ఆజ్ఞతో చనిపోయిన మానవులంతా తీర్పుదినాన లేపబడతారని ఖుర్‌ఆన్ పదేపదే గుర్తు చేస్తోంది. ఆ రోజు రావటం తథ్యమని ఎన్నో సూచనల ద్వారా మనిషికి జ్ఞానోదయాన్ని కలుగజేస్తోంది ఖుర్‌ఆన్. మరణాన్ని జయిస్తే ఆ తీర్పు దినాన హాజరయ్యే అవసరమే లేదని తలపోస్తున్నాడు మనిషి. స్వార్ధప్రయోజనాలకై ప్రపంచంలో నిత్యం మారణ "హోమాన్ని" సృష్టిస్తున్నాడు మనిషి. మరణం వుంటేనే ఇలా వున్నాడు; ఇక మరణమనేది లేకపోతే మనిషి ఎలా ప్రవర్తిస్తాడో మీరే ఆలోచించండి. అంగబలంతో, అర్ధబలంతో, అధికార దర్పంతో ఇక్కడ న్యాయాన్ని అణచగలుగుతున్నాడు, బలహీనుల్ని తన స్వార్ధానికి బలిపశువుల్ని చేస్తున్నాడు. ఈ అన్యాయం ఇక్కడితోనే సమసిపోతుందని, ఇక్కడి కోర్టులు చెప్పిందే న్యాయమని, ఇక తనను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగుతున్నాడు. కాదు ఎంత మాత్రం కుదరదు. ఇక్కడ అన్యాయానికి గురికాబడిన వారం దరూ దేవుని వద్ద న్యాయాన్ని పొందుతారు. దౌర్జన్యపరులకు తప్పక శిక్ష పడుతుంది. అందుకే దేవుడు జీవన్మర ణాల్ని తన అధీనంలో వుంచుకున్నాడు. ఆయనకు భయపడి జీవించటమే మనిషికి శ్రేయస్కరం.

> **ఆయన జీవిని నిర్జీవి నుండి వెలికి తీస్తాడు, నిర్జీవిని జీవి నుండి వెలికి తీస్తాడు. భూమి మృతి చెందిన తరువాత దానికి ప్రాణం పోస్తాడు. ఇలాగే నీవు కూడా(మరణావస్థ నుండి) వెలికి తీయ బడతావు. (దివ్యఖుర్‌ఆన్-30 : 18,19)**

اَلْمُحِيْطُ

96. అల్ ముహీత్

సత్యాన్ని అసత్యమని ఒకరు తిరస్కరించి నంత మాత్రాన అది అసత్యం కాబోదు. ధన బలంతో, అధికారబలంతో, ఇంకా ప్రపంచంలో అధిక సంఖ్య ఒక సత్య విషయాన్ని అసత్యంగా ప్రచారం చేసినంత మాత్రాన అది అసత్యం ఎన్నటికీ కాబోదు. ఇస్లాం ధర్మమే సత్యమని, స్వర్గ నరకాలు, పరలోకం-అన్నీ సత్యమని, అల్లాహ్‌నే ఆరాధించమని, సృష్టి తాలను పూజించవద్దని ఎంతగా చెప్పినా, ఎన్ని వందలు, వేల సంవత్సరాలు ప్రవక్తలు ప్రబోధించినా ఎవరూ వినలేదు. ఈ సత్య ధర్మ సందేశ ప్రచారంలో ఎంతోమంది ప్రవక్తలు పిచ్చి వాళ్ళుగా పరిగణించబడ్డారు. కొంతమంది హత్య చేయబడ్డారు. కాని వారు సత్యధర్మ ప్రచారాన్ని మాత్రం విడనాడలేదు.

సత్యాన్ని ఆశ్రయించటంలో మనిషి శ్రేయం దాగి వుంది. ఉభయలోకాల్లో అతనికి ఎలాంటి భయమూ ఉండబోదు. మరణా నంతరం శాశ్వత స్వర్గసుఖాలు అతని కోసం ఏర్పాటు చేయబడ్డాయి. సత్యాన్ని తిరస్క రించటం వలన నష్టం, కష్టం మనిషికే తప్ప సత్యానికి ఎలాంటి నష్టం వాటిల్లదు. అబద్ధాన్ని ప్రచారం చేయటంలో ప్రజలు అనేకమంది ఉండవచ్చు, వారికి అధికారం, ధనం, సమాచార ప్రసార సాధనాలు ఉండవచ్చు, సైన్యాలు కూడా వారికి అండగా వుండవచ్చు. అంతమాత్రాన నిజం అదృశ్యమై పోదు. వారి కంటికి సత్యధర్మ దృశ్యం, అదృశ్యమైనట్లే కనిపిస్తుంది. కాని అది వారిని పరివేష్టించి వుంది. వారు అసత్య ప్రచారంలో స్పృహ కోల్పోయారు. ఎంతగా అసత్య ప్రచారంలో మునిగి పోయారంటే, ఈ రోజు ఒకర్ని ఆరాధ్య దైవంగా పూజిస్తే, రెండోరోజు

మరో దేవుణ్ని ఆశ్రయిస్తున్నారు. ఈ రోజు సత్యమైనది, మరుసటి రోజు అసత్యంగా మారుతుందా? ఆలోచించటానికి ప్రతి మనిషికి దేవుడు బుద్ధీజ్ఞానాలను ప్రసాదించాడు. సత్య మేదో అసత్యమేదో అన్న విషయాన్ని తేల్చు కొని తన నడవడికను దిద్దుకునే స్వాతంత్ర్యాన్నీ ప్రసాదించాడు దేవుడు.

మనిషి జ్ఞానం, సంపద, జీవితం అన్నీ పరిమితమైనవి. అల్లాహ్ సత్యం, ఆయన నిత్యుడు. అన్నివేళలా, అన్ని చోట్లా, అన్ని వైపుల నుండీ మనల్ని పరివేష్టించి వున్నాడు. అల్లాహ్- అల్ ముహీత్ అంటే అన్ని వైపుల నుండి పరివేష్టించి వున్నవాడని అర్థం. ఆయన పట్టునుండి తప్పించుకునే అవ కాశం ఏదీ లేదు మనకు. కాబట్టి ఆయన ప్రవక్తల ద్వారా, గ్రంథాల ద్వారా మనకు తెలియజేసిన సత్యధర్మమైన 'ఇస్లాం'ను ఆశ్రయించటంలోనే శ్రేయం దాగివుంది.

తిరస్కార వైఖరిని అవలంబించిన వారు తిరస్కరించటంలో నిమగ్నులై వున్నారు. వాస్తవానికి అల్లాహ్ వారిని చక్రబంధం చేసి వుంచాడు. (వారు తిరస్కరించినంత మాత్రాన ఈ ఖుర్ఆన్‌కు నష్టమేమీ వాటిల్లదు) ఈ ఖుర్ఆన్ మహత్తరమైనది, ఫలకంపై వ్రాయబడి భద్రంగా ఉన్నది. (దివ్యఖుర్ఆన్-85:19-22)

اَلْوَارِثُ

97. అల్ వారిస్

అల్లాహ్ - అల్ వారిస్ అంటే సర్వ స్వామ్యం కలవాడు, నిజమైన వారసుడు అని అర్థం. మరణించిన తల్లిదండ్రుల ఆస్తికి వారి సంతానం వారసులౌతారు. భూమ్యాకాశాలకు, సకల సంపదలకు నిజమైన స్వామి, వారసుడు అల్లాహ్ మాత్రమే. జీవించినంత కాలం ప్రపంచంలోని వస్తు సంపదల్ని మనిషి అనుభవిస్తాడు. కన్ను మూసిన తరువాత అన్నీ వదలి వెళ్ళాల్సిందే. మనం అనుభవిస్తున్న ఈ సంపదలు, చివరికి మన ప్రాణం కూడా దైవ ప్రసాదితమే. ఏదీ మనది కాదు. మనం సంపాదించిన ఆస్తిపాస్తుల్ని మన సంతానానికి పంచి ఇవ్వగలం. కాని బుద్ధీజ్ఞానాల్ని వారసత్వంగా ఇవ్వలేము. ఇవి దైవ ప్రసాదితాలు. జ్ఞాన సంపద డబ్బుతో కొనగలిగేదైతే ఈ లోకంలో ఐశ్వర్యవంతులే జ్ఞానులయ్యేవారు. జ్ఞానాన్ని తమ చెప్పు చేతల్లో వుంచుకునేవారు.

ప్రవక్త దావూద్ (అ)కు ఎంతోమంది కుమారులు జన్మించారు. అందరూ ప్రవక్తలు కాలేకపోయారు. ఒక్క సులై మాన్ (అ) తప్ప. ప్రవక్త పదవి దైవప్రసాదితం. దైవం ఎవర్ని అభిలషిస్తే వారే ప్రవక్తగా ప్రభవించబడతారు. సంతానానికి ఆస్తి వారసత్వంగా సంక్రమిస్తుంది. కాని ప్రవక్త పదవి అలా కాదు. ప్రవక్తలు (అ) దైవంచేత ఎన్నుకోబడతారు. అంద రిలో ఆ అర్హతలు ఉండవు. ధనబలంతో, కండబలంతో మనం ఒక దేశ అధ్య క్షుడిగా లేక ప్రధానిగా లేక మంత్రిగా ఎన్నుకోబడవచ్చు. ఈ పరిస్థితిని మనం నేటి ప్రపంచ సమాజంలో కళ్ళారా చూస్తున్నాం. మచ్చుకైనా నైతిక విలువలు లేనివారు పెద్దపెద్ద

హోదాలలో మన గలుగుతున్నారు. అందుకే ప్రపంచ వ్యవస్థ అశాంతికి, అభద్రతకు లోనై పోతోంది. మానవుడు ఎన్నుకున్న దానికి, దైవం ఎన్నుకునే దానికి ఎంత తేడా వుందో చూడండి.

ప్రవక్త యాఖూబ్ (అ)కు కూడా ఎంతో మంది కొడుకులుండేవారు. కాని ఒక్క యూసుఫ్ (అ)నే దేవుడు తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. అన్ని అర్హతలూ వున్న మూలంగానే యూసుఫ్ (అ) ప్రవక్తగా ఎన్నుకోబడ్డారు.

> **"మేము ఎన్ని జనపదాలను నాశనం చేయలేదు; వాటి ప్రజలు తమ సంపదను చూసుకుని పొంగి పోయే వారు. అవిగో చూడు, వారి నివాసాలు ఎలా పడి వున్నాయో, వారి తరువాత వాటిలో నివసించిన వారూ చాలా తక్కువే. చివరకు మేమే వారసు లయ్యాము."** **(దివ్యఖుర్ఆన్–28 : 58)**

اَلْبَاعِثُ

98. అల్ బాయిస్

అల్లాహ్ - అల్ బాయిస్ అంటే వెలుగు చూపేవాడు అని అర్థం. అంధకారంలో చిక్కుకున్న మనిషికి వెలుగుబాట చూపించటమే కాక పరలోకంలో మృతులను లేపి లెక్క తీసుకునేవాడు అల్లాహ్‌యే కాబట్టి ఆయన అల్ బాయిస్ అని పిలువబడుతున్నాడు. మార్గ విహీనులైన మానవ సమాజాల్ని సరి అయిన మార్గం చూపి, వారి జీవితాల్ని సరిదిద్దేందుకు దేవుడు ఎంతో మంది ప్రవక్తల్ని పంపాడు. సృష్టితాలైన సూర్యచంద్రుల్ని, నక్షత్రాలను, రాయి రప్పల్ని, నదీ నదాలను, చెట్టు పుట్టల్ని, తోటి మానవుల్ని పూజించవద్దని, ఒకే దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలని అహరహం ప్రవక్తలంతా ప్రబోధించారు. తాతముత్తాతలు అనుసరించిన అంధానుసరణల్ని విడనాడి ఒకే దైవాన్ని ఆరాధించాలని ఎంతగానో నచ్చజెప్పారు ప్రవక్తలంతా, చిట్టచివరి సారిగా ప్రపంచం మొత్తానికి మార్గదర్శిగా దేవుడు మహాప్రవక్త ముహమ్మద్ (స)ను పంపాడు. అసత్యం నుండి సత్యం వైపునకు, చీకటి నుండి వెలుగు వైపునకు గొనిపోయే దేవుని నిజ ధర్మాన్నే ప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధించారు.

విద్యుద్దీపాలతో రేయి పగటిలా ప్రకాశిస్తున్నా మానవ జీవితాలు మాత్రం అంధకారంలో కొట్టుమిట్టాడుతూనే వున్నాయి. విస్తారమైన జాతీయ రహదారులు, ప్రపంచ రహదారులు నిర్మించుకున్నా అసలైన దారి యేదో తెలుసుకోక తికమక పడుతున్నాడు మానవుడు. మానవుణ్ణి సంబోధిస్తూ అనేక మాధ్యమాలు నిత్యం అదే పనిగా పిలుస్తున్నా ఏ పిలుపులో అసలైన గెలుపు వుందో అనే విషయం తన తలపుకు తట్టడం లేదు. ఏ జీవన విధానం నరకంలో నెడుతుందో, మరే

మార్గం స్వర్గానికి చేరుస్తుందో అనే విషయాన్ని దేవుడు ప్రవక్తల ద్వారా ప్రపంచంలోని ప్రతి మానవ సమాజానికీ తెలిపాడు. ప్రజల నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ ఆశించకుండా ప్రవక్తలు దేవుని ఏకత్వాన్ని, దైవధర్మాన్ని ప్రబోధిస్తూనే వచ్చారు. కొద్దిమంది తప్ప అత్యధికులు అవిశ్వాసంలోనే పడిపోయారు. ఎన్ని హెచ్చరికల్ని వినిపించినా, కళ్లకు కనిపిస్తే తప్ప తాము విశ్వసించేది లేదని తెగేసి చెప్పారు. భౌతికారాధనలో నిమగ్నమైన నేటి మానవ సమాజంలో నైతిక విలువలు అడుగంటిపోయాయి. మానవతా విలువలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రపంచ మానవాళికి అసలైన మానవ ధర్మం, దైవధర్మం 'ఇస్లాం' ఒక్కటే శరణ్యం. మరే మార్గంలో శరణు వేడినా అది వృధా ప్రయాస, నిరాశ తప్ప మరేమీ కాదు.

"ఆయనే నిరక్షరాస్యులలో (ఉమ్మీలు) ఒక ప్రవక్తను స్వయంగా వారి నుండే లేపాడు. ఆ ప్రవక్త వారికి ఆయన వాక్యాలను వినిపిస్తున్నాడు, వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు, వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ బోధిస్తున్నాడు. వాస్తవానికి దీనికి పూర్వం వారు పూర్తిగా మార్గం తప్పి ఉన్నారు. (దివ్యఖుర్‌ఆన్ 62 : 2)

اَلْبَاقِي

99. అల్ బాఖీ

పుట్టిన ప్రతి జీవీ గిట్టక మానదు. ఏ జీవీ శాశ్వతంగా వుండలేదు. సృష్టి ప్రారంభం నుండి నేటి వరకు కోటాను కోట్ల మాన వులు, జీవరాశులు పుట్టి గిట్టాయి. ప్రతి క్షణం, ప్రతి రోజూ ప్రతి విషయంలో నిర్మాణం, నిర్మూలన ఒక దాని వెంట ఒకటి జరిగి పోతూనే వున్నాయి. ఏదీ నిలకడగా లేదు. మనంతట మనం చూసుకుంటే - మాతృగర్భదశ, పుట్టుక, బాల్యం, కౌమారం, యౌవనం, వృద్ధాప్యం- ఇలా ఎన్నో దశలను దాటుకుంటూ చివరికి మరణదశకు చేరుకుంటున్నాం. ఇలా ప్రపంచంలోని ప్రతి జీవరాశీ ఎన్నో పరిణామాలు చెంది చివరికి చావుతో పరిసమాప్తమవుతోంది. ఆది, అంతం అందరికీ, అన్నిటికీ వుంది.

అల్లాహ్- అల్ బాఖీ అంటే శాశ్వతంగా మిగిలి వుండేవాడని అర్థం. జీవరాశులేకాదు, ఈ ప్రపంచం మొత్తం ఒక రోజు-అదే ప్రళయదినాన నాశనమై పోయేదే. ఆ రోజు మిన్ను, మన్ను ఒక్కటైపోతాయి, కొండలు దూదిపింజాల్లా ఎగిరిపోతాయి, సముద్రాలు, నదీనదాలు అన్నీ ఛిన్నాభిన్నమై పోతాయి. ఒక్కటేమిటి ఈ ప్రపంచ వ్యవస్థ, సూర్య చంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు- అన్నీ రాలి పోతాయి. మానవ నిర్మితమైన ఒక బాంబు విస్ఫోటన ప్రభావానికి మనం ఎంతో తల్లడిల్లి పోతున్నాం. మరి ప్రళయ విస్ఫోటనం ఎంత భయంకరంగా వుంటుందో ఇట్టే ఊహించవచ్చు. ఆ భయంకర ప్రళయ ఘడియ కొరకే ఈ ప్రపంచ వ్యవస్థ ప్రయాణం చేస్తోంది. ప్రళయం, ఆ తరువాత సంభవించే తీర్పు దినం (Judgement Day) గురించే ప్రవక్త లంతా మనల్ని

హెచ్చరించారు. ఆ తీర్పు దినం రోజు ఎవరి కర్మల గురించి వారే జవాబు చెప్పుకోవలసి వుంటుంది. తల్లి దండ్రులు, సంతానం, బంధువులు, మిత్రులు, పొరుగువారు- ఎవరు ఎవరికీ సహాయం చేసే స్థితిలో వుండరు. ఎవరికి వారు చెప్పలేనంత ఆందోళనకు గురై వుంటారు. ఇక్కడ చేసిన ప్రతి చిన్న విషయానికీ అక్కడ (పరలోకంలో) పరమోన్నత ప్రభువు అల్లాహ్ ముందు సమాధానం, లెక్క (Accountability) చెప్పుకోవలసి వుంటుంది. ఇక్కడ లంచాలు ఇచ్చి, లేక రాజకీయంగా పలుకుబడి వుపయోగించి శిక్ష నుంచి బయటపడ వచ్చు. కానీ అక్కడ అలాంటి పప్పులేమీ ఉడకవు. ఆ రోజు ఎలాంటి ఆందోళనా చెందకుండా వుండాలంటే ఈ రోజు ఈ ప్రపంచంలో ఏం చెయ్యాలి? ఏ మార్గాన నడవాలి అనేది ముఖ్యం. ఆ సవ్యమైన, దివ్యమైన మార్గాన్నే దేవుడు మనకు ప్రవక్తల ద్వారా తెలిపాడు. మనం ఆ భయంకరమైన రోజు గురించి ఎలాంటి తయారీ చేయాలనే విషయాన్ని ఈ రోజే తెలుసుకుందామా?

ఈ పుడమిపై వున్న ప్రతి వస్తువూ నాశనమై పోయేదే. కేవలం మహోన్నతుడూ, మహోపకారీ అయిన నీ ప్రభువు మాత్రమే మిగిలి ఉండేవాడు. (దివ్యఖుర్ఆన్-55 : 26,27)